భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మార్చి 1962

సంపుటము 39 : : సంచిక 3

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మార్చి 1962

సర్వజ్ఞుని త్రిపదులు	శ్రీ కె. అశ్వత్థరావు	1
ఉభయకవిమిత్రము	శ్రీ విశ్వనాథ సత్యనారాయణ	4
రవీంద్రుని ఒక గీతిక : తెనుగు అనువాదాలు	శ్రీ శ్రీవాత్సవ	9
డా॥ మెల్విన్ కాల్విన్ - 1961 లో నోబుల్ పురస్కార గ్రహీత		14
బాభ్రవ్యుని స్మర దర్శనము	శ్రీ గొల్లాపిన్ని వాసుదేవశాస్త్రి	17
చిత్రభాష	"ధనిష్ఠ" - "సత్యం"	20
ఆటవెలది	శ్రీ బాలగంగాధర తిలక్	24
మహత్తర పరివర్తనము - III	శ్రీ జాన్ స్ట్రాచీ	27
భావ వీణ	శ్రీ "స్ఫూర్తిశ్రీ"	33
జీవనజ్యోతి	శ్రీ పి. చలపతిరావు	34
'నక్క' - సైదోడు - నా 'పొరపాటు'	శ్రీ గజపతిరాయవర్మ	40
లిపి సంస్కరణము : ఒక ఉత్తరము : జవాబు	శ్రీ ఆంగీరస్	45
కట్నాలూ - పెళ్ళిళ్ళూ	శ్రీ మల్లికార్జున	49
బాణభట్టారకుని సూక్తివైచిత్రి	శ్రీ ఎస్వీ జోగారావు	62
బంగారు భూమి	శ్రీ తుమ్మల సీతారామమూర్తి	65
వ్యాకరణసంహితా సర్వస్వము - దాని పరామర్శము	శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి	70
నా మనస్థితి	శ్రీ రెండుచింతల లక్ష్మీనరసింహశాస్త్రి	80
విశ్వనాథ-ప్రయోగదక్షత	శ్రీ వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు	81
కలగూరగంప		89
గ్రంథవిమర్శనము		95
వార్తలు		98

గమనిక

ప్రచురింపబడని రచనలు తిరిగి పంపగోరువారు తగినన్ని తపాలాబిళ్ళలు జతపరచవలెను. రచయితలు తమ చిరునామా మార్పులు వెంటనే తెలియజేయ ప్రార్థితులు.

సర్వజ్ఞుని త్రిపదులు

శ్రీ కె. అశ్వత్థరావు

సర్వజ్ఞుఁడనువాడు గర్వమున నయినాఁడె?
సర్వులను గూడి నేర్వఁగా నొకటొకటి
సర్వజ్ఞుఁడాయె సర్వజ్ఞ—

నందినెక్కిన వాని ఇందుధరుఁడగు వాని
నందనునిగొల్చి, నర్తించి, తత్కృపను
బొంది వచియించె సర్వజ్ఞ—

ఎల్లరును శివుఁదలప నిలయెల్ల పాడియగు
ఎల్లరును శివుమఱువ, కైలాసమ్మ
వల్లకాడగును సర్వజ్ఞ—

శివునిసేవకుఁడైన శివుఁడు సేవకుఁడౌను
శివుచర్య లెఱుఁగ శివుఁ డొకఁడె, సర్వమును
శివునదే నమ్ము సర్వజ్ఞ—

తిట్టినను, కాలితోఁ గొట్టినను, నిష్ఠురము
గట్టితల మొట్లు బెట్టినను, నీ దృష్టి
బెట్టు శివునందె సర్వజ్ఞ—

కట్టిదవె, శివుఁడేమి గంటు దొంగిలి నాఁడె?
కట్టనూవలదు, విడవఁలదు-కన్ను, మది
గట్టితే చాలు సర్వజ్ఞ—

నరుని వేఁడఁగ నరుఁడు నగుబాటు, నగుచేటు
తిరిపిగాని వేఁడఁ దినిమిగిలిన కూడె
హరు వేఁడిచూడు సర్వజ్ఞ—

ఏనుఁగద్దంబులోఁ దా నడఁగి యుండునటు
జ్ఞాని హృదయాంతరమునన్ బరశివుడు
మానకేయుండు సర్వజ్ఞ—

తన్నెఱుఁగు ధన్యునకు భిన్నభావము సున్న
సున్న తనవారు పెరవారు; త్రిజగములు
నున్నవా యెడనె సర్వజ్ఞ—

తన మొగముఁ దనవీపుఁ దనకన్నులకు దవ్వ
తనగుణము దోష మెఱుఁగంగ, మఱియొక్క
మనుజుండువలయు సర్వజ్ఞ —

అరసికొనరమ్మనుచు నద్దమది పిలుచునే?
ఎఱుకమదిఁదోఁపఁగా గురుఁడునద్దంబు
తెఱఁగగును దెలియ సర్వజ్ఞ—

నడువహ్ని నీడు వెన్నయుడుకెత్త కేయున్న?
తడవుండు యోగి సంసారు లిండ్లలోఁ
జెడకుండు నెట్లు సర్వజ్ఞ —

అక్కరము వ్రాయుటకు తర్కమది వాదనకు
తక్కినవి భుక్తికే; ముక్తికొక రెండె
యక్కరములుండె సర్వజ్ఞ —

నుడిమంచికాలేదు ఒడలివ్రతమూలేదు
మడిమదికిలేదు,-కైలాసమన, లంజ
గుడిసెయా యేమి సర్వజ్ఞ—

జ్ఞానమున నే ఇహము జానమునే పరము
జ్ఞానమది లేక యెదియెంతగా నున్న
హానియగునన్న సర్వజ్ఞ —

జ్ఞాని, యజ్ఞాని యని కను సుళువు కలదొకటి
కానకేఁ వాఁగుఁ గన్నట్టు లజ్ఞాని
మాని సుమి జ్ఞాని సర్వజ్ఞ—

విద్దెకలిగిన మొగము ముద్దుగా పొలుపారు
విద్దెలేకున్న మొగ మద్ది పాడూరు
గ్రద్దవలె నుండు సర్వజ్ఞ—

సర్వజ్ఞుని త్రిపదులు

తనువు బట్టినవిద్య తనవెంటనే యుండు
మనుజులును, దొంగలును, రాజులును, దాని
కొనిపోవలేరు సర్వజ్ఞ—

దంతపంక్తుల నడుమఁ దనరారు నాల్కవలె
వింతగా దుర్జనుల నడుమ సజ్జనుఁడు
శాంతితో నుండు సర్వజ్ఞ—

మానహీనుని మైత్రి మాను లంచ మొసంగి
మానకుము మానధను మైత్రి విలువైన
మానికం బద్ది సర్వజ్ఞ—

ఎఱుఁగకే చదివినది ఎంగిలి చెఱకుపిప్పి
ఎఱిఁగి సారము మఱఁగి చదివినది-పిప్పి
చెఱకైనయట్లు సర్వజ్ఞ—

కలుగ దెముకనాల్క బలము బీదకు లేదు
నిలుకంబములు దివికి లేవు; దేవునకు
గులమొకటి లేదు సర్వజ్ఞ—

జాతిప్రశ్నేమి వాసనయున్న పూవునకు?
నీతితో మెలఁగి, శివునిదయగలుగ స
జ్జాతుఁడా తండు సర్వజ్ఞ—

ఉభయకవిమిత్రము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

పాత్రలు

తిక్కన — గణపతిదేవచక్రవర్తి
శివదేవయ్య — కాటమరాజు
మనుమసిద్ధి — ఖడ్గతిక్కన
కేతన — భట్టులం
దౌవారికుడు — ఒకటవగొల్లవాడు
రెండవ గొల్లవాడు — చిలుక

తిక్కన్న ఉభయకవిమిత్రుడు. ఉభయకవిమిత్రు నధికరించి వ్రాసిన కావ్య ముభయకవిమిత్రము. ఇందులో నుభయకవిశబ్దమునకు సంస్కృతాంధ్రకవులనిగాక యైహికాముష్మికముల రెంటికి సంబంధించిన కవియని వ్యాఖ్యానము చేయబడెను. హరిహరనాథుని తత్త్వము, ఖడ్గతిక్కన—వీర శైవుడైన బ్రహ్మరుద్రునితో యుద్ధముచేసి యుద్ధరును మడియుటలో జూపించబడినది. తిక్కనగారి రచనయందు భగవంతుడు ప్రత్యక్షమై యుండుట చూపబడినది.

[సభలో కలకలం]

దౌవారికుడు:—సభ అందరు నిశ్శబ్దముగా ఉండండి. శ్రీగణపతిదేవచక్రవర్తి ప్రభువులు, మహామంత్రియైన శివదేవయ్యగారితో మాట్లాడి సభా ప్రవేశము చేయక మున్ను కొంచెము విశ్రమించినారు. ప్రభువులకు హృదయాహ్లాదకరముగా రాచభట్టు సన్నని గొంతుతో మధుర సాహిత్య ప్రబంధములు పాడబోవుచున్నారు.

భట్టు:—కిమస్థిమాలాం కిముకౌస్తుభంవా
పరిష్క్రియాయాం బహుమన్యసే త్వం
కిం కాలకూటః కిమువా యశోదాస్తన్యం
తవ స్వాదు వద ప్రభో మే

గణపతిదేవుడు:—ఓయి భట్టూ! ఈ పద్య మెచ్చటిది? స్వామీ! నీకు అస్థిమాల యలంకారమా? కాలకూటము ప్రియమా? యశోద చనుబాలు ప్రియమా? కౌస్తుభ మలంకారమా? అని అనుచున్నాడేమో! ఇది యెవరినిగూర్చి యన్నట్లు? శివుడుగాడు, విష్ణువుకాడు, ఆ విష్ణువులో మరల యశోదబిడ్డయైన కృష్ణుడు. చాల పరిహాసాస్పదముగ నున్నది.

భట్టు:—ప్రభూ! ఈ పద్యము హరిహరనాథునిగూర్చి వ్రాయబడ్డది. ఆ స్వామి సింహపురమునం దున్నాడు. ఆయన సగము విష్ణువు, సగము శివుడు. శివుడే, సగము శివుడు, సగము పార్వతి. ఏమండీ శివదేవయ్యగారూ! మీ రేమనెదరు?

శివ:—ప్రభూ! పార్వతికిని, విష్ణువునకును భేదమేమి?

గణ:—అట్లుకాదండీ. అచట శివశక్తులు. ఇచట శివకేశవుల కభేద ప్రసక్తి. భట్టూ! ఈ పద్య మెవరు వ్రాసిరి?

భట్టు:—నెల్లూరు మండలాధిపతి మనుమసిద్ధియొక్క మంత్రియైన తిక్కన్నగారు వ్రాసిరి?

గణ:—ఆయనను గురించి చాల విన్నామే. చాల గొప్ప కవియట. నిర్వచనోత్తరరామాయణము, విజయసేనము, కృష్ణశతకము మొదలైన గ్రంథములను వ్రాసినాడని విన్నాము. మహాభారతమును నన్నయ్యగారు పూర్తిచేయని దానిని పూర్తిచేయుచున్నాడని గూడ వినికిలి. గొప్ప పండితుడట. ఏమండీ శివదేవయ్యగారూ! మన రాజ్యములో జైనుల ప్రాబల్య మెక్కువగా నున్నది. ఆ తిక్కనగారిని పిలిపించి వీరితో వాదింపజేయుదమా?

శివ:—మనము శైవులము. ఆయన వైష్ణవుడు.

భట్టు:—మహామంత్రీ! ఆయన వైష్ణవుడుగాడు. మహేశ్వరాంఘ్రి కమలధ్యానైకశీలుడు. నిర్వచనోత్తరరామాయణములో నిట్లు వ్రాసికొన్నాడు.

అమలోదాత్తమనీష నే నుభయ కా
వ్య ప్రౌఢి బాటించు శి
ల్పమునన్ బారగుడన్ గళావిదుడ నా
పస్తంబ సూత్రుండ గౌ
తమ గోత్రుండ మహేశ్వరాంఘ్రి కమల
ధ్యానైక శీలుండ న
న్నమకుం గొమ్మన మంత్రికిన్ సుతుడ ది
క్కాఖ్యుండ నన్నార్యుడన్.

గణ:—మరి ఈ హరిహరారాధనయేమి? ధర్మాద్వైతమేమి? మహామంత్రీ! ఆయన ధర్మాద్వైతమును గురించి మీ కేమైన దెలియునా?

శివ:—ఆ ధర్మాద్వైతము వైష్ణవము వంటిదే. వైష్ణవులకు వలెనే ఈ మతమునందుగూడ సంకర్షణ ప్రద్యుమ్నాది వ్యూహములు గలవు. ఆ కుటుంబమువా రందరు వైష్ణవులే.

భట్టు:—నిజమే. జైన, బౌద్ధ మతములు ప్రబలుచున్నవి. మన మతములో కొందఱు శైవులుగా, కొందఱు వైష్ణవులుగా చీలిపోవుచున్నారు. పరస్పర ద్వేషములతో నిండి

యున్నారు. మనలో సమైక్యము గల్గించుటకు తిక్కనగారీ హరిహరారాధన మారంభించిరి. హరిహరుల కభేద ప్రతిపత్తిగా నా రుపాసన చేసిరి. హరిహరనాథుడు వారికి స్వప్నమునందు గన్పించినాడు. తన కుటుంబమువారి నందరిని తన మతములోనికి మార్చినాడు. వా రూర్ధ్వ పుండ్రములను ధరించరు. స్మార్తులవలెనే వేషమును దాల్తురు. శైవులవలె విభూతి ధరింతురు. వారి పెద తండ్రిగారి కుటుంబము యొక్కటియే పూర్తిగా వైష్ణవులుగా ఉన్నారు.

గణ:—ఆ తిక్కనగారిని మన కొలువునకు పిలిపించవలయును.

భట్టు:—స్వామీ! తిక్కనగారు తమ దర్శనార్థము వచ్చియే యున్నారు.

గణ:—ఏమి! మన సభకు వచ్చిరా? ఎందుకు వచ్చిరి? మహామంత్రీ! సభలోనికిపోదము పదండు.

* * *

(తూర్య ధ్వనులు)

భట్టు:—శ్రీ గణపతిదేవ చక్రవర్తిగారికి జయము! కాకతీయ సామ్రాజ్య ధురంధరులకు జయము? ప్రోలరాజ వినిర్మితైకశిలానగర మహా నిర్మాతలకు జయము! శత్రు దుస్సాధ్య సప్త ప్రాకార నిర్మాతలకు జయము! ఓరుగల్ పురీప్రతిష్ఠాపనాచార్య మహాదేవులకు జయము—

గణ:—శ్రీ మనుసిద్ధి చోళరాజ మంత్రులైన తిక్కన్నగారు మా సభలోనికి వచ్చినారట. వారు మా సింహాసనమువద్దకు దయచేయుదురుగాక.

తిక్కన్న:—ఓహో మహాంధ్ర సార్వభౌమా! ఇంత తేజస్సుతో ఇంతటి ప్రభుత్వముతో ఇంతటి సౌజన్యముండుట దుర్లభమైన విషయము. మహాప్రభూ! తమ దర్శనార్థము వచ్చిన వాని నిట్లు పిలుచుట ఏ ప్రభువులును జేయరు.

గణ:—తిక్కనార్యా! మీరు సామాన్యులుకారుగదా. నన్నయగారి తరువాత మరల నన్నయ్యగా రంతటివారు. తమరు యజ్ఞమును జేసినవారు. సద్బ్రాహ్మణులు. పండితులు. భారతము వ్రాయుచున్నారని వినికిలి. మీ పద్యమొక్కటి మా భట్టు వినిపించినాడు. ఎంత రమణీయముగా నున్నది. భారతములో మీరు వ్రాయుచున్న ఘట్టములోని పద్యముల నేమైన వినిపింతురా? ఆ బంగరు గద్దియమీద నాసీనులు గండు.

తిక్క:—సార్వభౌమా! నే నాఘట్టమింకను వ్రాయలేదు. ఒక పద్యము నాకు స్ఫురించినది. తరువాత నా పద్యమునందిమిడ్చెదను. ఉత్తర గోగ్రహణవేళ నర్జునుడు ఉత్తరునకు సారథియై కౌరవసైన్యము నెదిర్చుటకు బోవును. అర్జునునిగూర్చి ఒక పద్యము వ్రాసితిని.

శివ:— మిక్కిలి సొగసైన ఘట్టము. సత్కవుల కిట్టిభవిష్యద్ఘట్టములలోని సన్నివేశములు స్ఫురించును.

తిక్క:—ఊఁ!

శివ:— తిక్కయజ్వగారూ! ప్రభువు లా పద్యమును వినగోరుచున్నారు.

తిక్క:—అయ్యా! తమరా శివదేవయ్యగారు. నమస్కారము. ఓహో! యేమి మూర్తి. పరమశివుడు ప్రత్యక్షమైనట్లున్నది. సార్వభౌమా! కాకతీయ రమాధురంధర! శివుడేవచ్చి మీకు మంత్రిత్వము చేయుచున్నాడు. మీ యదృష్టమేమని చెప్పవలయును.

శివ:—ఆంధ్ర కవిలోక శిరోమాణిక్యమా! ఆ పద్యమును చదివించుడు.

తిక్క:—సింగం బాకటితో గుహాంతరమునన్
జేడ్పాటు మైనుండి మా
తంగస్ఫూర్జితయూథదర్శనసము
ద్యత్క్రోధమై వచ్చునో
జం గాంతారనివాసఖిన్నమతి యు
ష్మత్సేనపై వీడెవ
చ్చెం గుంతీసుతమధ్యముండు సమర
శ్రీమాధి రామాకృతిన్.

గణ:—సింహ మాకటితో గుహలో నున్నదా. అవునవును. ఒక దినమా రెండు దినములా? పదమూడేండ్లాకలితో నున్నది. (గుసగుసలు) అయ్యా! తమరు మా దర్శనార్థమెందుకు వచ్చితిరో తెలియలేదు.

తిక్క:—ఆంధ్ర సామ్రాజ్య రమా రమణా! మా మనుమసిద్ధి మహీపాలునకు అక్కన్న బయ్యన్నలను దాయాదులు గలరు. వారు మా రాజ్యము నాక్రమించికొనిరి. వారిని గెలుచుట మా రాజునకు సాధ్యము గాలేదు. మహా ప్రభువులు తమరు విచ్చేసి వారిని పారద్రోలి మా రాజ్యము మా కిప్పింపుడని వేడుటకు వచ్చితిని.

శివ:—అదియేమి తిక్కయజ్వగారూ! మీ మనుమసిద్ధిరాజుగారి తండ్రియైన తిక్కరాజుగారి నాటినుండి మీ సేనాపతులు, మీ పెద తండ్రులు, వారి కుమారులు, వారు మహాశూరులని విన్నాము. మీ ఖడ్గతిక్కనగారు మహా శూరులని మాకు తెలియును. వా రేమైరి?

తిక్క:—ఇది దాయాదుల వ్యవహారము. ఆ ఖడ్గతిక్కన్నగారు మహాదాత. వాగ్దానము చేసినచో వెనుకకుబోడు. ఆ యిద్దరు దాయాదులును ఎవ్వరివలెనోవచ్చి, యేదో పనియున్నట్లు నటించి, దాని స్వరూపము చెప్పక, ఖడ్గతిక్కన్నగారి

సాహాయ్యమునభ్యర్థించి వాగ్దానమును బొందిరి. ఆ రీతిగా ఖడ్గతిక్కన్నగారు నిష్క్రియులైరి. తక్కిన సేనానులు విన్నవోయులైరి. మా ప్రభువులు నేడు మా పాటూరి గ్రామమునందు దాగియున్నారు. సేనాధిపతియైన ఖడ్గ తిక్కన్నగారు కూడ వారితోబాటు దాగియున్నారు.

శివ:—ఖడ్గతిక్కన్నగారు వైష్ణవులటగదా. అందులో తీవ్రమైన వైష్ణవు లట.

తిక్క:—నాకు శివకేశవులకు భేదములేదు. శివుడే విష్ణువు. విష్ణువే శివుడు.

శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే....

గణ:—మహామంత్రీ! మనము వెలనాటి ప్రభువులమీదికి బోవలయునని యెంచుచుంటిమిగదా? ముందా పనిజేసి యట నుండి నెల్లూరు పోదము. మహాకవీ! ఈ లోకము చమత్కారమైనది. మానవుని మహా లక్షణము చిత్రమైనది.

తిక్క:—ప్రభువు లాజ్ఞాపింపుడు.

శివ:—ఏమియునులేదు. ఈ రాజ్యమున జైనులబాధ పెక్కురిగా నున్నది. మీరు వారితో వాదింపవలయునని ప్రభువుల యాజ్ఞ.

తిక్క:—ఈ శూన్యవాదులతో దేశమున కుపద్రవముగా నున్నది. తమ దైవమును తాము ధ్యానించుకొనవలయును. మోక్షమును బొందవలయును. మోక్షమో మనేదో. వీరి కసలు దైవమేలేదు. పైన పందలను దమ మతములో జేర్చుకొనవలయునన్న దుర్నీతి యొక్కటే. ముక్కు మొగములేని యీ మతమునందు భయము భక్తిలేని జనులు చేరబడుచున్నారు. ప్రభువుల ఆజ్ఞకు బద్ధుడను.

దౌవా:—నేటికి సభ పూర్తియైనది. చక్రవర్తులు సభనుండి లేచుచున్నారు.

(జయధ్వానములు—పాన్ను కర్రల మ్రోతలు)

* * * *

తిక్కన:—శివదేవయ్యగారూ! తమరి నొకటియడుగ దలచుచున్నాను. ఇందాక నేను, సింగంబాకటితో ...... నన్న పద్యము చదువుచుండ దమరు భవిష్యత్కథ యన్నారు. అంతటితో నూరకున్నచో నేవిది యడిగెడివాడనుగాను. తరువాత మా ఖడ్గతిక్కన్నగారినిగూర్చి ఆయన తీవ్ర వైష్ణవులటగదా....యనినారు. అందుకని యడుగుచున్నాను.

శివ:—తిక్కయజ్వగారూ! తమరు మహా పండితులు. హరిహరనాథుని ప్రత్యక్షీకరించుకొన్న యుపాసకులు. తమరి శక్తి తక్కువదిగాదు.

* * * *

భట్టు:—తిక్కన్నగారు జైనపండితులతో వాదముచేసిరి. జైన పండితు లావాదమున నోడిపోయిరి.

* * * *

(రణభేరి నినాదము)

ఓహో! గణపతిదేవ చక్రవర్తి వెలనాటి చోళుని సంహరించి కృష్ణా గోదావరీ మధ్య దేశమును స్వాధీనము చేసికొని నెల్లూరిమీదికివచ్చిరి. అక్కన్న బయ్యన్నలను జయించి మనుమసిద్ధిని రాజ్యమునందు పునఃప్రతిష్ఠించినారు.

* * * *

తిక్క:—మనుమసిద్ధి నృపాలునకు జయము! తిరిగి సింహపురీ సింహాసన మధిష్ఠించిన మహారాజునకు జయము.

మనుమ:—మామా! యిదియంతయు నీవు చేసిపెట్టినది.

తిక్కన:—మహారాజా! యాదవ వంశోద్భవుడైన కాటమరాజు, వారి పినతండ్రి పోలమరాజు, పోలమరాజు కొడుకు కత్తియావులరాజు లంకమల, పాలకొండ, నల్లమల మొదలైన పర్వతములలో తమ విస్తారమైన గోగణమును మేపుకొనుచు నా పర్వత ప్రదేశములకు నేలికలై యున్నారు. కొండలమీద పచ్చిక కఱవైనది. పెన్న వానకొనియున్న యడవులలో వారు తమ పశువుల మేపికొందుమనియు, పుల్లరి నిత్తుమనియు పూర్వమడుగగా ప్రభువులు వారి మందలలో నేయావు కోడెదూడను పెట్టినను మన కిచ్చునట్లు ఏర్పాటు చేసితిరి. అట్లు జరుగుచున్నది. మన యడవులలో గూడ పచ్చిక వన్నగిల్లినది. వారు కోడెదూడల నిచ్చుటకు నిరాకరించుచున్నారు.

మను:—అయినచో మన యడవులను వదలి పొమ్మనుడు.

తిక్క:—వారు పోవుటలేదు. మీ దాయాదులు మీ రాజ్య మాక్రమించుటచేతను, రణతిక్కన నిష్క్రియు డగుటచేతను, నాంధ్ర చక్రవర్తి వచ్చి వారిని జయించి రాజ్యమిచ్చుటచేతను, వారి గోగణమును మనము పారద్రోలలేమను నహంకారముతో నా రున్నారు.

మను:—రణతిక్కన యిప్పుడు నిష్క్రియుడుగాడే.

తిక్క:—అది వారికి దెలియదు.

మను:—వారి యజ్ఞానమునకు తగినశిక్ష యనుభవింతురుగాక!

*   *   *   *

(గోవుల అంబారవులు, పక్షుల కలకలములు. ఒక చిలుక యిట్లు పలుకును)

చిలుక:—మహారాజా వచ్చుచున్నారు. గందము తీయుడు. తమల పాకులు చుట్టుడు.

(ఆవులమంద పరుగెత్తుచున్నట్లు కాలిగిట్టల ధ్వని)

ఒక గొల్లవాడు:—అది యేంట్రిరా? ఆ శిలక యేంది అంటుంది? మంద బెదిరి పోతుండదే.

రెండవ:—అదేదో పెంపుడు శిలక లాగుండది. దాని కాళ్లకి గజ్జె లుండయిరోయి. నాట్యం శిక్షది గాబోలు. బోగంది లాగుంది. (మరల చిలుక పలుకులు)

ఒకడు:—అది యేందిరా! మందని బెదరగొట్టేస్తుందాది. ఒక కోలేసి దాన్ని సంపరా సంపు.

(కూయుచు రెక్కలు టపటప కొట్టుకొనుచు చిలుక నేలమీద పడిన ధ్వని. గొల్లవాండ్రు పాడుదురు)

మనుమసిద్ది యేంది మహారాజాయేంది
గణపతయ్యావచ్చి కాల్చేసినాడు
ముదిపిల్క కాళ్లకూ మువ్వాలు గట్టి
అలమందలమీద అదలించినాడు

రెండవ:—ఒరేయ్! ఆ శిలక మనుమసిద్ది ఉంచుకొన్న బోగం దాని సిల్కటరా. దాన్ని మనం సంపామని ఆళ్ల సైన్యం మనమీదకొచ్చింది. మనుమసిద్ది కిరాతకుల్ని పంపిం చాడు. సంపండ్రా! సూత్తారేమి. ఈ కిరాతకపు గాళ్ళం దర్నీ దామెనబెట్టే నరకొండోసి.

(కొమ్ముబూరాలు; శంఖధ్వానాలు; కత్తుల పెళ పెళలు)

*   *   *   *

ఖడ్గతిక్కన్న:—కాటమరాజా! యిప్పటికైనా పుల్లరిక్రింద మీ రిత్తుమన్న కోడెల నిచ్చినచో యుద్ధములేదు.

కాటమ:—మే మీయము.

(ఆవుల యంభారములు వినిపించు చుండును.)

ఖడ్గ:—నాపేరు ఖడ్గతిక్కన. మీరు చచ్చుటకై సిద్ధముగా నున్నారా?

కాటమ:—నాపేరు కాటమరాజు. మేము యాదవులము. శ్రీ కృష్ణదేవుడే మమ్ము రక్షించును.

ఖడ్గ:—శ్రీకృష్ణుడు మా కవి తిక్కనయొక్క యారాధ్యదైవము.

*   *   *   *

తిక్కన్న:—ప్రియమ్ము నొప్పు నెంతయు
క్రొవ్విన భీష్మండు గఱుసు కోల్తలయున్ ద
క్కెవ్వరు నాతని చేరక
దవ్వుల నిల్చుటయు జూచి తన చిత్తమునన్
దారుణ రోషం బడరగ
నారాయణు డపుడు స్ఫైరణం దొరగి వెసన్
దేరి నొగల పగ్గము విడి
క్రూరత మునికోలయెత్తికొని యిలకురికెన్.

ఇట్లు లంఘించి
ధరణీ చక్రము గ్రక్కనన్ గదల
దిగ్దంతావళశ్రేణి కంధరముల్ మ్రొగ్గబడన్
దిశావలయ ముత్కంపంబుగా
నీ బలం బురులన్ బారగ భీష్ము పైగవిసె
రౌద్రోద్రేకముం జూచి ఖేచర లోకమ్ముమ సంచలింప
హరి చంచద్బాహు ఘోరాకృతిన్
లలిత పీతాంబరమ్ము విలాస మొప్ప
సింహనాదోద్భటంబగు చెలువుతోడ
మెరుగు వెలుగును గర్జయు మెరయవచ్చు
కాఱు మొగిలనః గృష్ణు నాకార మొప్పె.

భట్టు:—మహామంత్రి శేఖరా! ఉభయకవిమిత్రా!

తిక్కన:—(వచనము) అట్టి యెడ.....
బలుజీవము వోయిన
వెలవెల బాఱుచు నీదు యోధవీరులు, బొరిపెన్
బొరిపెనదె భీష్ముడనుచును
గలగంబడి యఱ్ఱులెత్తి కనుగొను చుండన్

భట్టు:—మహాకవి! తమరు రచనావేశములోనుండి వినిపించు కొనుటలేదు. అయ్యో!

తిక్కన:—ఎవరు నీవు. ఏమైనది!

భట్టు:—మంత్రిశేఖరా! తమరు కృష్ణు డావేశము పొందినట్లు వ్రాయుచున్నారు. కాటమరాజు గోవులలో నొకడు బొల్లావనియున్నది. శ్రీ కృష్ణు డా యావు నం దావే శించినాడు. మన సైన్యము నా యావు మాటిమనగు చున్నది.

తిక్క:—ఓహో! అట్లనా! ప్రస్తుతము రచన మానివేసితిని. పొమ్ము. మానివేయుట యెందులకు? అర్జునుడు భగ వంతుని వెనుకకు లాగునట్లు వ్రాసెదను. బొల్లావు శౌర్యము తగ్గిపోవును.

*   *   *

భట్టు:—మహా కవీ! మహాకవీ!

తిక్క:—ఏమివార్త?

భట్టు:—స్వామీ! ఇది మనకంతకు వ్యతిరేకముగా నున్నది. కృష్ణుని యావేశము వారి బొల్లావునందు గలిగినది. కృష్ణుని యువసంహారణము ఖడ్గతిక్కన యందు గలిగినది.

తిక్క:—ఓయి! హరిహరనాథైక్యము నే నెంతచెప్పినను మా ఖడ్గతిక్కన్న వినలేదు. మా పెదతండ్రిగారి యింటి లోని వార్తలు కొనుగొని రమ్ము.

* * * *

భట్టు:—స్వామీ! అవును స్వామీ! ఖడ్గతిక్కన్నగారు స్నానమునకు బోగా ఆయన భార్య సుంకమంచము అడ్డముపెట్టి పసుపు ముద్ద పెట్టినారు. ఇదియేమని యడుగగా.....

పగఱకు వెన్నిచ్చినచో,
నగదే విను మగతనమ్ము నాయకు లెందున్
ముగురాడువారమైతిమి........

తిక్క:—చాలు చాలు! పెదతల్లి కూడ నేమైన యున్నదా?

భట్టు:—ఆమె విఱిగిన పాల కిట్లు వ్యాఖ్యానము చేసినది.

నీ వసినైచి విరిగివచ్చిన
పసులును విఱిగినవి తిక్కా పాలున్ విరిగెన్

తిక్కన్న:—అడుగో ఖడ్గతిక్కన్న. అడుగో ఖడ్గతిక్కన్న. ఓహో ఎంత తీవ్రాకృతిగా నున్నాడు.

సింగంబాకటితోగుహాంతరమునన్
చేడ్పాటుమైయుండి మా
తంగస్ఫూర్జిత యూధదర్శనమున
దృగ్త్కోధమై వచ్చు నో
జం గాంతారనివాసఖిన్నమతి న
న్మత్సేనాపీడె న
చ్చెం గుంతీసుతమధ్యముండు సమర
స్పైమాభిరామాకృతిన్

ఓహో! శివదేవయ్యా! నీవు సాక్షాచ్ఛివుడవని నాకు దెలియును. ఇది యావాడు నీవు చూపించిన భవిష్య దర్శనము. నే నింద యుండెదను భట్టూ! నీవుపోయి యుద్ధవార్త నాకుః దెలియజేయుము.

(మరల మద్దెలం వాద్యములు)

* * * *

భట్టు:—మహాకవీ! ఖడ్గతిక్కన విజృంభించినాడు. శత్రువులు నిలువలేకపోయినారు. కాటమరాజును వాని పిన తండ్రి కొడుకును బ్రాహ్మణుడని యాయనను వధించుట కిష్టపడలేదు. బ్రహ్మరుద్రయ్యయున్న వీర శైవుడు ఖడ్గతిక్కన్నతో యుద్ధమాడెను. వా రిద్దరు నొకరి చేతిలో నొకరు మడిసిరి.

తిక్క:—చాల బాగుగా నున్నది. అతడు విష్ణువును నమ్మడు. ఇతడు శివుని నమ్మడు.

భట్టు:—అయ్యో! తిక్కన్నగారు విషణ్ణులై యున్నారు.

* * * *

కేతన్న:—మహాకవీ! మూలఘటిక కేతన్నను. దశకుమార చరిత్ర వ్రాసి మీకు కృతి యిచ్చిన వాడను. తమ వంటి తత్వజ్ఞులిట్లు విషాదము పొందరాదు.

సీ. సుకవీంద్ర బృంద రక్షకు డెవ్వడనిన వీ
డను వాలుకకు దొడవైనవాడు
చిత్త నిత్యస్థిత శివుడెవ్వడనిన వీ
డను శబ్దమున కర్థమైనవాడు
దశదిశావిశ్రాంత యశుడెవ్వడనిన వీ
డని చెప్పుటకు బాత్రమైనవాడు
సకలవిద్యాకళా చణుడెవ్వడనిన వీ
డని చూపుటకు గురియైనవాడు
మనుమసిద్ధి మహీశ సమస్త రాజ్య
భారధౌరేయు డభిరూప భావ భవుడు
కొట్టరువు కొమ్మనామాత్య కూర్మిసుతుడు
దీన జనతా విధానంబు తిక్కశౌరి.

తిక్క:—మహాకవి! మూలఘటిక కేతన! విషాదము తొలగినదయ్యా తొలగినది. జీవు దాత్మ ప్రశంస కెంత లొంగునయ్యా?

కేతన్న:—ఉభయకవిమిత్రా! శరీర మున్నన్ని నాళ్ళ ప్రారబ్ద ముండును.

తిక్క:—కిమస్థిమాలాం కిముకౌస్తుభంవా
పరిష్క్రియాయాం బహు మన్యసే త్వం
కింకాలకూటః కిమువా యశోదా స్తన్యం
తవ స్వాదు వద ప్రభో మే.

రవీంద్రుని ఒకగీతిక: తెనుగు అనువాదాలు

శ్రీ శ్రీవాత్సవ

రవీంద్రుని శతవార్షికజయంతి వత్సరములో ఆయన ప్రతిభ అనేక విధాల ద్యోతకం చేయడానికి అన్ని దేశాల లోను ప్రయత్నము జరిగినది. భారతదేశంలో అన్ని ప్రాంతాలలోను సంవత్సరముపాటు, కవి రవీంద్రుని స్మృతి చిహ్నంగా ఎన్నో భవనములు నిర్మించారు. ఉత్సవములు జరిపారు. ఉపన్యాసాలు చేశారు. నాటకములు వేయించారు. నవగీతాలు ఆలాపించారు. ఆయన గ్రంథావళిని వివిధ భాషల లోనికి అనువాదం చేయించారు. ఈ సందర్భములో తెనుగులోకూడ లెక్కలేనన్ని అనువాదములు వెలువడినవి. రవీంద్రుని గ్రంథములన్నీ చదివినా చదువకపోయినా ఆయన "గీతాంజలి" బెంగాలీలోకాని, ఇంగ్లీషులోకాని చదువ కల్గితే—కొంతఅయినా ఆ మహాకవి ప్రతిభను అర్థంచేసుకోవచ్చు. ఆ గీతాంజలి వివిధభాషలలో వెలువడినట్లే తెలుగులోకూడ ప్రచురణపొందినది. ప్రస్తుతము పది అనువాదముల వరకు లభ్యమగుచున్నవి. వానిలో మౌలికరచనకు ఎంతవరకు న్యాయము చేకూరినదియు పరిశీలించుట కష్టసాధ్యమే. అనువాదరచన ఒకభాషనుండి మరొక భాషకు పరివర్తనపొందే సమయంలో చీరె అంచుకి "ఉల్టా" వేసి చూపినట్లు "సీదా" అంచుతీరు తెన్నులలో రూపముమాత్రం లీలగా గోచరింప చేస్తుంది కాని అసలు రచన పూర్ణస్వరూపము సాక్షాత్కరింప చేయజాలదని ఒకప్రసిద్ధ ఫ్రెంచి రచయిత అన్నాడు. తెలుగులో గీతాంజలి పొందిన రూపాంతరాలు చూస్తే ఉల్టాకాదుకదా, అసలుస్వరూపమే గుర్తించలేనంత రీతిగా మారినట్లు అనిపిస్తుంది. ఈ సమీక్షలో గీతాంజలిలోని 101 పద్యాలు తీసికొనకుండా మచ్చుకి ఒక గీతికమాత్రం తీసికొని—దానిమాతృకను ఇంగ్లీషులోను, బెంగాలీ లోను ముందు చదువుకొందాం; తరువాత అది తెనుగులో మన కవులు అనువాదం చేసిన విధానమును గమనించుదాం. ఈవిషయంలో—పాఠకుల ఓర్పు, అధ్యయనదృష్టి, నిగ్రహము పరీక్ష లోనికి రావచ్చును. అయినాకాని ఓపికతో భరించి తారతమ్య పరిశీలన చేయగలరని భావిస్తున్నాము.

ఈపరిశీలనకు తీసికొన్న గీతికకు రవీంద్రు డిచ్చిన శీర్షిక "ప్రార్థన". దీనిని 1909లో కవి రచించి ఒక బెంగాలీ పుస్తకంలో ప్రకటించారు. 1911—12 సంవత్సరాల మధ్య తాను స్వయంగా చేసిన ఇంగ్లీషు అనువాదాలలో చేర్చి "గీతాంజలి" గ్రంథములో 35వ గీతముగా ప్రకటించారు.

ఈ గీతంలో కవిభావించిన ఊహాస్వర్గం ఎటువంటిదో నిర్వచించారు. ఆదర్శములకోసం, ఆశయాలకోసం ఆవేశంతో అశ్రాంతము పరితపించే భావుకులు వర్తమాన కాలంతో అసంతృప్తిపొంది—భవిష్యత్తులో బంగారుభూమిని ఊహించుకొని కలలు కంటారు. ఆ భావనా ప్రపంచము ఎక్కడాలేక పోవచ్చు. వాస్తవంగా అది అనుభవైకవేద్యంగాక పోవచ్చును. అదే ఒక "యుటోపియా"గా ఎందరో రచయితలు భావించుకొన్నారు. రవీంద్రుడు తన చుట్టుప్రక్కల వాతావరణంమాని భరించలేక దానినిమించిన అద్భుత లోకంలోనికి రమ్మని పిలుస్తున్నారు. గీతాంజలిలో ఈయన భగవత్ భక్తిప్రేరితుడై శతాధిక గేయములను గానంచేశారు. తన హృదయవీణ మ్రోగించారు. తన కుటీర ద్వారమును సదా తెరిచి యుంచారు. తన జీవనవల్లభుని పదముల సవ్వడికోసం ఆత్రంతో ఎదురుచూచారు. నవరత్న ఖచిత సింహాసనంమీద తననాథుని ప్రతిష్ఠించుకొన్నారు. ఆలయ ఘంటా నినాదాలమధ్యకాక అంతర హృదయాంతరాళాలలో రాజాధిరాజపరమేశ్వరుని ఆరాధించుకొన్నారు. ఆ భక్తిలో ఆ పూజనలో, ఆ నివేదనలో ఉపనిషత్ సూక్తులు ఉలికి పడినవి. వైష్ణవ పదావళి మధురముగా పలికినవి. మౌనవీణలు మ్రోగినవి. అదొక క్రొత్త కంఠము. క్రొత్తస్వరము. క్రొత్తవిధానము. క్రొత్తభావన. ఈ క్రొత్తలో కొంతఅస్పష్టత, కొంత అనవగాహన ఉన్నప్పటికీ, యీ కలస్వనం పాశ్చాత్యులను, భౌతిక వాదులను కూడ ఆకర్షించినది. ఆశ్చర్య చకితులను చేసినది. అందుకే వారు "గీతాంజలి"కి సాహిత్యములో అత్యంతఘనమైన బహుమతి—నోబెల్ పురస్కారము నిచ్చి 1913లోనే గౌరవించారు.

ఆ గీతాంజలిలో ఒకటి అయిన "ప్రార్థన"కు బెంగాలీలో మాతృక ఇది.

చిత్త జేథా భయశూన్య, ఉచ్చ జేథా శిర
జ్ఞాన జేథా ముక్త, జేథా గృహేర్ ప్రాచీర
ఆపన ప్రాంగణ తలే దివస శర్వరీ
వసుధేర్ రాఖేనాయ్ ఖండక్షుద్ర కరి
జేథా వాక్య హృదయేర్ ఉత్ సముఖ హొతే
ఉచ్ఛ్వసియా ఉఠే, జేథా నిర్వారిత స్రోతే
దేశదేశ దిశేదిశే కర్మధారా ధాయ్
అజస్ర సహస్ర విధ చరితార్థ తాయ్
జేథా తుచ్ఛ ఆచారేర్ మరు బాలురాశి
విచారేర్ స్రోతః పథ్ ఫేలేనాయి గ్రాసి
పౌరుషేర్ కొరేని శతధా, నిత్య జేథా
తుమి సర్వ కర్మచింతా ఆనందేర్ నేతా
నిజహస్త నిర్దయ ఆఘాత కరి పితః
భారతేర్ సేయీ స్వర్గకరో జాగరిత

ఈ పాటలో మాటలు చాలావరకు సంస్కృతశబ్దాలే. తెలుగువారికి సులువుగా అర్థంకావచ్చును. భారతదేశం ప్రస్తుతం ఉన్నట్లుగాక మరొకస్వర్గంలోనికి మేల్కొనేటట్లు చేయుమని భగవంతునికిప్రార్థన—"కరో జాగరిత" అనేప్రార్థనార్థకం ప్రయోగించటంచేత—జాగరిత మొనరింపుము, మేల్కొనగ జేయుము అనేఅర్థం స్ఫురిస్తున్నది. మేలుకొలుపు నిద్రపోతున్న వారికిగదా! అంటే అంతవరకు భారతదేశం నిద్రాముద్రితమై యున్నదని తాత్పర్యము. ఈ ప్రార్థన ఎవరికి? "ఆనందేర్ నేతా" "పిత" అని సంబోధించి లోకపిత అయిన భగవంతుని ఆనందనేతగా సంభావించుకున్నారు. ఈ భారతదేశాన్ని ఒక స్వర్గంలోకం లోకి మేల్కొనేటట్లు చేయువలసిందని ప్రార్థిస్తూ కవి ఆ స్వర్గం ఎలాగఉంటుందో దానిని నిర్వచిస్తున్నారు. బెంగాలీలో సంస్కృత సంప్రదాయంప్రకారం యచ్ఛబ్దము, తచ్ఛబ్దము ఉంటాయి. అందుకే "జెథా" అని ప్రతిపంక్తిలోనూ ప్రయోగించి "ఎక్కడయితే" అని సూచిస్తున్నారు. అది తా నూహించుకొన్న స్వర్గవర్ణన. ఇందులోవాడిన పదాలు— చిత్తము, భయశూన్యము, శిరము, ఉచ్ఛము, జ్ఞానము, ముక్తము—తెనుగు తత్సమాలే. అదేకొంచెం మారిస్తే

చిత్తమెచట భయశూన్యమొ
శిరమెచట ఉచ్ఛమొ
జ్ఞాన మెచట ముక్తమొ
దేశదేశములలో దిశదిశలలో కర్మధార
అజస్ర సహస్ర విధముల చరితార్థమగునో-అనవచ్చును

ఇటువంటి పద్యభాగాలు తెనుగువారికి అర్థమవుతూనే ఉన్నవి. ఈపాటలో రవీంద్రుని ఉద్దేశము నాటి సమకాలీన జీవితముపైన విమర్శయే! గుణీభూతవ్యంగ్యముగా తెలియ జేయాలని వారికోరిక. నాటి సాంఘిక, రాజకీయములమీద వ్యాఖ్యయే ఇది. అవి వందేమాతరమ్ రోజులు. వంగవిభజనాందోళన విపరీత పరిస్థితులకు దారితీసి కాగిచల్లారిన సమయం. ప్రభుత్వము పరులది. నిరంకుశాధికారం క్రీనీడలలో ప్రజలు భయభీతులతో అల్లాడిపోతున్నారు. దేశప్రజలకు గౌరవములేదు. స్వేచ్ఛలేదు. స్వాతంత్ర్యములేదు. చదువులపై ఆంక్ష. జ్ఞానముపై నిషేధము. సత్యము పలుకుట అపరాధము. మూఢాచారాలు ఛాదస్తాలుపెరిగి, సరిగా ఆలోచించే శక్తినిపోగొట్టాయి. ప్రజలు తమలోతాము నిర్మించుకొన్న అడ్డుగోడలతో సంఘం ఛిన్నాభిన్నమైపోయింది. ప్రజలు సోమరులయి పోయారు. పనిచేయరు. శ్రమించరు. కర్మధారపైన ధ్యాసలేదు. పౌరుషము నూరు దిక్కులుగా చెదరిపోయింది. అటువంటి నిద్రాముద్రిత జాతిని నిర్దయగా నిజహస్తంతో కొట్టి, తట్టి, లేపమని రవీంద్రుని ప్రార్థన.. యాభై యేండ్లక్రితం గురుదేవుడు ఒక ద్రష్టగా పలికిన వాక్కులు నేటికి నిజము కాలేదు. మనకు స్వాతంత్ర్యము లభించినా—గురుదేవు డూహించిన స్వేచ్ఛాస్వర్గము ఇంకా బహు దూరంలోనే ఉన్నది. తన అభిప్రాయాన్ని బెంగాలీపాటలో చెప్పినదీ, ఇంగ్లీషులోనూ అన్నారు. ఈ గీతానికి రవీంద్రుడు స్వయముగా చేసిన ఇంగ్లీషురచన చూడండి. గురుదేవుని స్వహస్తలిపిలోనే చదువుకోవచ్చును.

Where the mind is without fear
and the head is held high,
Where knowledge is free;
Where the world has not been broken
up into fragments by narrow domestic
walls;
Where words come out from the
depth of truth;
Where tireless striving
stretches its arms towards
perfection;
Where the clear stream of reason
has not lost its way into the
dreary desert sand of dead habit;
Where the mind is led forward
by thee into ever-widening
thought and action —
into that heaven of freedom,
my Father,
let my country awake.
Rabindranath Tagore
Santiniketan

ఇది ఆయనచేసిన అనువాదమే అయినా, బెంగాలీనుండి కొంతవిస్తరించి, కొంతగుస్తరించి మార్పుచేర్పులతో కూర్చినది. దీనిలో అర్థం తేటతెల్లంగా ఉంది. మాటలు పొందికగా కుదిరినవి. అస్పష్టతలేదు. చెప్పవలసిన అభిప్రాయం శక్తివంతంగా చక్కగాచెప్పారు. బెంగాలీలో వట్టి స్వర్గమే అంటే, ఇంగ్లీషులో ఆ స్వర్గానికి స్వాతంత్ర్యం చేర్చి Heaven of Freedom అన్నారు. మేలుకొలుపు అందులోను ఉన్నది. ఇందులోను ఉన్నది. బెంగాలీలో ఆనందనేత అయిన "పిత"ను ఇంగ్లీషులో My Father ఓ నాతండ్రీ అని మాత్రం సంబోధించారు. అంతమాత్రం చాలును అనుకొన్నారు.

ఇంక దీనికి తెలుగు అనువాదాలు చూద్దాం. తెనుగులో హెచ్చుభాగం ఆంగ్ల రచనకు అనువాదాలే. కొన్ని ఆంగ్లమాతృక నుండి హిందీలోకి రూపాంతరం పొందిన తరువాత, హిందీనుండి తెలుగు చేతలు కావచ్చును. ముందు కేవలము వచనములో చేసిన అనువాదం తీసికొందాము :

ఎక్కడ మనసు నిర్భయంగా వుంటుందో
ఎక్కడ మనుష్యులు తలెత్తి తిరుగుతారో

రవీంద్రుని ఒక గీతిక: తెనుగు అనువాదాలు

ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో
సంసారపు గోడలమధ్య ఎక్కడ భాగాలకింద
ప్రపంచం విడిపోలేదో
ఎక్కడ సత్యాంతరాళంలోంచి
పలుకులు బైలు వెడలతాయో
ఎక్కడ అలసట నెరగని శ్రమ తనబాహువుల్ని
పరిపూర్ణతవైపు జాస్తుందో
ఎక్కడ నిర్జీవమైన ఆచారపు ఎడారిలో స్వచ్ఛమైన
బుద్ధి ప్రవాహం ఇంకిపోకుండా వుంటుందో
ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాలలోకీ
కార్యాలలోకీ నీచే నడపబడుతుందో
ఆ స్వేచ్ఛా స్వర్గానికి తండ్రీ నా దేశాన్ని మేల్కొలుపు

చలంగారి ఈ అనువాదము ఇంగ్లీషు రచనలోని భావాన్ని కొంత వరకు తెలుగులో తెలిసేటట్టు చెప్పింది. అయితే దీనిలో యచ్ఛ బ్దము, తచ్ఛబ్దము, బడుధాతువు తెనుగు పలుకుబడికి విరోధాలు. మనుష్యులు తలలెత్తి తిరగడం, అలసట నెరగని శ్రమ తన బాహువుల్ని సాచడం, బుద్ధిప్రవాహం, మనసు నడపబడటం, స్వర్గానికి మేల్కొలపడం, తెనుగు నుడికారాలు కావు. ఇంగ్లీషు వాక్యవిన్యాసములతో అన్వయములతో పలికినవి. బెంగాలీలోని లయకాని, ఇంగ్లీషులోని బలంకాని ఈయనువాదంలో రాలేదు. భావం లీలగా తెలుస్తున్నది. అదే మేలు! మరొక అనువాదం, బెంగాలీ, ఇంగ్లీషు బాగా తెలిసి ప్రసిద్ధ యుగ కర్తలుగా తెనుగు దేశంలో పేరుగాంచిన శాంతినికేతన అంతేవాసి, ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు రచించినది.

ఎచట చేతము భీతి నెరుగదు
ఊర్ధ్వముగ శిర మెత్తి నెచ్చట
సదసదర్థ విచార మెక్కడ
'భాసిలున్ స్వచ్ఛందమై

ఇండ్లు వాకిండ్లనుచు కట్టిన
ఇరుకు గోడలలో ప్రపంచము
భిన్నమై యింతింతలై సం
కుచితమై పడదే దెసన్

వాక్కులెక్కడవెడలు సత్య మ
హాగుహాగుహ్యాంతరాళము—
అలయు కెచ్చట పరమసిద్ధికి
కర్మ చేతులు సాచెడిన్

దారిచెడి నిర్మలవివేక న
ధా ప్రవాహము ఇంకి యెండదు
శుష్కతుచ్ఛాచారదగ్ధము
లయిన యిసుకఎడారులన్

ఎందు ముందుకు నడుచు హృదయము
భవదపార కృపావలంబన
అనవరత విస్తృతములగు న
చ్ఛావ కర్మ పథంబులన్

ఆ మహోన్నత సుస్వతంత్ర
స్వర్గసీమల కభిముఖముగా
మేలుకొలప గదయ్య తండ్రీ
నా మహా దేశ ప్రజన్....

దీనికి రాయప్రోలువారు 'గీతాంజలి' అని శీర్షిక పెట్టారు. ముత్యాలసరము నడకలో పాటగా అనువదించిన కారణంచేత కొన్ని పడికట్టురాళ్ళ అలంకారాలు పొదగవలసి వచ్చింది. "భాసిలున్ స్వచ్ఛందమై" "అభిముఖముగా" "భవదపార కృపావలంబన"—ఇటువంటివి మూలంలోలేవు. కొన్ని భావాలు పునరుక్తిగా చెప్పారు. "కర్మధార"ను వీరు కర్మ చేశారు. కాని తెలుగులో "కర్మ" మరొక అర్థం స్ఫురింపజేస్తుంది అదేమి కర్మయో! "ఇండ్లు వాకిండ్లనుచు కట్టడం" "సద సదర్థ విచారము" మూలంలో కనిపించవు. సత్యము అంత రాళాలలోనుంచి హృదయోద్గతమై మూలంలో పలికితే, వాక్కులు గుహా గుహ్యాంత రాళములో నిగూఢమై పోయాయి. స్వర్గము—బహు వచనంతో స్వర్గసీమలుగామారి "ఆ మహో న్నత సుస్వతంత్ర" విశేషణాన్ని సంతరించుకొన్నది. తండ్రీ అనే సంబోధనలో అయ్య కూడ ప్రవేశించి—భారతభూమిని మార్చి "నా మహాదేశ ప్రజన్" అని వాచ్యంగా చెప్పుకొన్నారు. అర్థము, భావము అస్పష్టంగానే ఉండిపోయాయి. అందు బాటులోకి రాలేదు. ఇంతకంటే అస్పష్టంగా చేసిన మరొక అనువాదం అభ్యుదయకవి కె. వి. రమణారెడ్డిగారిది.

నిర్భీకమై హృదయ మెచ్చట మనేనో
అభిమానమున శిరము ఉన్నతి గనేనో
స్వచ్ఛందమై జ్ఞానమెట రహించేనో
తుచ్ఛ సంకుచితానేక స్వార్థ కుడ్యాలతో
పృథివి శకలప్రాయమై రూపుచెడదో
ఋత హృదయమెచ్చో వచోజన్మస్థానమో
నిర్నిద్రసాధనాదీక్ష ఎచ్చో సర్వ సం
పూర్ణ విస్ఫూర్తికై చేతు లెగయించునో
మృత సంప్రదాయ విర్ణుల సైకతాలలో
స్ఫటికాచ్ఛ యోచనాఝరు లింక బారవో
భావక్రియాపారవిస్తారమునమదికి
త్రోవ జూపించి మునుముందు సాగింతువో
అట్టి స్వేచ్ఛాస్వర్గ ప్రాంగణములో, తండ్రి
తట్టి మేల్కొల్పు మీ నా మాతృ దేశమును"

జంపె తాళంలో నడిచిన ఈ గీతంలో—సంస్కృత సమాసాలు హెచ్చుగాఉండి తక తకిట తక మనుచు భీకరంగా పలుకుతున్నాయి.

స్వర్గములో ప్రాంగణము చేర్చి, తట్టి మేల్కొలుపుమని కోరి, దేశాన్ని "నా మాతృదేశం" చేశారు. "మనేనో" "కనేనో", "రహిం చేనో" అనేవి వాడుక పదాలయినా శ్రవణసుభంగా లేవు. నిర్భీకమై హృదయం మనేనో అనేది—"మనసు ఎక్కడ నిర్భయంగా ఉంటుందో" అనే భావాన్ని తెలియజేయడంలేదు. "మృత సంప్రదాయ నిర్జల సైకతాలు" "స్ఫటికాచ్ఛ యోచనాఝరులు", "భావక్రియాపార విస్తారము" భావాన్ని, అర్థాన్ని మరింత అవ్యక్తం చేసివేశాయి. మూలమ్ములోని అందము తీలగానే విరిచి పోయింది.

మూడు రూపాంతరాలుపొంది—హిందీనుండి తెలుగు లోనికి వచ్చిన అనువాదం చూడండి—రాను రాను శల్యముల వంటి శబ్దములు మిగిలి జీవితప్రాయమైన భావార్థములు చివరకు ఏవిధంగా పలచబడి పోయాయో దీనినిబట్టి గ్రహించ వచ్చును.

ఎచట మనసు నిర్భయమో
ప్రోన్నతమో ఫాలపటము
నిర్నిబంధమో జ్ఞానకళిక
కౌటుంబిక కుడ్యాలయిన
సంస్కృతి విభజింప బడదో
సత్యతటిని ఎయ్యెడ
నిస్వనించునో కలకల
పురుషకార మెయ్యెడ
విజయమంది పూర్ణమగునా
పునీత వివేక నీరధార
శుష్క మౌఢ్య సైకత తటాల
నెక్కడ నోరయదో
నీ కరచాలితమై మానవచేతన
వ్యాపక భావాల సంస్పృశించి
ఉదాత్త క్రియల సవరించునో
ఆ స్వచ్ఛంద లోకాంచలాల కాంతులు
స్వామీ! నా దేశము వెలుగొందనిమ్ము!

త్రిశ్రంలో నడవడానికి యత్నించిన యీగేయాను వాదము కొన్ని మాత్రలు ఎక్కువయి, కొన్ని మాత్రలు తక్కువయి ఎగుడు దిగుడుగా నడిచినది. ఇది యెలాగూ పాడుకోవ డానికి వీలులేదు కనక అర్థమైనా సరిగా విడమరచి చెపుతున్న దేమో అని పరిశీలిస్తే "ప్రోన్నతమైన ఫాలపటము"లోను "నిర్నిబంధమైన జ్ఞానకళిక"లోను, "సత్యతటిని నిస్వనించు కలకల"లోను, "పునీత వివేక నీరధార"లోను "శుష్కమౌఢ్య సైకత తటాల"లోను ఇంకిపోయినది.

"మానవచేతన నీకరచాలితమై వ్యాపకభావాల సంస్పృశించి ఉదాత్త క్రియల సవరించడం" ఏమిటో మరి! తెలుగు తనములేక హిందీ మాటల కూర్పును ధ్వనిస్తుంది. "స్వర్గము" "స్వచ్ఛంద లో కాంచలాల కాంతుల"యింది.

"మేలుకొననిమ్ము" "వెలుగొందనిమ్ము" అయింది. "తండ్రి" "స్వామి" అయ్యాడు.

ఇలాంటిదే హిందీనుండి తెలుగు అనువాద మొకటి ఉన్నది. దాని ప్రసక్తి కూడ ఇక్కడ అనవసరము. తెనుగులో తొలి అనువాదము తేటగీతులలో అదిపూడి సోమనాథరావుగారు వంఘ్యేంధ్రీకృతం చేశారు. అది కూడ ఇప్పుట చెప్పవలసినంత ప్రత్యేకత కలదికాదు. ఇటీవల వచ్చిన మరొక అనువాదం బి. వి. సింగరాచార్యగారు చేసినది—ఉదాహరిస్తున్నాము. ఇది కూడ ఇంగ్లీసు మాతృక నుండి చేసినదే అనుకోవచ్చును.

మానసము భయలేశమేని సోకని సీమ
మానవుడు శిరమెత్తి మసలగలిగెడు సీమ
జ్ఞాన సముపార్జనాసక్తి గలిగిన సర్వ
మానవుల కది యుచితమై లభించెడు సీమ
జగతి సంఘస్వార్థ సంకుచిత కుడ్యాలి
విగతైక్యమై శకలవికలత గనని సీమ
పద పదము సత్య సంపదల బొదలెడు సీమ
ప్రతి యుద్యమము సత్యపథము కాన జను సీమ
సదసద్వివేచనా స్వచ్ఛాంబు ఝరి దుష్ట
సంప్రదాయోషరస్థలి లయింపని సీమ
నిత్య విస్తృత భావనాక్రియా వీధులను
నీవ తోడై మాకు త్రోవజూపెడు సీమ
స్వాతంత్ర్యరుచిరమౌ
స్వర్గసీమగ తండ్రి!
జాగరిత మొనరుపుము
నా జన్మభూమి?

ఇందులో యచ్ఛబ్ద తచ్ఛబ్దాలు విడిచిపెట్టి, తెనుగు తనం పలికేద్విపదగతిరగడలోనికి అనువాదం చేశారు. గతి,లయ, నడక సరిపోయినవి. మూలంలో శబ్దం 'జాగరితం' యథాతథంగా వాడు కొన్నారు. కాని స్వర్గసీమలో 'జాగరితం' చేయమని రవీంద్రుడంటే స్వర్గసీమగా మార్చవలసిందని అనువాదకుని ప్రార్థన. ఇందులో కూడ సంస్కృత సమాసాలు కొన్ని మూలంలోని అర్థాన్ని కొంచెం దూరంచేశాయి. ఛందస్సుకు అనువుగా కొన్ని వ్యర్థ పదాలు దొర్లక తప్పలేదు.

జ్ఞానము ఉచితము అని వీరు "ఫ్రీ" అనే శబ్దానికి అనువాదం చేశారు. బెంగాలీలో అది "ముక్తము" అంటే ఏ సంకెలలూ లేనిదని తాత్పర్యము. జ్ఞానము ఏ శృంఖలాలు లేకుండా స్వేచ్ఛగా లభించే చోటులో తనదేశం మేల్కొనాలని గురుదేవుని భావన.

రవీంద్రుని ఒక గీతిక: తెనుగు అనువాదాలు

బెంగాలీ నుండి యథాతథంగా తెలుగులోనికి అనువాదం చేస్తే యెలాగ పలుకుతుందో తెలుసుకోవడానికి రజనీకాంత రావుగారి అనువాదం నిదర్శనంగా చూపించవచ్చును.

చిత్తమెచట భయ శూన్యమో
శీర్షమెచట ఉత్తుంగమో
జ్ఞానమెచట ఉన్ముక్తమొ
భవ ప్రాచీగృహ ప్రాంగణ తలమున
దివారాత్ర వ్యుత్పత్తి కారేణువుల
క్షుద్ర ఖండములుకావో
వాక్కులెచట హృదయోర్ధ్వ తోచ్ఛ్వసన
మొరసి వెలువడునో
కర్మధార యెట అజస్ర సహస్ర విధాల
చరితార్థంబై అనివారిత స్రోతంబై
దేశ దేశముల దెసదెస పరచునో
తుచ్ఛాచారపు మరు ప్రాంతమున
విచార స్రోతస్విని ఎట నింకునో
శత విధాల పురుషయత్న మెచ్చట
నిత్యము నీ యిచ్ఛా విధి నెగడునో
అట్టి స్వర్గతరి భారత భూస్థలి
నిజ హస్తమ్మున నిర్భయాహతిని
జాగరితను గావింపవో పితా
సర్వకర్మ సుఖ దుఃఖ విధాతా"

ఈ యనువాదములో వంగమాతృకలోని శబ్దమాధురి, లయ తేవడానికీ కృషి జరిగినది. కాని అర్థం మరింత జటిలమైనది. బెంగాలీ పరిమళం ముసురుకొన్నది కాని తెనుగుతనం లోపించినది.

"చిత్తమెచట భయశూన్యము" అను పంక్తి, మనస్సు ఎక్కడ నిర్భయంగా ఉంటుందో అనే భావాన్ని వెల్లడించడం లేదు. అలాగే "శీర్ష మెచట ఉత్తుంగమో" కూడ తెలుగు జాతీయము "తలెత్తుక తిరగడం"కాని శీర్ష ముత్తుంగముకాదు.

ఇలాగ రవీంద్రుని గీతాలు ఎందరెందరో యథాశక్తి అనువాదాలు చేశారు. ఆ విధంగా రవీంద్రుని యెడల తమకు గల భక్తి గౌరవములు వెల్లడి చేశారు. సంతోషమే. ఆయన భావ వైఖరిని లీలామాత్రంగా నయినా ఎవ్వరూ తెలుగులోనికి తేవడానికి ప్రయత్నం చేయలేదు. కాని—భావ ప్రకటనా స్వాతంత్ర్యము అందరికీ ఉన్న యీ కాలంలో, అచ్చు యంత్రము అవలీలగా లభిస్తున్నది. అందరూ అనువాదాలు చేయవచ్చు. అచ్చు వేయవచ్చును. ఆనందించవచ్చును. కాని ఆ రచనలవెనుక మౌలిక రచయిత ప్రతిభను ఎంతవరకు వ్యక్తపరచగలిగారు అనేది ప్రశ్న! వివిధ కవుల అనువాదాలు పరిశీలించుటలో— తెనుగులో వెలువడిన రవీంద్ర రచనలను స్థాలీపులాకముగా పరిచయము చేయుటకు, రవీంద్ర గీతావళి అధ్యయనము చేయుటకు, జరిగిన ప్రయత్నమేకాని, ఆ యా రచయితల కృషిని న్యూనపరచుటకాదు. తేలిక చేయుటకాదు. రవీంద్ర ప్రతిభను, గీతములను అర్థము చేసికొనుటకు, వానిని అనువాదము చేసి ప్రయత్నించువారిలో "ఎందరో మహానుభావులు—వారందరికీ వందనములు."

డా॥ మెల్విన్ కాల్విన్ - 1961 లో నోబెల్ పురస్కార గ్రహీత

రసాయనశాస్త్రంలో ప్రశస్తమైన పరిశోధనలు కొనసాగించినందుకుగాను డా. మెల్విన్ కాల్విన్‌కు 1961 లో నోబెల్ పురస్కారమును ఇచ్చి గౌరవించినారు.

డా. కాల్విన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయములో అధ్యాపకులుగా వుంటున్నారు. ప్రకృతిలో జరుగుచున్న మౌలిక ప్రక్రియలలో నొకటియగు "ఫోటో సింథసిస్" (Photo Synthesis) ను గురించి పరిశోధన జరిపి, దాని రహస్యమును తేటతెల్లము చేసినందుకుగాను ఆయనకు ఈ పురస్కారము లభించినది.

ఫోటోసింథసిస్ అనే ప్రక్రియ ప్రకృతిలో జరగని నాడు జగత్తులో జీవము అనేదే వుండదు. ప్రాణిజాతము యొక్క అస్తిత్వము హతమైపోతుంది. ఈ ప్రక్రియలో పచ్చని చెట్లు భూమిలోని నీటిని, గాలిలోని కార్బన్‌డై ఆక్సైడును— మధుద్రవ్యములను, పిష్ట ద్రవ్యములనుగా, ప్రోటీన్‌లు లేక మాంసకృత్తులనుగా, మరియు ఇతర శక్తిప్రదములయిన మిశ్రమములుగా మార్చుకోగల్గుచున్నవి.

చెట్లలోవున్న హరితధాతువు (క్లోరోఫిల్), సూర్యరశ్మిలోని శక్తికి, నీటిని, అందులో నిహితమైవున్న హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా విడదీయుగల మహత్తను ప్రసాదించుచున్నది. ఈ విధముగా ఆక్సిజన్ లేక ప్రాణవాయువు వాతావరణములో విడుదలను పొందినదై, మనుష్యులకు, జంతువులకు ఉచ్ఛ్వాసమునకు దానిని సమకూర్చి పెట్టుటయేగాక, ఆ వాయువు తరిగిపోకుండ గూడ వృద్ధినిపొందించుచున్నది.

హైడ్రోజన్ లేక ఉదజని, వృక్షములలోనే అతి కృచ్ఛ్రమైన ప్రక్రియల ద్వారా కార్బన్ డై ఆక్సైడుతో కలిసి మధుద్రవ్యములుగా, పిష్ట ద్రవ్యములుగా, మరియు ఇతరమైన శక్తిప్రదాయక ద్రవ్యములుగా మారుచున్నది. వృక్షములలోనే సౌరశక్తి రసాయనిక శక్తిగా మారడమువలన, అట్లా మారగలందులకు అనువైన ప్రక్రియలు వృక్షములయందు నిహితమై వున్నందువలన, వానియందే ఈ పరివర్తనము జరిగి, అట్లా సముత్పన్నములయిన ద్రవ్యములు ఆ వృక్షములకే ప్రత్యక్షముగా ముఖ్యమైన ఆహారమై, పరోక్షముగా శాకాహారులగు జంతువులకు, మనుష్యులకు గూడా ఆహారమును సమకూర్చి పెట్టుచున్నవి.

డా. కాల్విన్ ఇప్పుడు "వృక్షములు కార్బన్‌డై ఆక్సైడ్‌ను ఎట్లా సంవిలీనము చెందించుకొనగల్గుచున్నవో" పరిశోధనలు జరిపి, హైడ్రోజన్ అనునది జలకణముగాను, సౌరశక్తి లేక తేజశ్శక్తిగాను, ఛేదింపబడిన అనంతరం, మధుద్రవ్యములు, పిష్టద్రవ్యములు సముత్పన్నములగుటకుగాను వృక్షములలో నడచుచున్న రసాయనిక ప్రక్రియయొక్క వివిధ గతులను నిరూపించి, ఆ ప్రక్రియ అంతయు ఎలాగున జరుగుచున్నదో అరూహం చేసినారు.

ఈ పరిశోధన పూర్తి యగుటకు దాదాపు 10 సంవత్సరములు పట్టినది.

ఇందులో డా. కాల్విన్, ఆయనతో పనిచేయుచున్న ఇతర శాస్త్రజ్ఞులు, రేడియో ధార్మికతను పొందిన కార్బన్ (బొగ్గు పదార్థము)ను (ఇది అణుశక్తియొక్క అతి శాంత ద్రవ్యములలో ఒకటి) ఉపయోగించి, గాలిలోనుండి కార్బన్ డైఆక్సైడ్ వృక్షములలో ప్రవేశించినదిమొదలు, అది తిరిగి ఆ వృక్షములయందు సముత్పన్నమవుతూవున్న మధుకణముల యందు ప్రత్యక్షమయ్యేడిదాకను, దాని చర్య ఏమో స్పష్టముగ తెలుసుకోగలిగినారు.

ఈ పరిశోధనములలో డా. కాల్విన్ ఆకుపచ్చని ఆల్గా క్లోరెల్లా (Alge Chlorella) ను నీటిలోవుంచి, దానిని సంతతము ఒకే విధముగావుండే కాంతిలోవుంచినారు. ఆ తరువాత ఆల్గా (Alga) కు కార్బన్ డైఆక్సైడ్‌యొక్క సన్నికర్షతను చేకూర్చినారు. ఆ కార్బన్ డైఆక్సైడ్ పట్టి కార్బన్ డైఆక్సైడుకాదు. దానిలో రేడియో ధార్మికశక్తి కల్గిన కార్బన్—14 గూడా కొంత చేరివున్నది. ఈ ప్రయోగముద్వారా ఫోటోసింథసిస్ అనే ప్రక్రియ ఆ వృక్ష విశేషములో జరుగుతూ వుండగా, డా. కాల్విన్, ఆ జరుగుతున్న ప్రక్రియయొక్క ప్రతి అవస్థను జాగ్రత్తగా పరిశీలించి, విపక్షించి, ఎప్పుడు ఏ రకమైన ద్రవ్యము, ఈ ప్రక్రియ

డా॥ మెల్విన్ కాల్విన్ - 1961 లో నోబుల్ పురస్కార గ్రహీత

ద్వారమున ఎట్లు ఉత్పన్నమౌచున్నదో తెలుసుకోగల్గినారు. తెల్పగల్గినారు.

అప్పుడు తేలిన విషయమిది:

కార్బన్ డైక్సైడ్ ముందు, వృక్షములలోవున్న మధుద్రవ్యముతో కలియుచున్నది. అట్లు కలిసి ఒక రకమైన Acid లేక ఆమ్లమును సృష్టించుచున్నది. ఇది ఇందులో జరుగుచున్న ప్రథమ చర్య. ఆ తరువాత ఈ ప్రక్రియ బహు జటిలముగా సాగి, బహువిధములైన రసాయనిక పరివర్తనములను పొంది, అప్పుడు ఈ ప్రక్రియయొక్క పరిపూర్తిని సూచించు వివిధ ద్రవ్యములను సృష్టిచేయుగల్గుచున్నది.

కార్బన్‌డైఆక్సైడ్ ఏవిధముగా మధుద్రవ్యముగా రూపాంతరమును పొందుచున్నదో, అందునిమిత్తము జరుగు ప్రక్రియనుగూర్చి మొదట తెలుసుకొన్నది, ప్రతిపాదించినది డా. కాల్విన్‌వే అని, ఫోటోసింథసిస్ ప్రక్రియా ప్రకరణమున పండితులైన శాస్త్రసిద్ధాంతులందరును చెప్పుచున్నారు. "ఇందులో ఇతరుల సహాయము లేదనను. కాని, అసలు పనివంతా డా. కాల్విన్‌వే చేసినారు. ఆయన ఊహాపోహ, ఉపజ్ఞాబలం వల్లనే ఇది సాధ్యం అయింది" అని డా. ఎర్‌క్లైన్ రాకర్ అన్నారు. డా. రాకర్ న్యూయార్కు నగర ప్రజారోగ్య వ్యవస్థ అధిపతి.

డా. కాల్విన్ మనస్సుకు ఆలోచనలు వాటిలంతట అవే తట్టుతూ వుంటవి. ఇప్పుడు ఈ ఫోటోసింథసిస్‌లో ఇంతవరకు అందని అసలు రహస్యము తనకు ఎట్లా అందినదో, ఆయన ఈవిధముగా తెలియజేసినారు:

"ఒకరోజున నేను, నా భార్య ఎక్కడికో వెళ్ళినాము. ఆవిడ ఏదో పని చూచుకుందామని వెళ్ళింది. నేను కారులో కూర్చున్నాను. అప్పటికి కొన్ని నెలలుగా ఒక విషయం నాలో మెదలుతోంది. లేబొరేటరీలో తేలిన అంశం అది. అది నాకు అంతవరకు తెలిసిన సంగతులతో పొంతనగా లేదు. వేరుగా వుంది. నేను అట్లా కారులో కూరుచుండి, మా ఆవిడ ఎప్పుడు వస్తుందా అనుకుంటున్నాను. అంతలో హఠాత్తుగా, ఆ పొంతన కుదరక పోవడం సంగతి ఏదో నా మనస్సులో మెదిలింది. నాకు ఇంతవరకు అందని సంగతిని గురించిన ఎరుక కల్గింది. అంతా ఒక్కక్షణంలో జరిగిపోయింది. అంతే. హఠాత్తుగా ఆ సంగతి నాలో మెరిసింది. దానితో వృక్షములో కార్బన్ యొక్క గతి, లేక మార్గము ఏమిటో విశదమైంది."

డా. కాల్విన్ 1911 ఏప్రిల్ 7 న మిన్నిసోటా రాష్ట్రంలో సెంట్‌పాల్ అనేచోట జన్మించినారు. 1935 లో మిన్నిసోటా విశ్వవిద్యాలయములో రసాయన శాస్త్రములో డాక్టరేట్ పట్టమును పొందినారు. ఆ తర్వాత ఇంగ్లండులో మాంచెస్టర్ విశ్వవిద్యాలయములో జీవ రసాయన శాస్త్రములో రెండు ఏండ్లపాటు పరిశోధనలు జరిపి, తిరిగి స్వదేశమునకువచ్చి బెర్క్లీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయములో అధ్యాపకులుగా చేరినారు.



డా॥ మెల్విన్ కాల్విన్

ఇటీవల డా. కాల్విన్, ప్రాణం ఎట్లా ఉద్భవించింది, దాని జనిస్థానం ఏమిటి? అన్న విషయమునుగూర్చి తీవ్ర పరిశోధనలు సాగించుచున్నారు. కొన్ని రసాయన ద్రవ్యములు కలిసి సజీవ పదార్థముగా ఎట్లేర్పడగలవో, ఆ మార్గములను గురించి ఆయన పిపాసతో మీమాంసించుచున్నారు. ఉల్కాలలో, ఉల్కాశకలములో న్యూక్లియిక్ ఆమ్లపు లవలేశములు వుండుటను ఈనడుమ డా. కాల్విన్ గమనించినారు. ఇందువలన అంతరిక్షములో కొనసాగుచున్న రసాయనిక పరిణామములను గురించిన ప్రథమ సాక్ష్యము లభించినది.

1947 నుండి డా. కాల్విన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయములో రసాయన శాస్త్రాచార్యులుగా పని చేయుచున్నారు. ఆ విశ్వవిద్యాలయములోని అణుధార్మిక కర్మశాల జీవధాతు విభాగం గూడా ఈయన సారథ్యముక్రిందనే నడచుచున్నది. అందులో కొంతమంది శాస్త్రవేత్తలు 'బైయోడైనమిక్స్' (Bio dynamics) లో పరిశోధనలు చేయుచున్నారు. వారికి

ఈయన నాయకుడు. ఈ Bio dynamics అనే శాస్త్రము, ఫిజిక్సు, కెమిస్ట్రీ, బయాలజీల మిశ్రమము- విడదీయరాని మిశ్రమము.

డా. కార్విన్‌కు శాస్త్రములను పృథక్కరించి పరిశోధన కొనసాగించటము అంతగా నచ్చదు. బహు శాస్త్ర సమవాయముగా ఈ పరిశోధనలు జరుగవలయునన్నది ఆయన వాదము. ఈమధ్య "సాటర్‌డే రివ్యూ" అనే పత్రికలో ఒక వ్యాసమును వ్రాస్తూ, ఇటువంటి పృథక్కరణ విపరిణామములను గురించి ఆయన హెచ్చరించి గూడా వున్నారు. శాస్త్రజ్ఞులు, శాస్త్ర పరిశోధకులు, తమ తమ శాస్త్రములలో పరిశోధనలను చేయుచున్నప్పుడు అవసరము తటస్థించినచో, ఇతర శాస్త్రముల యందు నిపుణులయినవారి సహాయమును గూడ పొందవలయు నని డా. కార్విన్ సూచన చేసినారు. "తమదయిన శాస్త్రము నందు మాత్రమే అభినివేశము కలిగి, అందున మాత్రమే పరిశోధనలు కొనసాగించు శాస్త్రజ్ఞులు, "ఫోటోసింథటిక్ చక్ర గతి"ని గురించి ఏమియు తెలిసికొనలేరు సరిగదా, దానిని వివరించుటయును చేయలేరు" అని ఆయన అనినారు. ఇందుకు ఆయన చెప్పు వాద లక్షణ మిట్లున్నది: "ప్రకృతిలో దృశ్యమానమగుచున్న వస్తుజగత్తులో ఈ పృథక్కరణము లేదు. ఆ ప్రకృతి ఈ జగత్తును ఫిజిక్సు, కెమిస్ట్రీ, బయాలజీ అని వివిక్తముగా విభాగములు చేయుట లేదు."

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయములో డా. కార్విన్, ఆయన సహచరులు కొనసాగించిన కృషిఫలమైన పరిశోధనలు, వర్తమాన ప్రాకృతిక శాస్త్రములో ప్రకృష్టమైన సాధన విశేషములుగా పేర్కొనబడుచున్నవి. ఆధునిక శాస్త్ర పరికరములను ఉపజ్ఞా సహితముగ వినియోగించుచో, చెట్టి సత్ఫలితములు ఒనగూడి రాగలవో, డా. కార్విన్, ఆయన సహచరుల ఈ కృషివలన సువ్యక్తమగుచున్నది.

—యు. ఎస్. ఐ. ఎస్. సౌజన్యంతో]

Statement about ownership and other particulars about newspaper

BHARATHI

1. Place of Publication :
6&7, Thambu Chetty St. Madras-1.
2. Periodicity of its publication :
7th of Every Month
3. Printer's Name :
Sri S. Radhakrishna
Nationality: Indian
Address: 6&7, Thambu Chetty Street, Madras-1.
4. Publisher's Name :
Sri S. Radhakrishna
Nationality: Indian
Address : (As above)
5. Editor's Name;
Sri S. Sambhu Prasad
Nationality Indian
Address: 29, Chamier's Road, Adyar Madras 28.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.

NAME	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	29, Chamier's Road, Adyar, Madras-28.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA,
1-3-1962 Signature of Publisher.

బాభ్రవ్యుని స్వర దర్శనము

శ్రీ గొల్లాపిన్ని వాసుదేవశాస్త్రి

పరమార్థ దర్శనులగు మహర్షులు వారి అపూర్వ ప్రజ్ఞా విలసిత ధార్మిక విజ్ఞానమ్ము నిక్కమునకు భారతీయుల పెన్నిధానము. ఆర్యు లెచ్చటనుండియో భరతఖండమునకు వలస వచ్చిరని పాశ్చాత్యులు లేవనెత్తిన అపూర్వ సిద్ధాంతము మూలమున భారతీయుల మహిమా సమన్విత అవాఙ్మానస గోచరమగు చరిత్ర అవక తవక రాద్ధాంతములతో కుత్సిత ధోరణులతో కొనసాగినది. అట్టి సిద్ధాంతములనే నేడు ఆర్య పండితులు యథార్థ సిద్ధాంతములుగా నమ్మి ప్రమాణీకరించు చున్నారు. పాశ్చాత్యుల నిర్ణయము మేరకైనచో మన ఋగ్వేదాది సమస్త విద్యలును కొన్నివేల సంవత్సరముల క్రిందట రచింపబడినవగుచున్నవి. అంతియేకాని సూర్య సిద్ధాంతోక్త యుగ విభాగముగాని వేదములందలి కాలగణనగాని తదితర పౌరాణిక గాథలుగాని, తదితర దర్శనములు తత్కర్తలుగాని మొత్తము నాలుగైదువేల ఏండ్లలోనే చేరిపోవుదురు. ఇట్టి విపరీత నిర్ణయాదులపట్ల మనవారు చూపెడు సమాదరము దుస్సహమగు విచార శూన్యతనే చాటుచున్నవి.

పాశ్చాత్య పండితులే ఋగ్వేదములోని సర్వాంగీణములగు దైవమానుష నాగరతా విభూతులను విని అచ్చెరుపాటుచెంది ఆర్యుల యుగయుగాంతర నాగరతా విశిష్టతకు కేల్మోడ్చియున్నారు. పైపెచ్చు యజుర్వేదాదులు ఋక్కులకే వ్యుద్ధృతముగా నున్న వనియు, కాబట్టి ఋగ్వేదముకంటె అర్వాచీనములనియు తలంచుచున్నారు. వేదములకున్న త్రయీశబ్దము గాని కనీసము ఉదాత్తానుదాత్త స్వరితప్లుతములనుగాని అవి ఎందుల కేర్పడినవో వానినేల ఆర్యులు ఆ నాటినుండి నేటివరకు అట్లే యుచ్చరించుచున్నారో అను విషయమునుగాని అర్థ మొనర్చి కొని యుండలేదు. ఆథర్వణికమైన విశ్వరచనా విజ్ఞానమును, సామమునకుగల యసంఖ్యాక గతిభేదములను, వీ రేమాత్రము లక్షించియుండలేదు. అందుచేతనే వీరికి వేదములందలి ద్యులో కాది వర్ణనల విషయమై అర్థము స్ఫురించియుండలేదు. ఇంక దేవతల విషయమై మంత్రముల విషయమై వీ రతిశ యోక్తుల క్రింద జమ కట్టుటలో ఆశ్చర్యపడవలసిన పని యేమున్నది? కావుననే ఆర్య విజ్ఞానముపట్ల పాశ్చాత్య పండితులు కనియు కాననివారివలె ప్రవర్తించియున్నారు. కేవల నవ్య చారిత్రకదృష్టి వారి నట్లు కుదింపచేసినది. ఆర్య ద్రావిడ విభాగమును, ఆర్యదస్యు విచక్షణమను మానవుడు కోతినుండి ఆవిర్భవించినాడనుటయును తొలి మానవుని ఆవిర్భావమును గురించిన పాశ్చాత్యుల అభిప్రాయములును మనకు మిక్కిలి వినోదపాత్రములగుచున్నవేగాని విశ్వాసార్హములు గానేరవు. ఆర్ష విజ్ఞానము దాని యనిదం పూర్వ ప్రభావమును కొలబద్దచే కొలువవలెనని తలంచుట వెఱ్ఱిగాక మరేమి? నవ్య విమర్శకులు చారిత్రక దృక్పథమని వ్యామోహపడి యొనర్చిన నిర్ణయముల వల్ల కల్గిన మేలేమి? ఇంతకూ ఆర్యులేదో ఆకించవలని తీర్మాన మొనర్చుటకు పాశ్చాత్య పండితులు పోయిన త్రోవ సమంజస మగునా? అది యట్లుండనిండు.

ధర్మ, అర్థ, కామ మోక్షములను చతుర్విధ పురుషార్థ నియమము అనాదిగా ఆర్యుల సిద్ధాంతమై యున్నది. ఈ చతుర్విధ పురుషార్థసాధనలకే ఆర్యుల అష్టాదశ విద్యలు, నరువది నాల్గు కళలు, అరువదినాల్గు ఉపకళలు మొదలగునవి ప్రవర్తించినవి. పెక్కురు మహర్షులు మంత్రములందలి ఒక్కొక్క విషయమునే గ్రహించి, ఆ యా మంత్ర ద్రష్టలుగా పేరుగాంచియున్నారు. ఈ చతుర్విధ పురుషార్థ నిరూపణము ఈ క్రమము గ్రీకులయొక్క రోమనులయొక్క పద్ధతులలో గానరాదు.

మరియును ప్రణవముగాని, ప్రణవపాదము ప్రణవార్థమునుగాని, ఆయా ప్రణవపాదముల యొక్క వ్యక్తావ్యక్తదశలుగాని, గ్రీకులలో రోమనులలోలేదు. ఆ గ్రీకు రోమనుల నాగరికతా విశేషములువేరు. వాటిదృక్పథములు వేరు. దీనికిని వానికిని సామ్యములు పోల్చిచూచుట అర్థరహితమైన పని. అయ్యైనాగరికతల ప్రత్యేకతలు స్పష్టముగనే కన్పడుచున్నవి గదా! ఇకపోల్చిచూడవలసిన ఆవశ్యకతయేమున్నది!

ఆర్యులలో వివాహవిధి మహర్షి శ్వేతకేతువునుండి ప్రారంభింపబడెనని యొక విమర్శకుడును, శుక్రునిశాపముతోడనే సురాపానము నిషేధింపబడెనని ఒకచారిత్రక లాక్షణికుడును, ఇట్లే యొక్కొక్క ప్రబుద్ధుడొక్కొక్క విషయమును గూర్చి తమతమ అభినవాపారక్రాంతదర్శిత్వమును స్వస్వ గ్రంథములలో వెలయించియున్నారు. సోమపానమునైనను సురాపాన యనియు సిద్ధాంతీకరించినారు. ఇట్టివన్నియూ అపసిద్ధాంతములు ఆర్యుల పురాతన పవిత్రనాగరతను కించపరచుచున్నవి.

మహర్షి వాత్స్యాయనుడు క్రీస్తు కివతలవాడని పాశ్చాత్యులవ్రాతలను నమ్మి యొకభారతీయ ప్రబుద్ధవిద్వాంసుడు స్వగ్రంథమున నుద్ఘాటించెను. మౌర్యచంద్రగుప్తునికి మంత్రిత్వము నెరపినచాణుక్యుడు ఆతనిదృష్టిలో వాత్స్యాయనుడు.

మహర్షివాత్స్యాయనుడు ఆర్యఋషులలో పేర్వాసిగాంచిన ఒకానొక గోత్రకర్త. ప్రసిద్ధమహాకవి బాణుడు వాత్స్యాయన గోత్రజుడే. ఇట్టిగోత్రకర్తలగు ఋషులు ఆర్యులదృష్టిలో అతిప్రాచీన ఋషిమండలికి చేరినవారు. కాని నవ్యులు కారు. అనగా నవ్యసిద్ధాంతులప్రకారము బుద్ధునికివతలివారు కారు.

బుద్ధునికన్న ఎన్నోవేలయేండ్ల క్రిందటి వారు. వీరి వేదయుగము సూత్రయుగము, సంహితాయుగము, పురాణయుగము ఇత్యాది విభాగములు ఆస్తికులగు ఆర్యులకు విశ్వాసార్హములు కావు; ఉపాదేయములునూగావు. ఏలయన్నచో వేదవిభాగకర్తయగువ్యాసుడే అర్వాచీనుడగును. వాల్మీకిరామాయణము క్రీస్తుకు కొంచెె మెంచు మించు ముందువెనుకల వ్రాయబడిన గ్రంథమగును. కాన రామాయణమునకు ఆదికావ్యప్రశస్తి పోవును. ఇంతకు వీరిసిద్ధాంతముల వెంటపోయినచో మనువ్యాసప్రాచేతసాదిమహనీయుల యస్తిత్వమే సంశయాస్పద మగును. కాన వీరి చారిత్రకదృష్టికి ఆర్యు డెవ్వడు హర్షింపడు. సత్కృత మమనరామః.

అర్థకామశాస్త్రముల నధికరించి సమగ్రములగు నిబంధనగ్రంథములను రచించిన మహర్షివాత్స్యాయనుడు పేర్కొన్న మహర్షులలో బాభ్రవ్యు డొక్కడు. ఇత డే కాలమువాడో ఎప్పటివాడో గుర్తించుటకు దగిన యథార్థములు లేవు. కాని పాంచాలుడని తెలియుచున్నది. వాత్స్యాయను డితని విశేషించి గైకొని యున్నట్లు అతని కామసూత్రములలోని అనుక్రమణికయు అయ్యై ప్రకరణముల వట్ల ఇతని నామోచ్చారణయు ఇతనితోపాటు తదితరస్మరదర్శనకారుల స్మరణయు గల మహర్షి వాత్స్యాయనుని పంక్తులు మనకు స్పష్టము చేయుచున్నవి. చూడుడు.

తదేవతు "పునరధ్యర్థశతేన సాధారణ సాంప్రయోగిక కన్యాసంప్రయుక్తక భార్యాధికారిక పారదారిక వైశికౌపనిషదికైః సప్తభి రధికరణైః బాభ్రవ్యః పాంచాలః సంచిక్షేప" అని బాభ్రవ్యుని పెక్కురు కామశాస్త్రప్రణేతలలో నొక్కనిగా గణించి ఏబదిఅధ్యాయములచే డెబ్బదిఅధికరణముల క్రింద బాభ్రవ్యుడు కామతంత్రమును రచించెనని వాత్స్యాయనుడు చెప్పియున్నాడు. తొట్టదొలుత బ్రహ్మయు, ఆటుపై మనువును, ఆటుపై బృహస్పతియు, ఆటుపై శివానుచరుడగు నందియు ఔద్దాలకిశ్వేతకేతువు ఆటుపై బాభ్రవ్యుడు పేర్కొన బడియుండుటచే ఇతడు వాత్స్యాయనునికే చాల పూర్వుడని, మహర్షియని తెలియవచ్చుచున్నది. ఇతని ఏబది అధ్యాయముల గ్రంథమే మైనదో కాని నాకు దొరికిన హంస కిరణావళి యను ఒకానొక ప్రాచీన తంత్రగ్రంథమునుండి ముప్పదిరెండు శ్లోకములు అందే బాభ్రవ్యునిగా పేర్కొన బడినవి దొరకి నందున ఈ వ్యాసము అవసరమైనది. నాకు హంసకిరణావళి నొసంగి యుపకృతియొనర్చిన శ్రీ రాజ్ఞీ వెంకటాచలపతి ప్రసాద చయనులవారు అభివందనీయులు. హంసకిరణావళి సంపూర్ణ తంత్ర మర్యాదాసంయుతము గాన తత్ప్రస్తావన ఇచట అనవసరమని తలంచి కేవల బాభ్రవ్య స్మృతిని గూర్చియే వ్రాయుచున్నాను.

1

"బాభ్రవ్యో భణతిస్మ
సత్ రసికానాం రసావహం
సర్వశాస్త్రేషు యత్రావ్యం
బ్రహ్మతత్ స్మరదర్శనం

సరసా నీరసా జీవా ద్విధాఽ
ద్యానాం ప్రధానతః
సులభః ప్రాణినాం మోక్షః
సహస్ర గథ దర్శనాత్

సారయోషి దధరామృతపానం
సోమపాన శతకోటి సమానం
సోమపాన శతకోటిభిరావ్యం
సారయోషి దధరామృతమేవ"

ఇతి శ్రీ బాభ్రవ్య స్మరదర్శనే ప్రకాశపాదః ప్రథమః

పై మూడు శ్లోకముల శైలి సరిక్రొత్తగా గాన్పించుచున్నదిగదా!! ఇంచుమించు వేదాంత శాస్త్రము లోని పదములకు సాహిత్యములోని రచనారీతులకును ఇందులోని సూత్రీకృతపద్ధతికిని గల సామరస్యమును లాక్షణికులగు పండితులు గమనింపగలరు. చూచుటకు సులభముగా కన్పడినను ఇది శాస్త్రీయ గ్రంథముగాన వ్యాఖ్యానావశ్యకత యెంతయేని గలదు. లేకున్న అపార్థములకు కొదువలేదు. ఆ కొరతను శ్రీచయనులవారు దీర్చియున్నారు. కాని ఇట వ్యాసవిస్తరభీతిచే మూలమునే వ్రాసి మరొకతూరి విపులముగా అర్థవిశేషములను గూర్చి వ్రాయుదును. ఇచటగల గథ శబ్దమును వ్యత్యస్తముగా గ్రహించునది. వేదమున* "అహతం గభే పసః నిజల్గలీతి ధాణికా"" ఇత్యాదులచే చాందసము. మిగిలిన విషయము సులభము.

2

అథ బాభ్రవ్య స్మరదర్శనే విమర్శపాదో ద్వితీయః

మామేతి భారతీ భామా భాషతే సరతే మధు
త త్సత్ర నాభిదార్థం స్యా దలంకారాయ కేవలం
లజ్జాకార్యతయా స్త్రీణా మేవం స్యా న్నవసంగమే
శ్వేతకేతుః పురా చక్రే నిషేధం పరయోషితః

పరిగ్రహేతు తత్రాప ద్రసికానాం హృదంబుజే
రసోదయ విధౌ జాతో ద్వితీయః కల్పపాదపః

యతోఽతీవ పరప్రీతి ర్దుర్లభో ప్యేవ వస్తుషు
పరకీయా పున స్సర్వ నాయికాసు హి దుర్లభా

జాతా శ్రీ శ్వేతకేతోస్తు ప్రసాదా దేవ తావతా
జాతేన రసలాభేన రసో వై స ఇతి శ్రుతేః

ముక్తోపి జాయతే జంతుః ఛాందోగ్యే శ్రూయతే తథా
ఇత్యేతద్వామదేవాఖ్య మతం తూపాసనా విధౌ

---

* ఇందు గథ పదమును వ్యాఖ్యానించుచు శ్రీ చయనుల వా రిట్లు వ్రాసియున్నారు: అత్ర గథ పదస్య వర్ణ వ్యత్యయ శ్ఛాందసః; అహతం గభే పసః నిజల్గలీతి ధాణికా—తైత్తిరీయ సంహిత 7–5–9.

నీరసానాం పున స్త్వత్ర వేదాంత మత యాయినాం
భావనారూప విజ్ఞానాదేవ మోక్షో భవేదితి

కథం జంజన్యతే తాదృ గ్భావనై తద్రసం వినా
త దభావా న్నీరసానాం మోక్షో మరు మరీచికా

కేషాం చి ద్విచికిత్సా త్ర రతి ర్యోనౌ జుగుప్సితే
కించ ప్రజాతి రమృత మానంద శ్శ్రూయతే శ్రుతౌ

అత ఏవ తతో జాతా సృష్టి రేషా సనాతనీ
త ల్లింగ దర్శనం పూజ్యస్థానే దేవాలయేపి చ

దర్శితం లోకరక్షార్థం పూజ్యపాదై ర్మహర్షిభిః
తత ఏత త్సృష్టికర్తుః బ్రహ్మణః పదమీరితం

భోజనం తు తథా విష్ణో ర్జ్ఞేయం పాలయితుః పదం
భోజనేన శరీరస్య పాలనం జాయతే యతః

నిద్రా త స్సర్వ జగతో విస్మృతిస్తు లయాత్మికా
నిద్రాతో రౌద్ర మిత్యుక్తం బ్రహ్మ విష్ణు శివాత్మకం

ఉపస్థంత్రయం యత్త దగ్నివేశేన భాషితం
సృష్టి స్థితి లయానాం చ సాధకం సుఖదం శుభం

అభియుక్త వచో వ్యాప్తి మైథునం మోక్ష సాధనం
ఇతి య త్త త్సృష్టికర్తుః బ్రహ్మణః పద మీరితం

యస్య యత్ర ప్రవృత్తి స్స్యాత్ తస్య తత్రైవ మోక్షదః
ఉపాయం కథితో లోకరక్షణే బద్ధకంకణైః

భారతే సర్వశాస్త్రేషు బ్రహ్మ లాభాత్ పరం నహి
తస్మా దిదం మోక్షశాస్త్రం బాభ్రవ్య భణితం భవేత్

ఇతి శ్రీ బాభ్రవ్యమహర్షి ప్రణీతే స్మరదర్శనే
విమర్శపాదో ద్వితీయః

3

అథ బాభ్రవ్య స్మరదర్శనే ప్రకృతిపాద స్తృతీయః

ప్రకృతిః బ్రహ్మణః పార్శ్వం య దాలంకురుతే తదా
ముముక్షు ర్జీవవత్ ప్రాప్య స్వతో వైముఖ్య మంజసా (సా)

ప్రపంచ లీలా మాతన్వన్ తత్త దావిత్య పక్షయం
ప్రాప్నోతి పూర్ణ వద్బ్రహ్మ విచిత్ర పరిణామతః

య దాలంబా న్నిర్వికార మపీత్థ మవభాసతే
సా స్వతంత్రేతి కిం వాచ్యా స్వాధీనపతికేతి వా

సా భూత్ స్త్రీజాతి సర్వస్వ మత స్త్రీణాం స్వతంత్రతా
ఆజన్మ సిద్ధా త న్మూలం లోకే తాసాం విచేష్టితం

రతౌ సాద్రసహోరాది శృంగారరస గర్భితం
తస్మాత్ రతిః ప్రాక్ ప్రవృత్తేః పితువా తత్ర జాయతే

బహు పుం సేవనం చాతః ప్రాకృతం నహి దోషకృత్
న మాంసభక్షణే దోషో న మద్యే న చ మైథునే

ప్రవృత్తి రేషా భూతానాం నివృత్తిస్తు మహాఫలా
ఆశ్వేతకేతుకాలం స ఆచారో భూ న్నిరంకుశః

నివృత్తి మార్గగా స్తస్మిన్ సామ్యే కాలే తటస్థితాః
అతో జబాల ప్రముఖాః భారద్వా జాతిమాతరః

నా వద్యతా మేవ యాతాః పశ్చా త్కృతనిషేధతః
ఇదానీంతన కాలీన దృశా జుగ్మశ్చ నింద్యతాం

పరమార్థ స్వతా మత్ర స్యా దేవ హృదయంగమః
యత స్సత్పురుష స్సైవ ద్గుణీ ప్రకృతి రంజనః

ఇతి శ్రీ బాభ్రవ్యముని విరచితే స్మరదర్శనే
ప్రకృతిపాద స్తృతీయః

4

అథ బాభ్రవ్య స్మరదర్శనే సమన్వయపాద శ్చతుర్థః

కాంతా కుచాద్రి సంచార జంఘాలం పౌరుషం మనః
త న్మందహాస పుష్పేషు మధు పీత్వా ముహుర్ముహుః

త ద్విలాస విటంకేషు విశ్రమ్య లలితస్వనం
పాయంపాయం గానసారం స్థాయీభావ రసం చిరాత్

పీపీమోక్షే న్నిమ్నద్వాసం నిర్వాణ మధిగచ్ఛతి,
త దిదం మానుషే లోకేఽమృతం దుష్కృతి దుర్లభం

య దిదం శాస్త్ర సంసిద్ధం బ్రహ్మభూయాయ కల్పతే
స చ్ఛాస్త్ర మాగమం ప్రోక్తం శివేన శివతాతయే

శివాయై సరహస్యం తత్ అధిగమ్య గురోః కులాత్
బుద్ధిమా సమవర్తేత సో సిధారా వ్రతం కృశీ

నాస్తి తన్మాదికం లోకే స్త్రీ సమ సర్వ సమ్మస్తు
సై వా త్రాధికృతా మోక్షసిద్ధ్యై యస్మా న్నియంత్రితా

అతిజాగరూకేణ మనసా స్థీయతాం సదా
ప్రమాదో నాధిగంతవ్యో విషయే వ్రతివర్జయేత్

ఇతి శ్రీ బాభ్రవ్యమహర్షి ప్రణీతే స్మరదర్శనే
సమన్వయ పాద శ్చతుర్థః.

చిత్ర భాష

"ధనిష్ఠ" - "సత్యం"

మనడానికి ముఖ్యావసరాలయిన తిండి బట్టలతో తృప్తి చెందడు మానవుడు. "Man does not live by bread alone" అంటారు, మానవత్వపు ఔన్నత్యాన్ని చూడమనే వేదాంతులూ, హ్యూమనిస్టులూను. అతని మెదడుకు కూడా మేత కావాలి, పసరానికిమల్లే కాకుండా. ఫలితం, మనోవికాసంకోసం, ఉల్లాసంకోసం, వినోదవిలాసా లుద్భవించాయి. సంగీత సాహిత్యాలు వెలిశాయి. శబ్ద దృశ్యకావ్యాలూ వచ్చాయి. వినేదానికంటే కనేదే ఎక్కువగా ఆకర్షిస్తుంది మనల్ని. విద్యాభ్యాసంలో Audio visual aids ఈమధ్య ముఖ్యాంగాలుగా రూపొందాయి. చూచిన చిత్రం తేలిగ్గా ముద్రవేసుకుంటుంది మన మనసుల్లో.

సాంకేతికాభివృద్ధి ధర్మమా అని, తోలు బొమ్మలు కాశీ బొమ్మల్లోంచి చలన చిత్రం ఉద్భవించింది. ఈనాడు సినీమా పండిత పామర జనరంజకం. రచ్చబండమీదా, నీలాటి రేవులోనూ పేరంటాల్లోనూ మామూలు జనం మాట్లాడుకొనేది సినీమా గురించే. అధునాతనుల ఆదర్శం వెండితెరకెక్కడం. మూడో చెట్టుకింద, మునివేషంలో మూడు నిముషా లున్నానని ముగ్గురికి డబ్బులిచ్చి సినీమాలు చూపెట్టాడో వెర్రి వెంగళాయి. తారాపథం ఐహిక భోగ భాగ్య సాధకం. కారులమీద జోరు షికార్లూ నృత్య గాన కేళీ విలాసాదులు ప్రత్యేకాకర్షణలు. భూరి విరాళాలు దిగంతర పర్యంతం కీర్తి వ్యాపకాలు. ప్రకృతితత్వమైనా, "నేతి" వేదాంతమైనా, స్టారు లేంపలికినా వేదవాక్కు. ఈ సినీ వ్యామోహంలో, నిత్య జీవితాల్లో పెనవేసుకున్న ఈ చిత్రాలూ, వాటి భాష, ప్రభావాదులు పరిశీలనీయాలు.

సాంకేతికంగా సినీ పరిశ్రమ అభివృద్ధి చెందుతూన్నట్టే, చలన చిత్ర సాహిత్యం కూడా మార్పుచెందుతూ వచ్చింది. ఆదిలో మూకీలకు భాష ప్రసక్తే లేదు. క్రమంగా ప్రత్యక్ష వ్యాఖ్యానాలు, గ్రామఫోను రికార్డుల స్థాయినుండి సెల్యూలాయిడ్‌మీద శబ్దగ్రహణం సాధ్యమవడంతో టాకీ లొచ్చాయి. ఆదిలో సినీమాలూ, నాటకాలూ అన్నీ పౌరాణికాలే. వివిధ రాగాల్లో పద్యాలు పాడుతూ, ప్రేక్షకులచేత "Once more" లు కొట్టించుకోవడం నటకుల ప్రావీణ్యానికి నిదర్శనం. "ఉద్యోగ విజయా"ల్లో 103 పద్యా లున్నాయని ప్రత్యేక ప్రకటనలు. అందుకు తగ్గట్టుగా నిసలైన గ్రాంథిక భాష పండితస్థాయి లక్షణం. ముష్టివాణ్ణి సైతం "భిక్షుకా, తండులమ్ములు నిండుకొన్నవి. నేడు పొండు, రేపు రండ"నేవారు ఛాందసులు. సురభూసుర విలాసాలు చిత్రించే చిత్రాల్లోనూ గ్రాంథికానిదే పై చేయి. వంది మాగధుల "మహా రాజాధిరాజ, రాజ మార్తాండ, రవిరాజతేజ శ్రీ శ్రీ శ్రీ.......................బహుపరాక్"లు నిత్య శ్రవణాలు. నకిలీ కిరీటాలూ, కొయ్యగదలూ, భుజకీర్తులూ నటకులకు శోభ నిచ్చేవి. మహారాజావారు మంత్రి పుంగవుని "సచివోత్తమా, సేమమా!" యని పల్కరించెడివారు. రాచ కార్యభారములో తలవంచి "తమ యనుగ్రహంబం"టూ ఆతని ప్రత్యుత్తరం. శయ్యాగారంలో సైతం "మహారాజ్ఞీ, నీ నాథుడ నాకు ప్రీతి గూర్చి అభీష్టంబులం గొమ్మం"టూ వరదానం. సేవకులకు "వీనిని గొనిపోయి చిత్రవధ చేయుడ"ని ఆజ్ఞ.

రాను రాను ఇటువంటి అసహజ రచనమీద మోజు తగ్గింది. ప్రజల్లో సంస్కరణాభిలాష పెంపొందడంతో సినీమాల్లోనూ, సాంఘికాలు వెలిశాయి. గూడవల్లివారి "మాలపిల్ల" నాటినుండీ ప్రజలకు సాంఘిక ఇతివృత్తాలంటే మమకారం పెరిగింది. కరడు గట్టిన మూఢ నమ్మకాలమీద, దురాచారాల మీదా, ద్వేషం ప్రజ్వరిల్లచేసే నాటి సాంఘికాల్లోని సాహిత్యం ప్రజల్నుత్తేజ పరిచేది. ఇతివృత్తాలు ప్రబోధాత్మకంగా వుండి ప్రజా వాహినిని కదిలించేవి. ఆనాటి "రైతుబిడ్డ", "వందేమాతరం" వంటి చిత్రాల్లో ప్రగతి, జాతీయ భావాలదే పై చేయి. అందు కనుకూలమైన భాష కూడ ప్రజా జీవన విధానం మీద ప్రభావం కనబర్చేది. నిద్రాణమైన జనతను జాగ్రదావస్థలోకి తేవడంకోసం పదిమందికీ అందుబాటులోవుండే సులభ శైలిలో మాటలూ, పాటలూ వుండేవి. ఇతర సాహిత్య విభాగాల్లోలాగే సినీమాల్లోనూ వాడుక భాష ప్రచారం అధికమైంది. అప్పట్నుంచీ దృశ్య కావ్యాలైన సినీమా నాటకాదులకు నవ జీవనం ప్రారంభమైంది.

సనాతనుల సాంప్రదాయ బంధాల్నుండి యువకతరం విముక్తికోసం, సినీమాల్లో ప్రేమ వివాహాలు చిత్రించబడ్డాయి. సినీ కథల్లో పెద్దల బూజు భావాల్నెదిరించిన పిన్నలు, తమకు నచ్చిన పిల్లకు మనసిచ్చి తెచ్చుకొనేవారు. బాధ్యతాయుత ప్రవర్త

నను ప్రోత్సహించేవాటి వెండితెర వివాహాలు, ప్రేమికులకు నూతనోత్సాహాన్ని పుష్టినీ యిచ్చేవి. నాటి "లైలా మజ్నూ", "మల్లీశ్వరి" ప్రేమికులు ఆదర్శ స్వప్న జగత్తులలోనే విహరిస్తారు. అటువంటి చిత్రాలూ ఉన్నత ప్రమాణాన్నందుకొన్నాయి. వాటి భాష కావ్యస్థాయి నంటుంది. అందుకే మల్లీశ్వరి గీతం

"మనసున మల్లెల మాల లూగెనే
కన్నుల వెన్నెల డోల లూగెనే......"

నేటికీ ఆణిముత్యంలా మెరుస్తుంది శ్రోతల మనో కమలాల మీద.

క్రమంగా, పెద్దల వైఖరి మారడంలో, యుగావసరం తీరిన ప్రేమగాథలు, ప్రణయ గాథలుగా దిగజారాయి. సినీమాల్లో "కాలేజి ప్రేమ" వర్ధిల్లింది. ఇంటిముందు కనిపించిన అమ్మాయి, అబ్బాయిలు వీధి చివర ప్రేమించేసుకుంటారు. ఈ చిన్న సైజు ప్రణయ జీవులు పలికే చిలిపి పలుకుల చిత్రణ, వాటికై కూర్చిన సంభాషణల శైలి అంతంత మాత్రంగానే వుంటాయి. పార్కు బెంచీమీద బటానీలుతింటూ, మధ్యలో స్టూడియో వంతెన మీదకు పరుగెడుతారు.

"వయసూ వలపూ నీదే" నంటూ ప్రేయసి యాహ్వానం.
"మది, యెదలో చాపం"టూ ప్రియుని ఫిర్యాదు.

రస సముద్ర కెరటాలు సభ్యతా తీరాన్నెప్పుడూ "చెలి బిగి కౌగిళ్ళం"టూ పొరాడుతాయి.

అవి నిజ జీవితాన్ని ప్రతిబింబించే సహజ సాంఘికాలు కావచ్చు. దాన్ని మరిపించే జానపదాలైనా, ఇహపరసాధక పౌరాణికాలైనా (ఇవి కేవలం పౌరాణికాలు కావనీ, పరలోకాల్లోనూ, ఆ యా దేవతలకు "జై" కొట్టి ఎలక్షన్లలోలా వూరేగించే మానవీయత కనబడి, పాత కొత్త సాంఘిక సమ్మేళన ముండడం చేత ఈ సంకరపదమే వాడటం మంచిదనే విజ్ఞుల మాటకు తలవొంచి) అన్నింటిలోనూ ఈ తేలి(గ్గా) యాడటం కనిపిస్తుంది. అసలు నాయికా నాయకులే ఈ తీరనుంటే పక్క పాత్రల సంగతి చెప్పక్కర్లేదు. "బైకో బైకో పెళ్లి కొడకా", తడిక తీర్పు, నులకమంచం కిర్రు కిర్రులూ, రొయ్యమేపడాలు, జానీ రాణీలు, బహుశా మన సాంస్కృతిక చిహ్నాలు. అదేమంటే పామరజనరంజకాలంటూ పాపాల భైరవులుగా పేద ప్రజానీకాన్ని చూపెట్టడం. ప్రేక్షకుల్లోని ప్రవృత్తుల్ని నేలబారు పట్టించే ఈ ఆటలూ, మాటలూ నిర్మాతలకు కనకవర్షం కురిపించవచ్చు. కొండకచో మోహం మొత్తించనూవచ్చు. వారి (దైవాను) గ్రహబలంబట్టి. అయినా ఈ రకం సంపాదన కానిపని. మత్తుమందు జల్లి జేబులు ఖాళీ చేయడం.

ఈ దళారీ వ్యాపారంలో పెన్నారుల చాదస్తాన్నధిగమించే దొంగదారులు శ్లేష ప్రయోగాలు. సినీ రచయితల్కిందు అందె వేసిన చెయ్యి. పూర్వం కవులు ద్వ్యర్థి త్ర్యర్థి కావ్యాలను రచించి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేవారు. పండితులు రామాయణ భారతాదులకు, వేదాంతరీతిన జీవాత్మ పరమాత్మ, పరంగా వ్యాఖ్యానాలు చేసేవారు. అయితే నేటి సినీ క్షేత్రంలో శ్లేషసంభాషణలలో గుట్టు రసికుల కెరుక. (పెరుమాళ్లకు ఎంతమాత్రం గాదున్మండీ!). ఎంత హృదయంగమసన్నివేశంలోనైనా కొన్ని చోట్ల సంభాషణ రహస్యంగా ఈ దారి పడుతుంది. హిమాలయాల్లో వెండికొండలమీద మంచుగడ్డలమీద కూర్చొని నాయికతో నాయకుడు "మనం ఇప్పుడాడుకొందామా" అని అడుగుతాడు. మరోచోట, రసవత్తర సన్నివేశంలో "మీరు ముందు మొదలు పెట్టండి. ముగింపు నేను చూసుకుంటా" నంటుంది నాయిక నాయకునితో. వీటిలోని గూఢార్థాల్నే (అవి విపరీతార్థాలై ఉండవచ్చు) ప్రేక్షకులు నిత్యం మననం చేసుకుని అనుభవిస్తూ వుంటారు. అసలు ఫ్రాయిడ్ మనస్తత్వ శాస్త్రరీత్యా సర్వత్రా మన నడివడి సెక్సీయం. తాపీవారు మతాచారాలు సైతం కామ స్వరూపాలంటే, కొందరికి కోపమొచ్చినా, అందులో కొంత సత్యం లేకపోలేదు. ఇక కొంత చాలు వేసి, మన ఆలోచనారీతు ల్నాదారి పట్టిస్తే ఆ గాడిలోనే "గుడి గుడి గుంజం" తిరుగుతూ వుంటాయి. ఆ సుడిగుండం నించి బయట పడటం కష్టం.

నేటి కథా సాహిత్యంలో కూడా "ఈ సినీమాల ధర్మమా" అని తేలిక ప్రణయపు అమ్మాయి అబ్బాయిలే ఎదురౌతున్నారు. సంఘటనలూ, సన్నివేశాలూ సినీ మార్కులే. సంభాషణల ధోరణీ ఆ తీరే. ఈ భావతూవ్యానికి తోడు భాషకూడ సాదాగానే వుంటుంది. అక్కడక్కడ హద్దు మీరడమూ కద్దు. సినిమా, పత్రికల తాకిడికి మామూలు జనం ఆ మాదిరిగానే నిత్య జీవితాల్లో వ్యవహరించడం నేర్చుకోవడం అంత కష్టంకాదు. పెద్ద పెద్ద పట్టణాల్లో రోడ్డు పైదు రోమియోలు స్వైర విహారం చేస్తూ వుంటారు. నిన్నటిదాకా "అవారా" పూల శ్లాకులు. నేడు టెరిలీన షర్టులు. శ్రుతిమించి వారు వ్రాసే "ప్రేమ" లేఖల్లోనూ సినీ పరిభాషే. అప్పుడప్పుడు ప్లేటాకు విధంగా తెర వెనక తారలు వేరు. భావిలో మన యువకులంతా ఈ బాపతు వారైపోతే, ఈ నూతన వాతావరణంలో నేటి ఎబ్బెట్టుతనంపోయి అంతా సహజంగా కనిపించవచ్చు. సినీ లోకులు, లోకులు ఈ రకంగా పరస్పరం అనుకరిస్తే చక్రనేమిత్వం సిద్ధిస్తుంది.

భావోన్నత్యాన్నీ, సమాజంమీద దానిప్రభావాన్నీ అటుంచి, నేటి సినీభాషలోని పేలవత్వం గమనార్హం. ఇంద్రలోకంలో అప్సరసల నడుమ, హంస తూలికా తల్పంమీద మూర్ఛపోయి పరుండిన రాకుమారుడు కాని, సిటీలో అదృష్టవశాత్తు అమ్మాయి కారుక్రిందబడి, ఆమెచే ఆసుపత్రిలో చేర్చబడ్డ రాజారావుగాని, తేరుకోగానే అనేస్తాడొక మాట. "నే నెక్కడున్నా"నని. అలాగే సందేహచిత్తులయిన నాయిక, నాయకుని ప్రీతి వచనాల్నిగాని, తన ఆశయ సిద్ధి వార్తని గాని, ఏ మాట విన్నా నమ్మడానికి ముందు కొంచెం ముఖ భంగిమ మార్చి, "నిజంగా!" అంటుంది ఆశ్చర్య సూచకంగా. తరవాత వీలైతే "ఎంత మంచివాడవురా" అంటూ పాడుతుంది, అక్కడక్కడ. లేదా తదనుగుణంగా వర్తిస్తుంది. అథవా నర్తిస్తుంది. అనేక చిత్రాల్లో ఇటువంటివి చూడడంతో వైవిధ్యం లోపిస్తుంది. బహుశా రచయితలు తక్కువ మంది కావడంవల్ల, ఒక్కొక్కరి చిత్రా లనేకం చూడడంవల్ల ఈ సారూప్యం సిద్ధించిందేమో. ఎడబాటు చిత్రణలో నేపథ్యగేయసాహిత్యం కూడా ఈమధ్య ఒకే తీరుగా నడుస్తోంది. అప్పుడప్పుడు పాత్రకు హాని చేయడమూ జరుగుతుంది.

"ఓ బాటసారీ, నను మరువకోయి
ఏనాటికైనా నీదాననోయీ......
మూగవోయిన వీణ శ్రుతి జేసినావూ
మోడువోయిన బ్రతుకు చిగురించినావూ"

మామూలు ప్రేమికులబాట పాట నడవటంతో పాత్ర విపరీతంగా దెబ్బతింది. ఇటువంటి పడికట్టు సంభాషణలతో విసిగిపోయిన ప్రజానీకానికి ఒకచోట నాయకుని "మహాశయా" అని నాయిక సంబోధించడంతో అందులో ఎంతో విలక్షణత కనిపించి ఉల్లాసం పొందుతారు ప్రేక్షకులు. అలాగే "నీ మాట నమ్మ మంటావా" అనడం, మామూలు "నిజంగా!" కు మరోమాట. ఈ చిన్న చిన్న కొత్తదనాలకు సైతం ప్రేక్షకజనం నిరంతర నిరీక్షణ సాగిస్తోందంటే వారి ఓరిమి అద్వితీయం.

ఇక గేయాల్లో రాగం, బాణీ మొదలైన సంగీత విషయాలు శాస్త్ర కట్టు క్రమంగా అంతరించి, లలిత సంగీతమై లాలిత్యమూపోయి "తైతక్క" సంగీతమయింది. హాలీవుడ్ నుంచి బొంబాయివాళీదశనుదాటి దేశవాళీఅయి తెలుగుసీమ ప్రవేశించడంతో అసలుకుమించి అష్టవంకరలూ వచ్చాయి. ఆదిలో పాత్రోచితంగా గేయంవ్రాసి, దానికి సరిపడే బాణీ కట్టేవారు. కాని కాపీట్యూనుల ధర్మమా అని, ముందర హిందీ పాటను పట్టుకొని, దాని కనుగుణ్యంగా గీతంవ్రాసి దాన్ని పాత్రకు అంటగట్టడం జరుగుతోంది. ఆ మాత్రలలో యిమడటంకోసం గేయకవి కృషి చెయ్యాలి. మస్తిష్కాన్ని మర్దించి మథనపడి ఏమీ తోచకపోతే "గోరింటాకూ కోయగబోతే గోళ్ళు కందేనూ!". ఏం చేస్తాం. "విధి రాకాసే కత్తులు దూసె". ఈమధ్య ఈ ఊబిలోంచి క్రమంగా బయట పడుతున్నా, ఇదివరలో సంభవించిన యాంత్రికత కవితను వీడలేదు. ఉర్దూలో లాగ బహుశః కుడి ఎడమైందేమో. చివర తాడు, కోడు, జోడు, పేర్చి

వాడు వస్తే తంతాడూ
ఇది చూస్తే వూరుకోడూ
నిలిచేదెట్టు మన కింక జోడూ

అంటూ పాదాలు పూర్తి చేస్తారులాగుంది. నేటి కవితలో యతి ప్రాసలంటే తీరని దాహం, మాటల్తో ఆడుకోవడం ఎక్కువగాని, సందర్భోచితంగానూ, సహజంగానూ వుండే గేయాలు మచ్చుకైనా కనబడటంలేదు.

ఇదే ప్రాసకోసం పాకులాడ్డం వచనరచనలోనూ కనిపిస్తోంది. చిల్లర మూకను చేరదీసినందుకు కిల్లీకొట్టుకు కయ్యానికొస్తాడొక పెద్ద మనిషి "ఎవడా నీచుడు. మారీచుడం"టూ. మరో విలను "అంతరాలు అంతఃపురంలోనే అంతరించాయి. ఇక్కడ అంతర్యానికే ప్రాధాన్యం" అంటాడు. శిక్షించడం కాదమ్మా, భిక్ష వేడుకొంటున్నాన"ంటుంది మరో పూర్వసువాసిని. నిత్య జీవితంలో అనునిత్యం సంభవించే సన్నివేశాల్లో, ముఖ్యంగా కథాగమనం బింకంగా సాగుతున్నప్పుడు గూడా ఈ విధంగా అసహజమైన కవిత్వాన్నిరికించడంతో సహజవాస్తవికత దెబ్బతింటుంది. అయితే ఈమధ్య సినీ రచనా క్షేత్రంలో ప్రవేశించిన కొత్త నీరు ఈ బాటను వదలి కొంత నవ్యత్వం చేకూరుస్తోంది. సంభాషణల తీరు కూడ మరికొంత మామూలుగా వుండి మనల్నాకర్షించగలుగుతోంది.

ఇక హాస్య రసోత్పాదనకు భాషపడే ప్రసవవేదన వర్ణనాతీతం. వినోదదాయకత్వం కోసం, హాస్యరసం పెంచుతున్నారు మన సినీజనులు. వీలైతే, కథోచితమైనా, కాకున్నా, కొన్ని పాత్రల్నందుకు కేటాయిస్తున్నారు. హాస్య నట చక్రవర్తుల కవి సమర్పిస్తున్నారు యథోచితంగా సత్కరించి. హాస్య నటుని కో రకమైన స్వాభావికోచ్చారణ వుంటుంది. హాస్యంకోసం కొంత వికృత పరుస్తున్నారు వెకిలి చేష్టలకు తగ్గట్టుగా. "చూడు సిస్టర్, అత్తాయ్ మెడ కోలార్ గోల్డ్ ఫీల్డ్". "ఏటంటావ"నే అమాయక ప్రశ్నకు "నానేటంతానూ" అని ఇమిటేషన్ సమాధానమూ. ఇవి కాకుండా కొన్ని "Catch words" ఉంటాయి పదిమార్లుఅని నవ్వించడానికి. "అసలేమైందంటే" అంటూ సినిమా అంతటా చెప్పబోతూంటే ఎప్పుడూ ఎవ్వరో మాని

వేస్తూవుంటారు. ఇక "సగం చాలు" "వచ్చింది గొర్రె" "జంబలక పంచా" వంటివి ప్రజల్లో పూర్తిగా నలిగిపోయాయి. పాశ్చాత్య సాంప్రదాయపు "హలో" ప్రాకృతపు "హలా"గా మారిపోయింది మామూలుమనుషుల్లో. సెలూనులో "గడ్డం గియ్యగురో"అంటే తప్ప మంగలి పలకడు. "ఎక్కండి బాబ్" అని జట్కావాలా ఆహ్వానించడంతో వాతావరణం అంతా సినిమాటిక్‌గా మారింది. ఏపాటవిన్నా, ఏమాటకన్నా సినిమాలే. ఇవి కాకుండా హాస్యం కోసం కొన్ని ప్రాదేశికయాసల్ని కూడా సినిమాల్లో జొప్పిస్తున్నారు. ఒక ప్రదేశపు భాష ఇతర ప్రాంతాల్లో ప్రచార మవడానికిది దోహదం చెయ్యొచ్చు. కాని అటువంటి భాషల్ని కేవలం హాస్యంకోసం ఉపయోగించడంతో, అవి నవ్వుల పాలౌతున్నాయని కినిసేవారు కొందరు. అచ్చ తూరుపు శింహాచలాన్నికరు సృష్టిస్తే, అర్ధ తెలుగు అలివేలును సృష్టించబోయి "పిండా లాభమిల్ల. ఇది వల్ల పని కాదం"టే మానివేశారు మరోరు. ఆదిలో కొత్తదనం మోజు నిచ్చినా, అనుకరణ అనేకం కావడంతో పాత రోత స్థాయికి దిగజారిపోతుందీ ప్రక్రియ.

సినిమాల్లో భాషకు తీరని నష్టం తెచ్చే మరో అంశం డబ్బింగ్. ఇతర భాషల్లోని చిత్రాలు మన భాషలో కనువదిస్తారు, నోట్లో మాటలుబెట్టి, అసలు రచయితల లిమిటెడ్ కంపెనీలో డబ్బింగ్ మహోపనిష్టులు కొందరు. పెదవుల కదలికతో మాట పొంతనానికి రచయిత చూపే చతురతలో, కవితకేకాదు, రచనకూ కరక్కాయే. ఈ భాష ప్రజల్లో నవ్వు పుట్టించడంలేదంటే వారి హృదయ వైశాల్యం మెచ్చుకో దగ్గది. ఏమాత్రం స్వతంత్రించినా, చిత్రాన్ని, వినడానికోమారూ, కనడానికోమారూ వేరు వేరుగా చూడండంటూ ఎత్తి చూపుతారు, విమర్శకులు. అందుకని ఆట, మాట కలవడం కోసం కర్త, కర్మ, క్రియల వరుసక్రమం మారుతుంది. "అయ్యో తెలియదయ్యో, ఇలాంటిది జరుగుతుందని ఎప్పుడైనా" అవగాహనకే అరగంట పడుతుంది. ఇంతకూ "రాముని లోక......."యేమో అసలు తెలియదు. "అపుడూ నేను వెళ్లి వస్తానం"టూ తమిళంతో పొత్తు కుదుర్చుకుంటేకాని పని జరగదు. శ్మశానాల్లాంటి విఘంటువులూ, ఛందస్సుల సర్పసరిష్వంగాలూ, వ్యాకరణపు ఛాందసాలూ వదులుకోవడం ఇందుకేనేమో. ఈ శైలి ప్రభావం మామూలు రచనలపై ఇంకా పడనందుకు సంతసిద్దాం. డబ్బింగేమ భాషలో రచన సాగించడం ఒక నూతన ప్రక్రియగా పరిగణించి భవిష్యత్ రచయిత లందుకు పూనుకుంటే సాహితీ కన్యకు నైలాన్ ధారణ పర్యంతం పూర్తవుతుంది.

ఇక సినీ పత్రికల్లోనూ, మామూలు పత్రికల సినీ విభాగాల్లోనూ ఒక కొత్త విమర్శనా శైలి రూపొందింది. కేవలం మూసబోసిన విమర్శలు కొన్ని "......వారి నటన బాగుంది......నాట్యాలు ముద్దుగా వున్నాయి.......సంగీతం వీనుల విందుగా వుంది........దృశ్యాల ఛాయా గ్రహణం కనుల పసందు నిస్తుంది" వంటివి. ఒకే నమూనా తయారు చేసుకొని, అవసరం వెంబడిని, ఖాళీలు పూర్తి చేసుకొని వాడతా రనుకుంటాము. ఇటువంటి ప్రోటో టైపు విమర్శల్ని సినీ జను లభినందిస్తారేమో కాని మామూలు జనం అంతగా పట్టించుకోరు. వారికి కావలసిన "మిర్చి మసాలా" విమర్శ లందించడంలో ఒక నూతన వ్యంగ్య ధోరణి జనించింది. ఈ శైలి మాటలు నేడు బహుళ ప్రచారంలో వున్నాయి. "రీలాతీతం కాకుండా, సినీ కష్టాల్ని, దుష్టుల్ని ఎదుర్కొని, క్లైమాక్సు కొండ లధిగమించి, కథ కంచికి పోవడంతో గ్రూప్ ఫోటోలో చేరిపోతారంతా"లో శైలి విలక్షణత ఆకర్షణీయం. వీటిలో వాడే "పాత్రకు ఖర్చు రాయించేశారు" వంటివి నూతన ప్రయోగాలు. ఇవి కాక కొన్ని కొత్త సంయోగ పదాలు. సినీవిలనుడు, ఫ్లాపింది వంటి ఆంగ్ల జన్యాలు కొన్ని. మొత్తంమీద ఇటువంటి రచనలు గిల్టీ కజ్జా తెచ్చుకోకపోయినా సినీజనుల్ని కొంత గగుర్పొడుస్తాయి. కంటికి కలికంరాసినా, మొత్తంమీద వారికీ లాభదాయకాలు. ప్రజాదృష్టి నాకర్షించే యిటువంటి విమర్శలు ప్రేక్షకుల సంఖ్య పెంచుతాయంటే సందేహంలేదు. లేకుంటే శరవేగంతో డబ్బాలు తిరిగి వచ్చినా, అవి సరుకులోపంవల్లకాని, విమర్శకులు నేరస్తులు కారు.

దీన్ని కూడా ఈ విమర్శల కోవకే చేర్చి సహృదయతతో స్వీకరిస్తే సంతోషం. ప్రాపాభిలాష మాకూ వుండవే ప్రతి విమర్శ సదా పరిగ్రాహ్యం.

ఆటవెలది

శ్రీ బాలగంగాధర తిలక్

1

ఇసుకడాలను మంటలొరసి కాల్చిన కూజ
మనసులోని కలలమైక మింత
యేని తరుగబోవ దిదియు తపస్సాక్ష్య
మేను కవినో ఋషినో ఏర్పరింపు

ఇంత గ్రీష్మదహన మెగసిన నీ గుండె
మండి మసిగ మసిగ మారునపుడు
నాదు మాట పాట నవపరీమళములు
పట్టి వేళ్ళ తెరల కట్టిచూడు

2

వల్గు గమన రమ్య ఫాల్గుణానిల మొండు
కొండ కొమ్మ తాకి గుండె సోక
మల్లె చెండ్ల దాల్చి మన్మథ వ్యాఖ్యలై
ఆంధ్రభామ లెదుట ఆడినారు

తోట ఆకుపచ్చ పైట తొలగి జార
పూలరొమ్ము నిక్క పొడిచి నిలచె
కొమ్మ కొమ్మ క్రొత్త కోర్కెల చివురుతో
గాలి కదలి పిలిచె కేలుసాచి

పవనుడేల యింత పంతాన పరవళ్లు
త్రొక్కి నిలిచె మావి తోపునందు
తేనె బరువుతోడ తెరపిలేని వలపు
తెలుప లేక ఆమ్ర తెల్లబోవ

3

నేల బారు మనిషి నిలిచి నిలిచి నడచు
పీతవోలె చావు వేళవరకు
ఒక్కసారివచ్చు ఉన్మత్త 'నిముషాన'
చదల కెగిరి రెక్క పొదివిరాడు

కలలతోట నిలిచి కవితలు పాడగా
లేత మబ్బుకొనల పూతమెరుగు
గిరుల ఝరుల తరుల కేళిమై పవనుండు
తావి తరగలొత్తె వావిమరచి

జారుసేసకొప్పు జల్లుపువ్వులతోడ
కనుల కోర్మనంగు కైపునిండ
వేల్పు వెలదిపిండు వినువాకపులినాల
అందెలొరసి మ్రోయ నాడినారు

4

ఇంత చినుకు పడిన ఎంత పొగరుహెచ్చి
పచ్చి గడ్డిపరక పల్లవించె
చిన్ని పువ్వు లొడిగి చిలిపిచిలిపి గాలి
నూగి తూగి నవ్వె నూరినెల్ల!

నిన్న మొన్నగాదె నీ పమిట మొలిచె
చిన్ని మబ్బు వాన చినుకు జిమ్మ
స్నాతయైన లేత జవరాలి హాయలతో
మరుల గొలుపు నెల్ల తరుల చూడు

5

మేలి ముసుగు జార వాలుచూపు నిగుడ
ఒదగలేని పైట ఒత్తి గిలగ
అడుగునడుగునందు ఆనందమే మ్రోయు
ఆంధ్ర కవిత నాది ఆట వెలది

అడుగు కదిపినంత అలవోక నెలవంక
నిలిచె శిరసుపైన నింగివిడిచి
చూపులోని సొగసా సొలపా సోకినయంత
సుడిగతిరిగి గంగ మృదుని విడిచె

6

చినుకు చినుకు వోలె మినుకు మినుకు తార
కొండలోయ కాంతి కురిసినటుల
పసరు పసరు మొగ్గ ప్రథమార్క కిరణాప్తి
పచ్చిమంచు పొగల విచ్చి నటుల

అమృత తత్వమేదో వ్యాపించె నాలోన
సృష్టి మొదటి యూహ స్పష్టమయ్యె
బ్రతుకు బయలునందు భయము గొలుపు పాము
పడగమీద మణిని పట్టుకొంటి

మహత్తర పరివర్తనము - III

[లెనిన్ చెప్పిన సామ్రాజ్యవాద సిద్ధాంత పరామర్శ]

శ్రీ జాన్ స్ట్రాచీ

సామ్రాజ్యతత్వ అవతరణగురించి మార్క్సు, ఏంజిల్సు వచించిన వివరణను క్లుప్తీకరించటంతో క్రిందటి ఉపన్యాసాన్ని ముగించాను. ఇవాళ ఉపన్యాసంలో ఎకాయకిని, నిన్నా, కొంతవరకు నేడూ, అమలులోఉన్న సామ్రాజ్యతత్వాన్ని (అమలు ఉన్నంతవరకు) గురించి ఎత్తుకుంటాను. దాని అవతరణ కాలానికీ, ఈ కాలానికి మధ్య గడచిన అనేక శతాబ్దాల కథను దాటేస్తాను. ఆధునిక సామ్రాజ్యతత్వము మన కాలంలో మనము ఎరిగిన రూపంలో 1870 సం. లో ఆరంభమైనదంటారు. ఈ కాల నిర్ణయం కొంతవరకు అడ్డదిడ్డంగా జరిగినదే. అయినా ఆ కాలం చాలా ప్రాముఖ్యమైనది. ఎందుకనేది మరోక్షణంలోనే చెబుతాను. పెట్టుబడి శక్తిని బాగా కలిగిఉన్న దేశాలు ప్రపంచంలో పెద్ద పెద్ద ప్రదేశాలను అనేకం తమవశం చేసికోవలసిన అవసరాన్ని 1870 సం. లోని పరిస్థితులు మరీ ఎక్కువ చేసినవి. 1870 సం. నకు ముందు సామ్రాజ్యతత్వం పుష్కలంగానే ఉన్నది. కాని అప్పటినుంచీ మరీ ఎక్కువైనది.

ఈ విషయం తెలుపటానికి కొన్ని లెక్కలు వినిపిస్తాను. అవి 1870 నుండి 1900 వరకు అనగా 30 ఏళ్లకు సంబంధించినవి. బ్రిటను 4754 చదరపు మైళ్ల ప్రదేశాన్ని తన వశం చేసికొన్నది. ఆ ప్రదేశంలోఉన్న జనాభా 8 కోట్ల 80 లక్షలు. జర్మని 10 లక్షల చదరపు మైళ్ల ప్రదేశాన్ని తన వశం చేసుకొన్నది. దాని జనాభా 85 లక్షలు. ఫ్రాన్సు 35 లక్షల చదరపు మైళ్లను వశము చేసికొన్నది. దాని జనాభా 260 లక్షలు. నేనిచ్చిన ఈ జాబితాలోని లెక్కలను కూడి, ఆ వచ్చిన మొత్తానికి పైకి చెప్పకుండా అనధికారంగా వీరు తమ ఆధిపత్యం క్రిందకు తెచ్చుకున్న ప్రదేశాలను, వాటి జనాభాను కలుపవలెను. ఈ కాలంలోనూ, 1900 సం. తరువాతనూ సంపాదించిన వాటిలో చాలా భాగం అగ్ర రాజ్యములు తమ పెత్తనం క్రింద ఉండవలసిన ప్రాంతాలు అని, చైనాని విభజించి పంపకం చేసికొన్నవే అని చెప్పాలి. నిజానికి ఈ విభాగం అనేది ప్రపంచంలోని ఎక్కువ భాగాన్ని విభజించుకొన్నట్లే అయినది.

దాని కంతటికీ కారణం ఏమిటి? 1870—1912 లకు నడుమ జరిగిన 40 సంవత్సరాలలోను సామ్రాజ్యతత్వం విజృంభణ ఇంతగా ఎందుకు జరిగింది? ఈ కాలంలోఉన్న వైఖరికి, 1850—60 సం. లలోఉన్న వైఖరికి వైరుధ్యమున్నది. అప్పుడు బెంజమిన్ డిసెరాలీ వంటి కన్సర్వేటివు ప్రధాన మంత్రి కూడా వలసలను గురించి ఇలా తిట్టిపోశారు. "ఈ వలసలను తగలెయ్యా! ఇవి మనకు పెద్ద గుదిబండలుగా ఉన్నాయి" అని అన్నారు. 19 వ శతాబ్దపు మధ్యన సామ్రాజ్య తత్వానికి బ్రిటనులో అతి తీవ్రమైన వైమనస్యముండేది. 1870 తర్వాత ఆరంభమైన అనుకూల వాతావరణానికీ, దానికీ పోలికలేదు.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. సామ్రాజ్య తత్వ అవతరణకు ఆదిలో కారణాలను చెప్పడానికి, మార్క్సు, ఏంజిల్సు మాత్రమే ప్రయత్నించారు. అలాగే 1870 సం. తరువాత జరిగిన ఆధునిక సామ్రాజ్యతత్వవిజృంభణకు కారణాలను వివరించటానికి ప్రయత్నించింది లెనిన్.

ఇక్కడ కాస్త ఆగి, లెనిన్ యొక్క సాంఘిక సిద్ధాంతాలను పరిశీలన చేస్తాను. నిజానికి లెనిన్‌ని ఇద్దరుగా భావించాలి. లెనిన్—సాంఘిక సిద్ధాంతి. లెనిన్—విప్లవకారుడు. విప్లవకారుడుగా ఆయన అందరికీ తెలుసు. తెలియని వారెవరైనావుంటే నా స్నేహితుడైన నటుడు మైల్సు మాల్లెసన్ చెప్పిన కథలోని వ్యక్తితప్ప మరొకరు ఉండరు.

1920 సం. లలో మాల్లెసన్ బ్రిటిషు మ్యూజియముకు వెళ్ళి అక్కడ చదువుతూ ఉండేవాడు. అతను చాలా అనక్తిగల అతివాద సోషలిస్టు. మార్క్సు బ్రిటిష్ మ్యూజియములో చదివినట్లు లెనిను కూడా తన ప్రవాసకాలంలో బ్రిటిషు మ్యూజియములో చదువుతూ ఉండేవాడని జ్ఞాపకము వచ్చినది. ఆ గ్రంథాలయంలో 30 సం. లుగా పని చేస్తున్న ముసలి ఉద్యోగి ఒకడున్నాడు. అతనికి లెనిన్ తప్పకుండా తెలిసి ఉంటాడనీ, ఆ మహాపురుషునిగురించి ఏదైనాసరే వినాలనే కుతూహలంతోఉన్న నా మిత్రుడు ఆ ఉద్యోగిని "లెనిన్ ఇక్కడికివచ్చి చదువుతూ ఉండేవాడు. నీకు జ్ఞాపకం ఉన్నదా?" అని అడిగాడట. ఆ ఉద్యోగికి అది అర్థంకాక అట్టే ఆలోచిస్తూ, "లెనిన్!—ఆ పేరున్న వారెవరు నాకు గుర్తుకు రావటంలేదు" అన్నాడట. "బహుశః అతను తన పార్టీ పెట్టిన లెనిన్ అనే పేరును అప్పుడు వాడక, ఉలియనావ్ అనే తన అసలు పేరునే వాడుతూ యుండవచ్చు! ఆపేరుగలాయన రావడం మీకు గుర్తుందా?" అని నామిత్రుడనేసరికి వెంటనే ఆ గ్రంథాలయ ఉద్యోగి "అవునవును ఉలియనావ్! జ్ఞాపకం ఉన్నాడు. పొట్టిగా—చిన్న గడ్డమూ—ఆయనా! చాలా మంచివాడు. చక్కగా మాట్లాడేవాడు. బాగా జ్ఞాపకం ఉన్నది. ఆయన ఏమైయినాడో తెలుసా?" అని అన్నాడు. కాబట్టి లెనిన్ విప్లవవాది అని ప్రతివారికీ తెలియదు. కాని చాలావరకు అందరికీ తెలుసు. సాంఘికంగా ఆయనకు సంబం

ధించినది వేరే విషయము. సామ్రాజ్యతత్వాన్నిగురించి ఆయన చేసిన సిద్ధాంతాన్ని తీసికొని ఆ సిద్ధాంతములో ఎక్కడ లోప మున్నదీ ఎక్కడ లేనిదీ చెబుతాను. చరిత్ర దృష్ట్యా చూస్తే కొన్ని సందర్భాలలో ఆయన చెప్పినవి తప్పులని తేలినవి. అయితే అంతమాత్రంచేత నేను లెనిన్‌కంటె మేధావంతుడనని, ఆయన కంటె బాగా విషయ పరిశీలన చేయగలవాడనని చెప్పడంకాదు. చరిత్ర దృష్ట్యా ఆయా మహామహుల సిద్ధాంతాలను విమర్శిస్తే, అంతమాత్రంచేత వారికంటె గొప్పవారమని చెప్పుకుంటున్నామని అర్థం తీయకూడదు. విమర్శకునికి సింహావలోకనముచేసే వీలున్నది. "షేక్స్పియరు నాకంటె ఉన్నతుడు. కాని నేను ఆయన భుజాలమీద ఉన్నాను" అన్నాడు బెర్నార్డ్‌షా. కాబట్టి ఒక విధంగాచూస్తే అర్థ శతాబ్దం క్రిందటి సాంఘిక సిద్ధాంతుల భుజాలమీద మనం ఉన్నట్లే. ఎందుకనంటే అప్పటికి, ఇప్పటికీ జరిగిందేమిటో తెలుసు. భలానివిధంగా జరుగబోతుందని వారు చెప్పిన దానితో, వాస్తవంగా జరిగిన దానిని పోల్చి చూడవచ్చు.

సామ్రాజ్య తత్వాన్ని గురించి లెనిన్‌యొక్క సిద్ధాంత మేమిటి? 1870 సం. నుండి ఈ సామ్రాజ్యతత్వం విజృంభించి, విస్తరించి, అంటే ప్రపంచాన్ని దాదాపు సంపకం చేసికోటానికి కారణమేది? ఈ ప్రశ్నలకు లెనిన్ ఈ విధంగా సమాధాన మిచ్చాడు: 1870 సం. ప్రాంతంలో పెట్టుబడి పంథాలో అభివృద్ధి చెందిన దేశాలు అన్య దేశాలలో పెట్టుబడి పెట్టక తప్పిందికాదు: ఆయన చెప్పిన సమాధానము స్థూలంగా సత్యంగానే ఉన్నది. దీనికి సంబంధించిన లెక్కలను పరిశీలిస్తే లెనిన్ చెప్పిన దానిని కాదన వీలులేదు. విశిష్ట బ్రిటిషు ఆర్థికవేత్త అయిన ప్రొఫెసరు కెరెన్‌క్రాస్ 1870—1913 సం. లలో 'స్వదేశ విదేశాలలో చేసిన పెట్టుబడులు' అన్న పుస్తకంలో ఇచ్చిన లెక్కలను పరిశీలించుదాము. ఆ సంవత్సరాలలో బ్రిటను తను కూడబెట్టగలిగిన మొత్తాలన్నిటిలోను సగముభాగము విదేశాలలో పెట్టుబడి పెట్టినట్లు తేలుతుంది. నా సహచరుడైన హెరాల్డ్ విల్సన్‌వేసిన లెక్కల ప్రకారము జాతీయ ఉత్పత్తిలో 7% విదేశాలలో పెట్టుబడి క్రింద వెళ్లినది. ఇవ్వాళ్ల అనగా 1960 సం. లో పాశ్చాత్య దేశాలు తమ జాతీయ ఉత్పత్తిలో 1% వెనుకబడిన దేశాలకు అప్పుక్రింద, సహాయంక్రింద ఇవ్వటాన్ని గురించి తర్జన భర్జన సాగిస్తూ ఉంటే, వెనుకవారు 7% విదేశాలలో పెట్టుబడి పెట్టడం అంటే ఎంత ఘనమైన విషయమో మనకు బోధపడగలదు. అయితే అప్పుడు లాభాలను సంపాదించాలనే ఆశ వ్యక్తులలో విజృంభించకపోలేదు. లెనిన్ మొట్ట మొదటగా చెప్పినదే ఇది.

అలా చెప్పి ఇలా ప్రశ్నించాడు. "విదేశాలలో ఇంత పెద్ద పెట్టున పెట్టుబడులు పెట్టడానికి కారణమేమిటి? విదేశాలలో ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడులను వెచ్చించటానికి కారణమేమిటి?". దానికి ఆయనే ఇలా సమాధాన మిచ్చాడు: వారికి వేరే మార్గాంతరం లేక అలా చేయక తప్పలేదు. స్వదేశంలో అంతా భారీ ఎత్తున లాభసాటిగా పెట్టుబడి పెట్టటానికి అవకాశం లేకపోయింది.దానికి Monopoly పెచ్చుపెరిగిపోయి,జాతీయాదాయము సరిసమానంగా పంపకం కాకపోవటమే కారణము. స్వదేశంలో ప్రజలను ఆర్థికంగా అతిహీనస్థితిలో ఉంచటంవల్ల వారి వస్తూత్పత్తి విక్రయం సాధ్యంకాకపోటం మూలాన, ఇతర దేశాలలో పెట్టుబడి రూపేణ వెచ్చించటానికి వెళ్లవలసి వచ్చింది. సామ్రాజ్య దేశాలవారు ఇలా అన్య ప్రదేశాలలో వెచ్చించటం మొదలు పెట్టటం సాగించేసరికి లాభసాటిగాఉండే ప్రదేశాల కోసం వారిలో వారు పెనుగులాడవలసి వచ్చింది. దాని ఫలితము ప్రపంచాన్ని తమకు తాము పంపకము చేసికొనడము. ఆ తరువాత సామ్రాజ్యయుద్ధంలో బలా బలాలనుబట్టి పునః పంపకము చేసికొనటము జరిగినది.

ఇలా చెప్పడం ప్రపంచస్వరూపాన్ని లెనిన్ చేసిన చిత్రణను అతిక్లుప్తంగా ముక్తసరిగా మూడు ముక్కలలో చెప్పడమే అవుతుంది. పెట్టుబడి దేశాలకు సామ్రాజ్య తత్వమనేది తప్పనిసరి అవుతుంది. అన్య ప్రాంతాలను తమ వశం చేసికొని, అక్కడ పెట్టుబడులనుపెట్టి, రాజ్యాధికారంతోనూ, సైనిక బలంతోనూ వాటిని రక్షించుకొనకపోయినట్లయితే వారు తెప్ప తిరగవేయవలసి వస్తుంది. సామ్రాజ్యములు లేకపోతే ఈ దేశాలు కూలిపోతాయి. అక్కడ పనివారు మాడిపోతారు. జనం లక్షలకొద్దీ నిరుద్యోగులవుతారు. ఈ స్థితి, కొద్ది కాలంలో విప్లవాన్ని తెచ్చిపెడుతుంది. ఇలా సిద్ధాంతీకరిస్తూ, తన అవసాన కాలం వచ్చేనాటికి (రష్యా అధిపతిగా ఉన్నప్పుడు) సామ్రాజ్యాధిపత్య దేశాల పతనానికి సామ్రాజ్య సాధన విధానాలనే నమ్మకానికి వచ్చేశాడు. పాలక దేశాలనుండి పాలితదేశాలను విడదీస్తే పాలక దేశాలు పడిపోతాయనీ, వారి ఆర్థిక జీవితము విప్లవము ద్వారా చితికిపోతుందని ఆయన విశ్వసించాడు. ఇదే, "లండన్ పారిసులకు వెళ్లే మార్గము పెకింగు మీదుగా వెళుతుంది" అన్న ఆయన ప్రసిద్ధ వాక్యముల అంతరార్థము.

అయితే ఆయన సిద్ధాంతము ఎలా పని చేసింది? ఆయన చెప్పినట్లు జరిగిందా? కొంతవరకు జరిగినదనటం నిస్సందేహం. ఆయన చిత్రించిన స్వరూపం, ఆయన జీవితకాలం నాటి కున్న ప్రపంచముయొక్క నిజ స్వరూపమనే చెప్పాలి. 1870 సం. నుండి 1900 సం. వరకు ఫ్రాన్సు, జర్మనీ, బ్రిటను లందు అమలులోఉన్న ఆర్థిక విధానములు సామ్రాజ్య తత్వమును తప్పనిసరి చేసిన సనటానికి సందేహంలేదు.

అయితే లెనిన్ సిద్ధాంతాన్ని నేటి మన ప్రపంచంతో పోల్చి చూడండి. నే నిదివరకే చెప్పిన మహావిశేషమొకటి మనకు కనబడుతున్నది. దాని విషయమై సందేహానికి తావు లేదు. గత 16 సం. ల లోను పెట్టుబడిదారీ సామ్రాజ్యాలు తమ సామ్రాజ్యాలను పరిత్యాగం చేయుటమో, పోగొట్టుకొనటమో జరిగింది. ఈనాడు అవి లేనేలేవని చెప్పవచ్చును. ఈ పదహారేళ్లలోను బ్రిటను (చరిత్రలో 16 సం. అంటే చాలా అల్పమైన కాలం) తన సామ్రాజ్యంలో 10 ఇంట 9 భాగాలను వదలివేసింది. దానికి సంబంధించిన లెక్కలనిస్తాను వినండి. 1945 సం. లో ప్రపంచ జనాభా 2225 మిలియనులు. అప్పుడు వారిలో 600 మిలియనులు వైటుహాలు (White Hall)పరి

పాలనక్రింద ఉన్నారు. 1961 సం. వచ్చేసరికి వైట్‌హాలు పరిపాలన క్రింద ఉన్నవారి సంఖ్య 50 మిలియనులు కూడా లేదు. అంటే 550 మిలియనులు ఏదో ఒకవిధంగా స్వతంత్రులైనారు. మహావిస్తీర్ణమైన బ్రిటిషు సామ్రాజ్యము ఇలా అంతరించిపోవటము, ఒక పరివర్తనక్రమానికి పెద్ద ఉదాహరణ. బ్రిటిషు సామ్రాజ్యం తరువాత పెద్దవైన ఫ్రెంచి, డచ్ సామ్రాజ్యాలకూ (కొంత అయిష్టత కనుపడినా) ఇంచుమించు ఇదే జరిగింది. ఫ్రెంచివారు తమ సామ్రాజ్యాన్ని నిలుపుకొనడానికి, దూర దృష్టి అనేది లేకుండా, ఇండో—చైనానుండి అల్జీరియావరకు పోరాటం సాగించి తప్పు చేశారని నాకు తెలుసు. అయితే అంతిమఫలితము మాత్రము ఒకటే. వారి సామ్రాజ్యము పోయింది. హాలెండ్ చాలా చిన్న దేశము. కాని దాని సామ్రాజ్యం చాలా పెద్దది. భాగ్యవంతమైన ఇండోనీషియా సామ్రాజ్యాన్ని వదలుకోటానికి వారికిష్టంలేక పోయినది. దానిని నిలబెట్టుకోటానికి ఘట్టిగా పోట్లాడారు. కాని ఇతరుల మోస్తరే అదీ నమసిపోయింది. బ్రిటను మోస్తరు స్వచ్ఛికంగా శాంతియుతంగా వదలుకున్నా, ఇతరులవలె ఇతర విధంగా వదలుకున్నా ఫలితాలు మాత్రము ఒకే విధంగా తయారయినాయి. అతి విస్తీర్ణమైన వలసరాజ్యాలు అంతరించిపోయినాయి.

సామ్రాజ్యాలు ఇలా అంతరించటంవల్ల పూర్వ సామ్రాజ్య దేశాలకు ఏం జరుగుతుందని, లెనిన్ బ్రతికియుండి, ఆయనను అడిగితే, "ఏముంది ఆ దేశాలలో పెట్టుబడి విధానము కూడా పోయింద"ని ఆయన సమాధాన మిచ్చేవాడని నా నమ్మకము. అది సాగటం అసాధ్యమని ఆయన వప్పుకొనేవాడు. ఇలా అనుకునేది ఒక లెనినేకాదు. సామ్రాజ్యం లేకపోతే బ్రిటను నాశనమైపోతుందని కన్సర్వేటివులూ అనుకునేవారు. ఈ అభిప్రాయాన్ని సెసిల్‌రోహడ్స్ చాలా గట్టిగా నమ్మి వాదించినవాడు. ఈయన దక్షిణాఫ్రికాను కైవశం చేసికొనటంలో చాలా పెద్దపాత్రను ధరించినవాడు. 1895 సం. లో సామ్రాజ్య వాదానికి అనుకూలంగా ఇంగ్లండులో ఈయన ప్రచారం సాగించాడు. బ్రిటనుకు కనుక సామ్రాజ్యం పోయినా, ఇంకా విస్తరించకపోయినా ఇంగ్లండు నాశనమవడం, దాని ప్రజలు తిండిలేక మాడిపోవటం జరిగి, ఆ ప్రజలు విప్లవం లేవతీస్తారని విశ్వాసం చేసేవాడు. ఆయన చెప్పిన దిది. "బ్రిటను జనాభా 40 మిలియనులను ఈ భీకరమైన అంతర్యుద్ధంనుండి రక్షించాలంటే, అదనపు జనాభాకు స్థిరావాసము కల్పించటానికీ, మన పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువులఅమ్మకానికి అవకాశం ఏర్పడ్డానికి, మన రాజకీయనాయకులు క్రొత్త ప్రదేశాలను సంపాదించాలి. నేను ఎప్పుడూ చెబుతున్నట్లు సామ్రాజ్యాలు మన మన్నిక సమస్యతో పెనవేసికొనినవి. అంతర్యుద్ధం రాకుండా ఉండాలంటే సామ్రాజ్య వాదులు కావాలి."

ఇలా అనుకునేది ఒక లెనినే కాదన్నమాట.

నేను తెల్పబోయేది మీరు వూహించవచ్చు. వారు చెప్పిన దానిని జరిగినదానితో పోల్చడమే నేను చేయదలచినది. కొద్ది కాలమైన 16 సం. లలోనూ బ్రిటిషు సామ్రాజ్యం అంతరించింది. మీలో కొంతమందికి నమ్మశక్యంకానిది, కొంతమందికి రుచించనిది అయిన ఒక విషయాన్ని గమనించగోరుతాను. అది ఇది. బ్రిటనేకాదు. ఫ్రాన్సు, జర్మనీ, హాలెండ్ దేశాలు ఆర్థికంగా కూలిపోకపోవడమేకాక, మునుపటికంటె మంచిస్థితిలో ఉన్నాయి. ఆ దేశాల ప్రజల, కార్మికుల జీవన ప్రమాణము వారి వారి సామ్రాజ్యాలు అతిఉచ్చస్థితిలో ఉన్నప్పటికంటె ఎక్కువ స్థాయిలో ఉన్నవి. సామ్రాజ్యాలు పోయిన తరువాత ఆ దేశీయులు అంతర్యుద్ధం లేవతీస్తారని లెనిన్, సిసిల్‌రోహడ్స్ అన్న దానిని గురించి సోషలిస్టునైన నేను ఏమనుకోవాలి. ఆ ప్రజలు అంతర్యుద్ధం అనేది లేవతీయకపోగా, వారు కన్సర్వేటివులకు వోటు చేయకుండా కూడా ఆపలేకపోతున్నాము.

కాబట్టి లెనిన్ సిద్ధాంతం ఎక్కడో గాడి తప్పింది. కాదంటారా! ఈ సిద్ధాంతాలు చాలా అపూర్వమైనవి. లెనిన్ సిద్ధాంతం అపూర్వమైనదే. వీటిని వాస్తవంగా సంఘటిల్లిన దానితో పోల్చి చూడమని ప్రార్థిస్తున్నాను. చరిత్ర పరిణామ క్రమంలో ఏది ఎలా జరుగబోతుందో ఎవరూ చెప్పలేరంటే అది మహామహులైనవారిని కించపరచటంకాదు. కాని వాస్తవంగా సంఘటితమైన పరిస్థితులను పురస్కరించుకొని సిద్ధాంతాలను పరీక్షించకపోతే చెప్పలేనంత హాని జరుగుతుంది. అలా పరీక్షించకపోతే మత సంబంధమైన విశ్వాసములను నమ్మినట్లే కాలదోషం పట్టిన సిద్ధాంతాలను నమ్ముతూపోటం జరుగుతుంది. అందువల్ల పెద్ద తప్పులు జరగటం కద్దు.

పెట్టుబడి దేశాలలో వచ్చిన ఈ అపూర్వ సాధారణ అభివృద్ధిని ఆధారం లేకుండా మిమ్మల్ని నమ్మమనడంలేదు. మీరు కావలసిన, లెక్కల నన్నిటినీ పరిశీలించుకోండి. సామ్రాజ్య తత్వంవల్లబాధపడినవారికి సామ్రాజ్యాలు పోయిన తరువాత కూడా పూర్వముకన్న మంచి స్థితిలో ఉన్నారని వినడం అంత ఆహ్లాదకరంగా ఉండదు. బండగా చెప్పాలంటే మీరు మా సామ్రాజ్యాలను లాగివేయటంవల్ల మా కేమీ నష్టము కలుగలేదనేది వినడమే మీ కిష్టముండదు. దొంగతనం మానేసి సతమ సుఖంగా బ్రతుకుతున్నాడంటే అతన్ని గురించి గుసగుసలు సాగుతూనే ఉంటవి.

కాబట్టి నే చెప్పవలసినది త్రోసివేయుడానికి వీలులేని వాటిలో ఒకటి. అది నిజం కాబట్టి ఇది ఇలా జరగటానికి కారణాలేమిటో చెప్పటానికి ప్రయత్నించనుకాని మా విధానాలను బాగా మార్చుకోగలిగియుండటమే ఈ మార్పుకు ప్రధాన కారణము. వాటిలో ముఖ్యమైనది ఆదాయపు పంపకము. అది ఎంతో పరివర్తన చెందినది. ప్రజాభిప్రాయపు వత్తిడివల్ల పెట్టుబడిదారీ విధానస్వభావము విపరీతముగా మార్పు చెందినది. ఈ సందర్భంలో 'సామ్రాజ్యతత్వము' అన్న లెనిన్ పుస్తకంలోనుంచి ఒక భాగం వినిపిస్తాను. ఇది ఎప్పుడూ ఎవరి దృష్టికీ రాదు. ఆ భాగంలో అతను చెప్పినది ఆయన ప్రతిభకు నిదర్శనము. పెట్టుబడిదారీ దేశాలలో ఇలాంటి పరివర్తనకనుక వస్తే, వారికి సామ్రాజ్యాల అవసరం ఉండదన్నారు. ఆయన అది గ్రహించారు. ఆ మీదట అది చెప్పారు. కాని వాస్తవానికి అలాంటి మార్పులు జరగవని అన్నారు. జరిగితే మాత్రము పెద్ద పెట్టుబడిదారులకు

సామ్రాజ్యాల అవసరముండదన్నారు. ఇది ఆయన పుస్తకం నాలుగో ప్రకరణం మొదట్లో ఉన్నది.

"పెట్టుబడిదారీతనము కనుక పరిశ్రమలతోపాటు సమానస్థితిలోలేని వ్యవసాయమును అభివృద్ధి పరచకలిగితే, ప్రతి చోట, సరిగా తిండి లేక, బీదస్థితిలో ఉన్న జన సామాన్య జీవన ప్రమాణాన్ని పెంచగలిగితే (సాంకేతిక విజ్ఞానం విపరీతంగా లభించినా ఇది జరుగలేదు) పెట్టుబడికి అవకాశం లేదనే మాట రాదు. కొన్ని దేశాలలో వ్యవసాయవిధానం వెనుకబడిఉండటం మూలంగానూ, (జన సామాన్యం అతి బీదస్థితిలో ఉండటము మూలాన) పెట్టుబడి "పండిపోయి" లాభసాటిగా వినియోగించ టానికి వీలుకాక అన్య దేశాలకు వినియోగించే అవసరం ఏర్పడు తుంది."

పెట్టుబడిదారీ విధానంలో, ఈమధ్య వచ్చిన మార్పులను, అది సాధించగలిగితే, సామ్రాజ్యతత్వం విదేశాలపైన విజృంభించే అవసర ముండదని లెనిన్ గ్రహించినట్లు మీకు తేట తెల్లమైనది. రాజకీయంగా ఆయన చెప్పినది తప్పు. ఆర్థికంగా చేసిన పరిశీలన ఒప్పు. సామ్రాజ్యాల అవసరము లేకుండా మన్నగల మార్పును పెట్టుబడిదారీ తనములో ప్రజాభిప్రాయము సాధించగలదనే విషయాన్ని ఆయన గణన చేయలేదు.

అయితే యిపుడు సంఘటిల్లిన మార్పులకు మరో సంజాయిషి చెప్పవచ్చు. మీ రేమంటారని మీరు కమ్యూనిస్టు నెవరినైనా అడిగితే నేను చెప్పిన దానికి భిన్నమైన సమాధానం ఇస్తాడు. సామ్రాజ్యాలు లేకుండా పెట్టుబడిదారీ దేశాలు నిలువటం అనేది లేదనీ, సామ్రాజ్యాలు అంతరించిన వనేది కేవలం భ్రమ అనీ, పాలిత దేశాలకు స్వాతంత్ర్య మిచ్చా మనేది కాగితంమీద తప్ప అనుభవ్వలేదనీ, వారిని పీడించుకు తినడం యథాప్రకారం సాగిపోతూనే ఉన్నదనీ అంటాడు. స్వతంత్రులు అయ్యారన్న ఇండియా, ఇండొనేసియా దేశాలు, నిజానికి స్వతంత్ర దేశాలు కావని అంటాడు. కాబట్టి పెట్టుబడిదారీ దేశాల సంపదపెరగటం సామ్రాజ్యాలను వదిలేయటం వల్ల కాక, పేరుకు స్వతంత్రంగా ఉన్న దేశాలను పీడించుకు తింటం వల్లనేనని అంటాడు. బ్రిటన్‌లో ప్రముఖ కమ్యూనిస్టు వ్యాఖ్యాత అయిన శ్రీ పామీదత్తు కొన్ని సంవత్సరాల క్రింద తాను వ్రాసిన "బ్రిటను—బ్రిటిష్ సామ్రాజ్య క్లిష్టస్థితి" అనే పుస్తకంలో యిదే అభిప్రాయాన్ని ఉద్ఘాటించారు. ఒక అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ఉన్న "పాల్ బారన్" అనే ఆయన మొన్న నీమధ్యనే తాను వ్రాసిన పుస్తకంలో ఇదేవిధమయిన అభిప్రాయాన్ని వెల్లడించారు. కమ్యూనిస్టులు ప్రతిపాదించే ఈ వాదనకు మనం ఏ సమాధానం చెప్పాలి ?

మొన్న ఈ సమావేశంలోనే ఒకరు యిదే ప్రశ్నను ఈవిధంగా అడిగారు. "ఇండియా స్వతంత్రం అయినప్పటి నుంచి బ్రిటన్‌కి, ఆ దేశానికి గల ఆర్థిక సంబంధాలలో వచ్చిన మార్పులను మీరు ఎలా నిర్వచిస్తారు ?" ఆ దేశాల సంబంధాలలో నిజమైన మార్పు రాలేదనే ఈ ప్రశ్న వేసినవారు సందేహిస్తున్నట్లు ద్యోతకమవుతున్నది. నన్ను యీ ప్రశ్న వేసినప్పుడు దానికి సమాధానంగా ఇలా ఎదురు ప్రశ్న వేస్తాను. అది యిది : "ఇండియా స్వతంత్ర దేశం అయినప్పటి నుంచి బ్రిటన్ భారత ఆర్థిక సంబంధాలలో మారకుండా ఉన్న దేమిటి ?"

స్వాతంత్ర్యం రాకముందు భారత ప్రభుత్వం చేయ జాలని వాటిని లెక్కపెట్టుకోండి. మొదట అసలు దేశీయ ప్రభుత్వం అనేది లేదు. భారత ప్రభుత్వం బ్రిటిష్ ఉద్యోగులతో నిండి బ్రిటిషు ప్రభుత్వంచే ప్రతిష్ఠింపబడినది. ఈ ప్రభుత్వం భారతదేశంలో పన్నులు ఏలా ఉండాలనేది నిర్ణయించేది కాదు. అలా నిర్ణయించటానికి "వైట్ హాల్" (White Hall) నుండి అనుమతి పొందాలి. దిగుమతుల మీద తన ఇష్టానుసారం సుంకములు వేయుటానికి వీలులేదు. లాంకషైరు నుండి వచ్చే గుడ్డల మీద సుంకములు వేయుటానికి బ్రిటిషు ప్రభుత్వఅంగీకారము అవసరము. ఇవాళ భారతదేశము తనకు యిష్టమైన సరకులనే దిగుమతి చేయనిస్తున్నది. ఇలాంటి ఏర్పాటు అప్పుడు వూహించటానికి కూడ వీలులేదు. బ్రిటిషు ప్రభుత్వం అనుమతి లేకుండా ఏ దేశము నుండి అప్పు తీసుకోడానికి వీలులేదు. 19 వ శతాబ్దంలో బ్రిటిషువారు ఏర్పరచిన జమీందారి విధానాన్ని, భూస్వామిక విధానాన్ని ఆ ప్రభుత్వం మార్చలేకపోయింది. ఇది 1947 సంవత్సరానికి ముందున్న స్థితి.

1947 సంవత్సరంనుండి ఏర్పడిన ప్రభుత్వము సంపూర్ణమైన భారతప్రభుత్వము. (ఇంగ్లీషువారికి దానితో ఏ సంబంధము లేదు.) ఈ ప్రభుత్వము పైన పేర్కొన్న మార్పులను చేయగలదు. అలా చేస్తున్నది కూడా. వారు కోరితేనే తప్ప లాంకషైరు గుడ్డ ఒక గజం కూడ భారత దేశానికి దిగుమతి కాలేదు. నిజానికి ఈ మధ్య దిగుమతి అయినది బహు కొద్ది. భారతీయులు తమ దేశంలో పరిశ్రమలు నిర్మించుకోడానికి అవసరమైన భారీ యంత్రసామగ్రిని కొన దలిచారు. అందుకని తమ విదేశమారకధనం అంతా అందు కోసం ఖర్చు చేయకుండా కూడబెట్టు కొంటున్నారు. ఆ కారణంగా బ్రిటను నుంచే కాక, యితర దేశాలనుండి కూడ కేవలం అత్యవసరమైన వస్తువులను కూడ సాధ్యమైనంత తక్కువగా కొంటున్నారు. దిగుమతులను గట్టిగా, తీవ్రంగా అరికడుతున్నారు. జమీందారి విధానాన్ని దాదాపు రద్దు చేసారు. అంతేకాకుండా తృతీయ పంచవర్ష ప్రణాళికను ఇప్పుడే ఆరంభించారు. ఈ ప్రణాళిక ద్వారా తమదేశంలో భారీ పరిశ్రమలను నిర్మిస్తున్నారు.

ఇంత జరుగుతున్నా కూడా బ్రిటిషు భారతదేశాల ఆర్థిక సంబంధాలలో మార్పు లేదని వాదించటం చూస్తే కేవలం కళ్ల కెదురుగుండా కనబడేవాటిని చూడ తిరస్కరిస్తున్నారని చెప్పాలి. కేవలం సిద్ధాంతసౌందర్యంతో ముగ్ధులయిపోయే మహత్వానికి యిది మంచి ఉదాహరణ. ఒక సిద్ధాంతం సరియైనది కావచ్చు. దాని కర్త ఆనాటి మహా ప్రతిభాశాలి అయిఉండవచ్చు. అయినప్పటికి ఈనాడు మన హయాములో

కనపడుచున్న అనేక సంఘటనలకు కారణ మేమిటో వివరించలేక పోవచ్చు. వారి సిద్ధాంతాలు వారి కళ్లకు గంతలై అడ్డుపడితే చూడలేనివారు తప్ప మరెవరు భారతదేశము 1947 సంవత్సరానికి పూర్వము వలస దేశంగా ఉండటం ఎంత నిజమో, ఆ తర్వాత స్వతంత్రదేశంగా ఉండటం అంత సత్య మనేది ఎవ్వరూ కాదనలేరు.

ఒక దేశము స్వతంత్రమా, అస్వతంత్రమా అన్నది తేల్చటానికి ఆ దేశము, అనగా, ఆ దేశప్రభుత్వము మరియొక దేశముపై యుద్ధము ప్రకటించగలదా ? లేదా ? అనే దాని మీదనే ఆధారపడి యుంటుందని నా అభిప్రాయము. ఇదే విషయం భారతదేశ స్వతంత్రప్రతిపత్తికి కడపటి లక్షణంగా పరిణమించింది. బ్రిటిష్ ప్రభుత్వము అతి తెలివి తక్కువగా ఏమాత్రం దూరదృష్టి లేకుండా, భారతదేశాన్ని సంప్రదించకుండా 1939 వ సంవత్సరంలో జర్మనీ మీద యుద్ధం ప్రకటించింది. కాంగ్రెసు ఆరంభించిన పోరాటంలో పాల్గొనని వారు కూడా సంపూర్ణస్వాతంత్ర్యమును కోరటానికి అది కారణమైందని భారతదేశంలోనే నా మిత్రులు కొందరు తెలియజేశారు. కాబట్టి పూర్వం వలసలైన యీ దేశాలు ప్రస్తుతం స్వతంత్రమైనా యన్నది పరమ సత్యం. ఒక విషయం మీ మనస్సులలో ఆడుతూ ఉండవచ్చు. స్వాతంత్ర్యమంటే నేను నిర్వచించిన ప్రకారము సింగపూరు స్వతంత్రము కాదు. అవునని ఎవరూ అనరు. కాని స్వతంత్రము అయ్యే మార్గంలో ఉన్నది. తనకు తాను స్వతంత్రంగా ఉండవచ్చు. లేదా మరొకరితో సమాఖ్యలో చేరవచ్చు. ఆ విషయమై నేను మరొక మాట కూడా అనకూడదు. అది మీరూ, మలయా ప్రభుత్వము నిర్ణయించుకోవలసినది. మీ పంచవర్ష ప్రణాళికను గురించినది చదివాను. మీ ప్రదేశ సాధారణ అభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి పాటుపడే ప్రభుత్వము మీకున్నది. స్వాతంత్ర్య సిద్ధికి ఇది అతిముఖ్యమైన వాటిలో ఒకటి. మీ కడపటి స్థితి ఎలా రూపొందుతుంది అనేదాన్ని గురించి నేను వ్యాఖ్యానించకూడదు. కాని స్వాతంత్ర్యానికి ఏదో రూపంలో సింగపూరులో వేళ్ళు నాటుకున్నాయన్న మాట నిజము. స్వతంత్రులైన తరువాత కూడా ఈ దేశాలు పీడింపబడటం ఆగలేదనే కమ్యూనిస్టు వాదన లన్నిటికీ నేను సమాధానం ఇవ్వలేదని నాకు గుర్తుంది. కొత్తగా స్వాతంత్ర్యమును పొందిన దేశాలను వారికి పెట్టుబడి పెట్టిన దేశాల ప్రభుత్వాలు గాని, వ్యాపార సంస్థలు గాని కొంతవరకు పీడించుకు తినడానికి అవకాశ మున్నది. దానిని నేను కాదనను. నిజానికి అనుభవంలేని ప్రభుత్వాలు అప్పును తెచ్చుకోటంలో నష్టదాయకమైన ఒప్పందం చేసుకోవచ్చు. పీడనకు గురి కావచ్చు. మీ ప్రభుత్వం విదేశాలనుండి పెట్టుబడిని తెచ్చుకోవలసి యున్నందున, ఈ విషయంలో మీరు భయపడుతున్నారని నాకు తెలిసింది. మీ రడగకపోయినా ఈ అంశాన్ని గురించి సలహా యిస్తున్నాను. మీ కలాంటి ప్రమాదాన్ని గూర్చిన భయం అనవసరం. ఎందుకంటే మీకు సమర్థత గల ప్రభుత్వ మున్నది. సాధారణంగా స్థానికప్రభుత్వము అసమర్థమైనపుడే అలాంటిది జరుగటానికి వీలున్నది. అయినా ఇంకా కట్టుదిట్టాలు చేయాలంటే మీకు కావలసిన పెట్టుబడిని ఏ ఒక్క దేశంనుంచీ కాకుండా వేరువేరు దేశాల నుండి తెచ్చుకోండి. వివిధ దేశాలమీద పంచండి. ఏ ఒక్క దేశంమీదా ఆధారపడవద్దు. పెట్టుబడిదారీ విధానమున్న దేశాల నుంచే కాక, ప్రపంచంలో ఉన్న అన్ని దేశాలనుండీ తీసుకొనండి. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కులను ఉన్న దేశా లన్నిటినుంచీ తీసికొనండి. స్వతంత్రమైన దేశంలో కూడా పీడనకు అవకాశమున్నది. ఈవిధమైన ప్రమాదంనుండి తప్పించుకొనడానికి ఇది మార్గం.

రాజకీయ స్వాతంత్ర్యము మాత్రమే చాలదు అన్న కమ్యూనిస్టు వాదనలో కొంత సత్యము లేకపోలేదన్న అభిప్రాయానికి ఇది దారితీస్తుంది. రాజకీయ స్వాతంత్ర్యము, నిర్మాణానికి, అభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు అవకాశ మిస్తుంది. ఆ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లేకపోతే అది కేవలము కపట బురఖా క్రింద తయారవుతుంది. ప్రజలు, దాన్ని పెద్ద మోసంగాను, మాయగానూ భావించే పరిస్థితిగా కల్పించవచ్చు. ప్రముఖ స్వీడిషు ఆర్థికవేత్త, ఆచార్య గున్నార్ మిర్‌డల్ ఈ అంశాన్ని చాలా చక్కగా వివరించారు. ఆయన ఈమధ్య సింగపూరు వచ్చి వెళ్లారు. "ఆర్థిక సిద్ధాంతము—అభివృద్ధి చెందని ప్రదేశాలు" అన్న పేరుతో యీమధ్యనే ఆయన ఒక గ్రంథం వ్రాశారు. దానిలో యిలా చెప్పారు :

"వెనుకబడి బీదరికములో ఉన్న ఒక దేశము, రాజకీయంగా స్వతంత్రమైనపుడు, రాజకీయ స్వాతంత్ర్యము రావడంతోనే ఆర్థికాభివృద్ధిని సాధించే మార్గంలోకి మామూలుగా వెడుతుంది అని అనుకోకూడదని, అంతకు పూర్వము తెలియకపోయినా తరువాత తెలుసుకుంటుంది."

ఇలా చెప్పిన దానిని సర్దటానికి ఈవిధంగా చెప్పారు :

"వారు గెలిచిన, గెలుచుకుంటున్న రాజకీయ స్వాతంత్ర్యము వారికి వెలలేని ఆస్తి. తమ అవసరములకు తగినట్లుగా తమ వ్యవస్థలను దిద్దుకోవచ్చు. ఏక ప్రపంచరాజ్య మనేది లేనపుడు ఇతరదేశాలతో సరిసమానత్వం సంపాదించటానికి, తమ దేశములో ఆర్థిక ప్రమాణమును హెచ్చించటానికి వారి విధానాలు జాతీయబద్ధంగా ఉండితీరాలి. స్వీయ ప్రయోజనానికి కూడా తోడ్పడుతేనే తప్ప, బీదదేశాలు అంతర్జాతీయ అవసరాలను గురించి ఆలోచించకూడదు."

ప్రపంచ ప్రసిద్ధి గల ఈ ఆర్థికవేత్త చెప్పినదాన్ని విని ధైర్యం తెచ్చుకోండి. ఎలాగైనా సరే అభివృద్ధిని సాధించాలి అని అభివృద్ధి చెందని దేశములు ముందు దీక్ష వహించాలి. ఆయా దేశములనుండి పండితు లనేవారు వచ్చి అంతర్జాతీయ అవసరములను దృష్టిలో ఉంచుకొని ఆలోచించవలసినదని మీకు ఉపదేశిస్తే, వారి ఉపదేశాలను లెక్కపెట్టకండి. అభివృద్ధిచెందని దేశాలకు కావలసినది అభివృద్ధి. మిగిలినవి ఆ తరువాతనే.

ఇప్పుడు నే నీ నిర్ణీత అభిప్రాయానికి వచ్చాను: ఒక దేశము స్వతంత్రం అయిన తర్వాత కూడా పీడనకు గురి అవుతుందన్న కమ్యూనిస్టు వాదము కొంతవరకు నిజము. అయితే ఆ సమస్యను క్రొత్తగా స్వతంత్రమైన దేశాలు పరిష్కరించుకోవాలి. పరులు స్వప్రయోజనమునకు తమను వినియోగించుకొనకుండా నిరోధించుకోవడం గూడా అవసరం. కేవలం బలహీనమైన, అసమర్థములైన, ప్రభుత్వములే అలా చేయలేకపోతాయి.

అక్కడక్కడ ఇంకా కొంత పీడనసాగిస్తున్నా పూర్వపు పెట్టుబడిదారీ దేశాలు నేడు అనుభవిస్తున్న కలిమి అంతా వాటి వల్లనే ప్రాప్తిస్తోందని చెప్పటానికి సాధ్యంకాదు. మీరు కావాలంటే, లెక్కల ద్వారా దీనిని ఋజువు చేయుగలను. బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడి దేశముల జాతీయఆదాయములకు వీటికి సంబంధము కనపడదు. ఈ దేశములు సాధించిన అభివృద్ధికి, అక్కడక్కడ యింకా మిగిలి సాగుతూన్న పీడిత కార్యకలాపము కారణము కాదు. తమ పెట్టుబడిని స్వదేశము లందే కేంద్రీకరించుట ద్వారానే సాధించగలిగారు. ఇది స్వార్థపరత్వమని మీరు అనవచ్చు. అసలు విషయము ఏమిటంటే మేము మిగుల్చుకో గలిగిన మొత్తములో మునుపటి కంటె ఎక్కువగా మా దేశములోనే పెట్టుబడి రూపంగా వ్యయం చేశాము. అది మాకు లాభించింది. ఇది సామ్రాజ్యవాదమునకు పూర్తిగా వ్యతిరేకమైన పద్ధతి.

మరొక పెద్ద వ్యక్తి చెప్పిన దానిని వినిపించి ముగిస్తాను. జోసఫ్ స్టాలిన్ Political Testment అని ప్రసిద్ధికెక్కిన గ్రంథం నుంచి ఉల్లేఖిస్తాను. "రష్యాలో సోషలిజం యొక్క ఆర్థిక సమస్యలు" అన్నది ఆయన వ్రాసిన చివరి వ్యాసం. ఇది ఆయన 1952 సం. లో వ్రాసారు. తన జీవితం చివరిదశలో ప్రపంచస్వరూపము తన కెలా కనపడుచున్నదో చిత్రించారు. ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఆయన చూడలేకపోయినట్లు తేలిపోయింది. 'లెనిన్' యిచ్చిన మందమైన కళ్లజోడుతోనే ఆయన చూచాడు. పెట్టుబడి దేశాలన్నీ అమెరికా కాళ్లక్రింద పడి నలిగిపోతున్నాయని ఆయన నమ్మాడు. నమ్మి యిలా వ్రాశాడు :

"పశ్చిమ యూరపు, జపాను, తదితర పెట్టుబడిదారీ దేశాలను అమెరికా రేషనుల మీద పెట్టింది. పశ్చిమ జర్మనీ, బ్రిటను, ఫ్రాన్సు, ఇటలీ, జపాను—అమెరికా కోరలలో ఇరుక్కున్నాయి. పరాజితులలో పెద్దవైన జపాను, పశ్చిమ జర్మనీలు-అమెరికా బూడ్సుల క్రింద పడి మూలుగుతున్నాయి.'

ఇది ముఖ్యంగా బ్రిటిషు పాఠకునికి కోపము తెప్పించే వ్యాఖ్యానము. పశ్చిమ జర్మనీ, జపానులు అమెరికా వారికి గారాబుతనయులుగా ఉన్నారని మా అభిప్రాయము. వీరి కిచ్చిన అప్పులు, చేసిన సహాయము, మరెవరికీ యివ్వలేదు. చేయలేదు. అందుకని ఆ రెండు దేశాలు అమెరికను బూడ్సుల క్రింద అణగిపోయి మూలుగుతున్నాయని ఎవరన్నా అంటే, మాకు చిరాకు కలుగుతుంది. ఆధునిక యుగంలో ఏ రెండు దేశాలు—కమ్యూనిస్టు కానివ్వండి, పెట్టుబడిదారీ పద్ధతి దేశాలు కానివ్వండి - అవి కోలుకున్నంత మహోద్ధృతంగా, శీఘ్రంగా కోలుకోలేదు. అమెరికా వారి కిచ్చిన ప్రత్యేక సహాయాన్ని చూచి మాకు ఈర్ష్య కలిగింది. మొత్తంమీద బ్రిటనుకు, యూరపుకు ఇచ్చినదానికి మేము అమెరికాను తప్పు పట్టటానికి వీలులేదు. ఇంతకీ అమెరికా చేసిన ఉపకారం ఏమిటి ? మా అందరినీ "రేషనుల నిచ్చి" బ్రతక మన్నదని స్టాలిన్ అన్నాడు. 1958 సం. వరకు అప్పు పేరుతో గాని, సహాయమనే పేరుతో గాని, యూరపుకు అమెరికా యిచ్చిన మొత్తం 40 బిలియనుల డాలర్లు. అలాంటి, అంటే 40 బిలియనులు యిచ్చే, రేషను మీద నన్ను ఎవరేనా పెడితే బాగుండును ! దాని కోసం ఎంతకాలం మూలగమన్నా మూలుగుతాను.

సమర్థుడు, తీక్ష్ణబుద్ధి అయిన స్టాలిన్ వంటి వానికి వాస్తవ స్థితి ఇంత అసహ్యముగా కనపడటము చాలా విచిత్రము. అందరిలోకీ బలమైన (పెట్టుబడిదారీ దేశములలో) దేశము, తనకన్న బలహీనమైన వాటిని, బలహీనమైనవారిని అరమరలేకుండా, నిర్దాక్షిణ్యంగా ఉపయోగించుకొనక తప్పదని వారి సిద్ధాంతమని ఆయనకు తెలుసు. కాబట్టి, అమెరికా అలా చేస్తూ ఉండిఉండాలి. తన కళ్లముందు జరిగే దానినే ఆయన చూడలేదు. తమ సిద్ధాంతమంటే కలిగే ఈ గ్రుడ్డితనమే, ఆయన తన వ్యాసములో మరొక సాధారణ అభిప్రాయమును తెలుపటానికి కారణమైనది. కమ్యూనిస్టు, పెట్టుబడిదారీ దేశాల మధ్య యుద్ధం వచ్చే అవకాశం కంటె యూరపు, జపానులు (ఈ రెండు రెండవ తరగతికి చెందిన పెట్టుబడిదారీ దేశాలు) ఒక వైపున ఉండి వారి మధ్యా, అమెరికా మధ్యా యుద్ధం వచ్చే అవకాశం ఎక్కువ ఉన్నదని ఆయన వ్రాశాడు. పెట్టుబడిదారీ దేశాల మధ్య యుద్ధం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని ఆయన వూహ. 40 బిలియన్ల డాలర్లు పుచ్చుకున్నందుకు ప్రతిగా బ్రిటను మొదలైనవి, యుద్ధానికి దిగబోతున్నాయి : ఇది విచిత్రమైన వక్రదృష్టిని నిరూపిస్తున్నది. సిద్ధాంతము అనేది ఒక మనిషిని ఎంత తప్పుదోవకు ఈడ్చుకొని పోగలదో అన్న దానికి ఇది మేలైన మెరిసిపోయే ఉదాహరణ.

అమెరికా బలము అమేయ మన్నది నిజమను మాటతో ఈ ప్రసంగము ముగిస్తాను. ఆధునిక ప్రపంచ చరిత్ర ఎరుకలో ఇంత బలమున్నదేశమున్నట్లు లేదు. ఇపుడు ఇది ప్రపంచంలో అతి ముఖ్యమైన విషయములలో ఒకటిగా పరిశీలించవలసి ఉన్నది. అది తరువాత చేయుగలననుకుంటున్నాను. పాత సామ్రాజ్యములస్థానే కొత్తవి రానున్నవా అన్న సమస్యను తీసికొని చర్చిస్తాను. అమెరికను సామ్రాజ్య తత్వము అనేది తలచూపే ప్రమాద మున్నదా అన్న విషయమును కూడా తప్పక చర్చిస్తాను. అయితే ఈ ఒక్క ప్రమాదాన్ని గురించే చర్చించను. ఇతరమైన కొత్త సామ్రాజ్య తత్వాలను అంటే తూర్పు, పడమర దిశల నుండి వచ్చేవాటిని గురించి కూడా చర్చిస్తాను. అది చాలా వాదోపవాదాలను లేవతీస్తుంది.

భావవీణ

"స్ఫూర్తిశ్రీ"

పలికెనులే-
భావవీణ పలికెనులే
పరమార్థము చిలికెనులే
పలికెనులే భావవీణ

విశ్వవేదనాలయమున
వివిధ సాధనముల ఫలము
ప్రతిగళమున ప్రతినదించు
ప్రతిభామయ సమస్వరము

అంకురాలు శిశిరమునే
అంటుకొన్న మధుమాసము
ముసలివయసు లోలోపల
ముడుచుకొన్న పసిప్రాయము

వికసించని మొగ్గలోన
వేడుకపడు వాసనలను
పండిన యాకుల లోపల
నిండియున్న నిస్పృహాలను

ప్రవహించెడి వాగుచూచి
పరవశమౌ జలాశయము
అందని యానందము కని
ఆరటపడు మదాశయము

జీవన జ్యోతి

శ్రీ పి. చలపతిరావు

తల్లిదండ్రులను చిన్ననాడే కోల్పోయిన సుమిత్ర దురదృష్టవంతురాలే; ఐతే ఆమె మెట్టినింటి మనుష్యులమంచి హృదయాలను బట్టి అదృష్టవంతురాలు. గుండెనుపిండే అర్థం ఓ మాటలోను, హృదయాన్ని తన్మయంచేసే మధుర భావం యింకో మాటలోను వుందని అర్థంచేసుకోవడం ఇక్కడ అవసరం.

సుమిత్ర నిరక్షరాస్యతను లోకం క్షమించకపోవచ్చును కాని ఆమెపాలిట అదో అమోఘమైన వర మయిందని బోధ పడినప్పుడు క్షమించక విధిలేదు. ఈ అల్పవిషయంలో సుందరం మానసికస్థితి మనం గ్రహించొచ్చు. పట్నం యువతంటే అతగాడికి రోత అనడానికి నాగరికతే కారణం అనుకొంటే మనం తప్పుటడుగే వేసిన వాళ్ళమౌతాం—నాగరికత పేరుతో మురికి నంతటినీ అనుకరిస్తారని అతగాడి బాధే. పల్లెపడుచు అనే మాటలోని మృదుత్వాన్ని అనుభవించ గలిగింది. ఎంతో నిదానంతో స్వీకరించాడు సుమిత్రని.

ఆ దినం సుందరం ఆఫీస్‌కి వెళ్ళిపోవడంతో సుమిత్ర అత్తయ్యతోచెప్పి బిందెపట్టుకొని నదికివచ్చింది. చైత్ర మాసానికే నాగావళి సన్నబడింది. ఉరకల ఉద్వేగం శాంతించింది. అందంగా మెరిసే సైకతాలు. మధ్య నిర్మలంగా, శాంతంగా కాలువలుగాచీలి, కలిసి ప్రవహించే నది. అక్కడక్కడ నల్లని రాళ్ళు. ఆ రాళ్ళదగ్గర లోతు గుమ్ములు. జనం సుమారుగా లేరు. ఊరు సంతగోల వినిపిస్తోంది.

వీధులు తిరిగి రావల్సిన అవసరం యేమీలేదు కనక సుమిత్రకి నదీస్నానమే సరిపోయింది. పెరటిసందులోంచి వచ్చేస్తే సరుగుడుతోటలు. ఇసికదిబ్బలు. జనం గోలలేని రేవు. ఆ పట్టణానికి యింకో వరమనిపించే అందమైన పొలాలు—ఆ వెనుక జేగురు రంగు కొండలు. ఇంకా వెనక్కి నీలంకాంతి తెరలు.

ఆమెకంటే ఓక్షణం ముందే వచ్చాడు రాంబాబు. ఇది రోజావచ్చే రాంబాబు వేళకాదు. బట్టలుమాసాయి. తలంటుకోవాలి. అందుకు సరైన సమయం యిదేనని వచ్చాడు. రాయిమీదకి పోయి గుడ్డలుతడిపి సబ్బుపెట్టుకొంటున్నాడు.

సుమిత్రని చూడడం రాంబాబుకి యిదే ప్రథమం—ఆమె జుత్తు ముడివిప్పుకొని తలంటుకొనేందుకు సిద్ధమౌతోంది. ఆమె సిగలోని గులాబిపువ్వు రాలిపోయింది. ప్రవాహం రాంబాబు వైపు పోతోంది. ఆ పువ్వు తలలో వుందన్న విషయం కూడా ఆమెకి తెలీదు. గులాబి రోజా పూయదు. పనితొందర్లో వున్నపుడు సుందరం సిగలో పొదిగాడు ఆ కుసుమాన్ని. ఆ సంగతి, ఆమెకి జ్ఞాపకమే వుంటే జాగ్రత్తగా బిందెలో దాచేదే. ఎందుచేతనంటే ఆ కుసుమాన్ని రాత్రి మళ్ళీ భర్తకి పునరుంకితం చేసుకున్నప్పుడే బాధ్యత పూర్తవుతుందన్నది ఆ దంపతులకు అలవాటు పడ్డ విషయము. గులాబి అలా ఈదుతూ వచ్చి రాయి దగ్గర సుడిలో పడి మలుపు తిరిగింది. ఆమె కిచ్చేయాలనే ఉద్దేశంతోనే రాంబాబు ఆ పుష్పాన్ని కోమలంగా అందుకొన్నాడు. తర్వాత అతని పరిస్థితి సంకటంగానే మారింది. చేతిలోకూడ ఉంచుకోలేక సబ్బుపెట్టెలో దాచాడు. అది ఉన్న కొద్దీ అతని బాధ యెక్కువయింది. ఇవ్వాలని సాహసం ఓపక్క. ఇస్తే ఏమంటుందో అనే భయం ఇంకోపక్క. మొదట్లోనే ఆ పనిచేసివుంటే బావుండేది. ఇంతటి విరామానంతరం యివ్వడానికి అతనికి మన సొప్పడంలేదు. ఇంక బాధపడలేక దాన్ని మళ్ళీ ప్రవాహంలోకి విసిరేసాడు.

సుమిత్ర మంచి తనానికి రాంబాబు యే విధంగానూ తీసిపోడు. అలాంటి యువ్వనంలోవున్న యింకో మగపురుగయితే ఆమె స్నానభంగిమలన్నీ చూసి రాత్రి కలగనేవాడు మళ్ళీ. సుమిత్ర అంత అందంగా స్నానం చేస్తోందా అనికాదు—ఎవరయినా అంతే. సుమిత్ర స్నానంకంటే రాంబాబుని ఆకర్షించేది యింకోటి వుంది—అది దూరాన పంచభూతాల్లో కలుస్తున్న మానవ దేహం.

అంతలో ఒకరిద్దరు రాడమ్మలు రేవుకి వచ్చారు. నిజానికి వాళ్ళు సుమిత్రని విచిత్రంగా చూసారు. సుమిత్రకి లోకాన్ని పట్టించుకొనే అవసరం రాలేదు. చెప్పుకోవల్సి వచ్చినప్పుడు ఆమెకి యీ లోకంలో అనేక విరుద్ధాలు, వికృతాలు వున్నాయన్న విషయంకూడా తెలీదు. తెలిసినదంతా కల్లాకపటం ఎరగని ఓ పల్లెటూరు, ఆ పక్కనించి ఓదార్పుతోపోయే నాగావళి, మీసాలతాత, మెట్టినింటిలోని రెండు జీవితాలు—యిక్కడా, ఆ నాగావళి సైకతాలు, ఆ ఓదార్పులు—అంతే. అంచేత చిన్ననాటినించీ సుమిత్ర ఆ నదీమాత మూగపాలనలోనే పెరిగింది. దైవిక జీవితంలో ఆమెని మానసికంగా, దైహికంగా అలంకరించేది కూడ ఆ మాతృశ్రీయే.

రాంబాబు పక్కకి చూసాడు. మరి కనిపించ లేదు గులాబీ రంగు. ఇప్పుడన్నా సుమిత్ర గుర్తు తెచ్చుకుని గులాబీని వెతికే యత్నం బహిర్గత మయుంటే రాంబాబు వెళ్ళి తెచ్చి యిచ్చేవాడే. ఆమెకి ఆ గుర్తులేనే లేదు. శిరోజాలు చీర చెంగుతో ఒత్తుకొంటోంది. లేతగా పసుపు పూసుకోవడం వలన సువర్ణశిల్పంలా దృగ్గోచరమౌతోంది. ఆమె చూపులు చూసాడు. హృదయంలోని మంచితనం కళ్ళలో మెరుస్తోంది. అంత మంచితనాన్ని చాలాసేపు

కరువుదీరా చూసే అదృష్టం అతనికి లభించలేదు. అందుకు రాంబాబు కళ్ళుమూసికొని సాగిన తీగెలాంటి మెత్తని ఊహని నిలుపుకొన్నాడు. తన జీవిత చరిత్రలో అలాంటి సోదరిపాత్ర ఒకటి వుంటే ఎంత మనోహరంగా వుండేదో తలంచుకొంటు న్నాడు.

సుమిత్ర బిందెతోమి, కడిగి, కొంచెం లోపలికిపోయి నీరునింపి ఎత్తుకోబోతే ఒక్కసారి ముఖారవిందం విషాదావృత మవగా బిందె కిందికి దింపింది. లిప్తలో ఆమె వాడిన మొక్కలా నిర్జీవమైపోయింది. ఆమెకళ్ళల్లో దిగులు పులుముకొంది. జేల అయింది. నీటిలో చేతులుపెట్టి యిసికని వెతుకుతోంది.

ఉతికిన గుడ్డలు పట్టుకొని, తడితువ్వాలు కప్పుకొని వస్తోన్న రాంబాబుకి యీ సంఘటన చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆమె దైన్య వదనంలోకి అవలోకించి చివుక్కుమన్నాడు. భయంతో శరీరం జలదరించింది. "ఏమయిం దమ్మా?" అన్నాడు ఓపలేక.

సుమిత్ర తడబడింది. చెప్పలేని కొన్ని విషయా లున్నాయి. అలాంటి విషయాలకి పరిస్థితి, వ్యక్తులు, వాతా వరణం, సంబంధం మొదలయినవి కారణం అవొచ్చు. అలా చెప్పక పోయినంత మాత్రాన అర్థం కాకపోవు. కొంచెం పరిశీ లించాలి. కొంత ఊహించాలి. మరింత యోచించాలి. అన్నిటి కంటే ముఖ్యం చురుకైన బుద్ధి. ఏదో వస్తువు పోయిందన్న సంగతి తొలుదొల్త గ్రహించాడు. ఆ వస్తువు ఏమయ్యుంటుందన్నది కొంతవరకు అంతు చిక్కింది. ఏదో ఖరీదయిన నగ.

సుమిత్ర మరోసారి తన గుండెల్ని వెతుక్కొంది. రాంబాబు మనో నేత్రంలో ఆమెకోల్పోయిన వస్తువేదో ఊగిస లాడింది. అతనిఊహ నిజమైతే—అతని దృష్టిలో — ఆమె అంత బాధ పడడం సానుభూతి కారకమే.

"మీరు వేసుకొనే వచ్చారా?"

ఆమె జాలిగొల్పే చూపు చూసింది. తన మెళ్ళోంచి ఆ సుమంగళిని యెప్పుడూ తీయదు. సరిగదా స్ఫురణ కొచ్చి నప్పుడల్లా కనులు కద్దుకొని ముద్దిడుకొని గుండెల్లో దాచుకొం టుంది. అన్నివిషయాలు ఆ చిన్నచూపులో సుబోధకమయ్యాయి. రాంబాబు ఒడ్డున, బిందెదరి, తడిగుడ్డలు పడేసి వెతుకుతున్నాడు. జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు ఆమె యెక్కడ స్నానంచేసిందో; ఆలోచిస్తున్నాడు ఆ వస్తువు నీట పడిన తరువాత ప్రవాహ వేగంతో ఎంతదూరం పోయుంటుందో, ఆకారం ఎలాంటిదో.

ఆమె అశ్రురాశిని వాగావళి రుచి చూస్తోంది. ఆమె విషణ్ణ వదనంలో వేదనచూసి కంట తడి పెట్టాడు. "మీ రెందుకు బాధ పడతారు. దొరుకుతుందమ్మా" అంటూ తనకి మిగిలిన చిన్న ధైర్యంతో ఓదారుస్తున్నాడు.

ప్రయత్నానికి ఫలితం ఏదో ఒకటి వుండాలి. ఆశో, నిరాశో. ఆ రెండూ లేవు వారిలో. దుఃఖం, బాధ తప్ప. గుడ్డ పీలికలూ, తాళ్ళూ, కర్రపుల్లలూ అలాంటి వేవో అప్పుడప్పుడు తగిలి ఆశ కల్గిస్తున్నాయి. ఒడ్డున బాగాచూస్తే ఇసిక స్పష్టంగా కన్పిస్తోంది. అంత నిర్మలంగా వుంది నీరు. పైగా ఎండ. కాని మధ్యలో ఇసిక కనిపించలేదు.

"ఎంత ఎత్తు?" అని సన్నిహితునికి మళ్ళీ ఆ ప్రశ్న. రాంబాబు ఓదార్చాడు. ఆమె వినిపించుకున్నట్టు లేదు. లేక ఇంకో ఆలోచనలో వుండి యీ ప్రేరణకి ప్రతీకారం యివ్వలేకపోయిందో మనసు. ఈసారి, "ఎంతెత్తుందమ్మా—నగ?" ఆమె దృష్టిని తనవేపు మళ్ళించే గొంతుతో అడిగాడు. ఆమె ఐదు తులా లంది. తాడుకూడా బంగారందే. ఫాలానికి అద్దుకొనేందుకు వీలుగా ఒదులుగా అత్తయ్య చేయించింది. అంతకు మించి యింకో నగంటూ ఆమె శరీరంలో లేదు. అసలు నగలంటే సుందరంకి పడదు. ఇంత బంగారంతో మంగళ సూత్రం చేయించారంటే అది అమ్మ అజ్ఞప్రకారం. ఆమెను బాధపెట్టడం యిష్టంలేక అతగాడు మౌనం వహించాడు. సుమిత్ర లేస్తూనే ఆ మాంగల్యాన్ని ఫాలానికి, కళ్ళకి అద్దు కోవడం, తన పాదధూళిని తీసుకోవడం అతగాడికి ఇష్టం అనికాదు. సుమిత్ర అందమైన సాంప్రదాయానికి విఘాతం కల్గించి ఆమె మనసుకి బాధపెట్టకూడదనే కారణం. అంచేత ఆమెచేష్ట లన్నీ సంతోషంగా స్వీకరించేవాడు. "ఈవాళ గౌరీ పౌర్ణమి. సుమిత్ర నీ గురించి పెద్దన్నర వరకూ ఆగదు. తొందరగా రావాలబ్బాయ్" అనిఅమ్మ అంటే ఆఫీసర్ దగ్గర ఓ చిన్న అబద్ధమస్నచెప్పి యింటికి చక్కా వచ్చేవాడు. ఆమె చేత పూజ చేయించుకొని శుభం పలకడం అతనికో ఆనందం.

చాలాసేపయింది. సూర్యుడు తలమీదికి వచ్చాడు. ఇది ఆలస్యం అన్నసంగతి సుమిత్రకి యింకా తెలీదు. కాని రాంబాబుకి తెలుసు. సెకండరీ ట్రయినింగు అవుతున్నాడు. హాస్టల్‌లో ఉంటున్నాడు. అందరి భోజనాలు అయిపోయుంటాయి. తనభోజనం ఎవరు తీసారో; లేదో—లేకపోతే ఆ పూటకిదుప్పే. అందుకని "మీరింట్లో చెప్పండి. ఎవరినన్నా తీసుకొనివచ్చి వెదికితే దొరక్కపోదు. పడింది మాయమయిపోతుందా? తప్పక దొరుకుతుంది" అన్నాడు.

నిజానికి యీ మాటలు వినిపించలేదు సుమిత్రకి. సుమిత్ర అన్యథా యోచిస్తోంది. యోచించడం అనడం కంటే జ్ఞాపకం తెచ్చుకొంటోంది అంటే బావుంటుందనుకొంటాను. ఆమెకి పదేళ్ళవయస్సులో, అంటే యిప్పటికి తొమ్మిదేళ్ళక్రితం, తమ పొరిగింటి లచ్చిమి మంగళ సూత్రం యిలాగే పోయింది. పోయిన పక్షం నాటికి భర్తపోయాడు. భర్తపోయిన మూరు పక్షంలో లచ్చిమి ఇద్దరి చిన్నారి బిడ్డల్ని పేదరికానికి దౌర్భాగ్యానికి విడిచిపోయింది. అప్పుడు అనుకొన్నారు....వివాహ ముహూర్తం చెడ్డదని; మాంగల్యం పోవడం దుశ్శకునం అని. ఆ మాటలు సుమిత్ర ఎప్పుడో మరిచిపోయింది కాని యీ సంఘటన తీగె లాగడంతోనే డొంకంతా కదిలింది. ఆ యోచనలో వినిపించుకో లేదు.

ఆ స్మృతి సుమిత్ర విషణ్ణ వదనాన్ని మాలిన్యం భూయిష్ఠం చేసింది. ఆ దుర్గంధం కంపు కొట్టడంతో రాంబాబు గ్రహించాడు. ఆమె మనసుని నిర్మలం చేయాల్సిన బాధ్యత తనమీద ఉన్నదన్న విషయం స్ఫురించింది. వెంటనే 'పోయిందని బాధపడొద్దు. నా కొకాయన తెలుసు. మా స్నేహితునిఉంగరంపోతే వెతికితీసాడు చిటికెలో. దొరికి తీరుతుంది. ఇంటికివెళ్ళి చెప్పండి.

బాధ పడొద్దు." అని ఆమె అవధానాన్ని తనమాటల వేపు కేంద్రీకరించి చెప్పాడు. ఆమె రాంబాబువేపు చూసింది. రాంబాబు కంటే దూరాన వున్న శవదహనంలోని జ్వాల ఆమెకి ముందుగా కన్పించింది. రాంబాబు పసికట్టాడు.

"నే చెప్పింది విన్నారమ్మా" అన్నాడు గంభీరంగా. "మీరు దయ ఉంచి లేవండి. ఇక్కడేపొద్దు గడపకండి. సాయంత్రం జనంవస్తారు. తొందరగాపోయి – ఇంట్లో ఈ విషయం చెప్పండమ్మా" అన్నాడు. రాంబాబుకి ఆశ్చర్యం—తను యీ ఇరవైయేళ్ళ వయస్సులో ఎవరికీ ఇలా సలహాలిచ్చి యుండలేదు. ఆమె గౌరవం సంపాదించుకొనేందుకన్నా ఆ వస్తువు తనకి దొరికితే బావుండుననే ఆశ అతనికి లేకపోలేదు. దొరుకుతుందనే ఆశ ఆమెకంటే అతనికే అధికంగావుంది.

అప్పటి సుమిత్ర పరిస్థితి భిన్నం. ఆమెమనస్సు పూర్తిగా వశపరచుకొంది. లచ్చిమి సంసారం పదేపదే స్మృతిలో కదులతోంది. దానికితోడు శవదహనంలోని జ్వాల. సుమిత్ర ఎంతో పట్టుదలతో భర్తపాదాలను జ్ఞాపకం తెచ్చుకోబోతోంది. కాని కష్టమౌతోంది. ఆ రూపం మరణానంతరం పేలవమైన పాదాలుగా వుండడంతో ఆమె కంపించి పోతోంది.

"మీ తమ్ముసిలా చెబుతున్నానమ్మా. వినండి నామాట." అనేసరికి సుమిత్రకి భాష అర్థమయింది. అతని కళ్ళలో విలచిన బిందువులనుచూచి 'మీకు శ్రమ పెట్టాను—కదూ' అని నిట్టూరుస్తూ లేచి బిందె పట్టుకుంది.

"పురోహితున్ని అడగండి. దీని కేదో క్రియవుంది. గౌరీ పూజ చేయిస్తారనుకొంటాను. తర్వాత మళ్ళీ కొత్తది ధరించొచ్చు."

ఆ మాట సుమిత్రకి ఆశకలిగించడం యదార్థమేకాని అంత బంగారం ప్రస్తుతం యెక్కడుంది. అత్తయ్య మెడలోని బంగారమంతా తీసేసి యీ నగ చేయించింది. ఈ విషయం తలంపుకొచ్చేసరికి మళ్ళీ ముఖం విచారగ్రస్తమయింది.

దారి చీలిపోయింది. రాంబాబు ఓ దారిలో పోయాడు. సుమిత్ర సరుగుడు చెట్లకిందినించి, సందులోంచి తమ పెరట్లోకి వెళ్ళిపోయింది.

రాంబాబు దైన్యావస్థ చూసిన సహాధ్యాయుల ప్రశ్నల వర్షం కురిపించేసరికి అతడేం సమాధానం చెప్పలేకపోయాడు. చెప్పక పోవడమే చాలా మంచిదనిపించిం దతనికి తర్వాత.

* * *

మునిమాపువేళ. పక్కింటి స్టూడెంటుతో కబురుపెట్టి సుందరంని రప్పించింది సుమిత్రఅత్త. జరిగినవిషయం చెప్పేసరికి సుందరం పడ్డబాధ యింకో రకంది. మాంగల్య మాహాత్మ్యం మీద అతగాడికి అంత పట్టింపులేకపోవడమే అందుకుకారణం: అతగాడి బాధంతా విలువమీద—అంటే ఆర్థికంగా నష్టపోయినట్టుమాత్రమే నొచ్చుకుంటున్నాడు. భర్తని చూసిన తర్వాత సుమిత్ర ఒళ్ళు వణికిపోయింది. అతగాడి కళ్ళల్లోకి చూడలేక పోయిన ఆమె కళ్ళల్లో బాష్పరాశి నిండింది.

పురోహితుడు వచ్చాడు. అతడు రావడంతో ఇంటినీ, మనుషులనీ పరిశీలించాడు. వరండాలో పద్మాసనంలో కూచున్నాడు. విబూదీ—గంధ్యం—చేతిలోపంచాంగం—సుద్దముక్క—బుజంమీద తడిగావంచా. బొజ్జ అతనికి నిండుదనం ఇచ్చిన సంగతికూడా పేర్కోవడం ఉచితం.

సుందరంతల్లి చెప్పిన సంగతులకి పురోహితుడు ఆశ్చర్యపోతున్నాడు. అతని ఆశ్చర్యంచూచి ఆమె భయపడుతోంది.

"గ్రహశాంతిచేయాలి. ఇది భర్తకి దోషం—" ఇంకా యేవోచేర్చికూర్చి చెబుతున్నాడు. సరిగ్గా యీమాటలు చెబుతున్నప్పుడే సుమిత్ర బయటికి తొంగిచూసింది. ఆమెకి వినిపించిన మాటలు అవే. ఇంకా వినేశక్తి ఆమెలో యీషన్మాత్రం వున్నా పరిస్థితి యింకో విధంగా మారేది. ఆమె వినలేక పోయింది. లోపలికి పోయింది.

గదిలో భర్త పాలోచనగా మంచంమీద పడుకొని శూన్యంలోకి చూస్తోండడం తర్వాత ఆమె దృష్టిలో పడిన సంఘటన. రెండేళ్ళనించి కాపురంచేస్తున్నా ఆమెభర్తకి యెదురుగా నిల్చి ఒక్కమాట పెగల లేదు. ఆమెకు అలవడిందల్లా 'ఆఁ'. 'ఊఁ'....'ఉహూఁ'....'ఆ?'....'సరే'....'అవును'....'కాదు'....... 'నాకు తెలియదు'....ఇంక కొన్ని నవ్వులు....కొన్ని చూపులు' అంతే. అత్తయ్యతోకూడా అమితంగా యేం మాటలాడదు. అలాంటి వాతావరణంలో పుట్టడమే అందుకో కారణమనుకొందాం.

భార్యలోని వ్యాకులత సుందరంకి అర్థమయింది. సానునయంగా ఆమెని ఓదార్చాలని ప్రయత్నం చేయాలని తలంచాడు. కూర్చొని అందుకే 'సుమిత్రా—యిలా రా'— పిలిచాడు. ఆమెదగ్గరికి వచ్చి పరితప్తహృదయంతో కాళ్ళదగ్గర నిలబడింది. ఇంకా యేం మాట్లాడాలో ఆలోచిస్తున్న సుందరం గభాలున 'ఏదీ నీ సిగలోని గులాబీ చూపించు' అన్నాడు. అప్రయత్నంగా వెతుక్కొంది. ఉదయం తలలో పెట్టినట్టు గుర్తుకొచ్చింది. ఎక్కడో పోయిందన్నది నిర్ధారణ అయేసరికి ఆమెలో బాధ మళ్ళీరగులుకొంది. అది గ్రహించాడు సుందరం. ఆ సంగతి మరిపించాలనే కోరికతో 'చూడు సుమిత్రా—అంత బాధపడకూడదు. నేమా విచారిస్తున్నాను కాని—' ఆ తర్వాత ఎన్నో విషయాలు ఓదార్పేయత్నంతో చెబుతున్నాడు. ఆమె వినిపించుకోలేదు. అద్దంలో ముఖంకనిపించింది. నుదుట తిలకం లేదు. మెరుస్తూవుండే తిలకంలేదు. పెట్టుకోలేదు? లేకపెట్టుకొనే భ్రమించిందిదా? మళ్ళీచూసింది. నిజంగానే లేదు. అక్కడా వుండలేక పోయింది. పెరటికి వంటగదిలోకి పోయింది. పొయ్యిలో జ్వాల—శవదహనం జ్వాల—కళ్ళు మూసుకొంది. నిండిన కన్నీరు కురిసింది. నిజానికి సుమిత్ర ఫాలాన తిలకం వుండనే వుంది. కళ్ళలో అశ్రువులు చేరడంతో ఆమెకి కన్పించలేదు సరిగ్గా.

సుమిత్రఅత్త ఏవిధమైన బాధా కనపరచలేదు. అలా అని బాధ లేదనుకోవడం పొరపాటు. కాని కోడలి బెంగచూస్తే— యింకా భయపెట్టడం నేరంగా ఆమె భావించుకొంది. సుందరం రావడంతో ఆదేహెచ్చరించింది. 'సుమిత్రను యీ విషయంలో బాధపెట్టేవ్....అప్పుడే కుప్పకూలింది. మరీ బెంగపెట్టుకొనేను. దోషముంటే గ్రహశాంతి చేయిద్దాం. పురోహితునికి కబురు

పెట్టాను....' ఆ విధంగానే సుందరంకూడా ప్రవర్తించాడు. కాని ఆ బలహీనత సుమిత్రలో వుంది. ఈ విషయంలో యింత బాధ పెట్టుకోవడం అర్థంలేనిదిగా కన్పించొచ్చు. భారతస్త్రీలో యేర్పడే రసభావం అటువంటిది. ఆమె పంచేంద్రియాలూ పట్టుకున్న జీవనజ్యోతి మాంగల్యం. ముఖ్యంగా సాంప్రదాయాల్లో పుట్టిపెరిగిన సుమిత్ర దగ్గర యీ జీవనసూత్రం అన్నివిధాలా అనుకూలించింది.

* * *

భర్త అమాయకంగా నిద్రపోతున్నాడు. సుమిత్రకి నిద్ర రావడంలేదు. కళ్ళు బరువౌతున్నాయి. మంచంపక్క చాప పరుచుకొని పడుకొంది. అలా చూస్తోంది. రాత్రి పది దాటిందేమో. రాంబాబు జ్ఞాపక మొస్తున్నాడు. ఉదయంనించి జరిగిన సంఘటనలు గుర్తుకొస్తున్నాయి. వెతకడానికి వెళ్ళిన వాళ్ళకి రిక్త హస్తాలు మిగిలాయి.

సుమిత్ర గోడవేపు చూస్తోంది. తెల్లనిగోడమీద బెడ్ లైట్ కాంతితో ఓ రిబ్బన్ చుట్టుకొన్న నీడ కనబడుతోంది. ఆ నీడ క్రమంగా మంగళ సూత్రంలా అయిపోయింది. సుమిత్ర గుండెలో వెతుక్కొంది. ఏమీలేదు. తన ఫాలానికద్దుకొనేందుకు ఏమీలేదు. మళ్ళీ ఆ నీడని చూసింది. సరిగ్గా తన మంగళ సూత్రం పరిధిలోనే వుంది. కనురెప్పలు బరువుగా పడుతున్నాయి. కళ్ళల్లో ఆర్ద్రత యిగిరిపోవడంవలన రెప్పలుజారి మూసుకోవడం లేదు. ప్రయత్నంమీద కళ్ళుమూయగల్గింది. మనస్సులో ఆదేనీడ. భౌతికంగా, మానసికంగా కూడ ఆమె అలసిపోయింది. లచ్చిమి .... లచ్చిమిభర్త .... శవదహనం .... గులాబీ— 'నేను విచారిస్తున్నాను కాని'' .... 'ఇది భర్తకి దోషం' .... అద్దంలో తిలకంలేని ఫాలం—పొయ్యిలోని జ్వాల—ఆ నీడలు ఆమెతో మాయమైపోయాయి. నిద్రపోతోంది. కళ్ళముందు భర్త నిర్జీవమైనపాదాలు—చల్లబడ్డపాదాలు—ఆమె దగ్గర కొస్తున్న మంగళసూత్రం .... ఆ సూత్రానికి యిరుక్కొన్న భర్త కంఠం...

సుమిత్ర పెద్దకేక భయం ప్రతిధ్వనించినట్టు వేసింది. నిల్చొంది. గోడమీద తలకొట్టుతోంది. సుందరం లేచాడు. అనంతావేశంతో ఆమెని లాగి తీసుకొచ్చి, 'సుమిత్రా....సుమిత్రా' అనికేకలు వేస్తున్నాడు. పలకదు. తెల్లబోయి మౌనంగాచూస్తోంది. సుందరంతల్లి వచ్చింది.

సుమిత్ర ఏడుస్తోంది. సుందరంతల్లి మంచంమీదకి తీసుకపోయి పడుకోబెట్టింది. సుమిత్ర శాంతించింది.జాగరం చేస్తూ కూచొన్నారు తనయుడూ, తల్లీ—ఆరాత్రికి.

* * *

రాంబాబు యీ మధ్య రెండుదినాలు సెలవుతీసుకొని స్వగ్రామం వెళ్ళాల్సివచ్చింది. సంబంధం చూడడానికి నాన్న రమ్మన్నారు. రాంబాబుకి యింత తొందరల్లో పెళ్ళి పైదృష్టిలోనూ యిష్టంలేదు. 'రాలేను. చూడాలనిలేదు' అని రాంబాబు చెప్పగలడు. కాని తల్లిదండ్రులు యీ విషయంలో ఎంత బాధపడతారో అన్నదే అతను ఓర్మితో ఆలోచించిన విషయం. వెళ్ళాడు. శెలవి, ఆదివారాలుకూడా కలిసాయి. తిరిగివచ్చి నదికి స్నానానికి వెళ్ళేసరికి అయిదు దినాలనాటి ఆ సంఘటన గుర్తుకొచ్చింది.

ఆ నగ దొరికిందా, లేదా, వెతికారా, ఏమయింది మొదలయిన వాటిగురించి మనసులో ఆరాటం. స్ట్రీంలో వెతుకుతున్నాడు ఎప్పుడన్నా అసంకల్పంగా ఆమె కలిస్తే బావుణ్ను. ఈవిషయాలన్నీ తెలుసుకోవా లనుకొంటున్నాడు.

మరోవారం గడిచింది. ఆరోజు ఉదయాన అదే రాయి మీద స్నానానికి వచ్చికూచున్నాడు. పెట్టెతాళంచెవి పడిపోయింది జారి. వెతుకుతున్నాడు. ఒకరిద్దరు అడిగారు ఏమిటని. తాళంచెవి అని విన్న తర్వాత వెళ్ళిపోయారు. ఇంకో విలువైన వస్తువైతే ఆనాడు రాంబాబు వెదికినట్టే వెతికి తోడు పడేవారు. రాయి దగ్గర. లోతుహెచ్చు. మునక వేయాల్సివస్తోంది.

ఉదయం....

జనం రద్దీగానే వున్నారు. యువకులు, యువతులు వృద్ధురాళ్ళు, వృద్ధులు యెంతోమంది. ఏవోమంత్రాలు జపించేవాళ్ళు, ప్రార్థనలుచేసుకుంటున్నవాళ్ళు, కీర్తనలు పాడుతున్న భక్తురాండ్రు—సందడిగానూ, చూడ ముచ్చటగాను వుంది. బూరగాళ్ళ వాళ్ళు కూడా అక్కడే మునిగేస్తున్నారు. రాంబాబు మొదట్లో అసహ్యించుకొన్నా అలవాటు పడి పోయాడు.

తాళంచెవి దొరకలేదు. కాని ఎంతో దూరం పోవటానికి ఆస్కారంలేదు. రాయిమీదుగా జారింది. అక్కడే పడివుంటుంది. విసుగెత్తిపోయి ఆఖరి ప్రయత్నం చేశాడు రాంబాబు.

వస్తున్నారు .... పోతున్నారు .... జనం సందడి.

రాంబాబు కళ్ళు ఆశ్చర్యపోయాయి. ఆ ప్రక్కనున్నవారు ఎవరూ చూడలేదు. అవును. అదే. దొరికింది. కాని—ఎలా—ఎలా బయటికి తీయడం—వీళ్ళంతాచూస్తారు. నాది నా దనొచ్చు· లేక పోలీసు స్టేషన్‌కే తీసుకెళ్ళొచ్చు—ఏమిటి గత్యంతరం? ప్రవాహం ఉరకల్లో మళ్ళీపోతే. కాలుతో పట్టుకోడానికి మనసు అంగీకరించడం లేదు. ఇసికలో పాతాడు—అక్కడే. తనలోని ఆశ్చర్యానుభూతులు బయటికి కనబడకుండా విఫలయత్నం చేస్తున్నాడు.

మనసులో ఆలోచన మెరిసింది. గబగబా ఒళ్ళు తోము కున్నాడు. తువ్వాలు నీటిలోకి ముంచాడు. వెతికాడు. వస్తువు లేదు. అయ్యో! అయ్యో! కనిపించదు. దొరకదే. పోయింది. పిరివి తప్పినట్టుయింది. చేయితో పక్కలు వెతికాడు. దొరికింది. ఇసికలో కూరుకొనేవుంది. తువ్వాల్లో అందంగా మడత, నీటిలోనే, పెట్టాడు. పైకితీసి జాగ్రత్తగా పిండాడు. అప్పటికి సహాధ్యాయులు వెళ్ళిపోయారు. మంచిదే అయింది. సబ్బుడొక్కూ మడత తువ్వాల పట్టుకొని వెళుతున్నాడు. అతని గుండెలు లబలబ కొట్టు కొంటున్నాయి. పోలీసు దారిలో కన్పించాడు. కాళ్ళు వణికాయి. పక్కకు తప్పుకొని, ధైర్యం, నిర్భయం నటించి నడుస్తున్నాడు.

గదిలోకివెళ్ళాడు. ఎవరూ గదిలోలేరు. ఫలహారాలు చేస్తున్నారు. చుట్టూచూశాడు. తోటివారి సామానులు అతనివేపు

చూస్తున్నాయి. భయంగా పెట్లో దాచబోయాడు. తాళం లేదు. పరుపులో దాయా లనుకొన్నాడు. ఎవరన్నావిప్పితే. ఉపకరణాలు కోసం తయారు చేసిన అట్టపీర్లలో దాయాలను కున్నాడు. చివరికి మంచిఆలోచన మెరిసింది. పేంట్‌జేబులో వేశాడు. చిన్నశబ్దం. భయపడ్డాడు. ఎత్తుగా కన్పిస్తోంది. ఇంకో యుక్తి. తలలో తటిల్లుమంది. రుమాలు జేబులో పెట్టాడు. కంగారు పడుతున్నట్టు అతనికే అనుమానమయింది. ఈ విషయం యింకెవరికో చెప్పి తనబరువు తీర్చుకోవాలను కొంటున్నాడు. ఇంకెవరికి చెప్పడమో అతనికి తెలీదు. నిశ్చలత్వం నటించాడు. మెట్లెక్కుతున్న శబ్దం. ఇంకా స్థిమిత పడినట్టు భంగిమలు మార్చుకొన్నాడు.

“ఇదిగో నీ ఫలహారం—కాఫీ”....అందుకొని తనచోటులో పెట్టుకొని తింటున్నాడు. ఆ స్నేహితునికి థాంక్సు అన్నా తెలియ చెప్పలేకపోయాడు. అంతా దుస్తులు మార్చుకొని పుస్తకాలు తీసు కొని క్లాసుకు పోతున్నారు. అతనుమెల్లగా తింటున్నాడు. రాంబాబు నెమ్మదిగా తింటాడని అందరికీతెలుసు. ఎవరూ ఎక్కువగా జోక్యం చేసుకోలేదు. అంతా మెల్లగా వెళ్లిపోయారు. ఈ దినం క్లాసుకి వెళ్ళాలనిలేదు. ఓ కుర్రాడితో సెలవు దరఖాస్తు పంపించాడు.

“తాళం పోయిందండి. బట్టలు పెట్లో వుండిపోయాయి. తాళం విరగ్గొట్టి బాగుచేయించాలి.” అని కారణం చెప్పాడు. నిజానికది సకారణం అనిపించుకోదు.

ఎవరూలేరు.

కింద స్పెషల్ డ్యూటీ కుర్రవాడు. వంట బ్రాహ్మణుడు. నౌకరీ—పెరుగుతెచ్చే గొల్లమనిషిగోల—అన్నీ వినిపిస్తున్నాయి. తాళం విరగ్గొట్టాడు. చుట్టూచూశాడు. మనుష్యులు లేకపోవడం వెతికాడు. పేంట్‌జేబులోది జాగ్రత్తగాతీసి పెట్లోదాచాడు. పైనబట్టలు జాగ్రత్తగా సర్దాడు. వీధిలో ఎదురుగావున్న ఫాన్సీషాపులో ఓ మంచి తాళంతీసుకున్నాడు. డ్యూప్లికేట్‌తాళం చెవి పెట్టెలో పడేసాడు. తాళంవేసాడు. పెట్టెపైన పరుపు చుట్టపెట్టాడు.

విశ్రాంతిగా రాంబాబు నిట్టూర్చడానికి గంటన్నర తర్వాత అవకాశం కలిగింది. అతని మనసులోని కల్మషంని ఓపక్క పాతరవేసాడు. దాని దుర్గంధం తగ్గింది. అతనిలోంచి పొంగిపొర్లే ధీరత్వం స్థిమితపడింది. ఇపుడు రాంబాబుని ఇంకో సమస్య బాధ పెట్టడం ఆరంభించింది.

ఎవరన్నా తనకేసి పరిశీలించారేమో! తనవెనుకవచ్చి యివన్నీ దొంగచాటుగా పరీక్షిస్తున్నారేమో! అయితే యెలా? బయటికివచ్చాడు. చుట్టూచూసాడు. కిందికి, రోడ్డుమీదికి, చూసాడు. తనవేపు ఎవరూ చూడడంలేదు. లోకం తనని గమ నించడంలేదు.

రాంబాబుకి ఆ వస్తువు ఏం చేయుదమో తట్టడంలేదు. ఆమె కనిపిస్తే బావుణ్ను. ఆమెకి యిచ్చేయాలి. ఆమె జీవనజ్యోతి ఆమెకి అందిపోవాలి. జీవితంలో తనకీ తొలి శాంతి లభిస్తే ఎంత అదృష్టవంతుడో వూహించుకొంటున్నాడు.

రేవుకివెళ్ళి చూడాలనిపించడంతో, రాంబాబు గదికి తాళంవేసి నదివేపు నడిచాడు. మనుష్యులు పలచబడిపోయారు. ఒకరిద్దరు ఆడమ్మలు—ఇద్దరుముగ్గురు చిన్నపిల్లలు.

నాగావళి విచారంతో చిక్కిపోయింది. ఈ కొద్ది దినాలకే ఆమెలో యెంతో మార్పు కనిపించింది. ఆ రాయిమీద రాంబాబు కూచున్నాడు. ఏదన్నా ఓ ఆకారం కదిలితే అది ఆమే నేమోనని వింతగా పరిశీలిస్తున్నాడు.

కొత్తది చేయించుకున్నారా? లేక ఏమయిందో?

రాంబాబు తన తెలివితక్కువతనం ఎన్ని చిక్కులలో పెడుతుందో అని ఆలోచిస్తున్నాడు. ఆమెపేరన్నా కనుక్కోలేక పోయాడు. ఆ యిల్లు యెలా పోలికపట్టడం? ఎలా ఆమెకీ వస్తువుచేర్చడం?

ఓ రోజు అంటే మరునటిరోజే ఆమె వెళ్ళినదారే తొక్కివెళ్ళాడు. రాంబాబుకి యిలా పనికట్టడం యింకా చేత కాదు. ఎవరో ఓ అమ్మాయి అతనివేపు తీక్షణంగాచూస్తే భయంవేసింది. వీధులు తిరగడంమానేసాడు. రాయి దగ్గర వెతుకుతూ కూచున్నాడు. రెండుదినాలు పూర్తిగా ఆమెకోసం అక్కడ కూచోడం ఓ విధంగా తెలివితక్కువతనమే—కాని రాంబాబులో పేరుకొన్న ఆశ మరి యెలాంటిదయుంటుందో ఆ సంఘటనతో ఊహిస్తే బోధపడకపోదు.

ఆ రోజు సాయంత్రం ప్రధానోపాధ్యాయులువారు పిలిచి, కోప్పడి, చాలా చీవాట్లుపెట్టారు. అతనికి అబద్ధం చెప్పడం రాకపోవడమే అన్ని హీనవచనాలకీ తలవొగ్గేందుకు కారణ భూత మయింది.

రాంబాబుకి రాత్రుళ్ళు బాగా నిద్రపట్టడంలేదు. భయ పెట్టేస్వప్నాలు వస్తున్నాయి. ఓ స్నేహితుడు చూసాడట. పోలీసులు పెద్దకర్రలు పట్టుకొని వచ్చారట. తనని కర్రలతో పొడిచి వెళుతున్నారట. సుమిత్ర—తమ్ముడూ—తమ్ముడూ అని అరుస్తో అతనివెనుక పరుగిడుతో వస్తుందట. “ఈ నగ యీమెది—యీమెదీ' అని చెబుతున్నాడట—ఆ మాట పలవ రించినట్టు తోటివాళ్ళు చెబుతున్నారు. తనలో, మనస్తత్వంలో పాతరవేయబడిన యీ కల్లోలం యింకెన్నాళ్ళో దాగదు. సమయం మించి పోయింది. తన జీవితం పాడయిపోకుండా చూసుకోవాలి. రాత్రంతా కంటిమీద రెప్పలేదు. ఇదేవిషయాన్ని ఆలోచించాడు. చివరికి ఒక నిశ్చయానికివచ్చాడు. ఆ నాడు గులాబీని పారేసినచోట్టే దీన్ని నాగావళికి అంకితం యిచ్చేయాలి—అనుకొని “భగవాన్! యీవిషయంలో నాలో యేమీ దురాలోచనలేదు. ఎవరికీ అన్యాయం చేయాలని అనుకోలేదు. ఎవరినీ బాధ పెట్టడం నా ఆంతర్యంకాదు. ఆమెకీ మాంగల్యం అందితే నా జీవితంలోని తొలి అధ్యాయం కృతార్థతతో పునీతుడనయే వాడిని. రే పామె కలిస్తే ఖచ్చితంగా యిచ్చేస్తాను. లేకపోతే ఆ నాగా వళికే మళ్ళీ అప్పగిస్తాను. నన్నురక్షించు భగవాన్! నాకంటికి నిద్రరానియ్యి భగవాన్”. త్రికరణశుద్ధిగా ప్రార్థించాడు. చక్కని నిద్రపట్టింది రాంబాబుకి.

* * *

ఆ దినం ఆదివారం. పక్షం దినాలయింది సరిగ్గా. ఆమెని తొలిసారి ఆఖరిసారి చూడడం అదేనేమో అనుకొంటు న్నాడు: సిద్ధంచేసుకుని అపాయంత్ర నాలుగ్గంటలు సమయాన నాగావళి సైకతాలలో తిరుగుతున్నాడు.

దూరాన శవదహనం ....

రోజుకి ఒకటో రెండో శవాలు కాలడం అతనికి వింతేమీ కాదు. ఆ శవానికిదూరం—యింకాపోయి—నది మలుపుతిరిగిన దగ్గర బలంగా విసిరేసి కూర్చోవాలనుకున్నాడు. క్రమంగా చీకటికూడ వికటాట్టహాసంచేస్తూ వస్తోంది.

నది ఒడ్డున తడిగుడ్డలతో సైకాళ్ళల్లోకి తలదించు కొని ఓ దౌర్భాగ్యుడు ఆలుస్తూ మూలుగుతూ వున్నాడు. "సుమిత్రా...నా సుమిత్రా". అంతే. అమాటలు-రాంబాబుకి— ఆ సుమిత్ర ఎవరో ఏం తెలుసును—ఏమర్థ మౌతాయి. అతనికి అక్కడ ఆగి అడగాలని బుద్ధి పుట్టకపోవడం విచిత్రం. స్త్రీ పేరు గదా—ఎవరో, ఏమిటో అనేనా అడిగివుంటే—రాంబాబు ఆ జీవిత జ్యోతి అంత తొందరగా అనంతకాంతితో లీనమౌతుందని ఊహించలేక పోయాడు.

జ్వాల తగ్గి పోతోంది.

మలుపులో ఒక్కడూ — పైన — కాంతి వత్సరాల దూరాల్లో నక్షత్రాలు—చుట్టూ చిక్కని చీకటి—నిశ్శబ్దం శుష్కరాగం—

భగవాన్ నీ, నదీమాతనీ మనసార స్మరించి, ఆమెకి మేలుచేయుండి అని దీర్ఘంగా ప్రార్థిస్తూ విసిరేశాడు.

అతనివెనుక ఎవరో వస్తున్నట్టువులోంది.

చిక్కని గుండెలవాడు రాంబాబు. వెనక్కి చూడడంలేదు.

శవదహనం చోట పెద్ద జ్వాల లేంది. బహుశా అదే అంతిమ జ్వాల. చీకటిలో కలిసిపోయింది ఆ జ్వాల.

ఆ ప్రక్కనించే వెళ్ళిపోతోన్నాడు.

కర్ర పట్టుకొని పొడుస్తున్న ఓ వ్యక్తి 'సివారికి పుస్తె కూడా సేయించారట—' చెబుతున్నాడు పక్కవారితో.

రాంబాబు ఆగాడు. అతనిలో అంతర్లోకాలు క్షణం స్తబ్దమయాయి. ప్రమిదనిండా చమురుంది. వత్తికొడి గట్టనూ లేదు. ఎలా ఆరిపోయిందా వెలుగు లీనుతున్న జ్యోతి. అతనికి నమ్మకం చాలడంలేదు. ఇంకెవరో—ఓ పెద్దగాలి చాలు— యీ జ్యోతి తమోరాశిలో లీనమై పోవటానికి అన్నది రాంబాబుకి అందని ఊహ.

భర్త దగ్గర ఆఖరి క్షణాల్లో అన్న మాట లేవో చెబు తున్నాడు—అందులో ఒకడు. ఆ మాటలు వాళ్ళ ఉచ్చారణలో రాయడం నాకు చేతకాలేదు. కాని ఆ భావం మాత్రం యిక్కడ సుమిత్ర మాటల్లో చెబుతున్నాను.

'మీరు—మళ్ళీ .... వివాహం—చే .... సుకొంటె. ఇది .... నా .... కడ .... సారి కోరిక .... నేను దురదృష్ట .... వంతురా లను. నాకోసం .... తయా .... రు చే .... సిన ఆ మంగళ మాత్రం .... పాడు చెయ్యొద్దు. ఈ ఒక్క .... కోరిక .... తీ—' ఆమె దాంపత్యంలో, బహుశా, ఇదే పెద్ద సంభాషణ.

ఓ చిన్న పరిచయం—ఓ రోజునాటి సంఘటన.

ఆ మాటలు విన్న తరువాత అతని హృదయం ద్రవించి కనుల్లోంచి కారుతోంది. భయం పీడిస్తోంది.

మరోసారి భగవాన్‌ని స్మరించుకొన్నాడు.

కళ్ళనించి కట్టలు తెంచి వస్తోన్న ప్రవాహం రొమ్ము ఎక్కేసరికి చెక్కిళ్ళపై యింకిపోయింది.

'నక్క' - సైదోడు - నా 'పొరపాటు'

శ్రీ గజపతిరాయవర్మ

"ఆంధ్రపత్రిక"(15—8—59) స్వాతంత్ర్యోత్సవ సంచికలోని "ఎల్లారమ్మ" గూర్చిన నా సచిత్ర వార్తావ్యాసం ఇంత చర్చకు దారితీస్తుం దనుకోలేదు. ఆ వ్యాస ప్రయోజనం యాత్రాస్థలం జేయాలనే దప్ప పరిశోధన దృష్ట్యా ప్రకటించలేదు.

శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు "భారతి" (డిసెం' 59) లో 'కాకతి శక్తి' గూర్చిన చర్చలో కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించిన దొండపాడు విగ్రహం దిగువ నున్నది నక్క చిహ్నం కాబట్టి అది కాకతమ్మ దైతే మండపాక 'ఎల్లారమ్మ' కూడా కాకతమ్మ కావాలి. నక్క చాముండ చిహ్నం కాబట్టి చాముండ కాకతీ ఒకటే నన్నారు. ఈ ఇద్దరూ యమశక్తి, యోగేశ్వరి (జోగులమ్మ)? అవతారభేదా లన్నారు. చాముండకు ప్రేతాసనం, నుదుట నెలవంక, పుర్రెల జందెం, కోరబా ఉండవచ్చున్నారు. మండపాక చిహ్నం నక్క అన్నారు.

"భారతి" లో (జులై 1960) లో 'నక్క-పంది కొక్కు' వ్యాసంలో శ్రీపాదవారు పేర్కొన్న కొన్ని విగ్రహాల ఛాయా చిత్రాలగూడా నేనే ప్రప్రథమంగా ప్రకటిస్తూ మండపాక 'ఎల్లారమ్మ' వద్ద మైక్రాస్కోపుక్కూడా నక్క కనిపించదన్నాను. వేశ్వరనే భావం గందని సూచిస్తూనే ఏకవీర కాకతమ్మలు ఒకే దేవి ద్విగుణ రూపకల్పనలుగా మళ్లీ సందేహించాను. కాకతి మూలగూరమ్మవలె ఒకూరి అమ్మవారు మరో రాష్ట్రంలో చూడాలన్నాను. విదేశాల్లో కొన్ని విగ్రహాల పోలికలు ఏకవీర కున్నాయన్నాను.

"భారతి" లో (నవంబరు 1960) 'కాకతమ్మ—ఏకవీర' గూర్చిన వ్యాసంలో శ్రీపాదవారు బాగా చర్చించారు. చాముండ లక్షణాలు కొన్ని ఏకవీర అనిపించేట్లున్నా యన్నందుకు సంతోషిస్తున్నాను. 'ఏకబీర' ను పేర్కొని అది ఏ లింగమో తెలీని ఒక విగ్రహం గల దన్నారు. అయితే ఇద్దరికీ భేదం ఉంద న్నారు. కాని యిద్దరికీ వేపమండలే చామరాలు అన్నారు. నాగేంద్రాచ్ఛాదితస్తనీ, కొన్ని చోట్ల చేత పాముందనీ, ఒక చోట అమ్మవారినే పాము చుట్టుకునుందన్నారు.

"కాకతమ్మ పేరూ ఏకవీర పేరూ కలిపి చెప్పడంవల్ల ఇద్దరూ ఒక్కరే అయివుంటారేమో నంటారు వర్మగారు' అన్నారు.

'సప్తమాతృకలలో శూల, ఖడ్గ, డమరుక హస్తములతో, నక్కచిహ్నములతో కనబడుతోంది చాముండ. దొండపాటి కాకతమ్మబీడుమీద శ్రీ ప్రభాకరశాస్త్రిగారు గుర్తించిన కాకతమ్మని చాముండకు కనపడే ఆయుధాలే. మండపాక (ఎల్లారమ్మ అనుకునే) కాకతమ్మకూ ఇవే ఆయుధాలు. చిహ్నాలూ నక్కలే కావాలి. గజపతిరాయ వర్మగారు అనుమానించినట్లు పంది కొక్కు లెలాగౌతాయి. పందికొక్కు ఈ చివరి చోట్ల విగ్రహాల చిహ్నాలకు వలె కాళ్లమీద నిలబడజాలదు. పందికొక్కు వీపు తలకంటె ఎత్తుగా గుట్టలాగ ఉంటుంది. వీటి రెంటికీ వీపు తలకంటె ఎత్తుగా లేదు. మీదు మిక్కిలి దొండపాటి చిహ్నానికి తోకబరువు నక్కకు వలెనే. మండపాక చిహ్నపు తోక పందికొక్కు తోకవలె పొడుగ్గా లేదు. మరి వారి మైక్రాస్కోపుకి ఈ చిహ్నాల 'నక్కత్వము' అందలేదంటే నేనేం జెయ్యను! సప్తమాతృకల వరుసలలోని చాముండ చిహ్నమును పరిశీలించుకోండి అంటాను. హైదరాబాదులో సప్తమాతృకా శిల్పంలో ఉంది నక్క' అని వ్రాసారు శ్రీపాదవారు.

'ఇద్దరూ ఎల్లమ్మలే అనడము వారు సైదోడులని తెలియక రూపాంతరములే అనుకోడమువల్ల వచ్చిన పొరపాటంటున్నా' నన్నారు.

అయితే ఆ వ్యాసంలో ఎవరైనా దొరకబుచ్చుకోగల—తప్పించుకో నవకాశం కల్గించే సౌకర్యం—రాచబాట చూపారు శ్రీపాదవారు. మూరు నయాపైసాల సత్యం మన దేశాన స్వతంత్ర పరస్పర శత్రురాజ్యాలు వెలయడం సాంప్రదాయాలు అన్నిటా అవే కావు అన్నారు.

వేటూరి శంకరశాస్త్రిగారు "భారతి" లో (ఫిబ్రవరి 1961) 'కాకతమ్మ స్వరూపం' వివరించారు. దొండపాడు చిహ్నం వరాహం కాదంటూ సృగాలమే అని ఖాయం జేశారు. ఇద్దరికీ నక్క చిహ్నం ఉంది కాబట్టి సప్తమాతృకల్లో చాముండ కాకతీ ఒకరే యన వీలగుననీ, కాకతి చాముండా వేశ్వరని, "కాళికా పురాణం" బట్టి వారిద్ద రొకటి కాదనీ "భారతి" (జూలై 1960) లో నే నుదాహరించిన వర్ణన కాకతమ్మకు సరిపడుతుందనీ వ్రాసారు.

శక్తులు, సప్తమాతృకలు, ఏకవీర, కాకతి మహామాతల గూర్చి సమగ్ర సచిత్ర వ్యాసాలు వేరుగా ప్రకటించ సిద్ధంగా నున్నాను. శ్రీపాదవారు, వేటూరివారు పేర్కొన్న యితర విషయాలగూర్చి అందు చర్చించడంలో చాముండ స్థానంలో నారసింహిని శ్రీవైష్ణవులు నిల్పియుండరు—ఆమె కూడా ప్రేత—సృష్టి సంబంధం గలదిగా క్రీస్తు పూర్వం నుండి గల కథ—బాబిలోనియా పురాణం పురావస్తు పరిశోధకులు ఇతర దేశాల్లో త్రవ్వి తీసిన విగ్రహాల వేరుగా వివరిస్తాను.

ఒకేదేవి ద్విగుణ రూపకల్పనయేమో వనే నా సందేహాన్ని శాస్త్రిగారు కూడా అపార్థం చేసుకున్నారేమి చెప్మా—కాకతి, యోగేశ్వరి, యమశక్తి, చాముండ అవతార భేదాలనే శ్రీపాద వారు, కాకతి ఏకవీర 'సైదోడు' లు కాబట్టి వేర్వే రంటారు. అయినా చాముండ లక్షణాలు ఏకవీరలో నున్నా యంటారు, శ్రీపాదవారు. కాకతి, చాముండ ఒకటే కాదు. వేర్వేరు అన్న శాస్త్రిగారు కూడా ఏకవీర—కాకతి వేర్వేరనడం, ఒకమ్మవారి ద్విగుణ రూపకల్పన కాదన్నేగా—అవతార భేదాలు అంటే వివిధ గుణరూప కల్పనలు కావటండీ!

నేనేం పండితుణ్ణి, పరిశోధకుణ్ణి గాను. పాఠకుల మెదడుకు మేతవేసీ, మెరుగుపెట్టీ ఉదరపోషణ చేసుకునే వృత్తిపరుణ్ణి. మెచ్చికోలు కెదురుచూడక తెలిసినంతవరకూ ఆలోచన కందినంతవరకూ వ్రాసేసి 'స్మాక్' చేయడం నా వృత్తికి పెద్ద సంతృప్తి. వస్తు సమాచార సేకరణలో కావాలనే తెలిసినది తెలీనట్లు, తెలీనిది తెలిసినట్లు ప్రవర్తించడం నా వృత్తికి ఉగ్గుపాలతోనేర్పదగిన ఉపాధి.

ఈ వ్యాసాలకు బదులుగా పంపిన వ్యాసం సుదీర్ఘం కావడంచేత నేమో తిరిగిరాగా సంక్షిప్తంగా వ్రాస్తున్నాను. "భారతి" లోనే పై వ్యాసాలకు మరో వ్యాసం వ్రాయాల్సిన అవసరం ఉందికదా.

నా పొరపాటు నప్త మాతృకం గూర్చి అప్పటికి ఎక్కువగా శ్రద్ధ వహించక పోవడమే కాదు—'ఎల్లారమ్మ' గుడిలో (తణుకు తాలూకా మండపాక) తలను పోలే చిన్న శిలామూర్తి గూర్చి అశ్రద్ధ చేయడం.

నక్క— సైదోడు 'పొరపాటు'

దొండపాడు చిహ్నం కీ. శే. శాస్త్రిగారు వరాహం అంటే కాబో లనుకున్నా కారణం గత వ్యాసంలో వ్రాశాను. అది పందికాదు. ముంగిసలా ఉంది. కాని వరాహ చిహ్నమున్న అమ్మవార్ను లేకపోలేదు. గోల్కొండ మ్యూజియంలో చిహ్నం స్పష్టంగా (ఛాయా చిత్రం ఇదివరకే ప్రకటించాను) నక్క. అంతకన్నా స్పష్టంగా తోక—నక్క హైదరాబాద్ మ్యూజియంలో శ్రీపాదవారు పేర్కొన్న నప్త మాతృకల వరుసలో చాముండవద్ద నుంది.

అలంపూర్ ఆలయాల గూర్చిన పవిత్ర గ్రంథం ఒకటి శ్రీ గడియారం రామకృష్ణ శర్మగా రంపారు. అక్కడ అమ్మవార్ల తంపై తేలు, బల్లి, గుడ్లగూబ ఉన్నాయి. వచ్చి చూచి పరిశోధింప గోరారు. నా రంపిన పుస్తకంలో చిత్రాలు—చాముండ దగ్గరున్న చిహ్నం ఖచ్చితంగా నక్క అనేట్లు కాన్పించదు. కక్కాలావుంది. ప్రేతాసనం కాన్పించదు. కాస్తలో కోరలు, స్తనాలు అక్కడి జోగులాంబకు, గోల్కొండ మ్యూజియంలో మరో విగ్రహం (ఛాయాచిత్రం ఇందుతో ప్రకటిస్తున్నాను) కు పోలికలున్నాయి. జోగులాంబలో శీర్ష ప్రాధాన్యత ప్రస్ఫుటం. ఈ పుస్తకంలోనే ఉన్న వైష్ణవి చిత్రంలో ప్రేతాసనం ఉందే!



గోల్కొండ మ్యూజియంలో సర్పకటి కుచబంధ అలంపూర్ జోగులాంబనుపోలును

శ్రీపాదవా రిటీవల నన్ను చూడవచ్చారు. ఆంధ్రలో సర్వం వాకే తెలుసుననే పరిశోధకులు కోవకు చెందని సహృదయులు. నిద్రాణ మైపోతున్న ఆలోచనల్ని రేకెత్తించినందుకు వారికి కృతజ్ఞుడ్ని.

మండపాక ఆలయంలో నెలవంక, కోరలు, ప్రేతాసనం—(చాముండ, కాకతికి చెందేవి) లేవు. ఎల్లమ్మ ఆకారం ఏదో నే నెరుగుదుననే సూచన గత వ్యాసంలోనే ఉంది. ఏకవీరాదేవి రూపం శీర్షం మాత్రమే. ఆమెకు సర్ప, సింహ చిహ్న లుంటాయి-శీర్షం మాత్రం—'ఎల్లారమ్మ' వద్ద సర్ప సింహాల్లేవు సరిగదా 'ఎల్లారమ్మ' నిండు విగ్రహంగా ఉంది.

ఈ విగ్రహం దిగువ నున్న చిహ్నం ఎంతమాత్రం నక్క గాదు. నక్క అంటే చూచినవారు నవ్వుతారు. శ్రీపాదవారికి 'నక్కత్వం' అందజేసినది ఆయుధాం పొలికైతే—".... శ్వేత

వర్ణం త్రినేత్రం జటామకుటినం .... వ్యాఘ్రచర్మ .... ఫణి వేష్టితం త్రిశూలం ...." వర్ణనకు మనః ఫలకంపై ఏ దేవుడు సాక్షాత్కరిస్తాడు ? కాని యీ వర్ణన శివ, రుద్ర సంబంధం కాదంటే ఆశ్చర్య పడతారు.

ఇందుతో శ్రీకాకుళం ఇందుశేఖరి విగ్రహ చిత్రం ప్రకటిస్తున్నాను. ఈవిడ చాముండ—కాకతి అంటారా ?

చంద్రశేఖరి, చంద్రహాసాయుధపాణి అయితే తప్పక భూమి—చంద్రాధిష్ఠానదేవి అయ్యుండా లనుకుంటున్నాను.



శ్రీకాకుళం కోటీశ్వరాలయంలో విగ్రహం.
కిరీటంపై శశిభూషణం చూడండి

అనేక దేశాల్లో—మన దేశంలో అమ్మవార్లందరికీ ఈ సంబంధం—ఉంది. ఏకవీర భూమాతయే—సర్పం జల సృష్టి సంబంధమై య్యుంది. అలంపూర్ విగ్రహాల్లో తల లేకుండా వంగరించిన కాళ్లతో నున్న నగ్నరూపం 'రేణుకా భూశక్తి'—జగన్మాత—ఈ విగ్రహం వెనుక చరిత్ర ఒక గ్రంథం అవుతుంది.

శ్రీపాదవారు హైదరాబాద్ మ్యూజియంకు వెళ్లి నప్పుడు ఈసారి—వారు పేర్కొన్న సప్తమాతృకల సరసకు ఎదుటి వసారా—శిథిల విగ్రహాలు చూడగోరెదను. చిన్న సైజ సప్తమాతృకా శిల్పా లున్నాయి. అందులో గణపతిని ప్రక్కనున్న విగ్రహం (వారు చాముండ, కాకతి అంటున్నదే) దిగువ చిహ్నం చూస్తే నక్క అవరువ రికదా, కాకతి చాముండ వర్గైనా దిగువ చిహ్నాల్లో ఎలుకజాతి కూడా ఉందని అంగీకరించక తప్పదు.

మండపాక వెళ్లి చూచినవారు, ప్రతి రేఖా స్పష్టంగా కాన్పించే నే దీసిన ఛాయాచిత్రం—ఎవరికీ నక్కగా కాన్పించదు.

మండపాక చిహ్నం పందికొక్కు జాతి అనడం నా ఉద్దేశం, లోహారియల్లో జీవించే నఖదంతాలపై ఆధారపడే (Vodent) వని—


శ్రీపాద వారికి అందిన 'నక్కత్వం' మండపాక అమ్మ వారిని జూచినవా రెవరికీ అందలేదు. మూషిక చిహ్నం ఉన్న అమ్మవా రుండడం శ్రీపాద వారికి తెలీదేమో ?

కుక్కంత ఉండే రకం నక్కతోక చివర బంతిలా గుండ్రని కుచ్చు—పొట్టి నక్క—గుంటనక్కల తోక మొదటి నుండీ కుచ్చు—జల్లితోక నక్కలు – కుచ్చు లేకుంటే నక్క తోకే కాదు. మండపాక చిహ్నం తోకకు కుచ్చు లేదు. కాగా చెవులూ నక్కవి కావు—ఎలుక జాతికి చెందిన చెవులే. మూతి నక్కది కాదు. కాళ్లు నక్కవి కావు—మండపాక చిహ్నం నిటారుగా నిలచిం దంటారు శ్రీపాదవారు. పందికొక్కు నిటారుగ (నక్కవలె) నిలువలేదు. వీపు గుట్టగా ఉంటుందనే శ్రీపాదవార్ని మరోసారి ఛాయాచిత్రం చూడగోరుతున్నాను. మండపాక చిహ్నం స్పష్టంగా కాళ్లు ముడుచుకున్నట్లుంది కాబట్టి ఎలుకజాతిదే అని అంగీకరించక తప్పదు.

మండపాక ఈ చిహ్నన్ని చూసినలు చుంచు, ఎలుక, పందికొక్కు, ముంగిసతో పోల్చారే గాని ఎవరూ—శ్రీపాద వారు తప్ప—నక్కగా గుర్తించలేదు. మండపాక చిహ్నం తోక పొడవుగా లేదు., చివర సూదిగా లేదు కాబట్టి నక్క అనుకున్నట్లుంది శ్రీపాదవారు. ఆ చిహ్నం చూస్తే దాని ఆకారానికి తోక ఏమాత్రం కురుచ కాదు. గుట్ట వీపు లేదే మంటారు శ్రీపాదవారు. ఎలుక, పందికొక్కు, చుంచు ఒక జాతి వనుకుంటున్నాను కాబట్టి—వీటిని వీరికి జంతువులుగా లెక్కించాను. ఈ వీరికి జంతువులు నవ్వడికి మనిషిని చూస్తే భయపడి ఆగిపోయి కుంచించుకుంటాయి. ఎలుక జాతికి పృష్ఠ భాగం బలసి ఉంటుంది. కుంచించుకోడంతో గుట్టు ఏర్పడు తుందే గాని పడిచేప్పుడు గుట్ట కనిపించదు. మండపాక చిహ్నంతోక వంపుంది—అయితే ఆ పొలిక నక్కతోక వంపుకు సరిపెట్ట వీలులేదు.

చుంచు చిట్టెలుకను చూస్తే—దాని తోక జూస్తే శ్రీపాదవారు పొరపాటు ఎవరిదో గుర్తిస్తా రనుకుంటాము. ఏ ఇంటిలో నైనా వీటిని చూడవచ్చును.

మరో సందర్భం గూడా చెప్తాను. హైదరాబాదు మ్యూజియంలో నున్న పార్వతి విగ్రహ చిత్రం ఇందుతో ప్రకటించాను. దిగువ తొండ చిహ్నం ఉంది. ఆవిడనే కొందరు



హైదరాబద్ మ్యూజియంలో పార్వతి
మకరవాహిని దిగువ తొండవుంది

దుర్గ అనీ, గౌరి అనీ అంటున్నారు. ఆ చిహ్నం తొండలా కాన్పించదు. మొసలి అయ్యుండాలి. పార్వతికి మకర చిహ్నం ఉందని ప్రాజ్ఞు లన్నారు.—" "అమరకోశం" లో గూడా అంతేనటగా! మకరం మరో కల్పితరూపం. అనేక రూపాలు— జలచర సరీసృప భూచర రూపాలుగా చెక్కేసారు. వర్ణించారు. విచిత్ర శీర్షాలూ యిచ్చారు.

ఈ మకరం పొందిన పరిణామాల పోలిక మండపాక చిహ్నంలో నక్క మూషికనైందనలేము. అది నక్క అని ఎవరూ అనరు. పైగా మూషిక చిహ్నం అమ్మవారు లేక పోలేదు.

వేటూరి శంకరశాస్త్రిగారు వ్యాసంలో నే పేర్కొన్న వర్ణన (భారతి" జూలై 1960) కాకతికి సరిపడుతుం దన్నారు.

నే పేర్కొన్న వర్ణన శివదూతికది. కాబట్టి వేటూరివారు కాకతి శివదూతిక అన్నట్లే గదా.

శివ రుద్ర అవతార భేదమే గదా గజాననుడు. ఇద్ద రికీ మూషిక సంబంధం ఉంది. భర్తకు, కొడుక్కున్న చిహ్నం పార్వతి కుండకూడదా? ఈ మార్పుల చరిత్రా ఉంది. రేణుక, పార్వతి, గిరిరాజనందన చరిత్ర వేరుగా వ్రాస్తాను.

పార్వతి అవతార భేదం (కూతురు) కాళి. కాళి చండ ముండుల జంపి చండిక అయింది ("మార్కండేయ పురాణం"). ఈమెనే శివదూతికా అన్నారు. ఈ చండికయే దుర్గుని జంపి దుర్గ అయిందట. దుర్గ—మహిషాసుర మర్దనివే చాముండీ అంటున్నారు (మైసూరు). దూతికలే శక్తులు. వారే అమ్మవార్లు, శివపత్నులైపోయిన కథ లున్నాయి.

చండికనూ శ్యేష్ఠాదేవి (వరుణ సతి, బ్రహ్మ మానస పుత్రి) నీ, రేణుకాదేవి పూజించినట్లే సంతానార్థులై పూజించడం ("కాదంబరి"), బాణ మహాకవి వర్ణనల్లో చండి కకు అజామూషిక హరిణీ సంబంధాల్లేవా? ఎలుక్కీ సృష్టి ధర్మాది సంబంధా లున్నగో!

కాకతి—రేణుకల కథ మనం ఎక్కువగా కర్ణాటకంలో వెదకాలి. అక్కడ ఏకవీర-(ఎల్లమ్మ)-రేణుకామూర్తి స్త్రీ శీర్షమే, 'జత్తిక మహామాయ" అంటే, ఏకవీరాదేవి మహా మాయాదేవికి దూతిక, సఖి, సైదోడు—మహామాయ వంటిది అన్నట్లుగా—ఆలోచించండి 'కాకతమ్మకు సైదోడు ఏకవీర'లో అర్థం. ఆ క్షేత్రాల్లో మూర్తుల్లేవు. సైదోడు పద ప్రయోగంవలన రెండు మూర్తులు అనుకొన్నారేమో శ్రీపాదవారు.

ఒకేదేవి ద్విగుణరూప కల్పనయేమో నంటే సైదోడ అని తెలియని పొరపాటుగా పట్టుకున్నారు శ్రీపాదవారు. కొన్ని తరాలనుండి అంధులంగా ఉంటూంటే ఆ అర్థం తెలివివాడ్ని అవుతానా!.

"క్రీడాభిరామము" ఏకవీర రూపం వూహించుకుంటే వెనుక కీ. శే. తలిసెట్టి రామారావుగారి వ్యంగ్యం చిత్రాలు (ప్రబంధ నాయిక—"భారతి") గా 'హాహా' గా ఉంటుంది. అయితే యీ వర్ణనలో ఆమె భూమ్యాకాశాలకు, సృష్టికీ, పంచభూతాలకూ సంబంధించినదిగా సూక్ష్మంలో సమగ్రంగానే ఉంది. తల మాత్రం (రేణుక), మొండెం (మాతంగి)గా కొందరు, తద్విరుద్ధంగా కొందరూ ఆరాధించినట్లుంది—అయితే రెండూ ఒకరి కథనే—

ఆ పుస్తకంలోనే వేరు సందర్భంలో లక్ష్మిచంద్రులను 'సైదోడు' అన్నాడు కవి. మన కథల్లో వా రిద్దరూ క్షీర సాగర మథనంలో పుట్టినట్లుంది.

దేశదేశాల సిన్, జిన్, చిన్, సినీవాలి,చెన్,చంద్ర, శ్రీ (లక్ష్మి) చరిత్ర తరిచి చూస్తే సిరిచంద్రు లొకటే అనేందు

కాధారాలున్నాయి. పాతే సైదోడులో తోబుట్టువు అన్నట్లే చెలి, పాటి అనే అర్థమూ జెప్పుకోవచ్చును.

"క్రీడాభిరామము" పద్యాల్లో మైలారదేవుడు భైరవుని తోడు జోదు (డు)గా మన్నాడు. శ్రీనాధుని పద్యాల్లో, దాక్షారామం గూర్చి చూడండి. కలియుగంలో మైలారుడు భైరవుడు:—

కాబట్టి యిద్దరూ ఒకటి కాదనుకునేందుకున్నన్ని ఆధారాలూ ఒకటే కావచ్చు ననుకునేందుకూ ఉన్నాయని ఎవరైనా అంగీకరించక తప్పదు.

భౌమిక సి వ యూ ర్తి జ్యోతిర్వై దికంలో ఉమా మూర్తుల్ని కలిపి అనేకు లనేక రూపగుణాలు గలవారిగా పూజించారు. ఇండయా, ఈజిప్ట్, బాబిలోనియా, ఆసియామైనర్, గ్రీసు, క్రీటు దీవుల్లో పోలికలు చూపడానికీ, ఏకవీర, ఏకగౌర (అర్ధ మూర్తి) కెబిలె, కబిరిన్, కా, కాకన్, కాకుత్—కూష్మాండివీ, దేశ దేశాల మాతృకల్ని, మాతల్ని, అదితి, రేవతి, గిరిరాజనందన లనూ ప్రకటించేవారూ, కావాలనేవారుంటే పవిత్రంగా ప్రదర్శింప సిద్ధంగా ఉన్నాను.

ఏకవీర (ఎల్లమ్మ) రూపం స్త్రీ శిర్సం అనుకుంటూనే మండపాక "ఎల్లారమ్మ" ఏకవీర మరో రూపం అనుకున్న కారణం చెప్తాను.

ఆలయంలో తలసుపోలే శిలామూర్తి ఎల్లమ్మకు చేరువ రూపం—అయినా అదినుంచీ అది అక్కడుందో, చెదరు చెదరుగా పడివుంటే అలా వేరుగా ప్రతిష్ఠించారో తెలీదు. అది విండు విగ్రహం యొక్క ప్రేతావశేషమో తెలీదు. "క్రీడాభిరామము" లో జెప్పిన మండపాక ఇదే అయ్యుండాలి. మండపాకలో బవనీలు (దాసర్లు) ఉండేవారు. "కోమటి" అన బడుతూన్న శిలపై శిల్పం—ఏకవీరాదేవి శీర్షం మొక్కుకున్నవాళ్ల హింసాయుతమైన ఆరాధనలు–సిడిమాను తిరగడాలుండేవి.

మానవుడు పుట్టుకను గూర్చిన తొలి ఆలోచనల్లో ఏర్పర్చుకున్న అకారం ఎల్లమ్మ, మహామాత, మహామాయ–ఆవిడే అదితి, హిరణ్యగర్భ, అండ, పిండ బ్రహ్మాండాల కథలు—ఆవిడ ఆకారం గుడ్డు, తలయే గాక ఇతర దేశాల్లో విండు విగ్రహాలూ ఉన్నాయి. వీరికీ సర్ప—సింహాలూ వెలవంకా చంద్రహాస సంబంధాలున్నాయి.

జనన మరణాలు, మరో లోకం గూర్చిన నమ్మకాలు, వాటినే వివిధ పార్టీలవారు విభిన్నరూపగుణాల నమ్ముకోడం, మాతృ ప్రాధాన్య కుటుంబాలఅయ్యలకు సోదరి, ప్రేయసి, భార్య కావటం—ఈ నమ్మకాల్లో తల్లి, మేనత్త కావడం, పవిత్ర గ్రంథాల్లో తోబుట్టువునే పెండ్లాడిన దైవాల కథలు ఇలాంటి వనేకం (మండపాక, గ్రీసులో మెడుసా, బైబిల్లో ఆబీజాత్, వైదిక ఉత్తానపాద విరాజ, హారప్ప శిధిలాలు, బాబిలోనియా తియమత సర్పగాథ) వీటన్నిటి సమన్వయం—కన్యారాశిని గూర్చిన కల్పనలు—ఆలంపూర్ నగ్నవిగ్రహం, గుడ్డు–తలను పోలే మూర్తుల చరిత్రలో జూప యత్నిస్తాను.

లిపిసంస్కరణము: ఒక ఉత్తరము: జవాబు

శ్రీ ఆంగీరస్

లిపి సంస్కరణమును గురించి 1962 జనవరి భారతిలో నేను వ్రాసిన ఒక చిన్న వ్యాసమును భారతి పత్రికాధిపతులు నాయందలి యవ్యాజానురాగముతో స్వవిషయముక్రింద ప్రకటించియున్నారు. వారికి అందలి యభిప్రాయములు నచ్చి అది అట్లు జరిగి యుండవచ్చును. లేదా, అందులోని కొన్ని అభిప్రాయములు నచ్చి, కొన్ని యభిప్రాయములు నచ్చక పోయినను మొత్తముమీద అందులో నా ప్రదర్శించిన వైఖరి బాగుగా నున్నదని భావించి వారు అట్లు చేసియుండవచ్చును. కాని దానిని నా పేరుతో ప్రకటించియుండుటవలన అందలి యభిప్రాయములను పూర్తిగా వారు అనుమతించినట్లు చెప్పికొనుటకు నా మనస్సునకు నాకే భావ్యమనిపించలేదు. అయినను దానిని వారు అట్లు ప్రకటించిరి గనుక, అందులోని కొన్ని అభిప్రాయములతోనైనా వారు ఏకార్థమతిత్వముకల్గి యున్నారనుట విశదమగుచునే యున్నది. నా అభిప్రాయములతో కొన్నిటితోనైనను, వారేకీభవించియున్నందులకు, వారికి నా ధన్యవాదములనేగాక, కృతజ్ఞతను గూడ తెల్పుచున్నాను.

ఇది ఇటులుండగా నా వ్రాసిన ఆ చిన్న వ్యాసముపై నొక యభిప్రాయమును ప్రకటించుచు, మైసూరు విశ్వవిద్యాలయమున ఆంధ్రశాఖకు అధ్యక్షులుగా నున్నటువంటి వారును, ఆంధ్ర ప్రభుత్వము నియమించియున్న లిపి సంస్కరణ సంఘములో సభ్యులుగా పనిచేసినవారును అయిన విద్వాన్ శ్రీ కె. సుబ్బరామప్పగారు భారతి పత్రికా సంపాదకుల కొక లేఖను వ్రాసిరి. అందులో వారు నా వ్రాసిన ఆ చిన్న వ్యాసముపై తమ చిత్తమునకు వచ్చిన అభిప్రాయములను వెలువరించి యుండిరి. అందలి వారి అభిప్రాయములపై నా అభిప్రాయములను తెలుపవలసినదిగా కోరుచూ, భారతి పత్రికా సంపాదకులు ఆ లేఖను నాకు పంపిరి. ఆ లేఖను ఇట సంపూర్ణముగా నుట్టంకించి, తరువాత దానిపై నా అభిప్రాయములేమో తెలియజేసెదను.

శ్రీ శివలెంక శంభుప్రసాద్‌గారు
"భారతి సంపాదకులు" మదరాసు—1.

ఆర్యా!

1962 జనవరినెల "భారతి"లో "ఆంగీరస్" పేరుతో లిపి సంస్కరణ విషయమై ప్రకటించిన మీ అభిప్రాయములను చదివినాము. అందులో తెలుగు—కన్నడ లిపుల ఏకీకరణ విషయమై వ్రాస్తూ, "ఈ లిపి తెలుగు కన్నడములకు కూడ ఉపయోగపడునని వీరి *(తెలుగు లిపి సంస్కరణ సంఘము) అభిప్రాయము. కాని ఇంతవరకును మైసూరు ప్రభుత్వము తమ అభిప్రాయమును ప్రకటించి యుండకపోవుట ఇక్కడ గమనించదగిన విషయము" అన్నారు.

* ఇది నేను చేర్చింది.

తెలుగు కన్నడ ఏక లిపి విషయమై మీ అభిప్రాయభేదాన్ని సమర్థించుకోవడానికని వాస్తవిక విషయాలను మభ్యపరచరాదని మనవి. మైసూరు ప్రభుత్వం అనుకూలమైన తమ అభిప్రాయాన్ని ఈవరకే ప్రకటించింది. తెలుగు కన్నడ ఏక లిపి విషయమై తమకు కూడా ఆసక్తి ఉన్నదని ఆంధ్ర ప్రభుత్వానికి మైసూరు ప్రభుత్వం వ్రాసింది. మైసూరు ప్రభుత్వ విద్యా శాఖామంత్రి 1959 సంవత్సరము డిసెంబరు మూడవ వారంలో జరిగిన మైసూరు శాసన సభలో శ్రీ జె. వెంకటప్ప అనే శాసన సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, వ్రాత మూలకంగా ప్రభుత్వాభిప్రాయాన్ని తెలియజేసినారు. ఆ విషయం (వార్త) పత్రికలు ప్రకటించినాయి. మీరు కూడా "ఆంధ్ర పత్రిక" దిన పత్రికలో వార్తల 'కాలము'లలో ప్రకటించివున్నారని జ్ఞాపకం. 1959 డిశంబరు 24 తేదీనుండి కొన్ని సంచికలు తిరుగవేస్తే కనిపిస్తుంది.

"ఇంతవరకును మైసూరు ప్రభుత్వం తమ అభిప్రాయమును ప్రకటించియుండకపోవుట ఇక్కడ గమనించదగిన విషయం" అని మీకు తెలియని విషయాన్ని నిశ్చితాభిప్రాయంగా వ్రాసి పాఠకులను పెడదారికి త్రిప్పడానికి చూడడం ఏమీ సబబుగా లేదు. ఉన్న సంగతిని తెలుసుకొనలేకపోవుట కూడా ఇక్కడ గమనించదగిన విషయంకదా! యోచించండి.

ఇది గాక—"ఈ లిపి తెలుగు కన్నడములకు ఉపయోగపడునని వీరి †(లిపి సంస్కరణసంఘమువారి) అభిప్రాయము" అని మీ నిశ్చితాభిప్రాయం ప్రకటించినారు. ఇలా ఎవరు చెప్పినారు? ఎక్కడ వ్రాసివుంది? గెజెట్ ఇలా ప్రకటించిందా? ఈ రెండు లిపుల ఏకీకరణాన్ని ఒక తెలుగు లిపి సంస్కరణ సంఘమే చేసేస్తుందా? అలా చేయుడానికి దీనికి అధికారం ఉచ్చిన వారెవరు? యోచించండి !లేని అభిప్రాయాన్ని ఉన్నదని ప్రకటించినారే!

† బ్రాకెట్‌లోనిది నేను వ్రాసింది.

మైసూరు ప్రభుత్వానికి ఈ సంస్కరణం ఇష్టంవున్నదో లేదోవారు తమ అభిప్రాయాన్ని "ఇంతవరకును" ప్రకటించినారో లేదో నిక్కచ్చిగా తెలుసుకొనదలిస్తే హైదరాబాద్‌లోని మీ ప్రతినిధిని ఆంధ్ర ప్రభుత్వ విద్యాశాఖవారివద్దకు పంపించి ఈ సంబంధమైన రికార్డులూ, పత్రికల్లో ప్రకటింపబడిన

వార్తలు, అభిప్రాయాల కత్తిరింపులు తీయించి సంగతి తెలుసుకొని మీకు వ్రాయుమని చెప్పండి.

పిమ్మట సత్యాంశాన్ని మరుగు పరచక ప్రకటిస్తారని నమ్మవచ్చునా? లేకుంటే కవిసామ్రాట్టు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారన్నట్టు" "భారతి" స్థాయి పడిపోయిందేమో అని అనుకొనవలసి వస్తుంది.

లిపి సంస్కరణ విషయమై తెలుగు లిపి సంస్కరణ సంఘమువారు చేసిన సిఫార్సులు మీకు ఇష్టం లేకపోతే దూది ఏకినట్టు ఏకండి. అది మీ యిష్టం. కలం ఉన్నది. పత్రిక ఉన్నది. కాని వాస్తవిక విషయాలను (Facts) మభ్యపరచడం పత్రికా రచనకు అపచారం అవుతుందని సుప్రసిద్ధ పత్రికా సంపాదకులైన మీకు నేను విన్నవించునంతటి వాణ్ణి కాను.

ఇట్లు

(సం.) కె. సుబ్బరామప్ప

విద్వాన్ శ్రీ కె. సుబ్బరామప్పగారిలేఖ ఇది. ఇందులో ఆయన మొదట పడిన పొరపాటు, నా వ్రాసిన ఆ వ్యాసమును భారతి సంపాదకులు వ్రాసియున్నారనుకొనుట. రెండు, ఆ అభిప్రాయములతో వారు పూర్తిగా నేకీభవించుచున్నట్లు భ్రమపడుట. ఇందులో తొలి భ్రమము రెండవ భ్రమకు దారి చేసినది. ఒక పత్రికలో ఒక వ్యాసమును ప్రకటించుచుండగా - దానిని స్వవిషయముక్రింద ప్రకటించినను—అది నా పేరున ఉన్నది గనుక, అది పత్రిక అభిప్రాయము కాదనియు, ఆ వ్రాసినవాని అభిప్రాయమనియు పత్రికల సంగతి నెరిగిన అందరికిని తెలియును. మరి అట్లు స్వవిషయము క్రింద నేల ప్రకటించుటయనగా, అందులోని బహు భావములతో ఆ పత్రికసంపాదకుల కేకీ భావమున్నదని అర్థము. ఇప్పుడు భారతి పత్రికా సంపాదకులు ఆ నా వ్రాసిన వ్యాసమునందలి ఏ యే అభిప్రాయములతో నేకీభవించుచున్నారో నాకే తెలియదు. కాని శ్రీ సుబ్బరామప్పగారు మొదటినుండి తుదిదాక భ్రాంతిని చెందియే యున్నారు గనుక, ఇచ్చట గూడా సంపూర్ణముగు భ్రాంతినే చెందిరి.

నిజముగా భ్రాంతిని చెందిరా? ఒక ప్రఖ్యాత విశ్వవిద్యాలయములో ఒక శాఖకు "హెడ్డు"గా నుండుచున్నవారలిట్లేల పొరపడుదురని సహజముగా నెవ్వరికైనను అనిపించును. అందువలన వారి ఈ వ్రాతకు ఇంకొక అర్థమున్నదేమోనని నాకు అనిపించినది. అది ఇచ్చట వ్రాయుచున్నాను.

ఇప్పుడు తాము ఆంధ్రలిపి సంఘములోనేడి ఒక అపురూపమైన లిపిని సృష్టి చేసినవారిలో, లేక వున్న లిపిని సంస్కరించినవారిలో ఒక్కరైనారు. దానిని ఎవరో విమర్శించినారు. భారతి పత్రికాధిపతులు దానిని ప్రకటించినారు. వారు అట్లేల ప్రకటించవలయును అను దురభినివేశముతో, పై లేఖలోని అంశములను వారు అట్లు వ్రాసియుందురు.

శ్రీ సుబ్బరామప్పగారింకను ఇట్టి ఆరోపణము చేయుచున్నారు. "తెలుగు కన్నడ ఏక లిపి విషయమై మీ అభిప్రాయభేదాన్ని సమర్థించుకోవడానికని, వాస్తవిక విషయాలను మభ్యపరచరాదని మనవి. మైసూరు ప్రభుత్వం అనుకూలమైన అభిప్రాయాన్ని ఈవరకే ప్రకటించింది." ఈ విషయము భారతికిని, భారతి పత్రికా సంపాదకులకును,—నలుబది సంవత్సరములుగా పత్రికలను నడుపుచున్న వారికి—తెలియదని శ్రీ సుబ్బరామప్పగారు అనుకొనుచున్నారు. అయితే భారతిలో ఆ వ్రాసిన వ్యాసము నాది కాన, ఈ ఆరోపణమునకు ప్రత్యుత్తరము నీయవలసిన వాడను నేనగుచున్నాను. శ్రీ సుబ్బరామప్పగారు నా వ్రాసిన వ్యాసమును సరిగా అర్థము చేసికొనలేదు. వారును, మరి ఇతరులును రెండు సంవత్సరముల తరబడి కూర్చుండి, ప్రజా ధనమును వృథాచేసి, తయారుచేసిన లిపిని సంస్కరణమును కాదన్నాననిన ఆవేశములో వారు ఆ నా వాక్యమును సరిగా నర్థము చేసుకొనకపోవుటయు సహజముగనే యున్నది. నేను వ్రాసిన వాక్యము లివి. "ఈ లిపి తెలుగు కన్నడములకు ఉపయోగపడునని వీరి అభిప్రాయము. కాని ఇంతవరకును మైసూరు ప్రభుత్వమువారు తమ అభిప్రాయమును ప్రకటించియుండకపోవుట ఇక్కడ గమనించదగియున్నది." ఇందుపై శ్రీ సుబ్బరామప్పగారు పై వాక్యములు వ్రాసినారు. అనగా అర్థమేమి? నేను దేనిని "ఈ లిపి" అన్నానో, దానినే శ్రీ సుబ్బరామప్పగారు "తెలుగు కన్నడ లిపి" అని అర్థము చేసికొనని పక్షములో, వారు "మైసూరు ప్రభుత్వము అనుకూలమైన తమ అభిప్రాయాన్ని ఈవరకే ప్రకటించింది" అని వ్రాయుడములో అర్థములేదు. కాబట్టి నేను పేర్కొన్న "ఈ లిపి"నే వారు తెలుగు కన్నడ లిపిగా అర్థము చేసుకొనుచున్నట్లు వ్యక్తము అగుచున్నది. అది అట్లైనచో, వారి కీ ఆగ్రహము రావలసిన అవసరమేలేదు. ఎందుచేతననగా, వారే, "లిపి సంస్కరణ విషయమై తెలుగు లిపి సంస్కరణ సంఘమువారు చేసిన సిఫార్సులు మీకు ఇష్టం లేకపోతే దూది ఏకినట్టు ఏకండి" అని సలహాను ఇచ్చియున్నారు. ఆ సలహాను, వారు చెప్పకముందే నేను పాటించుట ఇప్పుడు తప్పైపోయినది.

ఇందులో అసలు రహస్య మేమనగా శ్రీ సుబ్బరామప్పగారు నా ఆ పై వాక్యములకు మైసూరు ప్రభుత్వమునకు "తెలుగు కన్నడ ఏక లిపి" విషయములో అనుకూలమైన అభిప్రాయములేదని నేను వ్రాసినట్లు అర్థము చెప్పుకొనినారు. అది అట్లుకాదు. నేను 1962 జనవరి భారతిలో "ఈ లిపి" మొదలైన వాక్యములకుముందు ఇట్లు వ్రాసినాను. "అయితే, ఈ సంఘమువారు లిపిని సంస్కరించి నిర్మించిన అక్షరములు అందవికారముగా నున్నవి." ఆ తరువాత "ఈ లిపి" మొదలగు వాక్యమువలన "ఈ లిపి" అనగా లిపి సంస్కరణ సంఘము తయారుచేసిన అక్షరములని మాత్రమేకాని, మరి ఏవో ఇతర అక్షరములనికాదు. మరి ఈ అక్షరములకు మైసూరు ప్రభుత్వము తమ అనుమతిని తెలియ జేసినదా? శ్రీ సుబ్బరామప్పగారి ఉత్తరమున "తెలుగు కన్నడ లిపి" భాగమును చదివినచో, ఆ ప్రభుత్వము పూర్వమే ఇందుకు, తన అనుకూల్యమును ప్రదర్శించివున్నట్లు అర్థము చేసికొనవలసి వచ్చుచున్నది. ఇది శ్రీ సుబ్బరామప్పగారికి గూడ అనిష్టము. ఎందువలన ననగా వారే - ఇది గాక "ఈ లిపి" మొదలైన వాక్యములలో

లిపిసంస్కరణము: ఒక ఉత్తరము: జవాబు

ఆ లిపి వేరు, ఈ లిపి వేరు అన్న భావమును వ్యక్తముచేసి వున్నారుకాని నేను ఏదో లిపిని గూర్చి గాక, 1961 డిశంబరు 11 గెజెట్‌లోని "లిపి"ని గూర్చి మాత్రమే పై వాక్యములో వ్రాసినాను. ఆ విషయమును అర్థముచేసికొనియు, అర్థముచేసికొనకయు, శ్రీ సుబ్బరామప్పగారు తబ్బిబ్బు పడినారు.

"మైసూరు ప్రభుత్వంవారికి "ఈ సంస్కరణం" ఇష్టమున్నదో లేదో, "ఇంతవరకును" వారు తమ అభిప్రాయాన్ని ప్రకటించినారో లేదో" మొదలైన వాక్యములు ఇక్కడ అప్రస్థానపతితములు. ఈ విషయము ఎవ్వరినో అడిగి తెలుసుకోవలసిన అవసరములేదు. ఎందుచేతననగా, అసలు సంస్కరణము విషయమున మైసూరు ప్రభుత్వము అభిప్రాయము ఇక్కడ ప్రసక్తముకాదు గనుకను; ప్రసక్తమైనది లిపి సంస్కరణ సంఘమువారి 'లిపి'ని గురించి మాత్రమే గనుకను.

ఇక, "ఈ లిపి తెలుగు కన్నడములకు ఉపయోగపడునని వీరి అభిప్రాయము" అని మీ నిశ్చితాభిప్రాయము" మొదలైన వాక్యము లున్నవి. అది నా అభిప్రాయము. ఆ అభిప్రాయము నాకు కల్గుటకు గూడ 1961 డిశంబరు 11 గెజెట్టే కారణము. అందులో 13 వ పేజీలో ఈ వాక్యము లున్నవి:

"తెలుగు కన్నడ భాషలకు రెంటికీ ఒకే లిపిని రూపొందించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేరిట మైసూరు ప్రభుత్వంనుంచి వచ్చిన లేఖ ప్రతిని పొందుపరుస్తూ విద్యాశాఖ పంపిన ఉత్తరాన్ని సంఘం పరిశీలించింది.

"ఈ రంగంలో ప్రఖ్యాత విద్వాంసులు, నిపుణులు పంపిన అభిప్రాయములను, పత్రికల కత్తిరింపులను, మరల కొత్తగా సంఘం పరిశీలించింది.

....

....

"తెలుగు కన్నడ భాషలకు ఒకే లిపిని రూపొందించే విషయంలో మైసూరు ప్రభుత్వంనుంచి వచ్చిన ఉత్తరాన్ని ఆంధ్ర ప్రభుత్వం కోరిన విధంగా సభ్యులు సమగ్రంగా చర్చించి దిగువ తీర్మానాన్ని ఆమోదించారు.

"తెలుగు, కన్నడ భాషలకు రెండింటికీ ఒకే లిపి ఉండటం వల్ల చేకూరే లాభాలేమిటో సుస్పష్టమైనవి గనుక, ఈ ప్రయత్నానికి తెలుగు లిపి సంస్కరణ సంఘం తన ఆమోదాన్ని తెలుపుతూ, ఈ విషయంలో తరువాత చర్యలు తీసుకొనే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి వదిలివేయడం సబబని భావిస్తోంది."

ఈ పైన ఉద్ధరించిన వాక్యములవలన ఎటువంటి అర్థము ఉత్పన్నము కాగలదో పాఠకులే పరిశీలించగలరు. ఆ వాక్యములను పరిశీలించగా నాకు కల్గిన అభిప్రాయమునే భారతిలో నా చిన్న వ్యాసమునుండి శ్రీ సుబ్బరామప్పగారు ఉద్ధరించిన వాక్యములలో వ్రాసినాను. అందుకు కారణములు:

(1) మైసూరు ప్రభుత్వము ఆ ఉత్తరములో "తెలుగు కన్నడములకు ఏక లిపిని రూపొందించడ"మును గురించి తప్ప, మరి ఏమి వ్రాసినారో నివేదిక తెలుపుటలేదు. (ఇక్కడ పత్రికలను చూచుకొనరాదా అన్నచో అనవసరము. నా వ్యాసములో ఈ నివేదికలోని విషయములు మాత్రమే విమర్శింపబడినవి). (2) అట్లు ఆ లిపిని రూపొందించుటకు వారు చేసిన ప్రతిపాదనలేమో, సూచనములేమో ఈ నివేదికవలన తెలియుటలేదు. (3) "తెలుగు కన్నడములకు రెండింటికీ ఒకే లిపి ఉండటమువలన చేకూరే లాభము లేమిటో సుస్పష్టమైనవి గనుక," "ఈ విషయములో తరువాత చర్యలు తీసుకొనే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి వదిలివేయడం సబబు" అని ఈ సంఘం భావించడమువలన, ఆ ప్రయత్నమునకు, ఈ సంఘం తయారు చేసిన లిపినే మైసూరు ప్రభుత్వముచేత ఆమోదింపజేసే బాధ్యతను ఆంధ్ర ప్రభుత్వముపై ఉంచినారన్న అర్థము ప్రతీతమగుచున్నది. అట్లుకానిపక్షములో, మైసూరు ప్రభుత్వము చేసిన ప్రతిపాదనమేమో, ఆ ప్రతిపాదనములను ఏ విధముగా పాలించవలయునో, వీరు తెలియజేసియుండవలసినది. (4) "ఆంధ్ర ప్రభుత్వం కోరిన విధంగా" అని యున్నదిగాని, ఆ కోరిన విధమేమో నివేదికలో స్పష్టముగాలేదు. (సంఘమువారు మైసూరు ప్రభుత్వము లేఖను రెండుసార్లు పరిశీలించినారు. ఒకసారి విద్యాశాఖ పంపగాను; రెండవసారి ప్రభుత్వంకోరిన విధముగాను) (5) ఈ సందర్భంలో పత్రికలలో పడిన అంశములనుబట్టి, మైసూరు ప్రభుత్వము ఈ లిపిని రూపొందించుటకు "ఇంటర్ స్టేట్ కమిటీ"ని వేయమన్నది. అట్టి కమిటీ ప్రసక్తి ఈ నివేదికలోలేదు. కాబట్టి, ఇప్పుడు ఈ లిపి సంఘము, ఇంత కృషి చేసి తయారు చేసిన అక్షరములే కన్నడమునకు గూడా పనికి వచ్చునన్న అభిప్రాయము వారి కున్నదన్నచో విప్రతిపత్తి యేమి? అప్పుడు "ఇలా ఎవరు చెప్పినారు......లేని అభిప్రాయాన్ని ఉన్నదని ప్రకటించినారే!" అని శ్రీ సుబ్బరామప్పగారు వ్రాయుటలో అర్థములేదు. లిపి సంస్కరణ సంఘమునకు సమిష్టిగా గాని, లేక అందులో పని చేసిన సభ్యులకు వైయక్తికముగాగాని, ఆ అభిప్రాయము లేకపోవచ్చును. కాని, వారు వ్రాసిన నివేదికలోని పై వాక్యములవలన ఆ అర్థము ప్రతీతిని చెందుచున్నది. నేను దానినే వ్రాసినాను. అది దోషముగుచో, ఆ దోషము నాది కాదు. ఆ నివేదికను రచించిన వారిది.

ఈ సంఘమునకు ఈ అభిప్రాయమే లేకపోయినచో "ఇంటర్ స్టేట్ కమిటీని" వేయవలసినదిగా ప్రభుత్వమునకు సూచించి యుండవలసినదిగదా! అట్లు వెంటనే చేయక, ఈ "లిపి" తయారు చేసి, "ఈ విషయంలో తరువాత చర్యలు తీసుకొనే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి వదలటం సబబు" అనుకోవడంలో అర్థమేమిటి? ఇప్పుడు ఈ లిపియున్నా, "ఈ విషయంలో తరువాత చర్యలు తీసుకున్న" తర్వాత ఇంకో లిపి యున్నా! అట్లా ఇంకో లిపిని తెలుగు కన్నడములకు తయారు చేసే పక్షంలో ఇప్పుడు ఈ తయారు చేసిన 'లిపి', ఈ లిపికోసం జరిపిన కృషి వృధా అయిపోవడంలేదా! పైగా ఈ లిపినే అనేక విధములుగా ప్రచారములోనికి తెచ్చేందుకు సిఫార్సులు గూడా

చేసినప్పుడు, తరువాత ఇంకో లిపి వచ్చే పక్షంలో అయితే, అప్పుడు పరిస్థితి మరీ అవ్యవస్థితంకాదా! ఇన్ని కారణాలవల్ల తెలుగుకు ఇప్పుడు ఏర్పాటు చేసిన ఈ క్రొత్త లిపియే కన్నడమునకు గూడా పనికి రావచ్చునని ఈ సంఘమువారు భావించినట్లు అభిప్రాయ పడినానంతేగాని దీనిని మైసూరు ప్రభుత్వము ఆమోదించు నన్న అభిప్రాయము పడలేదు. అందుచేతనే "ఇంతవరకును"— అనగా 1961 డిశంబరు 11 తరువాతనుండి, 1962 జనవరి ప్రారంభమయ్యేడిలోగా, "ఈ లిపిని గురించి" వారు వారి అభిప్రాయమును ప్రకటించియుండలేదని, అది గమనించదగిన విషయమని వ్రాసినాను అంతేగాని "తెలుగు కన్నడ ఏక లిపి" విషయములో మైసూరు ప్రభుత్వము ప్రతికూలమని ఎక్కడను వ్రాయలేదు· ఈ రెండు భాషలకు ఏకలిపి అనవసరమని వ్రాసినాను.

ఇప్పుడీ సంఘమునకు "తెలుగు కన్నడ లిపుల ఏకీకరణానికి" ఎవరు అధికారం ఇచ్చినారని, శ్రీ సుబ్బరామప్పగారు ప్రశ్నించుచున్నారు! ఇది వారు మనస్సును, కండ్లను గూడ మూసికొని అనినమాట. అంతియుగాక, ఆంధ్రప్రభుత్వము లిపి సంఘమునకు అందజేసిన Terms of Reference ఏమిటో గూడా మరిచిపోయి అనుచున్నమాట. ఆంధ్ర ప్రభుత్వమువారు సంఘము పరిశీలనాంశములలో "తెలుగు కన్నడములకు ఏక లిపిని రూపొందించడానికి తీసుకోవలసిన చర్యలను" గురించి గూడా ఒక అంశాన్ని చేర్చియున్నారు. నిజమునకు నే నీ విషయమును నా వ్యాసములో ఎత్తుకొనలేదు. అప్రస్తుత ప్రసక్తి అని వదిలి వేసినాను. పరిశీలనాంశములేమో ఉదహరించి యూరకొన్నాను. అందువలన వారు ఈ సందర్భముగా వ్రాసిన మాటల కర్థము లేదు. అంతియుకాక ఇప్పుడు తయారుచేయబడిన లిపి ఈ రెండు భాషలకు పనికివచ్చునని ఈ సంఘ మభిప్రాయపడు చున్నదని వ్రాసినానంతేగాని, అది వారి నిర్ణయమనిగాని, సిఫార్సులనిగాని నేను అనలేదు. ఈ లిపిపై నా వ్రాసిన వ్రాతలు పాఠకులను పెడత్రోవకు త్రిప్పుటకు వ్రాసినవని శ్రీ సుబ్బ రామప్పగారు మరియొక ఆరోపణము చేయుచున్నారు. నా ఈ వ్రాతలవలన నిజముగా పాఠకులు "పెడదారిని" బట్టుచో, నేను చరితార్థుడనే. నేను నాకు తెలియని విషయమును వ్రాయలేదు. అర్థముకాని విషయమునుగూర్చి ప్రస్తావించలేదు. లోకము విపులము గనుక, నది గూడ నా వ్రాతలను సరిగానే అర్థము చేసుకొన్నదని అనుకొనుచున్నాను. ఆ లోకమున కిందరి అర్థము మరియు తెలియుట కొరకే, విషయము నింతగా కుండబద్దలు కొట్టినట్లు వ్రాసినాను. నా వ్రాసిన దానిని లోకము హర్షించుచో నాకు కావలసినదిలేదు. ఇప్పుడు శ్రీ సుబ్బరామప్పగారికి నా వ్రాసిన దానిపై కోపము వచ్చిన దనగా—ఆ కోపములో వారు ఏమి ఏమిటో తెలిసికొనక, తమ ఆక్రోశమును మాత్రము వ్యక్తము చేసికొన్నారు – అందులో కొంత నిజమున్నదనియు, ఇప్పుడు శ్రీ సుబ్బరామప్ప గారికి ఆ నా వ్రాతపై కోపము "గుమ్మడికాయ దొంగతనము" లాలాకు పామెత వంటిదనియు భావించి, నా వ్రాసిన వ్యాసమునందలి ప్రయత్న మిటుల సఫలమైనందుకు సంతోషించుచున్నాను.

విషయమిటులుండగా శ్రీ సుబ్బరామప్పగారు నేనేదో చేయరాని పాపమును చేసినట్లు—అది దోషమే యగుచో చేసి నది నేను—"వాస్తవ విషయాలను" అనగా "Facts" ను మభ్య పరచి వ్రాసినట్లు భావించి—"అది పత్రికా రచనకు అపచారం అవుతుందని" మందలించినారు. అంతియుకాక, కవిసమ్రాట్టు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారిని తెచ్చి, "వారన్నట్టు "భారతి" స్థాయి పడిపోయిందేమో అని అనుకోవలసి వస్తుంది" అని ఒక విసురు విసిరినారు. అసలు శ్రీ సుబ్బరామప్పగారి యుత్తరమే సందర్భశుద్ధి లేకుండ నున్నది. ఇప్పుడు ఈ మాటలు మరియు సందర్భశుద్ధిగాని, ఔచిత్యముగాని, లేకయున్నవి. "శ్రీ సత్యనారాయణగా రేదో ఆగ్రహములో భారతిని మాట అన్నారు. కనుక ప్రతిఒక్కరు కుక్కపిల్లలభాతి భారతిని చూచి మొరిగితే ఎట్లా!" అని భారతి సంపాదకులు నాతో అన్నారు. ఇంతకుమించి నేను చెప్పవలసిన దేమియు లేదు.

కట్నాలూ - పెళ్లిళ్లూ

శ్రీ మల్లికార్జున

పాత్రలు

రామయ్య — వెంకయ్య
గోపాలం — గోవిందయ్య
సూర్యం — మల్లిగాడు.

అది ఒకరైల్వే ప్లాట్‌ఫారంలో జరిగిన సంఘటన. తెర తీయగానే ఖాళీగాఉంటుంది. ఒకప్రక్కగా లైటు స్తంభం ఉంటుంది. దాని మీద ఆ వూరుపేరు ఉంటుంది. మధ్యగా పురుషులు కూర్చొను బల్ల ఉంటుంది. దానిమీద ఒకవ్యక్తి పేపరు చదువుకుంటూ ఉంటాడు. 25 సం॥ వయస్సు. అతనిపేరుగోపాల్. కొద్దినిముషాలలో రామయ్య ప్రవేశం. వయస్సు 60 సం; పంచె, చొక్కా, పై మీదకండువాతోఉంటాడు. ఒకచేతిలో గొడుగు, మరొకచేతిలో మరచెంబు ఉంటుంది. విసుగు, కోపం ముఖంలో ప్రస్ఫుట మవుతూంటాయి. వెనుకనే నౌకరు మల్లిగాడు ప్రవేశం. బనీను, మోకాళ్లవరకూ పంచె ధరించి ఉంటాడు. రామయ్య తనచేతిలోని మర చెంబు బల్లమీదపెట్టి గొడుగు దానిమీద పెడతాడు. ఏదో గొణుగుతూ:

రా : నాసంగతి వీళ్లకింకా తెలియదు. ఇంతమోసంచేస్తారా నన్ను. చూస్తాను. చూపిస్తాను నా తడాకాఖా. ఈ చుట్టుపక్కల గ్రామాల్లో నా మాటకు ఎంతవిలువ, ఎంత గౌరవం. ఎంత ఆదీ, ఎంతఇదీ. ఏవో కల్లబొల్లి కబుర్లు చెపితే బస్ అయిపోతాననుకున్నారేమో! (వెనక్కి తిరిగి నౌకరుతో) ఒరే మల్లీ ! వాళ్ల వస్తున్నారేమోచూడు!

మ : నేదు బాబయ్యా! ఆ ళ్లవుడే ఎనక్కి తిరిగి పోయినారు బాబూ!

రా : ఒరే మల్లీ! ఆడవాళ్ల బళ్ళన్నీ వచ్చాయిరా స్టేషనుకి?

మ : బళ్ళు దిగుతున్నారు బాబూ!

రా : అబ్బాయి ఏడిరా?

మ : అదిగో బాబూ! ఇటే వత్తున్నారు (అని చూపుతాడు)

రా : ఒరే మల్లీ! నీవువెళ్లి ఆడవాళ్లందర్నీ వెయిటింగ్‌రూమ్‌లో కూర్చోబెట్టి, సామాన్లన్నీ జాగర్తగా దింపించు. అన్నీ మొత్తం లెక్కచూడు!

మ : చాకలోళ్లు ఉన్నారుగా బాబూ దింపడానికి.

రా : హా! అలాగా! ఇదిగో నువ్వెళ్లు ఇంటికి!

మ : ఎందుకు బాబూ?

రా : చాకలివాళ్ళున్నారుగా పనిచెయ్యడానికి. ఇక నువ్వెందుకు?

మ : అదేంటి బాబూ!

రా : లెఖ్ఖరా! వాళ్ళున్నారు కదాని నువ్వు మానేస్తావా? నీ బదులు వాళ్ళు తింటారులే తిండి. ఏం! నువ్వు తినకు.

మ : మరి నా కాకలి ఎయ్యదుటండా?

రా : (విసుగుతో) ఒరేమల్లీ ! నన్ను విసిగించకురా! వెళ్ళు. ఆసామానులన్నీ జాగర్తగా దింపించి లెక్కపెట్టు.. (అనితన జేబులోంచి ఒక పొడుగాటి కాగితంతీసి) ఇదిగో. ఇదితీసుకువెళ్లి దీనితో పోల్చెయ్యి.అన్నీ సరిగ్గా విడిదినుంచి చేరాయో లేదోచూడు. దీనిమీద అన్నీ లిస్టువేశాను. మొత్తం 71 సామానులు. మళ్లీ మర్చిపోతావు. మా వెంకన్న ఉంటాడు వాడిచేతచూపించు.

మ : చిత్తంబాబూ (పోతూంటాడు. కాగితంతీసుకొని)

రా : ఒరే ఆ కాగితం జాగర్త. మళ్లీ తెచ్చి నా కివ్వాలి.

మ : చిత్తం! (నిష్క్రమణ)

(పెళ్లికుమారుని వేషంలో కొడుకు సూర్యం ప్రవేశం. దిగులుగా ఉన్నట్లుంటాడు. బల్లమీద కూర్చుంటాడు. పేపర్ చదువుతూ అక్కడే ఉన్న గోపాల్ చూసి, సూర్యాన్ని గుర్తుపట్టి, పేపరులో తలదాచుకొని ఏమీ గమనించనట్లూరుకొంటాడు)

రా : (కొడుకుతో) అదేమిరా సూరీ! అలాగున్నావు? ఏం! బెంగపెట్టుకొందా పెళ్లికాదని! ఇదిగో తొందర్లోనే ఒక మాంచి ముహూర్తంలో మంచి సంబంధ మొకటి చూసి గర్భాధానంకూడా జరిగేలా చూస్తాను.నీవేమీ దిగులు పడకు. నా సంగతి వీళ్లకింకా తెలియదు. వేమవరంలో పంచాయితీ బోర్డు ప్రెశిడెంటుగా పేరుపడ్డ సూరయ్య గారి కుమార్డు ఈ రామయ్య సంగతి వీళ్లకింకాతెలీదు. అర్భకులు. పోనీలే. ఈ సంబంధంకాకపోతే మరొకటి! ఎన్నిరాలేదు! ఎన్నిపోలేదు. వాటిలో ఇదొకటి అనుకుంటేసరి.

సూ : కట్నంగురించి మీకు అంత పట్టింపు ఎందుకునాన్నా! మీ బాల్యస్నేహితుడు కూడాను ఆయన. అటువంటప్పుడు వాళ్లకీ మనకీ మధ్య కట్నాలేమిటి?

రా : స్నేహితుడేలే. అయితే మట్టుకు కట్నం పుచ్చుకోకూడద నేముంది. స్నేహానికి స్నేహమే. ఈరోజుల్లో బంధువుల్లోనే కట్నాలు ఇచ్చి పుచ్చు కుంటుంటే స్నేహితుల సంగతి మాట్లాడుతావేమిటి? నాకు ఏమీ తెలియనట్లు!

సూ : మనకి కట్నం ఎందుకు చెప్పునాన్నా! ఉన్న ఆస్తి చాలదా!

రా : నువ్వు కాదుగా కట్నం తీసుకొనేది, పెళ్లిపీటలమీద కూర్చోవటం వరకే నీ బాధ్యత. మిగతా విషయాలు పెద్దవాళ్లే నేను చూసుకుంటాను. అయినా, కట్నం వద్దంటావేమిట్రా పిచ్చివాగన్నా! డబ్బుచేదా! ఇకపోతే, ఇవ్వటం వాళ్ల విధాయకం, పుచ్చుకోవటం మన విధాయకం.మనకీ

ఆడపిల్లలుంటే మనం ఇవ్వమా? వాళ్లకీ మగపిల్లలుంటే వారు పుచ్చుకోరా? నీకూ ఇంకా చిన్నతనంపోలేదురా అబ్బీ.

మా : ఈ కట్నాలు ఇవ్వటం, పుచ్చుకోవటం పెద్దజబ్బై పోయింది నాన్నా! ప్రతీవాళ్లకీ. వీటివల్ల ఎన్ని పచ్చని సంసారాలు అప్పులపాలై చితికి పోతున్నాయో మనం చూడటంలేదూ! ఈ రోజుల్లో ఆడపిల్లలకు పెళ్లిళ్ల చేయలేక సంవత్సరాల తరబడి అట్టే పెట్టుకొని నిప్పు పోయంగా కుమిలి పోతున్న కుటుంబీకులను గురించి కాస్త ఆలోచించండి. అన్నీ తెలిసున్నవాళ్లం మనమే అజ్ఞానంలో పడితే ఏలా! వాళ్లదగ్గర కట్నం తీసుకుంటే గానీ మనకు రోజుగడవదా నాన్నా!

రా : శేష్! శేష్! ఉపన్యాసం చాలాబాగుంది. ఓరి వెర్రి సన్యాసీ, జరగదనికాదు, కట్నంతీసుకోవడం. కట్నం తీసుకోవడం ఒక ఆచారంకనుక తీసుకోవడంలో తప్పేమీలేదు. కట్నం, కానుక అన్నారు పెద్దలు. మనం గుడికివెళ్తే దేముడికి కానుక ఇవ్వటంలేదూ, అలాగే ఆడపిల్ల తనకుకాబోయే భర్తకు కానుకగా కట్నం ఇవ్వాలన్నమాట. అందుకనే స్త్రీకి భర్త ప్రత్యక్ష దైవ మన్నారు.

మా : మీ వ్యాఖ్యానం చాలా బాగుంది. నీచమైన వరకట్నాన్ని పవిత్రమైన దేమునికానుకతో పోలుస్తారా? ఇంతకన్నా అన్యాయం మరొకటి ఉండదు నాన్నా!

రా : కట్నం, కానుక అని ఎందుకన్నారో చెప్పాను; నీకు తెలియదు కనుక చెప్పాను. నాకు నీతులు చెప్పుతున్నావా? మరి మా అప్పుట్లు ముచ్చట్లూ ఏలా తీరుతాయి. నువ్వా, నాకు ఒక్కగా నొక్క కొడుకువి. నేను చేసేపెళ్లి ఇది ఒక్కటే గదా నా జీవితంలో.

మా : నాన్నా! కట్నం తీసుకుంటేనేగానీ అది పెండ్లికింద లెఖ్క కాదా! ఒకనాడు పెళ్లిలో ఒకరంటే ఒకరికున్న అభిమానంకొద్దీ ఇచ్చుకొనే కానుకలు ఈనాడు వ్యాపారంగా మారాయి......(నచ్చచెప్పే ధోరణిలో) నాన్నా!

రా : ఏం! నాన్నా!

మా : నీవు తొందర పడ్డావు నాన్నా!

రా : ఒరే! ఒరే! ఏమిటిరా నీ వంటున్నది.

మా : నీవు కొంచెం ఆలోచించి ఒక నిర్ణయానికి రావలసింది.

రా : ఏమిట్రా నువ్వనేది? గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందిట. అలాగుంది నీ తంతు. ఇదిగోచూడు. నేను ఆలోచించకుండానే నిర్ణయించా నంటావు. నా ఆలోచన సంగతి నీకు తెలియదు. మనింటికి రోజూ ఎంతమంది వస్తూంటారు.

మా : ఎందుకు?

రా : ఎందుకేమిట్రా! ఆలోచనల కోసం. నా సలహాలకోసం.

మా : ఆఁ! ఎరుగుదును. మన బుర్రలు ఒకరికి సలహా లివ్వటానికేగాని స్వప్రయోజనాలకి పనికిరావు.

రా : ఇదిగోచూడు! పిల్లకాకికి ఉండేలుదెబ్బ సంగతేం తెలుసు? నా సలహాలకి ఆలోచనలకు సుప్రీంకోర్టుకు వెళ్లినా తిరుగులేదు. ఇదిగోచూడు. నామాటవిని ఏ బెంగా పెట్టుకోకు, పెళ్లికాదని. నా ఆలోచన సంగతి నీకు ఇప్పుడు అర్థం కాదులే. ఇంకా కొన్నాళ్లు పడుతుంది.

మా : అది కాదు నాన్నా!

రా : ఏదికాదురా.

మా : వాళ్లు సమయానికి డబ్బు సర్దుబాటు కాలేదని ఇవ్వలేక పోయారేకాని, వంచన పూర్వకంగా చేశారంటావా?

రా : ఒరే. నువ్వు ఎన్నైనా చెప్పు. నేను మాత్రం నమ్మను. వినను. అయినా వాళ్లుచెప్పిందాంట్లో ఎంతవరకూ నిజముందో నీకేం తెలుసురా. కుర్ర సన్యాసివి.

మా : ఆ నిజమేదో మీకు తెలిసిందనుకుంటాను.

రా : ఆఁ! అవునురా. నాకు తెలిసింది కాబట్టే ఇలాచేశాను. నేమా, ఆ నాడే అనుకున్నాను వీళ్లేదో చేసేలాఉన్నారని.

మా : వాళ్లేం చెయ్యలేదు. నీవే చేశావు.

రా : నువ్వు నోరుముయ్యరా పక్షీ. నేను చేసిందేమీలేదు. ఇకముందుంది చేయవలసిందంతా.

మా : నాన్నా!

రా : ఏం.

మా : నీవు పరిస్థితిని అపార్థం చేసుకున్నావు నాన్నా!

రా : అలాగా నాన్నా! (వ్యంగ్యంగా)

మా : అవును.

రా : ఎట్లా! ఒరేమారీ! ఇదిగోచూడు. నీకు అర్థమైంది ఏమిటో ఏడవరా!

మా : ఎవరు ఏమి ఏడ్చినా నీకు అర్థంకాదు నాన్నా! నీకే పెళ్లి కావలసిన ఒక కూతురు ఉందనుకో.అప్పుడునీకు ఈపరిస్థితి వస్తే ఎలా ఉంటుందో ఊహించు. నీకు అపుడు అర్థమవుతుంది.

రా : మాట అంటే మాటేరా. అనగానే సరికాదు. అన్నమాట మీద నిలబడాలి. పోనీ, నీ మాటకేవద్దాము. నాకే నిజంగా ఆ పరిస్థితివస్తే తల తాకట్టు పెట్టైనా మాట దక్కించుకొంటాను. ఆ పరిస్థితి నాకు రాదులే.

మా : అవును. పూర్వులు ఇంత గడించిపెడితే ఎవరైనా చెబుతారు కబుర్లు.

రా : ఏమిటోయ్ చెబుతున్నావు పెద్దకబుర్లు. పెళ్లిఅంటే మాటలా. ఎంత వేడుకగా జరగాలి పెళ్లి అంటే.

మా : పెళ్లిఅంటే ఒక్కనాటి ముచ్చట కాదు—నూరేళ్లపంట అని నీవే అంటావుగా. మరివాళ్లు ఉన్నంతలో వేడుకగా జరుపుతోంటే ఎందుకింత రభస చేశావు.

రా : ఒరే. పెళ్లిఅంటే నీ కేమితెలుసురా? పల్లకీలో ఎక్కి ఊరేగడ మనుకున్నావు కాబోలు.

మా : అవును.

రా : నాకు తెలుసురా. ఒరే నీమట్టుకునీవు నీ జీవితంలో ముచ్చటగా మూడుపెళ్లిళ్లైనా చూశావా?

మా : లేదు. మీరే చూశారు పాపం మూడుపెళ్లిళ్లు. నే నేం చూశాను?

రా : ఆఁ! చూడకేం, చూసే ఉంటావు. ఏ స్నేహితులపెళ్లిళ్లో! ఆపెళ్లిళ్ల రిజిస్ట్రారు ఆఫీసులో నిలబడి ఒకరి మెడలో మరొకరు దండలు వేసుకొంటే చూసి ఉంటావు. నీకు మరి అదే గొప్పపెళ్లి. అవునా!

సూ : అవును. ఈ కరువురోజుల్లో గొప్పలకి పోయి అనవసరంగా డబ్బుఖర్చుచేసేకంటే ఆ మాదిరిపెళ్లే ఎంతోమేలు.

రా : అవునురా. నీ బుర్రలో పాతుకు పోయాయిరా వెధవ బుద్ధులు. ఈ చదువుల్లుచదివి ఎంతో ఉద్ధరిస్తారని ఏదో(తవ్వి తలకెత్తుతారని ఆశపడి నాలాంటి తండ్రులు చదివిస్తే వాళ్ళు చెప్పే నీతులు ఇవిరా. (నోరునొక్కుకొని) అవ్వ! మా కాలంలో మే మెరుగుదుమా ఇవన్నీ.

సూ : మీ మాట నేనేమి కా దన్నాను నాన్నా! కాస్త ఆలోచించ మన్నానుకానీ!

రా : ఆలోచించాను కాబట్టే ఇలాచేశాను. అంతెందుకు మొన్నజరిగిన మీ మామయ్యపెళ్లి నీవు చూడలేదు కానీ, ఎంత వేడుకగా జరిగిందనీ.

సూ : ఆ వేడుకలన్నీ బాగా ఉన్నవాళ్ళకి నాన్నా.

రా : పోనీ, నే ఒప్పుకొంటాను. అన్నమాటప్రకారమేనా జరిపించాలా! వద్దా!? ఒరే నీ కేమీ తెలియదురా! ఒకసారి మీ నాయనమ్మను అడిగిచూడు చెపుతుంది. నా పెళ్లి ఎలా జరిగిందో, మీ తాతపెళ్లి ఎలాజరిగిందో చెపుతుంది. ఒరే లాంఛనాలన్నీ సక్రమంగా జరిగితే నలుగురూ గొప్పగా చెప్పు కుంటారురా, ఫలానాపెళ్లి ఇంత గొప్పగా జరిగిందని.

సూ : ఆఁ! అంతకంటే గొప్పగానే చెప్పుకుంటారు మీ రిప్పుడు చేసిన పనిని.

రా : నే నేంచేశానురా చెప్పుకోడానికి! అన్నమాట వాళ్లే నిలబెట్టుకోలేక పోయారు.

సూ : నాన్నగారూ!

రా : ఏం!

సూ : మాట్లాడితే వాళ్ళు అన్నమాట నిలబెట్టుకోలేక పోయారని అంటున్నారు. ఏమిటది మీరు నిలబెట్టుకొన్నది, వాళ్ళు నిలబెట్టుకో లేనిదీను?

రా : ఒరే, ఏమీతెలియని పసివాడిలా అడుగుతావేరా. అయితే చెబుతావిను. ఏదోనీకు పిల్ల నచ్చిందికదాఅని, వాళ్ళు కట్నం మనతాహతుకు తగ్గట్టు ఇచ్చుకోలేకపోయినా ఒప్పుకొన్నాను. ఎందుచేతా? పిల్ల సలక్షణంగా ఉంది. వంశ మర్యాదలు మంచివని. కట్నంతక్కువైనా ఒప్పుకొన్నానా! పైగా ఆనాడే చెప్పాను. లాంఛనాలన్నీ సకాలంలో సక్రమంగా జరగాలని. ఆ షరతుమీద సరనంటే సరేనన్నా.

సూ : ఇపుడు మాత్రం వాళ్ళు ఇయ్యనన్నారా నాన్నా!

రా : ఒరే, వేడుక అంటే ఏమిటిరా? అదే! ఏదిఎపుడుజరగాలో అదిఅపుడు జరిగితేనే వేడుక అంటారు. అవసరానికి లేనిది తర్వాత ఎందుకురా, అడుక్కుతినను. అందుకనే నీకుతెలియదు, నోరు ముయ్యరా అన్నాను. ముద్దు ముచ్చటలు తెలియవు ముఖానికి, మళ్లీచదివాడు, పేద్ద చదువు. ఎందుకో?

సూ : సర్దుబాటు కాలేదని కావాలంటే కాగితంమీద నోటు వ్రాసిఇస్తామని ప్రాధేయ పడ్డారుగా.

రా : కాగితా లేమి చేసుకుంటామురా! వాటితో నాలిక గీసుకుంటామా?

సూ : మళ్లీ అదే మాటంటే ఎలానాన్నా!

రా : మరి, ఇంక ఎలాగ నాన్నా!

సూ : (విసుగుతో) ఏలాగో నాకు తెలియదు, నేనుమాత్రం మీతో ఊరికి రాలేను. ఈ సాయంకాలం బండికి ఇటు నుంచి మద్రాస్ పోతాను.

రా : ఏం, ఎందుచేత?

సూ : నాకు చిన్నతనంగా ఉంటుంది. పెళ్లికుమారుడిగావెళ్లి సతీసమేతంగా తిరిగివెళ్తే బాగుంటుందికానీ........

రా : ఓహో! నిన్ను తలకొట్టిమొలేస్తారా ఏం, పెళ్లాన్ని తీసుకు రాలేదని!

సూ : ఏదిఏమైనా నేను మాత్రంరాను.

రా : బెదిరిస్తున్నావా? మరేం ఫర్వాలేదు. నీవు మద్రాసే వెళ్తావో మరోవూరే వెళ్తావో వెళ్ళు. కానీ కాస్త ఎడ్రస్‌మాత్రం ఇచ్చివెళ్ళు.

(నౌకరు మల్లిగాడు ప్రవేశం)

మరో సంబంధం ఖాయపర్చుకొని తెలియ పరుస్తాను. ఆ వేళకివచ్చి ఆ మూడు ముళ్ళు వేద్దువుగాని.

మ : (అమాయకంగా) ఎవరికి బాబూ!

రా : అబ్బాయికేరా!

మ : ఆ సంబంధం కూడా ఇలాగైతేనో.

రా : నువ్వు నోరుమూసుకోరా. శుభం పలకరా మంకెన్నా అంటే పెళ్లికూతురుముండ అన్నాట్ట ఎవడో. అలాగుంది నీ వరస.

మ : చిత్తం.

సూ : నాన్నగారూ! (రామయ్య ఏం! అన్నట్లుచూస్తాడు) మూడుముళ్ళు వెయ్యటంవరకేనా నానని.

రా : ఆఁ! అంతే నీపని.

సూ : వేరే బాధ్యతలే లేవన్నమాట.

రా : ఒరే కొడుకుగా నీ బాధ్యత అంతేరా! తండ్రిగా మిగిలిన బాధ్యతలన్నీ నావి.

సూ : ఆ మూడుముళ్ళువేసే పనికూడా మీరే చేసెయ్యరాదూ.

మ : (నవ్వుతూ) మా బాగా సెప్పేరుండా!

రా : నువ్వు నోరు ముయ్యరా!

మ : చిత్తం.

రా : ఒరే సామానులన్నీ భద్రంగా చేరాయిరా? ఏదీ లెక్కచూసి అలిస్టు.

మ : మరచెంబు కనపట్టం లేదుండా!

రా:—లేదూ (ఆత్రుతగా)

మ:—వూహూ!

రా:—ఇంకా నిలబడి చూస్తావేంరా. వెళ్ళు. ఆ వీడిదిలో మర్చిపోయారేమో. వెతికి తీసుకురా.

మ:—(పోతూంటాడు)

రా:—ఒరే! ఒరే! ఆగు. దానిమీద ఏది, మా తాతగారిపేరు "గో. వె. నా." అని ఉంటుంది; చూసితీసుకురా.

మ:—నా కాఅచ్చరాలు రావు బాబూ! ఏరే గుర్తుంటే చెప్పండా!

రా:—ఆ చెంబుమీద సొట్టపడిందిరా!

మ:—సొట్టచెంబాండి!

రా:—అవును.

మ:—చిత్తం (పోతూంటాడు)

రా:—ఒరే, ఏదో ఒక సొట్టచెంబు పట్టుకు వస్తావేమిటి.

మ:—మరి చెప్పారుగదుండా సొట్టచెంబని.

రా:—ఓరి దేవయ్యా! తెల్లచీర కట్టుకున్నవాళ్ళంతా నా పెళ్ళాలన్న చామెతగాఉంది నీ తంతు.

మ:—(నవ్వుతూంటాడు)

రా:—ఇంకా నిలబడ్డావేంరా! పో. తగులడు. ఆ అక్షిర్మని తీసుకెళ్ళు. గుర్తు చెపుతుంది. అది చదివి చెపుతుందిలే ఆ అక్షరాలేవో.

మ:—ఓరుబాబూ!

రా:—అదేరా నీ పెళ్ళాం.

మ:—అదాబాబూ! (అనుమానంగా)

రా:—ఏం?

మ:—నన్నాడికి తీసుకెళ్లి ఏడిపిత్తాదిబాబూ నదువుకోలేదని. ఆళ్లందరిముంద్రా నన్ను సిన్నబుచ్చుతాది బాబూ.

రా:—అబ్బబ్బ. ముందువెళ్ళిరారా! మళ్లీ దొరకదేమో. అక్కడ ఎవర్నేనాచూసి ఇవ్వమను. వెధవది నీతో ఇదో గోల!

మ:—మన బుల్లెమ్మగోర్ని తీసుకెళ్తానండి!

రా:—అలాగే. ఏదో ఏడు.

మ:—చిత్తం (పోతూంటాడు)

రా:—ఒరే ఇటు చూడు. దాని మెళ్లో నగలున్నాయి భద్రం. జాగర్తగా తీసుకెళ్ళి తీసుకురా!

మ:—చిత్తం (నిష్క్రమణ.)

(అక్కడ పేపరు చూస్తూ బల్లమీద కూర్చున్న ఆయన ఒకమాటు పేపరు ముఖానికి అడ్డుగాతీసి బల్లమీదేఉన్న మరచెంబుచూసి నవ్వుతూ)

గోపాలం:—ఇదిగోనండి మీ చెంబు.

సూ:—(ఆశ్చర్యంగా చూసి) గోపీ!

గో:—(సూర్యానికి మాట్లాడవద్దని కన్నుగీటి సైగ చేస్తాడు)

రా:—ఏదీ! (అని చెంబుచూసి) అరి దీని తస్సాదియ్యా! ఇక్కడే ఉంది. నా మతిమరుపుమండా. వీళ్ళు ఆ వీడిదిలో మర్చిపోతే నేనే ఆఖరున చూసి తీసుకువచ్చాను. మళ్ళీ ఇంతలోనే ఎంత గొడవ తెచ్చింది చెంబు.

గో:—ఎడంచేతో ఇక్కడపెట్టిఉంటారు బహుశా! అందుకని గుర్తు వచ్చిఉండదు.

రా:—ఆ! అయిఉండవచ్చు. (గోపాలంకేసి పైకీ కిందకీ చూసి) మీది ఏవూరూ నాయనా!

గో:—అమలాపురమండి.

రా:—ఏమిటీ! అమలాపురమా! ఎవరబ్బాయివి?

గో:—అనసరాల అబద్ధాలయ్యగారి అబ్బాయిని. పేరు గోపాలం. ఉద్యోగం చేస్తున్నాను. పెళ్లి అయింది. చాలా వివరాలు?

రా:—అయిందీ పెళ్లి. చాలు. ఇకచాలు. బుద్ధిమంతుడివి.

గో:—ఆ మాట మావాళ్ళంతా అంటుంటారండి.

రా:—నిన్ను చూస్తుంటేనే తెలుస్తోంది. చూసిరమ్మంటే కాల్చివచ్చే రకమని.

గో:—మీపేరు చెప్పండిమరి.

రా:—నాపేరు రామయ్య. ఇదిగో ఈ చవట నాకొడుకు సూర్యం. (అని కొడుకును చూపుతాడు)

గో:—ఇందాకటినుంచీ ఏమిటండి గొడవ పడుతున్నారు?

రా:—చెపుతా వినుబాబూ! కాస్త గడ్డి పెడుదువుగాని మావాడికి. వీడికో పెళ్లి సంబంధం చూశాను. పిల్ల నచ్చిందన్నాడు. సరే మాకూ నచ్చింది. ఇకపోతే కట్నం. నా అంతస్థుకి, వీడి చదువుకీ తగ్గట్టుగా కట్నం తీసుకోవాలంటే, ఏది, అధమపక్షం పదివేలుచూసుకో. కానీ వీడికీ మాకూ కూడా ఆ అమ్మాయి నచ్చిందీ. బుద్ధిమంతురాలిలాఉందని, పైగా ఈరోజుల్లో కట్నం పుచ్చుకోవడం తప్పే కనుక ఏదో లాంఛనప్రాయంగా, ముచ్చటగా ఉంటుందని మూడువేలకే ఒప్పుకొన్నాను. సబబుగాఉందా?

గో:—ఓ! ఫస్టుక్లాస్‌గా ఉంది.

రా:—ఉందా! మరి వాళ్ళు అన్నమాట నిలబెట్టుకోవాలా?

గో:—ఎవరు?

రా:—వాళ్ళేనయ్యా! పెళ్లివారు. ముచ్చటగా పెళ్ళికని తరలివస్తే, పోనీ ముందైనా చెప్పాలా "బాబూ కట్నం బాపతు డబ్బు సర్దుబాటుకాలేదని". ఊహూ! లేదు. పైగా ఆ టైము వచ్చేదాకా వూరుకొని వెర్రిముఖం వేసుకొని నావు కబురు చల్లగా చెప్పినట్లు "డబ్బు సర్దుబాటు కాలేదు" అని చెప్పారు. కాగితంమీద నోటువ్రాసియిస్తారుట! కాగితం! వాలిక గీసుకోవడానికైనా పనికిరాదు.

గో:—పోనీ చేసుకోవలసింది. నోటువ్రాసియిస్తామన్నారుగా!

రా:—ఆ మంచితనం చూపడంవల్లనే వాళ్ళు ఇంతకు తెగించగలిగారు.

గో:—ఏమిటది?

రా:—(దగ్గరకువెళ్ళి) కట్నం తీసుకోవడం, తప్పు! అవునా?

గో:—అవును.

రా:—పిల్లవాడికి నచ్చనిపిల్లని చేసి వాడి జీవితం పాడుచెయ్యడం తప్పు! అవునా?

గో:—అవును.

రా:—వాళ్ల కష్టసుఖాలు తెలిసిఉండికూడా ఎక్కువ కట్నం కోసం నిర్బంధించడం

గో:—తప్పు!

రా:—అవునా! మరి అందుకనే నేను ముందే చెప్పా. లాంఛనాలన్నీ సక్రమంగా సకాలంలో జరిపించాలని! అలా జరిపించకపోవడం.

గో:—తప్పు.

రా:—నా విషయమేమిటంటే! మాట ముఖ్యం. అన్నమాట ప్రకారం జరక్కపోతే తంతేసేసినట్లవుతుంది. ఎంత చిన్నతనం.

గో:—కాదుమరి!

రా:—పైగా నా బంధువులు, మిత్రులు ఎదుట ఎంత చిన్నతనం?

సూ:—(కోపంగా) ఎందుకూ?

రా:—ఎందుకా! కట్నం ఇంత అని చెప్పి తీరా ఆ టైముకి పేచీలు వస్తే వాళ్ళందరి ఎదుటా చిన్నతనంకాక మరేమిటి? అసలు నీకేం తెలుసురా! నే నెంత కట్నం తీసుకున్నానో తెలుసా? 5 వేలు.

గో:—అంతేనా?

రా:—ఈ రోజుల్లో పదిహేనువేలకి సమానం.

గో:—అవును.

రా:—మా నాన్న ఎంత కట్నం తీసుకున్నాడో తెలుసా?

గో:—ఎంత?

రా:—5 వేలే. అంటే అప్పుడు 5 వేలంటే ఈరోజుల్లో......

గో:—ఇరవై వేలకి సమానం.

సూ:—(విసుగ్గా) అయితే వాళ్లందరూ తీసుకున్నారని ఇప్పుడు నీవూ తీసుకుంటావన్నమాట?

రా:—ఒరే! నీ కేమితెలుసురా! ఈ నాడు నీ విలా నా ఎదుటబడి నిర్భయంగా మాట్లాడుతున్నావుగాని నేను మా నాన్న ముందర కిమ్మనకుండా ఉండేవాణ్ణి. మా నాన్న అంతేట. వాళ్ల నాన్నా........

సూ:—అంతేగా! ఇక కట్టిపెట్టండి మీ సోది.

రా:—ఏమిటిరా కట్టిపెట్టేది. సోదిట, సోది! ఒరే నాయనా నీకు సోదిలానే ఉంటుంది. లక్షణమైన పిల్లని చూసి వంక్షణంగా జరిపిస్తాను చూడు!

సూ:—ఏమిటి?

రా:—పెళ్లిరా!

సూ:—ఆఁ! జరిపిస్తారు. ఇది ఇంత అందంగా జరిగిందిగా. మరొకటి కూడా ఇంతకంటే బాగా జరిపించుకోండి. నాకు మాత్రం ఏమీ తెలియపర్చ నక్కరలేదు. ఇకపై నా పెళ్లి విషయంలో మీరు జోక్యం కలిగించుకోనవసరంలేదు.

రా:—ఏమిటీ! అసలు ఇకపై పెళ్లే చేసుకోనన్నమాట. జీవితమంతా బ్రహ్మచారిగానే ఉంటావేమిటిరా?

సూ:—ఆ!

రా:—ఆహా! (గోపాల్ తో) చూడునాయనా! ఆ నాడు ఆ భీష్ముడేచేశాడు. ఈ నాడు మావాడు చేస్తున్నాడు-ప్రతిజ్ఞ. ఒరే నువ్వూ నేనూ జోక్యం కలిగించుకోనక్కరలేదురా. మన ఇంటిచుట్టూ తిరుగుతారుచూడు రేపటినుంచి మా పిల్లనిస్తామంటే మా పిల్లనిస్తామని.

గో:—మా ఇంటికి కూడా అలాగే తిరిగారండి నా కోసం. కానీ మా నాన్నగారు కూడా మీలాగే ఖచ్చితంగా ఇదిగో ఇది ఇలా జరగాలి. అది అలా జరగాలని నిక్కచ్చిగా చెప్పి ఖాయం చేసుకొనివచ్చి నాతో ఒరే అబ్బాయీ నీ పెళ్ళి కుదిర్చానురా అన్నారు.

రా:—నీవు వెళ్లి ఆ మూడు ముళ్ళు వేశావు. అంతేనా!

గో:—అంతే? అంతే!

రా:—నాకు తెలుసునాయనా. నీవు బుద్ధిమంతుడవని. పితృవాక్యపాలనఅంటే (కొడుకుతో) ఇలా ఉండాలి. (గోపాల్ తో) మా వాడూ ఉన్నాడు. (కొడుకుతో) ఈయన్నిచూసియైనా నేర్చుకోరా కాస్త బుద్ధి.

సూ:—అదేదో మీరే నేర్చుకోండి.

రా:—ఏమిటీ! ఎంతమాటన్నావు. ఒరే! నీ తండ్రినిరా. నిన్ను కనిపెంచామురా. పోషించి పెద్ద చేశామురా. ఈ నాడు నన్ను ఎదిరిస్తున్నావురా!

సూ:—నాన్నా! నే నేమీ మిమ్మల్ని ఎదిరించటంలేదు.

రా:—మరేమిటిరా! ఇంకేమి ఎదిరించాలిరా! నన్ను నేర్చుకోమన్నావు. ఆ మాట చాలదూ?

గో:—తప్పు సోదరా! పితృదేవోభవ అన్నారు పూర్వులు.

సూ:—(విసుగ్గా) ఏమిటిరా ఇదంతా. నీగోల! నన్ను పిచ్చివాడిగా జమకట్టేనా?

రా:—ఒరే! ఒరే! ఏదో పోనీకదా వింటావని ఏదో చెపుతోంటే అమర్యాదగా మాట్లాడుతావా ఈయనతో. చూడు ఈయన్ని చూసియైనా కాస్త వినయం నేర్చుకోరా ఎవరితో ఎలా మాట్లాడాలో. ఆయన సోదరా అంటే నువ్వు ఏమిటిరా! అంటావా! ఎంత తప్పు.

సూ:—నీకు తెలియదు నాన్నా! వీడు.......

రా:—అదిగో మళ్లీ అదేమాట. ఇకచాలు. నన్ను అమర్యాదపాలు చేశావు. పైగా ఈయన్ని కూడానా! (గోపాల్ వైపు తిరిగి) ఇదిగో నాయనా. వీడికి బుద్ధి, జ్ఞానంలేవు. ఒట్టి తెలివి తక్కువ సన్యాసి. ఎవరు ఎన్ని చెప్పినా తలకెక్కదు. నీవు పూరుకోనాయనా ఏమీ చెప్పవద్దు.

గో:—నేను మీ అబ్బాయితో చెప్పి ఒప్పిస్తానులెండి. (సూర్యం వైపు తిరిగి కన్నుగీటి) సోదరా! లోకంలో తల్లి, తండ్రి, స్నేహితుడు వీరు ముగ్గురే హితులని నీవు చదువుకోలేదూ! పోనీ నీ తండ్రిమాట వినవద్దు. స్నేహితునిగా నా మాటవిను. తండ్రిమాట కాదనకు. నీ హితంకోరి చెపుతున్నాను. ఆయన్ని బాధపెట్టకు. ఆయన చెప్పినట్లు విని పెళ్ళి చేసుకో.

సూ:—ఏమిటిరా! నీగోల?

రా:—(కోపంగా) అప్రాచ్యుడా! మర్యాద తెలియదురా నీకు? ఆయన అంతగా చెపుతోంటే నీకు బోధపడటంలేదురా! హాఁ! నీకు ఎందుకు బోధపడుతుందిలే!

గో:—సోదరా! కొడుకుగా నీ బాధ్యత నీ తండ్రి యెడల నిర్వర్తించు. నీ తండ్రిమాట విను.

రా:—అలా చెప్పినాయనా కాస్త బుద్ధి. ఆనాడు ఆ శ్రీరామ చంద్రుడేంచేశాడు.

గో:—పితృవాక్యం పరిపాలనకై 14 సం. వనవాసం చేశాడు.

రా:—ఊఁ! కైకేయి తండ్రిని వరాలు అడిగిందని తెలుసుకున్నాడు. తండ్రి వరమిచ్చిన విషయం తెలిసింది. అంతే, నారబట్టలు ధరించి అడవులకు వెళ్ళేడు. అటువంటి కొడుకును కన్న తండ్రి ధన్యుడు. మీ తండ్రిగా రెవరోకాని అయినా ధన్యుడే.

మ:—(నౌకరు ప్రవేశం) ఎవరుబాబూ దన్యుడంటున్నారు!

రా:—మరచెంబు ఇక్కడే ఉందిరా (అని చూపుతాడు)

మ:—బలేవారండి మీరు. అదంతా ఎతికి సచ్చినాను.

రా:—అదిసరేకాని, వాళ్ళేం చేస్తున్నారురా?

మ:—వోరుబాబూ.

రా:—వాళ్ళేరా! ఆ పెళ్ళివారు.

మ:—మా ఎనకాతలే వత్తున్నారు బాబూ!

రా:—(కంగారుగా) ఎవరురా?

మ:—ఆరే బాబు! కోడలుగారితండ్రిగారు. ఇంకా ఎవరో కరణం గారంట! అరూ వత్తున్నారు.

రా:—(కోపంగా)కోడ లెవరురా! కోడలుట!కోడలు.పెళ్ళికాకుండా?

మ:—జరిగేదే కదుండా! పెళ్ళి. కానీ......(నసుగుతాడు)

రా:—నోరుముయ్యరా!

మ:—శిత్తం! (కొంతసేపు ఆగి) బాబూ! అమ్మగారు పిలుత్తున్నారు.

రా:—ఎందుకూ?

మ:—నాకేం తెలుసుబాబూ! ఏదో మాట్లాడుతారంట. పెద్దమ్మ గోరు కూడా సెప్పమన్నారు.

రా:—వాళ్ళేం చెప్పేది నాకు తెల్సు. బోడి ఆలోచనలూ వాళ్ళూనూ. (గోపాలంవైపు తిరిగి అతనితో వినక పోయినా) కట్నం లేకపోతేఏం? పిల్లే డబ్బనుకోండి. పిల్ల సాక్షాత్తూ లక్ష్మీదేవిలాఉంది అని ఉపమానాలు చెపుతున్నారు ఆ ఆడవాళ్ళంతా కలిసి. పిల్లని ఏదో అడిగినట్టు. ఇదిగో నీవు పోయి (కొడుకుతో) వాళ్ళని మాట్లాడకుండా ప్రయాణం అవమను. వాళ్ళేం చెప్పినా వినేదిలేదు. నా ఇష్టం వచ్చినట్టు జరగాలి. నేను మాట అనను. అన్నానా అంతే! జరిగితీరాలి.

సూ:—నేనూ అంతే! మద్రాస్ పోతున్నాను.

రా:—వెళ్ళు వెళ్ళు. నిక్షేపంలా వెళ్ళు. కాస్త ఎడ్రస్ మాత్రం ఇచ్చివెళ్ళు.
(సూర్యం నిష్క్రమిస్తూంటాడు వినిపించుకోకుండా) ముహూర్తంపెట్టి తెలియ పరుస్తాను. (కొంత వ్యవధి)

మ:—బాబుగారూ! (అనుమానంగా)

రా:—ఏరా?

మ:—మరండీ!.......(నసుగుతాడు)

రా:—ఏమిటిరా?

మ:—అక్కడోళ్ళంతా ఏడుత్తున్నారండి.

రా:—ఎందుకూ?

మ:—ఎందుకంటారేంటుండా! పీటలమీద పెళ్ళి ఆగిపోతే ఏడుపు కాకపోతే ఇంకేమి వత్తాదండా!

రా:—ఓరి వెధవా! నీవు కూడా ఏడు వాళ్ళతో! నువ్వూ చెప్ప వచ్చావూ నాకు!

మ:—అదికాదుండీ!

రా:—(విసుగ్గా) ఏదికాదురా!

మ:—మరేం! కోడలమ్మగారు ఒకటే ఏడుపంట! బుల్లెమ్మ గోరు సూసి ఏడుత్తూవచ్చి వదిన ఏడుత్తోందని నా కాడ సెప్పారుండా.

రా:—ఊహూ! నువ్వు నాదగ్గర ఏడుస్తున్నావా?

మ:—ఆ రందర్నీ ఉసురుపెట్టమోకండి! పాపం వత్తాది.

రా:—నోరుముయ్యరా పక్షీ! పాపంలేదు, గీపంలేదు.
(ఇంతలో ఒక ముసలాయన-వయస్సు 60 సం; కరణం గోవిందయ్య—వయస్సు 50 సం॥ ప్రవేశం. పెళ్ళికూతురు తండ్రి పేరు వెంకయ్య. దిగులుగా ఉంటాడు)

వెం:—బావగారూ! నా దొక మనవి!

రా:—(గంభీరంగా) ఏమిటి?

వెం:—మీరు సావధానంగా చిత్తగించాలి.

రా:—చిత్తగిస్తాను చెప్పండి!

వెం:—నేను గంపెడు ఆశతో ఎదురుచూసిన ముహూర్తం ఇది. కానీ నే ననుకొన్న పనులు సక్రమంగా జరుగని కారణంచేత డబ్బు సర్దుబాటు కాలేదు. శక్తివంచన లేకుండా మిమ్ములను అన్నివిధలా సంతోషపెట్టడానికి ప్రయత్నించేను. నా దురదృష్టంవల్ల ఇలా జరిగింది. కానీ వంచన పూర్వకంగా చేయాలని చేయలేదు.

రా:—ఆ మాట ఇందాకటినుంచి అంటూనే ఉన్నారుగా. మళ్ళీ అదేపాటఅయితే ఎలా! వంచనపూర్వకంగా మీరు చేయలేదంటున్నారు. పోనీ! అన్నీ సమకూరినప్పుడే పెళ్ళి ప్రయత్నం చేసుకోలేక పోయారూ?

వెం:—నాకు నమ్మకముందిబాబూ! ఏవో అనివార్య కారణాల వల్ల రాలేకపోయాడు డబ్బు తీసుకొని. తప్పకుండా ఇస్తాను. అంతవరకూ నమ్మకం లేకపోతే నోటు వ్రాసి ఇస్తాను.

రా:—అదిగో మళ్ళీ అదే పాట.

వెం:—నేను అన్నమాట ప్రకారం డబ్బు ఇచ్చుకోలేకపోతే నా జీవితమంతా మీకు ఊడిగంచేసి మీ ఋణం తీర్చుకుంటా! బాబూ, ఇప్పటికే నా బ్రతుకు తలవంపులైంది. నలుగురిలో నన్ను అవమానపరచారు. అయినా సహించాను. కారణం నేను ఆడపిల్లను కన్నతండ్రిని కాబట్టి.

గోవి:—బాబుగారూ! మీకూ ఈయనకూ గల పాతస్నేహాన్ని పురస్కరించుకొనియైనా శుభకార్యాన్ని జరిగేలా చూడండి. నిష్కారణంగా ఆ అమ్మాయి జీవితంలో నిప్పులు పోయకండి. జరగవలసిన పెళ్ళి ఆగిపోతే మళ్ళీ సంబంధాలు వస్తాయా! ఆ అమ్మాయికి పెళ్ళి జరుగుతుందా? నలుగురూ నాలుగు విధాలుగా చెప్పుకుంటారు. అమ్మాయి

గురించి మీకు తెలియనదేమీ కాదు. అన్యాయం చేయకండి.

రా:—నేనేం చేశాను అన్యాయం? అయినా స్నేహం స్నేహమే. వ్యవహారం వ్యవహారమే!

గోవి:—బాబూ! నేనూ ఆడపిల్లలను కన్నతండ్రినే. అష్టకష్టాలూ పడి పెళ్లిళ్లుచేసి, అమ్మాయిలను అత్తవారింటికి పంపించాను. నాకు తెలుసును ఆ బాధ. నాకు తెలిసినంతగా మీకు తెలియదు. క్షమించండి బాబూ ఇలా అన్నందుకు. పీటల మీద పెళ్లి ఆగిపోతే మరో సంబంధం కూడా కుదరదు. లోకం అనేకవిధాల అనుమానిస్తుంది. మీ కట్నం డబ్బుకు నేను హామీ ఉంటాను. నామాటవిని వచ్చి ముచ్చటగా పెళ్ళిచేసుకొని వెళ్లండి.

రా:—మీరు ఎన్నైనా చెప్పండి. నేనుమాత్రం వినను. నన్ను నలుగురిలో అవమానపరిచినతర్వాత మళ్లీ ఏ ముఖం పెట్టుకొనిరానూ అంట.

వెం:—మిమ్మల్ని మేము అవమానపరచలేదు బాబూ. ఒకవేళ అటువంటి దేదైనా జరిగితే క్షమించండి. కానీ నా కూతురి జీవితాన్ని నాశనం చేయకండి.

రా:—ఏమిటీ? నన్ను అవమానించలేదూ? అవమానమంటే మీ కేమైనా తెలుసా? జరిగినదంతా చాలదూ? పెళ్లికి వచ్చిన పెద్దలందరి ఎదుటా, నా బంధుమిత్రులందరి ఎదుటా నా కెంత తలవంపులైందో మీకేం తెలుసు.

గోవి:—బాబూ! మీరే ఆలోచించండి. ఇది కూడా ఒక అవమానం క్రింద లెక్కేనా? నిజం చెప్పాలంటేఇంతకంటేఎన్నోరెట్లు అవమానాన్ని భరించా డీయన. ఇకపైన కూతురిపెళ్లి ఎలా చేయడమా అని తోచక సతమత మౌతున్నాడు. నేనే చెప్పి తీసుకువచ్చాను. మరొకమాటుచెప్పిచూద్దామని. అన్నీ తెలిసున్న మీరు ఈ విధంగా ప్రవర్తించడం భావ్యంకాదు.

రా:—ఏమిటయ్యా భావ్యంకానిది. కట్నమిస్తానని పెళ్లి కుదుర్చుకొని లే దనడం భావ్యమా?

గోవి:—నా మాట నమ్మండి బాబూ! మీకు డబ్బు అందేట్లు నేను చూస్తాను. దయుచేసి కొద్దిరోజులు గడు వియ్యండి.

వెం:—బాబూ! రామయ్యగారూ! మరొకమారు మిమ్మల్ని వేడుకొంటున్నాను. మీరు సలక్షణంగా తరలివచ్చి పెళ్లి చేసుకొని వెళ్లండి. మీ డబ్బు నయాపైసలతోసహా మీకు అందచేస్తాను. కానీ కొద్దిరోజులు గడువు మాత్రం ఇవ్వండి. ఈ ముహూర్తం దాటిపోనివ్వకండి. ఎన్నాళ్లనుంచో ఎదురు చూశాను ఈసుముహూర్తంకోసం. కానీ మీ చేత అవమానింపబడ్డాను. విధిలేక పడవలసి వచ్చింది ఆడపిల్లతండ్రిని కనుక. నేనే కాదు ఈ దేశంలో ఎంతోమంది నా లాటి దౌర్భాగ్యులున్నారు. కన్నకూతుళ్ల వివాహం చేయలేక ఈపాడు కట్నాలజ్వాలకు ఆహుతి అవుతున్నారు. దేశం ఎన్ని విధాల పురోభివృద్ధికి వస్తున్నా ఈ కట్నాల బాధ మాత్రం వదలక ప్రతి నాలాటి ప్రాణినీ పీడిస్తుంది. నా గురించి బాధలేదు. నా కూతురి జీవితం బాగు చేద్దామని ఎంతో ఉవ్విళ్లూరేను. కానీ ఈ విధంగా చెడిపోతుందని కలలో కూడా ఊహించలేదు. నా కూతురి ముఖం చూసి యైనా......

రా:—నీ కూతురి ముఖం చూశాను కనుకనే తక్కువ కట్నమైనా ఒప్పుకున్నాను. ఇదిగో మీరు ఎన్నైనా చెప్పండి. వినను. కట్నం ఇస్తే జరుగుతుంది పెళ్లి. లేకపోతే......

వెం:—బాబూ! అంతమాట అనకండి. నన్ను అన్యాయం చేయకండి. ఇవి చేతులుకాదు. కాళ్లు అనుకోండి. (అని దగ్గరగా పోతాడు—రామయ్య దూరంగా జరుగుతాడు)

రా:—ఇదిగో మీరు ఏమి చేసినా ప్రయోజనంలేదు. (అని వెళ్ళిపోతాడు. మల్లిగాడు నిర్ఘాంతపోయి చూస్తాడు. గోవిందయ్య దీనంగా వెంకయ్యవైపు చూస్తాడు)

మ:—వట్టి తిక్కమనిషి బాబూ! రాయైనా కరుగుద్దికానీ ఈ మా రాజుగుండె కరుగదు. అటువంటాయన కడుపున పుట్టినా చినబాబుగోరే ఎంతో మంచోరు.

గోవి:—ఏమిటోయ్ మంచి! తండ్రిని ఎదిరించలేడూ? చదువుకున్నాడు పైగా! హు! ఎంత చదివితేనేం? ఆ తండ్రికి కొడుకేగా! అందుకనే తండ్రి వెనుక నోరు మూసుకొని జారుకున్నాడు మెల్లగా.

మ:—మీకు తెల్దు బాబూ! చినబాబుగోరి సంగతి. నాతో అన్నారు బాబూ. ఏమైనాసరే ఆ అమ్మాయినే పెళ్లాడుతానని. అవసరమైతే నాన్న కళ్లుకప్పైనాసరే అంతపనిచేసి తీరుతారు అబ్బాయిగోరు.

గోవి:—ఆ! ఇంత రాద్ధాంతం జరుగుతోంటే చూస్తూ వూరుకున్నాడు. ఇకపై చేస్తాడుట. ఒకవేళ చేసినా అమ్మాయి జన్మలో సుఖపడలేదు. రా వెంకయ్యా! ఈయన మనిషి కాడు. మళ్లీ మళ్లీ ప్రాధేయపడటం మనదే తప్పు. మరొక సంబంధం చూసుకో వచ్చులే. అమ్మాయి అదృష్టం ఎలాఉంటే అలా జరుగుతుంది.

వెం:—గోవిందయ్యగారూ! ఏ ముఖంపెట్టుకొని ఇంటికి వెళ్ళను. నా కూతురు ముఖం చూడలేను. నేను రాలేను (అని ఏడుస్తాడు.)

గోవి:—ఇదిగో వెంకయ్యా! ఎందుకింత బెంబేలు పడిపోతావు. ధైర్యంగా ఉండు. అన్నిటికీ భగవంతు డున్నాడు.

(ఇంతలో అక్కడఉన్న గోపాలం తన కళ్లజోడుతీసి మల్లిగాడిని పిలుస్తాడు)

గో:—మల్లీ!

మ:—(ఆశ్చర్యంగాచూసి—గుర్తుపట్టి—నవ్వుతూ) గోపాలం బాబుగోరా!

గో:—అవును.

మ:—ఎప్పుడొచ్చినారుబాబూ! అబ్బాయిగోర్ని చూడలేదూ! పిలమన్నారా?

గో:—ఆ! చూశాను. ఇందాకటినుంచీ ఇక్కడే ఉన్నాను. (వెంకయ్య గోవిందయ్యలకేసి చూసి) బాబూ! మీరెవరో, నే నెవరో! మీకూ నాకూ కూడా తెలియదు. కానీ ఇందాకటినుంచీ ఇక్కడే ఉన్నాను. అంతా తెలుసుకున్నాను. నేనూ, మార్యం చదువుకున్నాము.

మ:—అవునుబాబూ! ఈ గోపాలంబాబుగోరు మాపెద్ద మంచోరు. ఈ వగీన తల్చుకొంటే.......

గో:—మల్లీ! నీవు ఆగు (వెంకయ్యతో) బాబూ! మీరు ఇంటికి సంతోషంగా వెళ్ళి మీ ప్రయత్నంలో ఉండండి. వీళ్లందర్నీ పెళ్లికి తీసుకువచ్చే బాధ్యత నాది. పెళ్లి నిర్విఘ్నంగా కొనసాగుతుంది.

వెం, గోవి:—(ఆశ్చర్యంగా) ఎలాబాబూ!

గోపాల్:—మీరు ఇంటికి వెళ్లండి. నా మాట నమ్మండి. మీ ప్రయత్నంలో మీరు ఉండండి.

గోవి:—ఎలా జరుగుతుంది నాయనా ఈ పెళ్లి. మోసం చేస్తావా?

గో:—ఇందులో మోస మేముంది బాబూగారూ! నూరు అబద్ధాలాడియైనా ఒక పెళ్ళి చేయమన్నారు పెద్దలు. మీకు అనుమానంగా ఉంటే ఆదిగో మీ రా ప్రక్కకువెళ్ళి ఏం జరుగుతుందో చూడండి.

గోవి:—సరే అయితే. ఇదిగో వెంకయ్యా నీవు ఇంటికి వెళ్ళు. సంతోషంగా ప్రయత్నాలన్నీ చేయి.

వెం:—వద్దు బాబూ! ఆయన కిష్టంలేని పెళ్ళి మోసంచేసి చేస్తే నా కూతుర్ని అష్టకష్టాలు పెడతాడు. వద్దుబాబూ. వద్దు.

గో:—బాబుగారూ! మీ అమ్మాయి జీవితం సుఖంగా సాగుతుంది. నా మిత్రుడి సంగతి నాకు తెలుసు. నా సోదరిగా భావించి మీ అమ్మాయి కేలోపం రాకుండా చూస్తాను. నా మీద నమ్మకముంచండి. (మల్లిగాడితో) మల్లీ, నీవుపోయి మీ బాబుగార్ని పిలుచుకురా! తర్వాత నీ విక్కడేఉండు. జరిగేదంతా చూస్తూ. నీకేమీ తెలియనట్లు నటించు. సూర్యాన్ని మాత్రం పిలవకు. తర్వాత పిలవవచ్చులే.

మ:—(నవ్వుకుంటూ) సరేబాబూ (నిష్క్రమణ)

గో:—మీరు వెళ్లిరండి బాబుగారూ! (అని చేతులు పట్టుకుంటాడు)

వెం:—నీ మేలు మరువలేను నాయనా!

గో:—ఇప్పుడుకాదు తర్వాత ఆ మాటలన్నీ. ముందు మీరు వెళ్లండి,

వెం:—నీ రుణం ఎలా తీర్చుకోవాలో?

గో:—కాస్త పప్పూ అన్నం పెట్టండి చాలు. ఊ! మీరు వెళ్లండి త్వరగా.

(వెంకయ్య, గోవిందయ్య రెండో వైపునకు వెళ్తారు. గోపాలం కళ్లజోడు పెట్టుకొని కాసేపు అటూ ఇటూ పచారు చేస్తూంటాడు. మల్లిగాడు, రామయ్య ప్రవేశం)

రా:—ఎవర్రా నన్ను పిలుచుకు రమ్మన్నది?

గో:—నేనే బాబుగారూ!

రా:—ఓహో! నీవా! ఇంకా వాళ్లేమో అనుకున్నాను. ఇందాకటి నుంచీ చూస్తూనే ఉన్నావుగా నాయనా ఈ తతంగమంతా! కట్నం ఇవ్వరుట. పెళ్ళి చేసుకోవాలిట. ఎంత చక్కగా ఉందీ. తర్వాత ఇస్తారుట—తర్వాత. ఇప్పుడు లేనిది తర్వాత ఎక్కడనుంచి వస్తుందో. ఇది అంతా ఎగవెయ్యడానికి ఎత్తు.

గో:—(జేబులోనుంచి డైరీ, పెన్నుతీసి) బాబుగారూ.

రా:—ఏం బాబూ!

గో:—ఆయన పేరేమిటి అన్నారు.

రా:—ఎవరి పేరు?

గో:—ఆదే మీ వియ్యంకుడిగారి పేరు.

రా:—అదేమిటి నీవు కూడా వియ్యంకు డంటున్నావు.

గో:—మరింకేమి అనాలి.

రా:—పెళ్లి కాలేదుగా. ఆయనెవరో, నే నెవరో.

గో:—ఇప్పుడు జరుగుతుందిగా పెళ్లి!

రా:—ఏమిటీ?

గో:—అహ! ఏమీలేదు. ఇందాకటినుంచీ జరుగుతున్నదంతా ఒక తమాషాగా ఉందిలెండి, అందుకని. అసలు జరగవలసిందేగా పెళ్లి. నాకూ అప్పుడప్పుడూ, ఇటువంటివి చూసినప్పుడూ కథలు వ్రాస్తూ ఉంటాను. కనుక ఆయన పేరు అడుగుతున్నాను.

రా:—అయితే దానికేం! వెంకయ్యగారు. ఇంటిపేరు.....

గో:—అక్కరలేదు. ఊరిపేరు చాలు. (వ్రాసుకుంటున్నట్లు నటిస్తాడు) సరే మీపేరు......ఆ! మర్చిపోయా చూశారు ఇందాకనే చెప్పారుగా రామయ్యఅని..... (వ్రాసుకుంటూటాడు) మీ అబ్బాయిపేరు ఏమిటన్నారు?

మ:—సూరెంగోరుబాబూ!

గో:—ఊహూ! (వ్రాసుకుంటాడు)

రా:—(ఆశ్చర్యంగా) మావాడిపేరు ఎందుకునాయనా!

గో:—కాస్త పనిఉంది లెండి.

రా:—ఏమిటాపని?

గో:—ఈ వివరాలన్నీ సేకరించి ఒక చిన్న రిపోర్టు ఇద్దామని.

రా:—ఏమిటీ? రిపోర్టా! ఎందుకూ? ఎవరికీ? (కంగారుగా)

గో:—(వ్రాసుకుంటున్నట్లు నటిస్తూ) కట్నం ఎంత?

మ:—మూడువేలు బాబూ.

రా:—నువ్వు నోరుముయ్యరా దద్దమ్మా (గోపాలాన్ని సమీపిస్తూ) ఏమిటిబాబు ఇదంతా?

గో:—(వ్రాసుకుంటున్నట్లు నటిస్తూ, ఏమీ వినిపించుకోడు) కట్నం......Dowry Three Thousands— డౌరీ త్రీ థౌజండ్స్. (కాస్త ఆగి) అయితే ఇప్పుడు మీరు ఇంటికేనా వెళ్లేది?

రా:—(భయంగా) అంటే!

గో:—ఆదేనండి మీ ఊరు వేమవర మేనా?

రా:—అవును! అయితే.

గో:—వచ్చే సోమవారంనాడు మీరూ, మీ అబ్బాయి ఒకమారు ఈ ఊరువచ్చి మేజిస్ట్రేటుకోర్టుదగ్గర నన్ను కలుసుకోండి. లేకపోతే పోలీసులు ఆ మరునాడే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి అరెస్టు చేస్తారు.

రా:—(పూర్తిగా అధైర్యపడిపోతాడు) అసలేమిటో చెప్పు బాబూ.

(బతిమాలుతున్నట్లుగా దీనంగా చూస్తాడు)

గో:—కట్నం తీసుకోవడానికి ప్రయత్నించారు కనుక మీ మీద రిపోర్టు ఇచ్చాను. అంతే నాపని.

రా:—తర్వాత?

గో:—ఇంకేముంది? కోర్టు కెక్కటం, శిక్షపడటం, జైలు గోడలమధ్య మీన మేషాలు, మీరు మీ అబ్బాయి కలసి లెక్కపెట్టడం.

రా:—(కంగారుగా) జైలే, శిక్షే! అమ్మ బాబోయ్ (మల్లిగాడితో) వెళ్లి అబ్బాయిని పిల్చుకు రారా.

మ:—(నిష్క్రమణ)

రా:—ఇదిగో నాయనా! చూడు. నీవు చాలా బుద్ధిమంతుడివను కున్నా. ఇంతపని చేస్తావని అనుకోలేదు.

గో:—మీరు కూడా చాలా పెద్ద మనుష్యులే ననుకొన్నా! ఇంత పని చేస్తారని అనుకోలేదు.

రా:—నే నేంచేశాను.

గో:—ఏమీ చేయకపోతే ఎందుకింత కంగారుపడతారు.

రా:—అసలు నీ వింతకూ చేయదలచుకొన్నదేమిటో, నేను చేసిం దేమిటో చెప్పుబాబూ!

గో:—అనవసర ప్రసంగం చేయకండి.

(మల్లిగాడు, సూర్యం ప్రవేశం)

రా:—ఒరే సూర్యం చూడరా! ఇంతవరకూ చక్కగా మాట్లాడి మన గుట్టు అంతా లాగి రిపోర్టు ఇస్తున్నాడు. ఈయన ఎందుకు ఇస్తాడో, ఈయనకూ, రిపోర్టుకూ సంబంధ మేమిటో?

సూ:—ఏరా? ఏమిటిరా ఇదంతా!

గో:—కట్నం కావాలా నీకు. లేకపోతే పెళ్లి చేసుకోరుగా! అందు కని మీ ఇద్దరి పెళ్ళి నేను చేస్తాను.

సూ:—నీ కెందుకురా ఇదంతా?

గో:—(కన్నుగీటి) ఉద్యోగధర్మం. (అని జేబులోనుంచి డైరీ తీసి చూపుతాడు)

సూ:—అవును అన్నట్లు మరచి పోయాను. నాన్నా! ఈయన సి. ఐ. డి. ఆఫీసరు.

రా:—అయితే ఈయన కీ పనేమిటి?

మ:—అదేమంటి. మన వూళ్లో మునసబుగార్ని కూనీచేసినపుడు మారువేసాల్లో పోలీసోళ్లు రాలేదుటండా! (సూర్యంతో) ఆళ్లేనా బాబూ!

సూ:—అవును నాన్నా! వీళ్లు ఇలా తెలియనట్లు నటిస్తూనే కూపీలాగి ప్రభుత్వానికి సమాచారం అందచేస్తారు.

రా:—అయితే

సూ:—అయితే అంటావేమిటి నాన్నా! కట్నాల నిషేధానికి బిల్లు వచ్చిందిగా! చట్టప్రకారం కట్నం తీసుకోవడం అపరాధం కనుక రిపోర్టు ఇస్తామంటున్నాడు ఈయన.

రా:—అయితే దీనికి సాక్ష్యులు ఏరీ! నేను కట్నం తీసుకున్నట్లు. అసలు పెళ్లే జరుగలేదుగా!

గో:—రామయ్యగారూ, అతితెలివితేటల్ని ప్రదర్శించకండి. ఇంతవరకూ నేను చూసిందీ విన్నదీ అబద్ధమేనంటారా?

రా:—అయితేమాత్రం సాక్షి అంటూ ప్రత్యేకంగా ఒకడు లేక పోతే కేసెలా నెగ్గుతుంది.

గో:—సరే అదేమిటో కోర్టులోనే తెలుస్తుందిగా! ఇదిగో మిస్టర్ సూర్యం! నీవూ, మీ నౌకరూ, మీ ఫాదర్ వచ్చే సోమ వారంనాడు ఈ ఊరు మేజిస్ట్రేట్‌కోర్టులో హాజరు కావా లని తెలియజేస్తున్నాను. తెలిసిందా?

రా:—ఒరే సూర్యం! అలా నిలబడి చూస్తావేమిరా! కాస్త ఇంగ్లీ షులో రెండుముక్కలు మాట్లాడి ఈయన్ని ఎలాగో పంపించేయి. ఇదిగో ఇలారా (అని దగ్గరకు పిలచి నెమ్మ దిగా అంటాడు.) "అవసరమైతే కాస్త పడేద్దాము డబ్బు"

సూ:—సరేనాన్నా! మీరింత భయపడకండి. వీడు నా స్నేహి తుడేలే. మే మిద్దరం కలసి చదువుకున్నాము. నామాట వింటాడులే.

రా:—(సంతోషంగా లేని నవ్వును తెచ్చిపెట్టుకొని) ఏమిటీ అయితే ఇకనేం. నేను ఇందాకటినుంచీ అర్థం చేసుకోలేక పోయాను. నీవు ఏరా! ఏరా! అంటూంటే! (గోపాలంవైపు తిరిగి) ఇదిగోచూడు బాబూ, స్నేహం విలువ, చదువుకున్నావు కనుక! నాకంటే నీకే ఎక్కువ తెలుస్తుంది. ఏలాగూ మీ రిద్దరూ స్నేహితులే కనుక నీ స్నేహితుడికి అన్యాయం చేయకు. అనవసరంగా జైలుకు పంపితే నీ కేమి లాభం చెప్పు. (కొడుకుతో) నీవు కూడా చెప్పరా!

సూ:—ఒరే గోపీ!

గో:—డోన్ట్ టాక్ఆల్ రబ్బిష్.(Dont talk all rubbish) కీప్ క్వైట్ ఐ సే (Keep quite I say)

సూ:—మన మిద్దరం స్నేహితులం కదురా!

గో:—What? అయితే! స్నేహం స్నేహమే! వ్యవహారం వ్యవహారమే. ఇందాకా మీ నాన్నగారే నేర్పారు నాకీ సిద్ధాంతం. కనుక నీవు అనవసరంగా శ్రమ తీసుకోకురా మై డియర్ ఫ్రెండ్.

రా:—(బిత్తరపోయి) ఓహో! అదా! నే నేదో మాట వరసకి అన్నాను.

గో:—సరే అయితే నేను ఆచరణలో పెడతాను.

రా:—(కంగారు, భయంగా) ఒరే సూరీ! బెల్లంకొట్టినరాయిలా అలా నిలబడ్డావేమిరా! రెండు ముక్కలు ఇంగ్లీషులో మాట్లాడి ఒప్పించరా. బి. ఏ. ప్యాసైనావు. ఒక్క ఇంగ్లీషు ముక్క నోటిలోంచి వూడిపడదేమిరా. (దగ్గరకు పిలచి నెమ్మదిగా) "మా నాన్నకు మతి స్థిరంలేదనో, ఏదో బొంకి చెప్పరా"

సూ:—Mister! you please hear me with a little bit patience.

గో:—Will you please shut up your mouth for a while ?

సూ:—నాన్నా! ఇక లాభంలేదు. పరిస్థితి చేయిజారిపోయింది. ఆయన ఉద్యోగధర్మం కనుక రిపోర్టు చేసితీరుతాడు.

రా:—నీ స్నేహితుడేకదురా, మరొకమారు చెప్పరా!

గో:—ఏమండోయి. వాడు నా స్నేహితుడు కానివ్వండి. మీరు కూడా నా స్నేహితునితండ్రే కనుక మీ రిరువురూ మా ఇంటికిరండి. విందు భోజనాలు ఆరగిద్దాం. స్నేహాన్ని అభివృద్ధి చేసుకుందాము. కానీ నా విధ్యుక్తధర్మ నిర్వహణకి స్నేహం అడ్డు రాకూడదు. స్నేహితుడైనా, తండ్రియైనా మరెవరైనాసరే నా విధిని నేను నిర్వర్తిస్తాను. అనవసరంగా శ్రమతీసుకోకండి. (సూర్యంతో) (My dear friend, dont take unnecessary pains)

రా:—(ప్రాధేయపూర్వకంగా) ఇదిగో నాయనా. చిన్నవాడివి. నీకు లోకం విషయం తెలియదు. నీ కంటే కాస్త కూస్త పెద్దవాళ్ళం. మా వంశానికి ఇంతవరకూ ఎటువంటి మచ్చా లేదు. ఈ నాడు నా వల్ల వస్తోంది. కనుక ఇకపై జాగ్రత్తగా ఉంటాను. కట్నం తీసుకోకుండానే మా అబ్బాయి పెళ్ళి చేస్తాను. రుజావు కావాలంటే నీ ఎడ్రస్ ఇయ్యి. పెళ్ళికి శుభలేఖ పంపుతాను.

గో:—మీ రుజావులు, విజాయితీలతో నాకేమీ పనిలేదు.

రా:—ఇదిగో చూడునాయనా. కాస్త నా మాట విను. మా వంశంలో ఏనాడూ కనీ, వినీ ఎరుగని శిక్ష, నేను అన్యాయంగా అనుభవించి జైలుకువెళ్ళానుఅంటే, నా పరువు, ప్రతిష్ట మాట ఏమిటి చెప్పు. నేను నలుగురిలోనూ తల ఎత్తుకు తిరగగలనా?

గో:—ఇదిగో రామయ్యగారూ! నేనొక మాట చెపుతాను. మీ వియ్యంకుడుగారు ఆత్మాభిమానాన్ని పైతంచంపుకొని కాళ్ళావేళ్ళాపడి బతిమాలినపుడు, మీరు ఏమాత్రమైనా కనికరమనేది లేకుండా, నిర్విచారంగా అవతలకి వెళ్ళిపోయారే; అపుడు ఆ వ్యక్తి ఎంత బాధపడిఉంటాడో ఆలోచించండి.

రా:—అవును నాయనా! కానీ ఏంచెయ్యను. ఏదో బుద్ధి గడ్డి తిని వెధవ పాడుపని చేశాను. బుద్ధివచ్చింది. ఇంకెప్పుడూ చెయ్యను.

గో:—మీరు నా దగ్గర ఎన్ని అన్నా లాభంలేదు. నా ధర్మం నేను నిర్వర్తించాలి.

రా:—ఒరే సూరీ! (పూర్తిగా అధైర్యపడిపోయి) ఇప్పుడెలారా? నేను, మా నాన్న, మా తాత, ముత్తాత ఎవ్వరూ కూడా జైలుకు వెళ్ళలేదే. అటువంటిది ఇపుడు నే నెలారా వెళ్ళేది. ఎంత చిన్నతనంరా.

మ:—పెదబాబుగారు జైలుకెళ్ళారు గదండీ!

రా:—ఒరే చచ్చు సన్యాసీ! నీవు వూరుకోరా! మా తాత వెళ్ళేడంటే ఆ రోజుల్లో ఆయనకే చెల్లింది. గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో నడిచి స్వరాజ్యంసంపాదనకై దేశాభిమానంమీద ఆయన వెళ్ళేడు. అందుకనే ఆయన జైలునించి విడుదలై ఇంటికి వస్తూంటే ఊళ్ళోవాళ్ళంతా నారాయణగార్కి జై అంటూ మేళ తాళాలతో ఊరేగించారు జ్ఞాపకంలేదూ!

మ:—దానికేంటిలెండా! ఆయనగారేమో దేశంమీద అభిమానం కొద్దీ జైలుకి వెళ్ళారు. మీరేమో కట్నంమీద అభిమానం కొద్దీ......

రా:—ఓరి బోడివెధవా! నీకు నవ్వుగా ఉందిరా? శనిగాడిలా దాపురించావు నాకు. జైలుకెళ్ళడం అంటే సంబరం లాగుంది నీకు. పోనీ నా బదులు నీవు వెళ్ళు.

మ:—బాబోయి! నావల్లకాదుండా! ఆ జైల్లో చీకటి, దోమలూ, నల్లులూ, తేళ్ళూ ఉంటాయంట బాబూ!

రా:—ఆఁ! ఎలారా! సూరీ! పోనీ ఏదైనా జరిమానా విధిస్తే అది కట్టేస్తేపోదురా ఈ తంటా!

సూ:—లాభంలేదు నాన్నా! ఈ రకం నేరాలకి జరిమానాతోబాటు శిక్ష కూడా ఉంటుంది. ఆమధ్య పేపర్లో చదివాను.

రా:—అయితే ఇప్పుడేమి చెయ్యటం?

మ:—పోనీ వెనక్కెళ్ళి పెళ్లి చేసుకుంటేనో!

రా:—నీవు నోరు ముయ్యరా సన్యాసీ!

సూ:—అదే మంచిపని నాన్నా! లేకపోతే వేరే గత్యంతరంలేదు.

రా:—(కొంత వ్యవధి తీసుకొంటాడు) నేను మళ్ళీ వాళ్ల గుమ్మం ఏ ముఖం పెట్టుకొని తొక్కనురా! నా అభిమానం దెబ్బ తింటుందిరా!

గో:—అందుకనే పెళ్లి జరుగనివ్వండి.

రా:—అది వీల్లేదు.

గో:—అయితే మీ ఆత్మాభిమానం—

రా:—ఒరే సూరీ! అలా నిలబడ్డావేరా, కొయ్యలా! నీ ఒక మొద్దువి. ఏమీ తెలియటంలేదు. నీ తండ్రి ప్రతిష్ట, గౌరవం మంట కలిసిపోతూంటే నీకు చీమకుట్టినట్లైనా లేదేమిరా! (గోపాలం దగ్గరకువెళ్ళి చేతులు పట్టుకొని) బాబూ, ఇవి చేతులుకావు. కాళ్ళు అనుకో. నన్ను అప్రతిష్టపాలు చేయకు నాయనా. ఇందాకా ఆయన నా కాళ్ళమీదపడినా వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తించినందుకు, వెంటనే భగవంతుడు నాకు శిక్ష వేశాడనుకుంటా. బాగా బుద్ధి వచ్చింది బాబూ! పోనీ తిరిగి వెళ్ళి పెళ్ళి జరిపిద్దామంటే చూడు, ఏదోలాగ ఉంటుంది. కాళ్ళబేరానికి వచ్చినట్లుగా ఉంటుంది. అయినా ఏ ముఖం పెట్టుకొని ఈ ముఖం ఆ ముఖాలకు చూపను. కాస్త ఆలోచించునాయనా! నీవే ఏదో మార్గం ఆలోచించు. నన్ను గట్టు ఎక్కించు నాయనా!

గో:—రామయ్యగారూ! మీ మంచికోరే చెపుతున్నాను.

రా:—ఏమిటీ?

గో:—మీరు ఇపుడు మర్యాదగా వెళ్ళి పెళ్లిజరిపిస్తే చాలా మంచిది.

రా:—లేకపోతే?

గో:—మీకు శిక్ష తప్పదు. ఆ తర్వాత పెళ్లి అవకమానదు. కనుక పెళ్లిచేస్తే శిక్ష తప్పుతుంది.

(రామయ్య నెత్తిన కండువా వేసుకొని, ఉసూరుమంటూ కూలబడతాడు.)

మ:—అయితే బాబుగారూ, జరిమానా, శిక్ష, పెళ్లి ఈ మూడూ ముచ్చటగా జరుగుతాయన్నమాట.

సూ:—(తండ్రి దగ్గరకువెళ్లి) నాన్నా! నా మాటవిను. నీకు ఇప్పుడు వచ్చిన అవమాన మేమీలేదు. కానీ నీ విపుడు పెళ్ళికి ఒప్పుకోకపోతే ఇంతకంటే ఎక్కువఅవమానాన్ని భరించ వలసివస్తుంది. కనుక మిగిలిన భారమంతా నాది. ముందుగా వాళ్లకు కబురుపంపుదాము పెళ్లికివస్తున్నట్టు. వాళ్లు ఎంతో ఆనందిస్తారు. వాళ్లేమీ కించపరచరు.

రా:—ఏదో మీ ఇష్టమొచ్చినట్లు ఏడవండి. నేను మాత్రం రాను. రాలేను.

సూ:—అదేమిటి నాన్నా! మీరు లేకుండా పెళ్లా!

రా:—నాకు అవమానం జరిగినతర్వాత మళ్లీ ఏ ముఖం పెట్టుకొని వియ్యంకుడిగా ఆ గుమ్మం తొక్కను.

గో:—ఇదిగో రామయ్యగారూ! మీకు ఏవిధమైన లోటు కలుగనీయను. మీ గౌరవప్రతిష్ఠలకు ఏ భంగమూ రాకుండా కార్యభారాన్ని నేను నిర్వహిస్తాను. సరేనా!

రా:—(దిగులుగా—పూర్తిగా ఓడిపోయాననే భావంతో) ఏదో కానీయండి. ఇంక నాకు గౌరవము ఎక్కడ ఏడిచింది. విలువలేదు నా మాటకు. ఈ కట్నాల బిల్లువచ్చి ఇంత గొడవ తెచ్చింది. నాలాటి తండ్రుల వ్యక్తిత్వాన్ని సమూలంగా నాశనం చేసింది. కొడుకులను కన్న నావంటి తండ్రులు నా కేమని, రొమ్మువిరచి రోడ్డుమీద తిరగడానికి లేకుండా చేసింది. పైగా ఇపుడు ఆడపిల్లలను కన్న తండ్రులు నిర్భయంగా, నిర్విచారంగా కూతుళ్ల పెళ్లి గొడవైనా పట్టించుకోకుండా జీవితం సాగిస్తున్నారు. పై చేయిగా ఉండవలసినవాళ్ళు క్రిందచేయిగా అయిపోయారు. ఇదంతా ప్రభుత్వం చేసింది. మాలాటి వాళ్లను తలఎత్తుకోకుండా చేసింది.

గో:—బాబుగారూ! మీరు చాలా పొరపాటుగా భావిస్తున్నారు. ప్రభుత్వం ఎన్నడూ కూడా చేయకూడని పనులు చేయించదు. దేశం అన్ని విధాల పురోభివృద్ధి పొందాలనే, ఆర్థికంగా బాగుపడాలనే క్రొత్తచట్టాలను, ప్రణాళికలను ప్రవేశపెట్టింది. దేశాన్ని బాగుపరచాలనే ప్రయత్నిస్తోంది. ప్రతి వ్యక్తి కూడా ఆ చట్టాలనూ, ప్రణాళికలనూ అర్థం చేసుకొని మనస్ఫూర్తిగా ఆచరిస్తూ, సహకరిస్తేనేదేశం బాగుపడుతుంది. బీదతనం దేశంలోనశిస్తుంది. ప్రజలు సక్రమంగా అన్నింటినీ ఆచరణలో పెడుతున్నారో లేదోనని ఆచరణలో పెట్టేలా చేయాలని వివిధ రంగాలలో వివిధ వ్యక్తులకు ఉద్యోగాలుఇచ్చి, సక్రమంగా పరిపాలన సాగేట్లు చూస్తోంది. ఎందుకనో తెలుసా? ఇంకా మీ లాంటి వ్యక్తుల బూజుపట్టిన పాత అభిప్రాయాలు పూర్తిగా సమసిపోలేదు. కనుకనే దేశం పురోభివృద్ధికి రాలేదు. అవి పోయేలా చూడటమే మా విధి.

రా:—అవును నాయనా! మేము ఏమి చేసినా, ఏమి చెప్పినా అవన్నీ పాత అభిప్రాయాలుగానే కనబడుతాయి. వాటి విలువ మీకు తెలియదు. అవన్నీ మీకు బూజుపట్టినట్టుగానే కనపడుతాయి.

గో:—మీరు పొరబడుతున్నారు బాబుగారూ!

రా:—అవును. పొరపాటో, గ్రహపాటో జరిగిందిగా!

గో:—అదికాదు బాబూ! నే నొకటి చెపుతా వినండి.

రా:—ఇంతవరకూ విన్నానుగా. ఇంకా చెప్పు వినేదేమైనా ఉంటే.

గో:—ఒక మనిషి ఎంతకాలం జీవిస్తాడంటారు?

రా:—మా కాలంవాళ్లయితే 80 సంవత్సరాలు. ఈకాలంవాళ్ళు 40 సంవత్సరాల నడి వయస్సులోనే.....

గో:—సరే మీమాటకే వస్తాను. 80 సం. ఒక మనిషి జీవిస్తాడు. ఒక ఇల్లు ఎంతకాలం శిథిలం కాకుండాఉంటుంది.

రా:—ఒక వంద సంవత్సరాలు వేసుకోవచ్చు.

గో:—మనిషీ జీవించడు వంద సంవత్సరాలకు పైబడి. మనిషి కట్టిన ఇల్లు కూడా శిథిలం కాకుండా వంద సంవత్సరాలకు పైబడి ఉండదు. అంటే, మనిషీ వుండడు, మనిషి కట్టిన ఇల్లూ వుండదు. అటువంటపుడుఆ నాటి పాతఅభిప్రాయాలను ఎందుకు మార్చుకోరు! పాతది పడిపోతే కొత్తఇల్లు ఎలాగయితే కట్టుకుంటున్నారో వివరించడానికి, ఆలాగే దేశకాల పరిస్థితులనుబట్టి పాత అభిప్రాయాలకు స్వస్తిచెప్పి, కొత్త అభిప్రాయాలను ఆచరణలో పెడితే దేశం ఎంత బాగుపడుతుందో ఆలోచించండి.

రా:—ఇవన్నీ నా కెందుకు చెపుతావు. ఇంక నా మాట సాగదనరాదూ? అలాంటప్పుడు మీ ఇష్టము వచ్చినట్లే సాగనివ్వండి. నేను నామమాత్రుణ్ణేకాని నా సలహాలు కావాలా, నా మంచి కావాలా! ఏమీలేదు! ఊ! కానివ్వండి.

సూ:—నాన్నా! నీవు అనవసరంగా పరిస్థితుల్ని అపార్థం చేసుకొంటున్నావు.

రా:—నీవు నాకేమీ చెప్పక్కర్లేదులేవోయ్! చేసుకో పెళ్లి. ఊరేగు. కలిసిపోయాయిలే నా పరువూ మర్యాద గంగలో.

గో:—రామయ్యగారూ! మీకు ఇంత చెప్పినా పాత పాట మానలేదు.

రా:—నాకేం, మానుతాను. నిక్షేపంలా మానుతాను. కానీ నాకు జరుగబోయే అవమానంగురించి తలచుకొంటూంటే......

గో:—మీకేమీ అవమానం జరుగకుండా చూస్తాను. సరేనా? కానీ మీరు మాత్రం జరిగినదంతా మర్చిపోయి పెళ్ళికి వెళ్లండి.

రా:—ఆ! వెళ్ళకేం? వెళతాను.

సూ:—అదికాదునాన్నా! రోజులు మారాయి. మనుషులు కూడా మారకపోతే ఎలా?

రా:—మారింది బాబూ! మారింది. వాళ్ళు ఏమైనా అవమానం చేస్తారని........

సూ:—వాళ్లేమీ అవమానం చేయరునాన్నా! మనం వాళ్లకు 'కట్నం వద్దు, పెళ్ళికి వస్తున్నాం' అని కబురుపంపుదాము.

గో:—బాబుగారూ. నేను కబురుపంపుతాను. మీకు అవమానం జరుగకుండా చూస్తాను. కానీ కట్నం రూపేణా మాత్రం

డబ్బు తీసుకోవద్దు. పూర్వకాలం ఒకళ్లమీద ఒకళ్ళకుండే అభిమానంకొద్దీ ఇచ్చి పుచ్చుకొనే కానుకలే ఈ నాడు కట్నాలుగా రూపొందాయి. పెళ్ళి అంటే వ్యాపారంగా మారింది ఈరోజుల్లో. ఇకపోతే వాళ్ళు మీమీద ఉండే అభిమానంకొద్దీ తృణమో పణమో ముట్టచెపితే తీసుకోండి. కానీ కట్నంగా మాత్రం తీసుకోకండి.

రా:—అసలు నేనేమీ తీసుకోను. అంతా మీ ఇష్టం వచ్చినట్లు కానివ్వండి. నా మనసు మారక తప్పలేదు చివరికి.

సూ:—నీ మనసు మారినందుకు సంతోషం నాన్నా!

రా:—సంతోషించకేమిచేస్తావులే. అదికాదురా! ఇంత రాద్ధాంతం జరిగిన తర్వాత ఇప్పుడు తిరిగి వాళ్లపిల్లనే చేసుకోవడం కొంత లోకువగా ఉంటుందేమోనని ఆలోచిస్తున్నాను. కానీ ఇదంతా జరుగక ముందే నా మనసు మారి ఉంటే ఎంత బాగుండేది.

మ:—బాబుగారికి జైలు వూసెత్తేసరికి మారిపోయింది మనసు.

రా:—లేకపోతే నా పిచ్చిగానీ. ఆస్తిపాస్తులున్న నేను కూడా కట్నం కోసం ఎగబడితే ఇంకేమైనా ఉందా? లేనివాళ్ళు కట్నాలు ఇచ్చుకోలేక ఎంత బాధపడతారోకదా?

మ:—(ముసి ముసి నవ్వులతో) బాబుగారి మనసు పూర్తిగా మారిందుందా?

రా:—ఒరే అబ్బాయీ నాకు తలవంపులైనా ఫరవాలేదు. కట్నం తీసుకోమని కూడా కబురుపంపు తెలిసిందా!

సూ:—మా నాన్న చాలా మంచివాడు. నిన్ను లోకం ఎంతో గౌరవిస్తుంది నాన్నా.

రా:—జరిగింది చాలు నాయనా!

సూ:—నీవు వెళ్లి వాళ్లందర్నీ బళ్ళు ఎక్కమని చెప్పు నాన్నా.

రా:—నడవరా మల్లిగా! ఆ! అన్నట్టు మరిచాను. నాయనా గోపాలం నీవు కూడా ఈ పెళ్ళికి రావాలి.

గో:—ఎంతమాట! తప్పకుండా వస్తాను. అందుకనే కదండీ నేను వచ్చింది.

రా:—సరే! ఒరే మల్లీ! నీవుపోయి బళ్ళు కట్టించు. పద (అంటూ రామయ్య ముందు నిష్క్రమిస్తాడు)

మ:—(రామయ్య వెళ్లిన వైపే చూస్తూ) బాబుగారి మనసు మారిపోయినట్లే.

గో:—ఏరా సూర్యం! ఇంత గొడవ ఎందుకు చేశావురా? కాలేజీలో చదివేరోజుల్లో పెద్ద లెక్చర్లు ఇచ్చేవాడివి. ఆచరిస్తావనుకొన్నాను కానీ......

సూ:—నీకు తెలియదురా! నెమ్మదిగా నచ్చచెపితే ఆయన ఒప్పుకుంటాడనుకున్నాను. మా నాన్న సంగతి నాకు బాగా తెలుసు.

గో:—ఒప్పుకోకపోతే! "పెళ్లిచేసిచూడు" సినిమాలో మాదిరిగా నీ ఇల్లాలితో రహస్యజీవితం సాగిద్దామనుకున్నావా?

సూ:—ఏదైతేనేం! మంచే జరిగిందిగా! ఒరే గోపీ! నీవు అసలు ఇక్కడ ఎందుకున్నావురా! పెళ్లికి రమ్మని ఉత్తరంవ్రాస్తే స్టేషనులో కూర్చున్నావేం?

గో:—నీ పెళ్ళి చూద్దామనే ఎంతో ముచ్చటపడి వందలమైళ్ళ ప్రయాణంచేసి పెళ్లి పందిట్లో అడుగెట్టే సరికి గొడవ జరుగుతోంది. కాసేపు నిలబడి పరిస్థితి అంతా తెలుసుకున్నాను. నాకుమాత్రం నీ మీద జలేకోపం వచ్చింది. వెంటనే తిరిగివెళ్లిపోదామని అసహ్యంతో వెనక్కివచ్చి రైలు కోసమని ఇక్కడ నేను నిరీక్షిస్తూంటే తమరిలా దయచేశారు.

సూ:—అదికాదురా!

గో:—ఇంకా ఏమిట్రా కానిది? నీ భావాలకు, అభిరుచులకు తగ్గ భార్య దొరికిందనివ్రాస్తే నీ పెళ్ళికివచ్చి మనసారా దీవించి పోదామని ఎంతో ఉవ్విళ్లూరుతూ వచ్చాను. కానీ తండ్రి వెనక చేతులు నలుపుకుంటూ ఇలా వస్తావనుకోలేదు. అంతేలే చెప్పేదానికీ, చేసేదానికీ చాలా కష్టం. ఇప్పుడు అర్థమైంది. తమరి మాటలు కోటలు దాటుతాయికానీ చేతలు మాత్రం గడపలు దాటవని. వట్టి డంబాల రాయుడివిరా నీవు.

సూ:—సమయానికి వచ్చి చాలా సహాయం చేశావురా! నాకు పుట్టబోయే కొడుక్కి నీపేరు పెడతా.

గో:—మీ శ్రీమతి ఒప్పుకోకపోతే!

సూ:—జరిగిందంతా తెలిసిందంటే ఇలవేల్పుగా నిన్ను కొలుస్తుంది తెలుసా?

గో:—సరే! పడు వెడదాం! కానీ ఒక మనవి!

సూ:—ఏమిటి?


గో:—నాపేరు పెట్టాలని తొందరగా పుట్టించకు కొడుకుని. ఆతర్వాత నన్ను తిట్టుకుంటావు. వీడి ధర్మమా అని పెళ్లి అయితే అయ్యిందికానీ దాంపత్యసుఖం అనుభవించలేదు అని బాధపడుతావు. కనుక కంగారులేదు. పుట్టినప్పుడు పెడుదువుగానిలే నాపేరు.

సూ:—అమ్మమ్మా ఎంతమాట! మన ప్రణాళికలన్నీ మరచిపోయావన్నమాట!

గో:—ఆ! ముందు పెళ్లి అయ్యేదే నేను కనుక రాకపోతే! పద వెడదాం!

మ:—గోపాలంగారి ధర్మమా అని పెళ్ళి జరుగుతోంది. మీరంతా రండి. దీవించడానికి (అంటాడు ప్రేక్షకులతో—కాసేపు ఆగి) లెగండి. లేవరేం. నడవండి పెళ్లికి.

(తెరవాలుతుంది)


ఈ పిల్లకి నీఫా మిఠాయిలు ఇవ్వండి
ఇవి చాలా రుచికరంగా ఉంటాయి

బాణభట్టారకుని సూక్తివైచిత్రి

డా॥ ఎస్వీ జోగారావు

బాణవితాంతః కరణుడైన కవిబ్రహ్మ భవ్యాభిమ్ముడైన యవన్నాల్ చేసిన కావ్యసర్గసంకల్ప మాకల్పాంతస్థాయిక మానంద బ్రహ్మపదావతీర్ణము. భట్టబాణ ముఖోద్గీర్ణమై గీర్వాణవాణీ వీణాక్వాణపాణింధమముగా వెలసిన కాదంబరీ కావ్య మొకం డట్టిది. ఆ మహాకవి లేఖినీ ముఖమున అవతరించిన ప్రత్యక్ష రము అమృతార్ణ బిందు తుందిలము. అది యొక వర్ణనకాని, కథ పట్టుగాని, ఐకాంతికమగు పాత్రైక మనోవస్థా చిత్రణము గాని, నైకపాత్ర సమావేశముగాని ఆ కావ్యమందలి ప్రతి సన్ని వేశము కళాకౌశల పేశలము.

కాదంబరిలో భంగ్యంతరమున 'వివిధవర్ణ శ్రేణీ ప్రతి పాద్యమానానేక నవార్థ సంచయ'మ్మని 'ఉత్కృష్ట కవి గద్య' ముగ్గడింపబడినది. అచ్చముగా అనవద్య గద్య విద్యాధరుడు బాణుని వాణి యట్టిద.

అర్థవంతమ్మైన ప్రతిశబ్దము నొక ఉక్తియే. అది యొక ధర్మముముగాని, నీతినిగాని, సత్యసన్నిహితమగు నొక విశిష్ట విషయముమగాని తత్స్వభావోచితముగా ఔపదేశిక ప్రతిపత్తితో నిర్వచించునెడల సూక్తియగును. ఇక దాని వైచిత్రియనగా అది రచనా విన్యాసమునకు సంబంధించినది. సుగమముగా, కతిపయపదఘటితముగా, ప్రతిపద సార్థక ముగా సూత్ర ఫక్కికముగా కథా సందర్భ సంవాదిగా చెప్పుట. ప్రాయికముగా సూక్తులు కూడ సూత్రప్రాయముగా నుండును.

"అల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతో ముఖమ్

అస్తోభ మనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః"

అని సూత్ర లక్షణము. ఇది సూక్తి రచనా ప్రతిపత్తికిని సావ గీటు.

సమస్త విస్తృతిగల బృహత్కావ్యములలో సూక్తి విక్షే పమున కవకాశ మెక్కువ. అయితే అది అందరికిని సాధ్యపడు విషయముగాదు. ఋషికల్పులు, జగత్కల్యాణకాంక్షులును, క్రాంతదర్శనులు, ధర్మప్రవణులు, శబ్ద లక్షణ విచక్షణులును, షెల్లీ చెప్పినట్లు 'Unacknowledged Legislators of the World' సు అగు మహా కవులకు మాత్రమే సాధ్య పడునది. ఆ విక్షేప మపదేశ విక్షేపముగా, కావ్య సందర్భ సుందర ముగా, కాంతా సమ్మితముగా నున్ననే కావ్యధర్మ మక్షతమై అందగించును. వాల్మీకి వ్యాసాదులగు ఆర్ష కవుల కది వెన్నతో బెట్టిన విద్య. బాణ కాళిదాస భర్తృహరి ప్రభృతులు సాక్షాన్మ హర్షులు గాకపోయినను మహోన్నత సాహిత్య తపస్సంపన్ను లైన మహానుభావులు. వారి కావ్యములలో నట్టి సూక్తులు కో కొల్లలు. 'జగద్ధితంబుగ' మహా భారత సంహితా రచన బంధురు డైన మన నన్నయభట్టు 'నానా రుచిరార్థసూక్తి నిధి'. ప్రబంధ పరమేశ్వరుని 'సూక్తి వైచిత్రి'ని శ్రీనాథుడుగ్గడించి స్వీయ కావ్యములం దట నట ఆ వైచిత్రిని పరిఢవించినాడు. తక్కిన ఆంధ్ర మహా కవులు ననేకులు సూక్తి వైచిత్రిని పలు విధముల వెలయించినారు. వీరికిని, తదితర భారతీయ భాషా కవులకును సూక్తి విక్షేపవిషయమున ఒజ్జబంతులు దీర్చినది కాదంబరి.

ప్రకృతము బాణభట్టు కాదంబరీ పానకములోని ఆ మిరియపు బలుకులను గొన్నిటిని చవి చూతము.

బాణునికి మహర్షులయు, ఋషికల్పులగు మహాత్ములయు తత్త్వమునందు ప్రగాఢ ప్రత్యయము. వారి గౌరవాధిక్య మును బహువారములు బహుభంగులుగా పేర్కొనిగాని తనివి నసడు.

చిలుకను రక్షింపవచ్చిన ఋషి కుమారు నుద్దేశించి 'ప్రాయేణా కారణ మిత్రాణ్యతి కరుణార్ద్రాణి సతాం ఖలు భవంతి సదా చేతాంసి' అని సజ్జన హృదయము లకారణ మిత్రములు, నతి కరుణార్ద్రములు ననియు యుగ్గడించినాడు. అడిగినచో ఉపకారము చేయువాడు మధ్యముడు. అడుగక చేయువాడే ఉత్త ముడు. అందులకే సజ్జన హృదయము లకారణ మిత్రము లనుట. మధ్యమహృదయములలో కరుణాస్ఫురణ తాత్కాలికము. సజ్జనహృదయములు సదా కరుణార్ద్రములు. హారీతాసీతుడై శుక రూపమునసున్న వైశంపాయనుడు జాబాలిని దర్శించినపుడు 'అఘక్షయకారిణామ్ పుణ్యాని భవంతి నామ గ్రహణాన్యపి మహా మునీనాం, కిం పునర్దర్శనాని ?' అనగా పాపహమగు మహా మునుల పేరు స్మరించినజాలు పుణ్యములు గల్గును. వేరే దర్శన మెందులకు? అని వక్కాణించినాడు. ఎట్లును దర్శనమైనది గదా మరి యీమాట యెందులకు?—అన్నచో ఆ చూచిన దొక శుకము. శుకమునకు నామగ్రహణము సహజగుణము. కావున దాని చూపట్టి యూహాసై ప్రసరించుట సహజము.

ఆ యాత్రమపదమున అగ్నిదేవుడంజలి పట్టిన వానివోలె హవిస్సులను గ్రహించును. వాయుదేవుడు జంకు గొంకులతో మంద మందముగా సంచారములు సాగించును. అని చెప్పుచు జాబాలి ప్రశంసా నిమిత్తముగ మహాత్ముల తేజస్సులు మహాభూతములకును తిరస్కరింపరానివని 'ప్రాయోమహాభూతానామపి దురభిభవనీయాని భవంతి మహాత్మనాం తేజాంసి' అని చెప్పినాడు. అసలు మహాభూతములను కైవసము చేసి కొన్నవాడే మహాత్మశబ్దవాచ్యుడు. ప్రపంచ ప్రవృత్తికి మూలాధారములు పదార్థము, శక్తి (Matter and Spirit). పదార్థములకంటె శక్తి గొప్పదికదా. పదార్థము భూత స్వరూపము. శక్తి ఆత్మస్వరూపము. పదార్థ శక్తుల పరస్పర సన్నివేశమే అనుభవోత్పాదకము. అనుభవజ్ఞానము జ్ఞానేంద్రియ సన్నికర్షజన్యము. భూతగతమైన పదార్థ ధర్మమునకును, జ్ఞానేంద్రియగతమైన శక్తి స్వభావమునకును నొక సాధర్మ్యము గలదు.

భూతములు		జ్ఞానేంద్రియములు	ధర్మములు
పృథివి	—	త్వక్కు	స్పర్శ
ఆపస్సు	—	జిహ్వ	రసము
తేజస్సు	—	చక్షుస్సు	రూపము
వాయువు	—	ఘ్రాణము	గంధము
ఆకాశము	—	శ్రోత్రము	శబ్దము

జితేంద్రియులే మహాత్ములనబడుదురు. అనగా మహాభూతములును వారికి వశంవదములనుట (భూతగతమైనదిగా మనకు భాసించుశక్తి ఆ భూతములదికాదు. వారి వెనుకనున్న దైవముదా శక్తి అనికదా పెద్దలందురు.) అప్పుడే వారాత్మశక్తి సంపన్నులగుదురు. మహాభూతములకును వారు దురభిభవనీయు లనుటలో నింత యర్థ మిమిడియున్నది. మరియొకచో మహామునులసేవ అమోఘ ఫలోదర్కమనియు ('అమోఘ ఫలాహి మహామునిజన సేవా'), మహాత్ముల ప్రభావము అచింత్యము అనియు ('అచింత్యోహి మహాత్మనాం ప్రభావః'), ధర్మ పరాయణు లకు కల్యాణ సంపదలు సమీప సంచారులనియు ('ధర్మ పరాయణానాంహి సదా సంచారిణ్యః కల్యాణ సంపదా భవంతి'), సజ్జన సమాగమములు దుఃఖితులను కూడ నుల్లాసపరుచుననియు, ('దుఃఖితమపి జనం రమయంతి సజ్జన సమాగమాః'), ఇట్లనేక ప్రకారముల మహాత్ముల మహిమనుగ్గడించియున్నాడు బాణుడు.

ఇక దైవపురుషకారములగూర్చి బాణుని ఆభాణకములు: తారాపీడు డనపత్యతా శోకార్తయగు తన దేవితో 'నహిశక్యం దైవ మన్యథా కర్తు మభియుక్తై నాపి'—అభియుక్తులచేతనైనను దైవ మన్యథాకరింపబడజాలదనును. అన్యథాకరింపబడినచో అది దైవశక్తియేకాదు. అది అభియుక్తులకు అనగా ఆప్తులు, ఆసక్తులు, పండితులు—అట్టివారికిని అసాధ్యమనగా దాని మహత్త్వ విశదమగుచున్నది. ఇట తారాపీడు డభియుక్తుడని చెప్పక చెప్పుట. ఇక 'చిత్రంచ దైవమ్' 'బలవతీచ నియతిః' ఇట్లు మరీ టుష్టీ కంచంటి సూక్తులకు లెక్కయేలేదు. 'ఆత్మహాతినః కేవల మేనసా సంయుజ్యతే' (ఆత్మహత్య కుద్యోగించువారు పాపమునకు బాల్పడుదురని యర్థము)—ఇత్యాది సూక్తులు కొన్ని చక్కని విధి వాక్యముల హోదాలో నడచినవి గలవు.

సంసారము, సుఖ దుఃఖములను గూర్చిన యతని వక్కణలు: 'బహుప్రకారాశ్చ సంసార ప్రవృత్తయః' (సంసారగతులు బహువిధములు). ఇది మహాశ్వేత నోదార్చుచు చంద్రాపీడుడన్న మాట. సాంత్వన సందర్భములందిట్టి మాటలు బాగుగా అక్కరకు వచ్చును. శాపగ్రస్తుడైన చంద్రుని రూపాంతరమే చంద్రాపీడుడు. చంద్రుడు మనఃకారకుడు. కాదంబరిలో చంద్రాపీడు డుత్తమ మనస్వియైన పాత్రగా చిత్రింపబడినాడు. అతని కుచితముగనున్న దీమాట. అతడు మహాశ్వేత విరహగాథ వినుచు మధ్యలోనే సానుభూతి సాటమరించి మరి వినుట కశక్తుడనని చెప్పు సందర్భమున 'అతిక్రాంతాన్యపి సంకీర్త్యమానాని అనుభవ సమాం వేదనా ముపజనయంతి సుహృజ్జనస్య దుఃఖాని'—అనగా ఆప్తజనుల దుఃఖ కథలు గడచిపోయిననైనను (మరల) చెప్పబడునప్పుడు (వినునట్టి సజ్జనులకు) అత్యానుభవమట్లు సంతాపము గల్గించును—అను నొక సూక్తి యుటంకింపబడినది. ఈ యొక్క సూక్తిచాలును చంద్రాపీడుడు భావితాంతఃకరణ శిరోమణియని నిరూపించుటకు. అట్లే మహాశ్వేతకు కాదంబరీ విజ్ఞప్తి వ్యాజమున 'సుహృద్దుఃఖే ఖేదితేహి మనసికైవ సుఖాశా?'' అనుచో మరియొక మారు సుఖ దుఃఖ సందర్భములందు స్నేహగత సహృదయతా ధర్మతత్త్వము నిరూపింపబడినది. చంద్రాపీడప్రియవల్లభకాదంబరీమధురహృదయమున పాదుకొనియున్న సహృదయత్వమిట సమ్యగావిష్కృతమైనది. మరియొకచో 'విపద్వివదం సంపత్సంపద మనుబధ్నాతి' అనగా కష్టము వెంట కష్టము. సుఖమువెంట సుఖమును వచ్చుననెడివాని యొక్క పరంపరా ప్రవృత్తి స్వభావము సంప్రోక్తము. అయితే సుఖానుభూతులు తాత్కాలికములు, దుఃఖానుభవములు దైర్ఘ్య కాలికములు నైనట్లుగ తోచుట లోకసైజమను విషయమును గుర్తించినాడు బాణుడు. 'అనాయత స్వభావ భంగురాణి సుఖాని, ఆయత స్వభావానిచ దుఃఖాని' అని వక్కాణించినాడు. శబర సీడాకర్షితమగు శుకపోతము స్వగతముగా 'అతి కష్టాసు దశాస్వపి జీవిత నిరపేక్షా న భవంతిఖలు జగతి ప్రాణినాం ప్రవృత్తయః, నాస్తి జీవితా దన్యదభిమతతరమిహ జగతి జంతూనాం' అని యెంతకష్ట దశలో గూడ జీవులకు ప్రాణములన్న నెంతో తీపి యను విషయ ముద్ఘాటించినాడు.

శృంగార భావస్పర్శగల విషయములందును మిగుల చురుకైనది బాణవాణి. స్త్రీ హృదయ తత్త్వమునంతటి నొక్క ముక్కలో చక్కగా మూసకట్టినాడు—'అతిగాఢం హృదయ మంగనా జనస్య' 'నవన్నీ కరణం నారీణాం ప్రధానం కోపకారణం' అని—సిగ్గును గూర్చి 'కన్యకాజన సహజా లజ్జా' 'వనితాజనస్య సహజ మాభరణం లజ్జా' అని కాంతాత్వ ప్రతిపత్తికి దాని సహజత్వ— ఆభరణత్వ యోగ్యతలయనుబంధము

విశదీకరించినాడు. 'సక్షమం తే దీర్ఘకాల మవ్యాజ రమణీయం ప్రేమ'—అనగా ప్రేమయనునదొక నెపమును గిపమును లేకయే నిసర్గముగా మనోజ్ఞమైనదనియు, అట్టిప్రేమ దీర్ఘకాల విరహమును భరింపలేదనియు 'ఏకస్మిన్ జన్మని సమాగమో జన్మాంతర సహస్రాణి చ విరహాః ప్రాణినామ్' అనగా ప్రాణుల (ప్రణయ జీవుల) సమాగము మొక జన్మలో నయితే విరహము వేయి జన్మలనియు (అది వేయి జన్మల విరహ ఫలితమనియు) ప్రేమ, సంయోగ వియోగముల తత్త్వము నావిష్కరించినాడు.

మన్మథ ప్రభుత్వమును గూర్చిన యతని సూక్తులతి మాత్రమనోజ్ఞము లనుపదసురుచిరములు. అవి యొక అనుభవశాలి హృదయమునుండి దూసుకొనివచ్చినట్లుండును. ఒకచో, 'అప్రార్థితానుకూలో మన్మథః' అనియు, ఒండొకచో అతడు 'అనారాధిత ప్రసన్న'డనియు చెప్పబడినది. ప్రార్థింపబడకుండ ఆరాధింపబడకుండ ఏ దేవుడును ప్రసన్నుడుకాడుగాని, సర్వదేవతలందును, మన్మథు డొక్కడే సంకల్ప మాత్రమున సద్యః ప్రసన్నుడగువాడు. అడుగకవచ్చి వరాలిచ్చు దొడ్డ దేవుడు. మహానుభావుడు. అతనికి పూజా పురస్కారము అవసరములేదు. అనలత దుసాహ్య దైవతము. కేవలము ధ్యాన గమ్యమౌ దేవర ప్రభావము. ప్రపంచములో నిరీశ్వరవాదమును చాలప్రాచీనమైనదే కాని సృష్ట్యాదినుండియున్న ఈ దేవుని విషయములో మాత్రము నాస్తికబుద్ధిగలవారు నాస్తి. ఇంకను ఆ మహానుభావుడేలాటివాడనగా 'అవిచారిత గుణదోష విశేషో, రూపైక పక్షపాతీ, నవయౌవనసులభః కుసుమాయుధః'—అనుట ఆయన పట్ల కేవలము స్వభావోక్తి. ఉన్న దున్నట్లు చెప్పిన ప్రశంస యెట్లగును? అందుచే మరియొకచో బాణు డతని కిచ్చిన కితాబు 'అనేక సురత సమాగమ లావ్య లీలోపదేశోపాధ్యాయః' అని సురత సమాగమునకు లావ్యలీలతోడి రూపకము, ఆ యుపదేశ ముద్రాధికార మాచార్య మన్మథుని దనుటయు హృదయంగమములు. అతడట ఏకాంత సంకేత ప్రదేశముల కేకాకినులై యేగు అభిసారికల రక్షణార్థము సజ్యకార్ముకుడై యనుసరించువాడట! అకారణ మిత్రుడు మహానుభావుడు. అభిసారికలకిక బాహ్యపరిజనావశ్యకతయే ముండును? 'ప్రియతమాభిసరణ ప్రవృత్తస్య జనస్య కిమివ కృత్యం బాహ్యేన పరిజనేన, సహైవ ఏవ పరిజన లీలాముపదర్శయంతి, తథాహి, సమారోపిత శరాసనాసక్త సాయకోఽనుసరతి కుసుమాయుధః'' అని బాణవాక్కు. ఇట బాహ్యశబ్దోపయోగమున మన్మథు డంతరంగ పరిజనుడను సర్థము ధ్వనింపబడినది. మరియొకచో అతని "ప్రజ్ఞా ప్రాభవమిట్లు ప్రశంసింపబడినది—'అతనురేష హుతాశనః తథాహి—అప్రకాశయన్ జ్వాలావలీః సన్తాపం జనయతి; అప్రకటయన్ ధూమపటల మశ్రుపాత యతి; అదర్శయన్ భస్మరజోనికరం పాండుతామావిర్భావయతి'—అంటే మన్మథు డగ్ని భట్టారకునంతవాడట' అంతవాడేమి అతనికంటెను ఘనుడు. అవును మరి మంట కనిపింపకుండగానే మాడ్చగలడు. పొగ పగపర్చ కుండగనే కన్నీరు కార్పించగలడు. బూది పొగల కువ లేకుండగనే యొడలికి పాండుతనాపాదింపగలడు. అశ్రుపాత వైవర్ణ్యములు సాత్త్విక భావములు. సంతాపము మన్మథావస్థలలో నొకటి. ఆ యవస్థలు దశవిధములని కాదు ద్వాదశ విధములని పోటీలు పడినా రాలంకారికులు. అవది పండ్రెండేకాదు. నానావస్థలుపడు మహానుభావు లనేకులు గలరు. లోకములో ('సిద్ధిర్లోకాద్ధ్యవశ్యా!'). అతని ఆయుధములు—ఆశీవిష విషవేగ విషయము'లని యన్నాడు బాణుడు. అతడు సామాన్యుడా మరి! అందులకే 'నాస్తిఖల్వసాధ్యం నామ భగవతో మనోభువః' అనగా భగవంతుడైన మనోభవున కసాధ్యమన్నది లేదని –('అచింత్యోహి మహాత్మనాం ప్రభావః!') – 'సర్వథా నమో భగవతే త్రిభువనాభ్యర్చిత శాసనాయ మకర కేతనాయ' అని మహాశ్వేత జాలి కథ విన్నసహృదయుడు చంద్రాపీడుని స్వగతము వ్యాజమున ఆ మహానుభావుని పైతాను నొక నమస్కారబాణము పడవైచినాడు భట్టబాణుడు.

ఇక మరికొన్ని విషయములగూర్చి బాణ సూక్తుల బాణీ యెట్టిదో చూతము:—

'అవితథ ఫలాహి ప్రాయో నిశావసానసమయే దృష్టా భవంతి స్వప్నాః'—ఇది వేకువజామున వచ్చుకలలు ఫలోదర్కములను భారతీయ విశ్వాసమునకు ప్రతీక. అందు 'ప్రాయః' అని కవి చూపిన జాగరూకత గమనార్హము.

'గర్భేశ్వరత్వ మభినవ యౌవనత్వ మప్రతిమరూపత్వ మమానుష శక్తిత్వం చేతి మహతీయం ఖల్వనర్థ పరంపరా—సర్వావినయానా మేకైకమప్యేషా మాయతనం, కిముత సమవాయః'—ఇది చంద్రాపీడోద్దిష్టము శుకనాసోపదేశ సందర్భము సందలిది. చంద్రాపీడు డీ చెప్పబడిన గర్భేశ్వరత్వాది లక్షణములన్నియు నమరినవాడు. ఆ లక్షణము లొకప్పుడొక అనర్థ పరంపరకును దారితీయవచ్చును. అందేయొక్కటైనను అవినయము లన్నిటికిని స్థానము కాగలదు; అన్నియు కూడినచో నిక చెప్పెడిదేమియని తాత్పర్యము. చంద్రాపీడునకా యదనున నట్టి యుపదేశ మవసరమే. అయితే అది చంద్రాపీడునకేగాదు లక్షణములు గలవారందరికిని సర్వదావశ్యకమే యగును.

కొన్ని సూక్తులు మరీ చిన్న వయ్యును చిక్కణభావములై నిర్వచనప్రాయములై యొప్పుచున్నవి.

ఉదా : 'అపుత్రాణాంకిలగతిర్నాస్తి
న హి సంతి లోకాః శుభాః

(కొడుకులులేనివారికి గతులుండవు. పుణ్యలోకములు గల్గవు.)

'పున్నామ్నో నరకా త్త్రాయత ఇతి పుత్రః'

(పున్నామ నరకమునుండి రక్షించువాడు పుత్రుడు. ఇది పుత్ర శబ్ద వ్యుత్పత్తి నిరూపకముగా నున్నది.)

'అవిదిత స్నేహ శోకాయాస మనోహరం శైశవమ్'

(స్నేహమనగా నేమిటో, శోకమనగా నేమిటో, ఆయాసమనగా నేమిటో నెరుగబడనిది (అగుటచే) మనోహరమైనది పసితనము.)

బాణ సూక్తు లిట్లు బహువిషయోపగూహన సమర్థములై, సందర్భ మంజుల సుందరములై, ప్రతిపద సార్థకములై, అతనిలోకజ్ఞతకు, నీతిజ్ఞతకు నికషోపలరేఖలై ప్రాజ్ఞతా పతాకలై పరిఢవిల్లుచున్నవి.

బంగారు భూమి

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

ఏమి సుబ్బయ్యా! మీ వార లెపుడు లేచి
యెపుడు చేసిరి యీ పను! లపుడె కమ్మ
కమ్మగా సాగె మీయింట గారెముక్క
లుడుకు వాసన; యీ రాత్రి నడుము వాల్చి
నట్లె తోఁచుట లేదు మీ యాఁడువారు;
ఎన్ని ముగ్గులు! తోరణాలెన్ని! యెన్ని
యెన్ని పూలదండలు! పండుగల్ల వచ్చి
నీటుగా నేఁడు మీయింటఁ బీఁటవెట్టె
గోఁటుగా నేఁడు మీయింటఁ గొలువుదీరె

* * * *

రావయ్యా! రామభద్రయ్యా! రాక రాక
వచ్చితివి మంచివేళకే! బాగు! బాగు!
బల్లమీఁదఁ గూర్చుండుము; పనులు తేలి
వచ్చెనా? పాఁడికలదుగా! బావగారు
తిందు రొకపట్టుగారెలు తెచ్చిపెట్టు
మోసి జానకీ! గిన్నెకుఁ బోసి నేయి
కూడఁ గొనితెమ్ము! భద్రయ్యా! క్రొత్తచోటు
గాదు, కానిమ్ము, వెనుకాడఁగాఁ బనేమి?

* * * *

చాలు నీకేఁ జాలు సుబ్బయ్యా! చాలు; నాది
కనుపు గాని చెఱువు కాదుగద! బలే తె
గింపుచేసితి; వౌనులే! గింజ లెన్ని
రాలె నీయేఁడు నీ; కహో! నాలు గైదు
కట్టితివి పెద్ద పురులు; సంక్రాంతి సిరులు
సర్వమును నిన్నుఁ జేరె; నుత్సాహమునకు
నెట్టి కొఱఁతయు లేని నీ విపుడు లక్ష
విందులైనను జేసెద వందఱకును;

* * * *

కాదు భద్రయ్యా! దైవము కలిసివచ్చి
జాయవానలు కురిసె నీపాలునందు;
విసమువంటి తప్పుడుగాలి విసరదాయెఁ;
జలియు నెండయు వాలుగాసాగ; మఱియుఁ
బంటకాల్వలు ముఱుగుకాల్వలును దీర్చి,
మంచికత్తుల నెరువులఁ బంచిపెట్టి,
నాటునకుఁ దగ్గపూత్రిముల్ తేటపఱిచి,
తెగులు నరికట్టు మందులు తెచ్చియిచ్చి,
యంత్రమైన వడ్డీలకు నప్పు లొసఁగి,
దొరతనమువారు పెక్కురీతులను సేద్య
గాండ్రకున్ దోడుపడినారుగాదెఁ బంట
గొప్పగాఁ బండెఁ; దొండలు గ్రుడ్లుపెట్టు
పొలము లీనాఁడు బంగారుభూములయ్యె;
నోడలు వంచి కష్టించుట కొప్పకొనని
సోమరులచేలసంగతి కేమిగాని
చెమ్మటోడ్చి భూదేవిని నమ్మి కొలుచు
కాఁపుల పొలాలు వరహాల కాపు గాచె;
వెనుక నెకరాన కొకపుట్టి ఘనముగాని
యిప్పుడో రెండు పుట్లైన నేమిగొప్ప?
యెంతకాలము తెల్లవాఁ డేలలేదు?
నాఁడు మన కిట్టిమే లొనగూడెనా? మ
హాత్ముఁడా గాంధిగారిపుణ్యాన యుగయు
గాల పాపములన్నియుఁ గూలి కూలి
బానిసముత్రాడు తెగి, పీడవదలి, వచ్చె
దేశమునకు స్వరాజ్యము; దిక్కుమొక్కు
లేనిపల్లెల నొకపొంగు కానిపించె

* * * *

నిజము! నీ వన్న దంతయు నిజము! గాని
సుబ్బయా! గోడకుఁ బునాది శూన్యమయ్యెఁ;
బంట పెరిఁగె; నూరూరను బాఠశాల
పుట్టె; బాటలేర్పడె; బారుబూరు మనుచుఁ
బరుగుదీయుచునుండెను బస్సు; లింట
నింటఁ దళతళలాడుచు నెగసె మెఱుపు
దీపములు; లోపములు పెక్కు తీఱెఁ; గాని

నీతినియమాలు దిగజాతె జాతిలోన;
పొలము పండినఁ జాలునా? బుద్ధికూడఁ
బండవలయుఁగదా! తన బాగు తప్ప
నిరుగుపొరుగువారల బాగు నెంచువాఁడు
చిక్కునా నేఁడు నూటికి నొక్కఁడైనఁ?
బట్టణాలన రే! మనపల్లెలందు
నెంతస్వార్థము! తలబిఱు సెంత పెరిఁగె!
నెంతయీసు! దురభిమాన మెంత రేఁగె!
నెంతకుట్ర! యసత్య మదెంత హెచ్చె!
నేఁగతికిఁ బోవునో దేశ; మిది యధర్మ
మనిన పెద్దలమాటకు నావగింజ
పాటి విలువయు లేదాయెఁ; బల్లెపల్లె
కేర్పడె ముఠాలు నాలుగై; దేమి బావు
కొనుటకో చిన్న పదవికిఁగూడ వేలు
కుమ్మరింతురు మొనగాండ్రు కొండ్ర నమ్మి;
కూటికిని గుడ్డకును లేక గోడుగుడుచు
పేదవంకకుఁ జూడరు; వీరియందు
లేదు దయ; లేదు ముందుచూపు; లేదు ప్రేమ;
లేదు వినయము; లేదు మర్యాద; లేదు
పాపభీతి; యీమూఁకను బాగుపఱుచు
నాథుఁ డెవ్వఁడో తెలియక బాధపడెద;

* * * *

భద్రయ్యా! నాకుఁగూడ నీబాధ కలదు,
కాని మన మేమి సవరింపఁగలము? నేఁటి
యాగడము లాఁప భావేమహర్షి వంటి
వారె సతమతమగుచున్నవారు; నూఱు
చట్టములు వచ్చినను మాఱునట్టి తెగులు
కాదు కాదిది; కాల మొక్కటియె చక్కఁ
జేయవలయును దీని; నమ్మయ్యా! జాన
కీ! యెచట నుంటివో! యింత పాయసమును
దీసికొని రావె! బావకు; దీనిఁగూడ
భద్రయ్యా! పుచ్చుకొను; మావుపాలతోడ
వండి రీపాసెమును; మాకు రెండుకోడె
దూడ లీయేఁడు పుట్టెను; జూడు; మవిగో!

జంటమెడ, ముద్దమూఁపుర, మంటుబొడ్డు,
ముట్టికుఱుచ, గుజ్జుపుగిట్ట, పొట్టిపోఁక,
వెన్నుబారు, కాటుకకన్ను, చిన్నచెవులు,
వెల్లవన్నెయు జోడుగా వెలసి యూడ
లచ్చముగ రామలక్ష్మణులై యుండుఁ;
గోరతెలకట్టు వచ్చెనా కోరఁదగిన
కవళికలు వీని కిం కేమి కలవు చెపుమ!
వామిదిబ్బను బూచినబంతిపూల
నెల్ల మాపిల్ల లీడతకే యలంక
రించినారయా! యివి కాఁడి క్రింది కెపుడు
వచ్చునో భాగ్యములు పండివచ్చు నపుడు

* * * *

మంచిమాట వింటిని! మఱి మాఖమాన
మందు మనజానకికి వివాహమునుశేయు
దృష్టిలో నుంటివా? తగ్గయీడుకూడ
వచ్చెఁగా పిల్లదాని; కే వంక నైన
నైనసంబంధ మున్నదా? యదియు నిదియు
నడిగితిని సుబ్బయా! కోపపడదవేమొ!

* * * *

బెదరకుము తప్పలేమి చెప్పితివి? కాని,
మాటలా యీఁడుపిల్లకు మనకుటుంబ
ముల వివాహము? భద్రయా! పొలము, నగలు,
కానుకలు, కట్నములు హద్దులేని ఖర్చు
లెన్నియో చూడవలెఁగదా! మన్ను మిన్ను
జోరుకొనునట్లు కట్నాలు పుచ్చుకొనుట
తగదనుచు నుపన్యాసాలు దంచినట్టి
దేశభక్తులే, చట్టాలు తెచ్చినట్టి
పెద్దలే చాటుచాటుగా బిడియ మూడ్చి,
బిఱ్ఱబిగిసి, తెగించి మాపిల్లవాని
కెకరమునకు రెండెకరాల నిమ్మటంచు,
విద్యకై కొన రొకపదివే లటంచు
బేరములు చెప్పసాగి; రీపెండ్లి చదువు
బువ్వకా? బట్టకా? భూమిబుట్ర లమ్మి
యెదురుపెట్టి యుద్యోగము లిచ్చువారి

బ్రదుకు లెవ్వ రెఱుంగరు? పిదప బుద్ధు
లేర్పడెన్ బ్రజ; కీదాహ మెట్టులున్న
మంచిమనువు కావలెఁగదా! మాకు, నైన
వారిలో జతపడు కుఱ్ఱవాఁడు లేఁడు;
వాడవాడల మే మాడనాడఁ గొన్ని
జాడలను దీసితిమి; గాని సంప్రదాయ
మున్న వియ్యము తగులలే; దెన్నిలక్ష
లా స్తియున్నను గుణగణా లమరనపుడు
నేను దల డూఁపఁజాల నే పూనో కొనకు!

*　　　*　　　*　　　*

కథ యిదా! చెప్పినాఁడవు కావు! నీకుఁ
దగినయల్లుఁడు మాపినతల్లికొడుకు
కలఁ డయా! నేఁటిచిలిపిపోకడలు వాని
కంటలే; దెంత చదివిన నతఁడు పొలము
పాటు మానఁడు; వేషాలనీటు మరగి
కులుక నొల్లఁడు; బురదనాఁగలియు దున్న;
నప్పనము సేద్యగాఁడుగా, నందఱకును
మంచివాఁడుగా మెలఁగును; మాగిలియును,
మెట్టయును నాలుగరకలగట్టికొండ్ర
వాని కున్నది; పదివేలు వడ్డిమీఁద
నడుచుచున్నవి; బలఁగ మెంతయును గలదు;
పెద్దలోఁగిలి కలదు; నీయొద్ద మిగులఁ
బుచ్చుకొనువాఁడు కాఁడు; నీబుద్ధి కితఁడు
నచ్చ ననుకొందుఁ; జూచిరావచ్చు నీవు

*　　　*　　　*　　　*

మంచివార్త చెప్పితివి! నీమాట చాలు
భద్రయా! దైవ మనుకూలపడిన, జనుము,
మినుము గక్కిక్కనంతనే మనము నిశ్చ
యించుకొందుము లగ్నము; నిదిగో! మఱచి
నాఁడ నొకటి; జానకిపెండ్లినాఁడు పులుసు
ముక్కలకు వచ్చెఁ గాని మామూలచేను
గట్టుమీఁదను గుమ్మళ్లు కాచెనంట!
దాఁచిపెట్టు, ముహూర్తముదాఁక నాల్గు
మంచిపండ్లు; నామాటలు మఱచిపోకు!

(ఆల్ ఇండియా రేడియోవారి సౌజన్యముతో.)

వ్యాకరణసంహితా సర్వస్వము - దాని పరామర్శము

శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి

(గత సంచిక తరువాయి)

III. వీరి మఱికొన్ని యపసిద్ధాంతములు

(ఇది మూడవ యాక్షేపము)

ఈ శీర్షకము చాలఁ బెద్దదిగాఁ గానవచ్చి, ఏవో చాల నపసిద్ధాన్తములు నావి వీరు ఖండించినట్లు లోకమును భ్రమపెట్టును. ఇందులకే శ్రీ శాస్త్రులుగా రీ శీర్షకము నిట్లుంచిరి. మరికొన్ని యపసిద్ధాన్తము లనుటవలన నిదివరలో నేవో కొన్ని యున్నట్లు స్ఫురించును. ఇంతకుముందు వీరు చూపిన నా యపసిద్ధాన్తము లేవియుఁ గావరావు. 'వ్యధికరణ బహువ్రీహి, త్రిలోకములు'— అనువాని విషయమున వీరే ప్రమాదపడియున్నారని నిరూపించియే యున్నాను. ఇఁక నీ శీర్షకముక్రింద వీరు నా యపసిద్ధాన్తములని యుదాహరించినవో 'పాణినీయము—కావ్య వాఙ్మయము' అను నా గ్రంథమున సప్రమాణముగా సిద్ధాన్తములని నేను నిరూపించినవే! శాస్త్ర సంప్రదాయముల సరిగా నెఱుఁగని, వీరు వానినిజూచి విస్తుపోయిరి. తమ వాదమును సమర్థించుకొను నభిలాషముతో నందలి నా వ్రాఁతలఁ గొన్నిటి నపలాప మొనర్చిరి. కొన్నిటి కన్యథా వ్యాఖ్యానము లొనర్చిరి. మఱికొన్నిటిని హాస్య జనకములగు చమత్కారములతో మఱుఁగు పఱపఁజూచిరి. అవి యెట్టివో విశదపఱచెదను. ఈ సందర్భమున శ్రీ శాస్త్రులుగారు "శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రులుగారు స్వవాదానుకూల్యమునకై వింత వింతలు వ్రాసి"రనిరి. ఆ వింత వింత లివి :—

(1) కావ్యకర్తలు ప్రమాదపడినప్పుడు శాస్త్రకర్తలు గౌరవార్థమై వానిని ఛాందసములు వార్షములు నని చెప్పుదురఁట! మహాకవి ప్రయోగములను బ్రయోగ శరణులగు వైయాకరణులు తప్పులని చెప్పుట యెట్లు పొసంగును? (పాణి.కా. 68 90, 91.)

(2) పాణినీయమునకు మంచి వ్యాఖ్యలు పుట్టనికాలపుఁ బ్రాచీన మహాకవులు సాధువు లనుకొని కొన్ని యప ప్రయోగములఁ జేసిరఁట !

(3) సూత్రములను గల్పించి షిత్తులగు ప్రత్యయము లను విధించి, గాత్ర నేత్రాది శబ్దములను సాధించుకొన్నచో ఙీప్ప్రత్యయము సుప్రాప మగునఁట! (పాణి. కా. 50. 51)

(4) ఒక్కొక్క వ్యాఖ్యాత యొక్కొక్క రీతిని సూత్రముల సమన్వయించునప్పు డందు దేనిచేతఁ బ్రయోగము సరిపడినను సరిపడినదనుకొనఁదగునఁట! అం దేదియు శాస్త్ర విరుద్ధ మనరాదఁట! దేనిచేఁ గుదిరిన ప్రయోగము దానిచే సాధించుకొన వలసినదే! (పాణి. కా. 47)

ఇవియే శ్రీ శాస్త్రులుగారు నా యపసిద్ధాన్తములని యుదాహరించినవి. వీనికే యింతటి మహాశీర్షకమును వీరుంచినది. వీని నన్నిటిని గ్రమ క్రమముగా విమర్శించి యిందలి పరమార్థమును నిరూపించెదను.

(1)—మొదటి విషయమును గుఱించి పాణి. కా. 109 పుట, 4, 5 పుటలు సమగ్రముగాఁ జూడఁగోరుచున్నాను. శ్రీ శాస్త్రులవారి కవియే సమాధాన మీయఁగలిగియున్నవి. మరల నా సమాధానము చర్విత చర్వణమే! కాని, కొన్ని క్రొత్త విషయముల ముచ్చటించుటకై సమాధాన మొసఁగ నుపక్రమించెదను. పెద్దలు ప్రమాదపడినపుడు, ప్రమాదమనుటకు బదులుగా గౌరవ దృష్టితో 'చిన్త్యమ్, మృగ్యమ్, ఆర్షః, అర్షత్వాత్సాధుః, ఛాన్దసః, ఛాన్దసత్వాద్వ్యభ విస్మృతి' మొదలగురీతిని వచించుట శాస్త్ర సంప్రదాయసిద్ధము. ఇదియే నేను వచించినది. శాస్త్రజ్ఞు లెవరును దీనిని గాదనరు. శ్రీ శాస్త్రులుగారికిది యొక వింత విషయముగాఁ గానవచ్చుట యొకవింత! 'యూస్త్ర్యాఖ్యౌ నదీ' (1. 4. 3) అను సూత్రమున 'ఛన్దోవత్కవయః కుర్వన్తి, న హ్యేషా ఇష్టిః' అని మహాభాష్యకర్త స్పష్టముగాఁ దెలిపినాఁడు. ఇట 'న హ్యేషేతి' అసాధవః వై ప్రమాదయః; నతు తత్ప్రామాణ్యాత్ సాధుత్వ వ్యవస్థా' అని కైయటుఁడు స్పష్టముగా వ్యాఖ్యానించియున్నాఁడు. నేను వివరించి ఈ విషయము నెంతో విపులముగా విప్పిచెప్పియే యున్నాను. (చూ: పాణి, కా . 4, 5 పు). వీరు 'స్వవాదానుకూల్యమునకై నేనేదో వింత వింతలు వ్రాయుచున్నా' ననెదరేమి? మహాభాష్యకర్తయే కదా! ముక్తకంఠముగా నీ విషయమును జెప్పినది.? దానినేకదా! నేను జెప్పినది? వ్యాకరణ వ్యాఖ్యాతలందఱు నపమార్గములు త్రొక్కి యప వ్యాఖ్యానము లొనర్చి రనుచున్నను, మహా భాష్యకర్త ప్రామాణికుఁడు కాఁడని వీరింకను ననలేదుగదా! 'ఆర్షః' 'ఛాన్దసః' మొదలగువానికి నేను జెప్పినది యర్థము కాదని వీ రను నప్పుడు, తా మేమని యర్థము చెప్పెదరో? యెట్లే మహా

భాష్యమును సమన్వయించెదరో చెప్పరేమి? ఒకరి యొక్క సిద్ధాంతమును నిప్పు డిట్టి పనియేకదా! ప్రతివాదులకుఁ గర్తవ్యము. అట్టి దేదియుఁ జేయక, యిచ్చిన వాద ప్రమాణముల స్పృశింపనైన స్పృశింపక యుపలపించి, పెద్ద పెద్ద శీర్షికముల మాత్ర ముంచి యూరక మాటలతో వల్లిక లల్లినంతనే శాస్త్రీయ సిద్ధాంతము లెల్ల నపసిద్ధాంతము లెట్లగును? ఇఁక 'ఆర్షః' 'ఛాన్దసః' మొదలగువానికి 'ఋషిప్రోక్తము లగుటంబట్టి యాదరణీయములు; అస్మదాదులకును బ్రయోగార్హములు; సాధువులు, అను నర్థమును వీరు చెప్పెదరా? అట్లైనఁ బై మహాభాష్య మెట్లు సరిపడును? 'న హ్యేష ఇష్టిః' శాస్త్ర వ్యవస్థాపకములగు ప్రామాణిక ప్రయోగము లవి కావని స్పష్టముగా నిర్వచించుచున్నాఁడే! 'అసాధవో నైవమాదయః' అని కైయటు ముద్ఘోషించుచున్నదే! ఇట నుద్ద్యోతమున నాగేశుఁడే మనుచున్నాఁడో చూడుఁడు! 'అసాధవ ఇతి' ఋషీణాం తపో మాహాత్మ్యాత్తు తదుచ్చారయితౄణా మస్మాకం న ప్రత్యవాయ ఇతి బోధ్యమ్'. చూచితిరికదా! 'ఛాన్దసాః' 'ఆర్షాః' అనెడి ప్రయోగము లసాధువులు. ఐనను వాని యుచ్చారణమున నస్మదాదులకుఁ బాపము సంభవింపదు. అందులకు వారి తపః ప్రభావమే కారణము. అసాధువులు ప్రయోగార్హములు కావనుట వేఱుగాఁ జెప్పనక్కరలేదుగదా! మహా భాష్యకర్త యీ విషయమును జెప్పియే యున్నాఁడుకదా! ఇది గాక, భాగవతాదులలో ఛందస్సు (శ్లోక లక్షణము) తప్పినప్పుడు కూడ 'ఆర్షః' 'ఛాన్దసః' అనుటగలదు. చూ: "భద్రాశ్వం కేతుమాలం చ భారతం చోత్తరాన్ కురూన్, కింపురుషాదీని వర్షాణి విజిత్య జగృహే బలిమ్" (భాగ. స్కం. 1, అ 16 శ్లో. 13) ఇచ్చట 'కింపురుషేత్యత్ర వర్ణాధిక్యమార్షమ్' (భావార్థదీపిక—శ్రీధరాచార్యస్వామి). ఆచార్యస్వామి యేమనుచున్నాఁడో! చూచితిరా? 'కింపురుషాదీని వర్షాణి' అనుచోట 'వర్ణాధిక్యమార్ష'మనుచున్నాఁడు. ఎనిమి దక్షరములతో నుండవలసిన యనుష్టుప్పాదము (ఆర్షమగుటంబట్టి) తొమ్మి దక్షరములు గలదిగానైన దనినాఁడు. ఐనను నీ శ్లోక పారాయణమున నస్మదాదులకుఁ బైరీతిని బ్రత్యవాయము మాత్రములేదు. ఇట శ్రీ శాస్త్రులుగా రభిప్రాయపడునట్లు, తొమ్మిది యక్షరముల తోడి యనుష్టుప్పద్యమును మనమును రచింపవచ్చును. అది ఛందశ్శాస్త్రానుశిష్టమే! యనితాత్పర్యమా? ఇట్టి యభిప్రాయము నెవరైన నంగీకరింతురా? ఈ యల్ప విషయములు గొండంతలుగాఁజేసి యింతగా వీరికి బోధింపవలసి వచ్చుట దురదృష్టము. ఈ శాస్త్రీయ సంప్రదాయము లేవియు వీరికిఁ బరిచితములుగాక పోవుటవలననే వీరి గ్రంథములలో నెన్నియో యపవ్యాఖ్యానములు శాస్త్రదూరములుగా నడచి, నన్నయాథర్వణుల హృదయములకు దూరములై, వారి శాస్త్రజ్ఞత్వమును సైతము తుడిచిపెట్టినవి. (చూ. 'సన్నిర్ణాచోద్యమతః' 'శాస్త్ర ప్రయుక్త వచసః' మొ.). ప్రకృత విషయ మది కాకుండుటచే వాని నిట వివరింపక వదలుచున్నాము. ఇఁక శ్రీ శాస్త్రులుగారు "మహా కవి ప్రయోగములఁ బ్రయోగ శరణులగు వైయాకరణులు తప్పని చెప్పుట యెట్లు పొసఁగును?" అని ప్రశ్నించుచున్నారు. వీరు "ప్రయుక్తానా మిద మన్వాఖ్యానమ్, 'ప్రయుక్తానా మిద మన్వాఖ్యాన'మ్మని కూడ నెన్నియో పర్యాయము లుగ్గడించుచుందురు. నా 'పాణినీయము—కావ్య వాఙ్మయము'న 'పృషోదరాదీని యథోపదిష్టమ్' అను సూత్రమునందలి భాష్యమును సమన్వయించునప్పు డీ విషయమును వివరించియే యున్నాను. శ్రీ శాస్త్రులుగారు దానిని సరిగా నర్థము చేసికొనకపోవుటచే గాఁబోలు! మరల మరల నిట్లడుగుచున్నారు. ఈ విషయము నింకను విశదపరచి వీరి ప్రశ్నమునకు సమాధాన మొసఁగెదను. సంస్కృత వ్యాకరణమునకు శిష్టుల ప్రయోగములే యాధారము! శిష్ట ప్రయుక్త శబ్దములకే వ్యాకరణము సాధుత్వ బోధకము. శిష్టలక్షణము 'పృషోదరాదీని యథోపదిష్టమ్' మొదలగు సూత్రములకడ మహా భాష్యమున వివరింపఁబడినది. శబ్ద బ్రహ్మ సాక్షాత్కారముగల మహానుభావులు శిష్టులు. ఆవరణాచ్ఛాదనములేని వారగుటచే వారికి భ్రమ ప్రమాదములు సంభవింపవు. కావుననే, వారి ప్రయోగములు శాస్త్రమునకుఁ బ్రమాణము. భ్రమ ప్రమాదములకు లోనగు నస్మదాదుల ప్రయోగములు శాస్త్ర వ్యవస్థాపకములు గావు. మహాకవులును, నస్మదాదులలోనివారే! కాన, మహాకవి ప్రయోగములైనను శిష్ట ప్రయోగములకు విరుద్ధములగునప్పు డసాధువులే! మహాకవులు శాస్త్రము ననుసరింపవలసినవారు. శాస్త్రము వారి ననుసరింపదు. 'ప్రయుక్తానా మిద మన్వాఖ్యానమ్' అనుచో 'ప్రయుక్తానామ్' అనుదానికి 'శిష్ట ప్రయుక్తానామ్' అనియే యర్థము మహాభాష్యమున వివక్ష-(1) ప్రాయోక్త్రీ (వివక్ష), (2) లౌకికీ (వివక్ష)—అని రెండు విధములుగా విభజింపఁబడినది. మొదటి వివక్ష యస్మదాదులది. రెండవ వివక్ష శిష్టలోకమునకుఁ జెందినది. మొదటి వివక్షకుఁ జెందినవారే మహాకవులు. రెండవ వివక్షయే వ్యాకరణ శాస్త్రమున కాధారము. ఈ విషయమంతయు 'త దస్య త దస్మిన్ స్యా దితి' (5—1—16) మొదలగు సూత్రములలోని మహా భాష్యమున వివరింపఁబడినది. శిష్టప్రయోగమే వ్యాకరణ శాస్త్ర వ్యవస్థాపకమని మహా భాష్యకర్త యెట్లు విశదపఱచినాఁడో! తిలకింపుఁడు:—"'శిష్టప్రయోగా దాణవయత్యాదీనాం నివృత్తిః' శిష్ట ప్రయోగా దాణవయత్యాదీనాం నివృత్తిర్భవిష్యతి సచావశ్యం శిష్ట ప్రయోగ ఉపాస్యః యేఽపి పశ్యన్తే తేషా మపి విపర్యాస నివృత్త్యర్థః; లోకేహి కృష్యర్థే కిసిం ప్రయుజ్యన్తే; దృశ్యర్థే చ దిశిమ్" (మహాభాష్య 1. 3. 1.) అత్ర కైయటః "ప్రయుక్తానా మిద మన్వాఖ్యానమ్" ఆణవయత్యాదయ శ్శిష్టైః ప్రయుజ్యన్తే—ఇతి నాస్తి తేషాం శాస్త్రేణాను విధాన మితి భావః". కనుకనే, మహా భాష్యకర్త 'ఛాన్దసత్వా దుపివ్యతి' అను రీతిని 'ప్రాయోక్త్రీ' వివక్షకుఁ జెందిన మహాకవి ప్రయోగముల నిరాకరించుట జరగినది. ఆవరణాచ్ఛాదితులగుటంబట్టి శబ్ద బ్రహ్మ సాక్షాత్కృతియందు నిష్ణాతులు కాని వారి ప్రయోగము లపభ్రంశబహులము లగుటంజేసి శాస్త్రమునకుఁ బ్రమాణములుగావు. శాస్త్రము ననుసరించునప్పుడివి శిష్ట ప్రయోగోపబృంహకములుగా మాత్ర ముపయోగపడుచుండును. ఉపజ్ఞోపక్రమం తదా ద్యాచిఖ్యాసా యామ్ (2. 4. 21.) సూత్రమున నాగేశుఁడు కూడ దీనినిఁ గొంత వివరించినాఁడు. ఇఁక శిష్ట ప్రయోగ శరణులగు వైయాకరణులు మహాకవి ప్రయోగముల

వేల నిరాకరింపరు? మహాకవి ప్రయుక్తముల నిరాకరించు మాత్రమున శిష్ట ప్రయుక్త శబ్దముల కీ శాస్త్ర మన్వాఖ్యాపకమగుట కభ్యంతర మేమి? ఇప్పుడు 'ప్రయుక్తానా మిద మన్వాఖ్యానమ్' అను వైయాకరణ సిద్ధాన్తమున కేమి భంగము కలిగినది? శాస్త్రకర్తల యాశయములు సరిగా నర్థముచేసికొనలేక మనము భంగపడిన వారి సిద్ధాన్తము లేల భంగపడును? ఇట్లు మీ రప సిద్ధాన్తమని మొదట నుదాహరించినది శాస్త్ర సిద్ధమగు వైయాకరణ సిద్ధాంతమని విశదపరచితిని. ఇక, రెండు, నాలుగు విషయముల గురించి ముచ్చటించెదను.

(2) (4):—ఇందు రెండవ విషయమున శ్రీ శాస్త్రులు గారు నా వ్రాసిన వ్రాతలకు విరుద్ధార్థము స్ఫురించునట్లు రచన సాగించి యాశ్చర్యపడినారు. ఇక నాల్గవ విషయమున, నేను వ్రాసిన దానికిని వీరు వ్రాసిన దానికిని జాలవరకుఁ బొంతనమే లేదు. ఇట్టి విషయములు రెండును వీరి గ్రంథమున వీరిచే నన్యథా వ్యాఖ్యాతములై పరిహసింపఁబడినవి. ఈ రెండు విషయము లను నా గ్రంథమున నేను సప్రమాణముగా సయుక్తికముగా విపులమగు విమర్శతో నిరూపించితిని. ఈ విషయము లెట్లు చర్చింపఁబడినవో చూడుఁడు! (పాణి. కా. 44 నుండి 54 వరకు). ఇందొక యంశమునైనను వీరు కాదని నిర్ణయింపఁగలిగిరేమో పరామర్శింపుఁడు! విషయముమీఁది ప్రసంగము విమర్శమున కావశ్యకము. ఈ సందర్భమునఁ బైనా గ్రంథము సమగ్రముగాఁ జూచిన వారెవరును వీరి యీ మాటలకుఁ జెవియొగ్గరు. అచ్చటి సారాంశమునే యిచ్చటఁ గొంత వివరించి వీరి కీ విషయము తెలియఁ జెప్పెదను.

(4) :—"ప్రామాణికులగు వ్యాఖ్యాతల భిన్న భిన్న వ్యాఖ్యానములు శాస్త్ర సంప్రదాయమునుబట్టి మతభేదములుఁగాఁ బరిగణింపఁబడుచున్నవి. సంస్కృత వ్యాకరణమున 'కైయట మతము, దీక్షితమతము, నాగేశమతము, వృత్తికారమతము మొదలగునవి యిట్టివి" యని నేను వ్రాసితిని. ఈ శాస్త్రముననే యన నేల? ప్రతి శాస్త్రమునను నిట్టి మతభేదములు గలవు. చూ:—ఉత్తర మీమాంస:—అవచ్ఛేదవాదము, ప్రతిబింబవాదము, ఆభాసవాదము మొ. పూర్వ మీమాంస— భాట్టమతము, ప్రాభాకరమతము మొ. తర్కము—ప్రత్యక్షవాదము, అప్రత్యక్షవాదము ఖణ్డోపాధి, అఖణ్డోపాధి మొ. ఇంత యేల? బాదరాయణ సూత్ర వ్యాఖ్యాతల వ్యాఖ్యాన భేదములఁ బట్టియేకదా! 'అద్వైతమతము, విశిష్టాద్వైతమతము, ద్వైతమతము' అనునవి యేర్పడినవి. ఇందు, వాది బుద్ధి దౌర్బల్యమున నొకప్పు డొక మతము దుర్బలముగాఁ గానవచ్చినను, మఱియొకప్పు డదియే వాది బుద్ధి ప్రాబల్యమునఁ బ్రాబల్యము వహింపఁగల్గును. కావున నివి ప్రమాణములగు మతభేదములుగానే నేఁడును బరిగణింపఁబడుచున్నవి. ఎవ రెవ రెంతెంతగా వీనిని ప్రమాదములని ఖండించినను, నప్పుడో, మరియొకప్పుడో వారో, మఱియొకరో! మరల వానిని ప్రమాదములని నిరాకరించుట జరుగుచుండును. వాది ప్రతివాదుల బుద్ధి దౌర్బల్య ప్రాబల్యములమీఁదనే వీని దౌర్బల్య ప్రాబల్యము లాధారపడినవి. ఇట్టివి మతభేదములుగాక మరియేమగును? ప్రతి శాస్త్రమునను నిట్టివి సంభవించునప్పు డీ వ్యాకరణ శాస్త్రమున మాత్ర మట్టి వేల సంభవింపవు? ఇంతయేల? శాస్త్రకర్తలే మతభేదములతో లక్ష్య భేదముల నైత మంగీకరించుటలేదా! 'వ్యోర్లఘు ప్రయత్నతరః శాకటాయనస్య' (8. 3. 18) 'ఓతో గార్గ్యస్య' (8. 3. 20) 'ఋతో భారద్వాజస్య' (7—2—63) మొదలగు సూత్రము లేమనుచున్నవి? తెలుఁగు వ్యాకరణమున మాత్ర మిట్టిదిలేదా!" "కవి భల్లటైః క్రియాణాం నామ్నాం చోర్లోప ఇష్యతే హ్యేషు" 'న విరుద్ధో హరేర్మతే' 'అత్ర శ్రీకవి సమ్మతేః', మొదలగునవి యాంధ్ర వ్యాకరణమునందేకదా! యున్నవి? 'నన్నయ మతము—అథర్వణ మతము'—అని వ్యవహరించుచు లక్ష్య భేదములఁ దామే ప్రదర్శించుట లేదా! 'పూఁబోఁడి' యను చో బాల ప్రౌఢ వ్యాకర్తృ మతభేదములఁబట్టి యర్థభేదమును నేఁ డందరు నంగీకరించుట లేదా! ప్రౌఢ వ్యాకరణకర్త చాల పట్టుల బాలవ్యాకరణకర్తను గాదని నిరాకరించినను నీతని మతమే సరి! యని నేఁ డాదరించు వారెందఱుఁ గలరు? ఒకమాట! 'క్త్వార్థంబైన యిత్తునకు సంధిలేదు' అని బాలవ్యాకరణకర్త సూత్రమును రచించి 'క్త్వార్థేత్తునకు' సంధి తప్పని నాఁడు. ఇక ప్రౌఢ వ్యాకరణకర్త 'ఇప్రత్యయాంతా వ్యయంబునకు సంధియుఁ జూపట్టెడి'నని వచించి, యాతని నిరాకరించినాఁడు. ప్రయోగముల నొసఁగినాఁడు. ఐనను, వీనికిఁ బాఠాంతరము లున్నవనియో మరియొక రీతినో సమాధానపడి సూరి మతమునే ప్రామాణికు లంగీకరించుట లేదా! ఇట్లెన్నియో గోష్పదము వంటి తెలుఁగు వ్యాకరణముననే ప్రత్యక్షమగుచుండ ననంతమగు సంస్కృత వ్యాకరణమున నట్టిది చూచి శ్రీ శాస్త్రులుగారు నివ్వెరపోయెదరేమి? ఇది నేనుటకాదు! వైయాకరణ మూర్ధన్యులగు పాణినీయ వ్యాఖ్యాతలే మతభేదములతో లక్ష్యభేదములఁ గంఠోక్తములుఁగా నెట్లు నిర్వచించియున్నారో చూడుఁడు! "ప్రథీశబ్దస్యతు వృత్తికారాదీనాం మతే లక్ష్మీవ ద్రూపమ్; పదాన్తరంవినాపి స్త్రియాం వర్తమానత్వం నిత్యస్త్రీత్వ మితి స్వీకారాత్; లిఙ్గాన్తరానభిధాయకత్వం త దితి కైయట మతేతు పుంవ ద్రూపమ్" ('వామి' సూ. 1. 4. 5. సిద్ధాన్త కౌముది) ఇట్లనేక స్థలములలో ననేకుల వ్యాఖ్యానములున్నవి. పూర్వము నా ప్రదర్శించినరీతిని శాస్త్రకర్తలే మతభేదములతో లక్ష్య భేదముల నాదరించియున్నారుకదా! 'ఉపేయ ప్రతిపత్త్యర్థా ఉపాయా అవ్యవస్థితాః' అను శాస్త్రీయ సిద్ధాన్త వచనము దీనినేకదా నిర్వచించినది. శాస్త్ర సంప్రదాయము లపరిచితము లగుటచేతనా? వీరికీ విషయ మింత వింతగాఁ గానవచ్చినది? శిష్ట ప్రయోగ మూలకము వ్యాకరణము. అవి శిష్టప్రయోగము లనుటకు నిదర్శనముగాఁ బ్రామాణికములగు వ్యాకరణాంతరములు సాధువులుగా వానిని సాధించినప్పుడు, ప్రామాణిక వ్యాఖ్యాత యొకఁడు పాణినీయమును దదనుగుణముఁగా సమన్వయించెనేని తదితరులు దానినెంతగా నన్యథా వ్యాఖ్యానించినను, గొప్ప దోషము లందును గానవచ్చునవిగా నా వ్యాఖ్యానము లున్నప్పు డా వ్యాఖ్యలు రెండును మతభేదములుగానే యంగీకరింపఁబడును. అప్పుడు శిష్ట ప్రయోగానుసారి వ్యాఖ్యానమునే మన మనుసరించి, తదనుగుణముగాఁ బాణినీయమున వానిని సాధించుకొనుట తప్పుగాదని యేఁ

నా యనిన మాట! అంగాది శబ్దముల విషయమునవే యిది యంతయు నేను వ్రాసితిని. అవిశిష్ట ప్రయుక్తములనుటకే వ్యాకరణాన్తరమున నవి యెట్లు సాధితములైనవో కూడఁ జూపితిని. వ్యాఖ్యానములలో శిష్ట ప్రయోగములఁ ద్రోచివైచు కేవల లక్షణ దృష్టితోడి వ్యాఖ్యానము లెంతగా నిరూపింపఁబడినను లక్ష్యానుసారి వ్యాఖ్యానమే ప్రబల ప్రమాణమై చాలవఱకు లోకముచే నాదరింపఁబడునని యు నేను జెప్పితిని. ఇందుల కొక యుదాహరణము చూ :—నాగేశుడు 'నఞ్' సూత్రోద్యోతాదులయందు 'అనేకమ్' అనునది, ('దారాః' అనునది నిత్య బహు వచనాన్తమైనట్లు) నిత్యైక వచనాన్తమని నిరూపించినాఁడు; ఈతని ఈ మతమునుబట్టి 'అనేకం జనాస్తిష్ఠన్తి' అను ప్రయోగము సాధువు. 'అనేకే జనాస్తిష్ఠన్తి' అను ప్రయోగ మసాధువు. ఇట్లే 'అనేకం కవయః' అనునది సాధువు. 'అనేకే కవయః' అనునది యసాధువు. ఐనను నేఁ డీతనియం దాదరాభిమానములు కలవారు సైతము 'అనేకం కవయః' వంటి ప్రయోగములఁ బ్రయోగింపక, (ఆతని మత మెఱిఁగియు) ఇతర మతానుయాయులయి 'అనేకే కవయః' వంటి ప్రయోగములనే ప్రయోగించుచున్నారు. అట్లే 'అనేకంజనా స్తిష్ఠన్తి' అని ప్రయోగింపక 'అనేకే జనా స్తిష్ఠన్తి' అనియే ప్రయోగించుచున్నారు. ఇందలి సారాంశమునేకదా! నేను బైరీతిని వ్రాసితిని. ప్రత్యక్ష సిద్ధమగు దీనిని గాదని యెవరైన ననఁగలరా? ఇట్టి నా వ్రాఁతలను గేవల విజిగీషతో శ్రీ శాస్త్రులుగారు మీ కెట్లు చూపుచున్నారో! దర్శింపుఁడు :—

"4—ఒక్కొక్క వ్యాఖ్యాత.....దేనిచేఁ గుదిరిన ప్రయోగము దానిచే సాధించుకొనవలసినదే (పాణి. కా. 47)". (ఇది శాస్త్రులవా రొనర్చిన వివరణమే! ఇట్టి పంక్తు లేవియు నా గ్రంథమునలేవు. ఏ మున్నదో యిదివరలో నేను వ్రాసియే యున్నాను.) ఇదియా? నా చెప్పిన మాట! వ్యాఖ్యానము లన్నియుఁ బ్రమాణములని నేనంటినా? అవియన్నియు లక్ష్యసాధకము లగునంటినా? దేనిచేఁ గుదిరిన ప్రయోగము దానిచే సాధించుకొనుమంటినా? అట్లైన 'పృషోదరాదీని యథోపదిష్టమ్' అను సూత్రమునకుఁ దామును నొక వ్యాఖ్య రచించిరికదా! అదియును బ్రమాణమై పాణినీయమును దుడిచిపెట్టకపోయినదా? అట్టి యప వ్యాఖ్యానముల వారించి సత్యమును వెలువరించుటకేకదా! యింతటి నా ప్రయత్నము. వ్యాఖ్యాతలు ప్రామాణికులుగానున్నప్పుడు వారి భిన్న భిన్న వ్యాఖ్యానములు శాస్త్ర సంప్రదాయ సిద్ధములై గుణదోష విచారణమునఁ జాలవఱకు సమబలములుగానున్నప్పుడు శాస్త్రమున నవి భిన్న భిన్న మతములుగాఁ బరిగణింపఁబడును. ఈ శాస్త్రమున నట్టి వేవో నేనుదాహరించియే యున్నాను. అట్టివారి మతముల ననుసరించి శిష్ట ప్రయుక్తముల సాధించుకొనుటలో విప్రతిపత్తి యేమి? దీక్షితాదులే యట్లు లక్ష్యముల సాధించిరని పైనిఁ జూపించియే యున్నానుగదా! స్వవాదానుకూల్యమునకై నేను వ్రాసిన వింతలివియే! శ్రీ శాస్త్రులవారి కపసిద్ధాంత మనిపించిన దిదియే. ఇట్లు వీరుదాహరించిన '4 వ విషయము' శాస్త్ర సిద్ధమగు సిద్ధాన్తమే! యని విశదపరచితినిగదా! ఇఁక '(2)' రెండవ విషయమును గురించి చర్చింతును.

'2' :—ఇచ్చట శ్రీ శాస్త్రులుగారు 'స్వాఙ్గాచ్చోపసర్జనా దసంయోగోపధాత్' (4—1—54.) అనుచో 'అసంయోగోపధాత్' అను నిషేధ ముండుటవలన సంయోగోపధక శీషన్తములగు 'కృశాఙ్గీ' ఇత్యాదులు పాణినీయమునుబట్టి యెట్లు సాధువు లని యడిగినారు. వానిని బాణినీయ సిద్ధములగానేను నిరూపించుచు 'దీక్షితునకుఁ బూర్వమున్న కవులు, వృత్తి గ్రంథానుయాయులై వీనిని బ్రయోగించుట తప్పుకాదు. వృత్తి గ్రంథము 'అఙ్గ గాత్ర కణ్ఠేభ్యో వక్తవ్యమ్' అని వీనిని సాధించినది. ఈ వృత్తి గ్రంథమును న్యాసకారుఁడు వ్యాఖ్యానించుచు, 'స్వాఙ్గాచ్చోపసర్జనా దసంయోగోపధాత్' అను సూత్రములోని 'చకారము'నకు 'అఙ్గాది శబ్దము'ల సంగ్రహించుటయే ప్రయోజనమని పాణినీయ సూత్ర విహితములే యివి యనినాఁడు. నేఁడు, 'సిద్ధాన్తకౌముది' వలెనే నాఁడు వృత్తి గ్రంథమును బాఠ ప్రవచనాదులలో నుండెడిది. దీనియందు మహాకవులు నాఁడు చాల నాదరము గలిగి యుండెడివారు. ఇందులకు 'సవృత్తిః స్పష్టి బన్ధనా, శబ్దవిద్యేవ నో భాతి' (మాఘ. స. 2. శ్లో. 112) మొదలగునవి యనేకములు నిదర్శనములు. సిద్ధాన్తకౌముదీకర్త వృత్తి గ్రంథము నీనాఁడు (ఏ 16 వ శతాబ్దిలోనో) ప్రమాదమని నిరాకరించినను దీక్షితునకు బూర్వమందుండు కవులకు (దీక్షిత సిద్ధాన్తముకాక) వృత్తి గ్రంథ సిద్ధాన్తమే ప్రమాణ మగునంటిని. ఇది యుక్తి యుక్తమే కదా! ఇందు నే నొనర్చిన యపరాధ మేమి? శ్రీ శాస్త్రులవారు తమ వాదము నిలుపుకొనుటకై దీక్షితునికిఁ బూర్వికులగు కవులు సైతము, ముందేర్పడనున్న దీక్షిత సిద్ధాన్తమును దివ్యదృష్టితోఁ బ్రత్యక్షీకరించి తామీ ప్రయోగములఁ బ్రయోగింపకుండరాదా? యని నాతో వివాదపడుచున్నారు. పాఠకులారా! యిందేది సమంజసమో మీరే నిర్ణయింపుఁడు! ఇట్లే వృత్తి గ్రంథమునకుముందు మహాభాష్యమే పాఠ ప్రవచనాదులం దుండెను. ఆనాటి మహాకవులు దానినే చదువుచుండిరి. వారు 'న చకార కారయామ్ న చకార హారయామ్' (2.4.2. 8 1.) అను మహాభాష్య ప్రయోగములఁ జూచి 'తం పాతయాం ప్రథమ మాస' ఇత్యాదులఁ బ్రయోగించియుందు రంటిని. అది యట్లు జరుగుట యేమంత యసంభవమో నాకుఁ దెలియదు. శ్రీ శాస్త్రులుగారు మాత్రము "పాణినీయమునకు మంచి వ్యాఖ్యానములు పుట్టని కాలపుఁ బ్రాచీన మహాకవులు సాధువులనుకొని కొన్ని యప ప్రయోగములఁ జేసిరఁట!" యని యిది యొక యపసిద్ధాన్తముగా నెత్తి వ్రాయుచున్నారు. ఎందువలన నిది యప సిద్ధాన్తమో తెలుపరేమి? మాటలతోనే యపసిద్ధాన్త మగునా? మహాభాష్యమునకు మంచి వ్యాఖ్యానములు (కైయటాదులు) బయలు వెడలని కాలమసంభవమా? ఆనాటి కవికుల మసంభవమా? ఆనాఁడు సాధువులనఁబడినవి తరువాతివారి వ్యాఖ్యానముల మూలమున నప ప్రయోగములగుట యసంభవమా? ఇం దేది యసంభవము? ఏదియు నసంభవము కానప్పు డిది యపసిద్ధాన్త మగుట యెట్లు?

ఒక కాలమున సాధువులనఁబడినవి తరువాతి వారి వ్యాఖ్యల మూలమున నసాధువులుగా నొకప్పుడగుననుటకు సందేహమేమి? వృత్తికారుఁడు వాఁడు సాధువులనిన 'కృశాఙ్గే'త్యాదులు దీక్షితుని వ్యాఖ్యానమునుబట్టి నే డసాధువులనఁబడుట లేదా? 'అనేకే' (కవయః) వంటి ప్రయోగములు మొన్న మొన్నటివరకు సాధువులై ఈనాఁడు నాగేశవ్యాఖ్యమూలమున నప ప్రయోగము లగుటలేదా! భ్రమ ప్రమాదములకు లోనగు నస్మదాదుల వ్యాఖ్యానము లస్తవ్యస్తములగు ననుటకు సందేహమేమి? కావుననేకదా! శాస్త్రకర్త లావరణాద్యాదనమేకాని శిష్టుల ప్రయోగములే శాస్త్ర ప్రవృత్తి కాధారమని నిర్వచించి మహా కవుల ప్రయోగముల స్వైతము, శిష్ట ప్రయోగములకు విరుద్ధములగునప్పుడు త్రోసి రాజనిరి. మహాకవులైనను నస్మదాదులలోనివారే. భ్రమ ప్రమాదములకు లోనగువారే! (చూ. పాణి. కా. 'కవులు—ప్రమాదములు' అను శీర్షకము.). ఇట్టి మహాకవులు 'న చకార కారయామాస, న చకార హారయామాస' (మహాభాష్యము 2. 4. 2. 81) అను మహా భాష్య ప్రయోగమునకు 'లౌకికి' (వివక్ష) యందుఁ దాత్పర్య మనుకొనుటకాని, తరువాతి వ్యాఖ్యాత యగు కైయటుఁ డది యట్టిదికాదని వ్యాఖ్యానించుట కాని యేల జరుగరాదు? అదియేకదా! జరిగినది. ఇందుల కింతగా మీరు వింతపడనేల? ఇంతయేల? మీరి 'నవ్యయాధర్వణీయము'న నేఁ డెన్ని వ్యాఖ్యానములు భ్రమ ప్రమాదములకు గుఱియై శాస్త్ర విరుద్ధములుగా నడచి ఖండనీయము లగుచున్నవి? కానున్నవి? 'కూర్చుండిరి యొండురుం గదిసి' అను శ్రీనాథ ప్రయోగము భ్రాంతికి గుఱియైనదని యప్పకవి నిరాకరింపఁ గాలాంతరమున సహాబలపతి సాధువనలేదా? తెలుఁగున నిట్టి వెన్ని లేవు? శ్రీ శాస్త్రులుగారి కివి తెలియరానివియా? ప్రత్యక్షముగాఁ గానవచ్చు నీ విషయమును గాదనుట యెట్లు? మీరు నాయువ సిద్ధాన్తములనిన—(2) (4)—విషయము లిట్లు సిద్ధాన్తితములే యైనవి. ఇక '(3)' వ విషయమును గుఱించి ముచ్చటించెదను.

('3') ఇప్పుట శ్రీ శాస్త్రులుగా రేమనుచున్నారో సావధానముగా వినుఁడు! "సూత్రములఁ గల్పించి, షిత్తులగు ప్రత్యయములను విధించి, గాత్ర నేత్రాది శబ్దముల సాధించుకొన్నచో ఙీష్ప్రత్యయము సుప్రాపమగుననఁట!" పాఠకులారా! యివి నా మాటలఁట! ఇట శ్రీ శాస్త్రులు గారెంతటి వంచనా పాటవమును బ్రదర్శించిరో చూడుఁడు!—సూత్రములను నేనే కల్పించినట్లు, షిత్తులగు ప్రత్యయముల స్వైతము నేనే యేర్పఱిచినట్లు, ఇది యంతయు స్వకపోల కల్పితమే యైనట్లు, దీనికేమియు నాధారము నేను జూపనే చూపనట్లు—వ్రాంతలవలన మీకు మీరు బోధించుచున్నారుకదా! ఇం దేదియు సత్యము కాదు. ఒక్కటియైనను సత్యముండరాదా? (చూ: పాణి. కా. 'నేత్ర గాత్రాది శబ్ద సాధనము' 48 పు. మొ.). సూత్రముల నేను గల్పింపలేదు. షిత్తులగు ప్రత్యయముల నే నేర్పఱుపలేదు. సూత్రముల రచించినవారు, షిత్తులగు ప్రత్యయముల విధించినవారు పాణిన్యాదులే! చూ: 'నేత్ర శబ్దము' "దామ్నీ శస యుయుజస్తు తుదసిసిచమిహపతదశనహః కరణే (అష్టాధ్యాయి 3. 2. 182) దాబాదేః కరణే 'ష్ట్రన్' ప్రత్యయస్స్యాత్ (సిద్ధాన్త కౌముది). చూచితిరికదా! పాణిని సూత్రము, 'ణీఞ్' ధాతువుకంటెఁ గరణార్థమున 'ష్ట్రన్' ప్రత్యయమును విధించి షిత్తగు నీ ప్రత్యయముతో 'నేత్ర' శబ్దమును సాధించినది. ఇటుఁ బ్రత్యయమును విధించినవాఁడు పాణినియే! దానికి షిత్త్వ మేర్పరచినవాఁడు స్వైత మాతఁడే! ఇందు నేను గల్పించినది విధించినది యేమికలదు? 'ష్ట్రన్' ప్రత్యయాన్తములగు 'మీన నేత్ర' ఇత్యాదులకు 'షిద్గౌరాదిభ్యశ్చ' (4-1-41) అను పాణిని సూత్రముచేతనే 'ఙీష్ప్రత్యయము' వచ్చిన 'మీననేత్రీ' ఇత్యాదులు పాణినీయసిద్ధములగునని నే నంటిని. ఇందు నేను జేసిన మహా దోష మేమియో? మీరే తెలుపుఁడు! ఇక 'కృశాఙ్గీ' ఇత్యాదులు వ్యాకరణాంతర సాధితములై శిష్ట ప్రయోగములైనందున, నంగ శబ్దమునకు వ్యాఖ్యాత లనేకు లనేక విధము లగు వ్యుత్పత్తుల నిర్వచించినందున, 'సంజ్ఞాసు ధాతురూపాణి.... మేతచ్ఛాస్త్రముణాదిషు' అని మహా భాష్యకర్త యభ్యనుజ్ఞ యిచ్చిన చొప్పున 'అగి' ధాతువుకంటె షిత్తగు ప్రత్యయము నేర్పఱిచి వీనిని సాధించుకొనవచ్చునంటిని. అఙ్గశబ్దము కడనే నే నీ మాట చెప్పినది. దీనిని శ్రీ శాస్త్రులుగారు గాత్ర నేత్రాది శబ్దములకడఁ గూడ నారోపించి, పై రీతిని నా యువ సిద్ధాన్తమని చూపినారు. 'కృశాఙ్గీ' ఇత్యాదులు శిష్ట ప్రయోగములని వ్యాకరణాంతరము సాధించుచున్నప్పుడు, 'పృషోదరాదీని యథోపదిష్టమ్'—అని పాణిని సూత్రించుచున్నప్పుడు, మహా భాష్యకర్త 'సంజ్ఞాసు ధాతురూపాణి....." అను రీతిని వీని నంగీకరించుచున్నప్పుడు, వ్యాఖ్యాతలు బహుముఖముల నంగ శబ్దమునకు వ్యుత్పత్తి ననుమతించుచున్నప్పు డిది శాస్త్ర విరుద్ధమగు నప సిద్ధాన్త మెట్లైనది? ఇట్లు నా దాని నప సిద్ధాన్త మనుచున్న మీరే 'కైవార దుర్వాసలు' అను వాక్కు శ్రీనాథ ప్రయోగమునకై తా మీ సంహితా సర్వస్వమున నే 'కైవార' శబ్దము నెట్లు సాధింపఁగడఁగినారో చూడుఁడు! కవి సార్వభౌముఁడు, బహు గ్రంథకర్త యగు కూచిమంచి తిమ్మకవి తన యచ్చ తెనుఁగుఁ బ్రబంధమున నచ్చ తెనుఁగుఁ బదముగానే దీని నుపయోగించినాఁడు. ఐనను మీరు సూర్యరాయ నిఘంటుకర్తలను గాదనవలయునను నభినివేశముతోఁ దిమ్మకవి భ్రాంతుఁ డాయెనని యూతని ప్రయోగము ప్రమాణము కాదనినారు. 'కవులకుఁ బ్రమాదములే లేవనుట' పరమ సిద్ధాన్తముగా గల శ్రీ శాస్త్రులుగా రీ మాట నెట్లనఁ గలిగిరో! 'కైవారము' నకు 'కయివార' మను రూపాంతర ముండుటనైన మీరు గమనింపవలదా? ఇంతచేసి, మీరు కైవార శబ్దమును సాధించినవిధ మెట్టిదో దర్శింపుఁడు:—"కైవార శబ్దమునకు మూలమును వ్యాకరణమునఁ గన్పట్టుచున్నది. 'కర్వ—దర్పే' అని కల్పద్రుమమున వాన్తధాతువు కన్పట్టుచున్నది. 'కేవ—సేవనే' ఇత్యాదిః; ఆత్మనే. సక. సేట్. కేవతే (శబ్ద. కల్ప.). ఉణాదులలో 414 మొ. 420 వఱకుఁగల సూత్రములందు 'అరన్' ప్రత్యయమున దేశింపఁబడెను. అందు 'తుషారాదయశ్చ' ఉణా 419 చొప్పునఁ దుషారాదులలోనిదిగా 'కైవార' శబ్దము సుసాధమగుచున్నది.

*కుఞ్జిమృజిభ్యాం చిత్' కుఞ్జారో మయూరః మార్జారః (సి. కౌ. ఉణా. 417 సూ.) అను సూత్రము సందర్భమున 'మృజ్' ధాతువునకువలెనే 'కేవ' ధాతువునకు వృద్ధి ప్రయోగానుసృతి నంగీకరింప నగును. కేవ్+అర—కైవ్+అర—కైవార' అను రీతిని సాధింపనగును. 'ఉణాదయో బహులమ్' ఏతే వర్తమానే సంజ్ఞాయాంచ బహులం స్యుః కేచి దవిహితా అప్యూహ్యాః "సంజ్ఞాసు ధాతురూపాణి........" అని మహా భాష్యమునఁ జూపఁబడెను. స్మృతిపాఠక సందిసేవా విషయమని ధాత్వర్థమునకు సందర్భము సరయునది" — ఇవి శ్రీ శాస్త్రులుగా రీ సంహితా సర్వస్వమునందుఁ గైవార శబ్ద సాధనావసరమున వ్రాసిన వ్రాఁతలు. చూచితిరికదా! యిందులకై వీరు పడినపాట్లు! ఇంతకును నొక్క శ్రీనాథుని ప్రయోగమే వీరి కాధారము! అది యైనను నాతని యితర ప్రయోగములకై యాతని కవితా సంప్రదాయమునుబట్టి యంగీకరింపవలసిన మణి ప్రవాళ న్యాయమున నన్యథాసిద్ధమే! ఇఁక వీరి ఈ శబ్ద సాధన ప్రక్రియను గమనింపుఁడు! 'తుషారాదుల లోనిదిలేదు. లేకపోయినను దీనిని దాము చేర్చెద' మనిరి. అది యాకృతిగణమైన నట్టిది సాగునేమో! అది యట్టిదికాదే! ప్రత్యయము విహితముకాకపోఁగాఁ బ్రత్యయము నొకదాని నిట్లు కల్పించెద మనిరి. వృద్ధి యసంభవముకాఁగాఁ బ్రయోగానుసృత మది యనిరి. దీనికి 'మృజ్' ధాతువును దృష్టాంతముగా నొసఁగిరి. 'మృజ్' ధాతువు వృద్ధికర్హము. 'మృజేర్వృద్ధిః' అని వృద్ధి విహితము. గుణవృద్ధులు 'ఇక్కు' నకు గదా వచ్చును? 'కేవ్' అనుచో 'ఏకారము'నకు వృద్ధి వచ్చుట యెట్లు? వీరు ప్రదర్శించిన దృష్టాంతమునకును దార్ష్టాంతికమునకును సంగతి యేది? ఇంత సేసినను నర్థము కుదురకపోఁగా 'సేవన' మను ధాత్వర్థమును బ్రకృతానుగుణముగా యోజించెదమనిరి. దీని కంతకును 'సంజ్ఞాసు ధాతు రూపాణి......" అని నా చూపిన మహా భాష్యమే ప్రమాణ మనిరి. ఒక్క శ్రీనాథుని ప్రయోగము మాతగా గొని అర్థానుగుణమగు ధాతువులేక, విహితమగు ప్రత్యయములేక, వృద్ధికి యోగ్యత యనునదియే లేక సర్వమును విశ్వామిత్ర సృష్టి యొనర్చి, కవి సార్వభౌముని సైతము త్రోసి రాజని శశ శృంగముగా నీ శబ్దమును సాధించితి మనుకొను శ్రీ శాస్త్రులుగారిది శాస్త్రీయమగు సుసిద్ధాన్తమా? పాణినీయాంగమగు నొక వ్యాకరణము సాధించిన శిష్ట ప్రయోగములను బహులములుగా నుపలబ్ధములగువానిని "సంజ్ఞాసు ధాతు రూపాణి......" అను చెప్పున శాస్త్రీయముగా నేను సాధించుట శాస్త్ర దూరమగు నప సిద్ధాన్తమా? ఈ కైవార శబ్దమందలి వస్తు స్థితి యెట్టిదో నా కాశిఖండ వ్యాఖ్యానమున నేను నిరూపించియున్నాను. శ్రీ శాస్త్రులవారి వ్రాఁతల స్వరూప స్వభావము లెట్లుండునో తెలుపుటకే యింతగా వ్రాసితినిగాని 'కృశాఙ్గీ' ఇత్యాదు లిట్టి ప్రక్రియ యక్కఱ లేకుండఁగ గూడ నెట్లు సాధితములగునో ప్రదర్శించియే యున్నాను (చూ. పాణి. కా. 53 ఫు.) ఇఁక దీని నింతటితో వదలి ఈ సందర్భమునం దేర్పడిన మరియొక యవాంతర విషయమును గురించి ప్రసంగింతుము.

'పుచ్ఛాచ్చ' అను వార్తికము — శ్రీ. శాస్త్రిలవారి సమర్థనము

శ్రీ శాస్త్రులవారు 'పుచ్ఛాచ్చ' అను వార్తికమును దాము కాత్యాయముని వార్తికముగా గుర్తించియే యున్నామని, వృత్తికారుని గ్రంథముతోపాటు తాము దాని నుదాహరించుటకుఁ బాణిని సూత్ర సాధ్యములుగాని వాని నచటఁ బ్రదర్శించుటయే తమతాత్పర్యమని తమ ప్రమాదమును సమర్థించుకొనఁ జూచుచున్నారు. 'పుచ్ఛాచ్చ' అనుదానిని వీరు త్యాజ్య చిహ్నముల నడుమ నుంచుటయేకాక, వృత్తి గ్రంథోపక్రమమున కుప సంహారప్రదర్శకములగు ననుకరణ చిహ్నముల నడుమ గూడఁ దీనిని నిలిపినారు. ఇఁక నిది వృత్తి గ్రంథమనవలయునా? కాత్యాయనుని వార్తిక మనవలయునా? వార్తికమే యని వీరనుకొనిన దీని కాదియందుఁ గూడ ననుకరణ చిహ్నము లుండెడివేకదా! పోనిండు! వీరు దీనిని గాత్యాయన వార్తికముగానే గుర్తించిరని యొప్పికొందము! ఐన నిచట దీనికిఁగల ప్రసక్తియేమి? అపాణినీయములని తామనుకొనిన శబ్దములేవో! వానిని బరిగణించి చూపుటయేకదా! శ్రీ శాస్త్రులుగా రిచటఁ జేయుచున్నది! పాణిని సూత్రముల చేతనేకాక, కాత్యాయనుని వార్తికములచే సాధింపఁ బడినవి కూడఁ బాణినీయములేకదా యగును? పాణినీయములఁ గూడ నపాణినీయములఁగాఁ బ్రదర్శించి, పాణినీయమునకు దాటి పోవు శబ్దములు సరశ్శతములని లోకమును భ్రమింపజేయుటకా యిచట దీని ప్రదర్శనము! వీరియుపసంహారము గూడ నేత దను గుణముగానే నడచినది. చూడుఁడు 'అంగాంత్రదంత కంఠం చ శృఙ్గకర్ణౌష్ఠ మిత్యపి, పుచ్ఛనేత్రం తథా గాత్రం జంఘ మంగాది రీరితః' (ముగ్ధబోధ—154 పు.) సంయోగోపధములతో ఙీప్ప్రత్యయము వచ్చునవి యింత యధికముగా నగపడు చుండఁ బాణిని సూత్ర మెంతవఱకుఁ దదనుశాసన బుద్ధితో రచింపఁబడినదో బుద్ధిమంతు లూహింతురుగాక!" (చింతా. వి. స. 112 పు.) చూచితిరా! ఈ యుప సంహారము! వార్తికకారుఁడు ప్రత్యేకముగా శ్రద్ధ వహించి 'పుచ్ఛాచ్చ' కబర మణి విషశరేభ్యో నిత్యమ్' 'ఉపమానా త్పక్షాచ్చ పుచ్ఛాచ్చ' అను వార్తికముల రచించి, పుచ్ఛ శబ్దాంతములగు ననేక లక్ష్యములఁ బాణినీయములఁగా సాధింప, నివి యన్నియు నపాణినీయము లని భ్రమించునట్లు దీక్షితుఁడు ప్రమాద మనిన వృత్తి గ్రంథముతోపాటు 'పుచ్ఛాచ్చ' అనుదానిని గూడఁ జేర్చి, వీనిని గూడ దీక్షితుఁడు ప్రమాద మనినట్లు నివి గూడ నపాణినీయము

---

* 'కఞ్జిమృజిభ్యాం చిత్' కఞ్జి స్విత్రో ధాతుః-కఞ్జారో మయూరః మార్జారః,' అని కౌముది. ఇచ్చట తత్త్వ బోధినియో! "కఞ్జి—,...'కఞ్జారో జఠరే సూర్యే విరిఞ్చౌ వారణే మునౌ' ఇతి విశ్వమేదిన్యౌ"—అని వ్యాఖ్యానించినది. వీరు దేనిని బట్టి యిట్లు వ్రాసిరో తెలియదు.

అని సిద్ధాన్తితములే యైనట్లును జూపి, దీని కుపష్టంభకముగా ముగ్ధబోధ వ్యాకరణమును ప్రదర్శించినారు. ఇంకొక వింత! ఈ సందర్భమున వీ రుదాహరించినది సిద్ధాన్త కౌముదీ గ్రంథము. అందు 'అత్ర వృత్తిః; అఙ్గగాత్రకణ్ఠేభ్యో వక్తవ్యమ్, స్వఙ్గీ, స్వఙ్గేత్యాది. ఏత చ్చానుక్త సముచ్చ యార్థేన చకారేణ సఙ్గ్రాహ్య మితి కేచిత్, భాష్యాద్యనుక్తత్వా దప్రమాణ మితి ప్రామాణికాః; అత్ర వార్తికాని—"పుచ్ఛాచ్చ" (సిద్ధాన్త కౌముది. స్త్రీ ప్రత్యయము. 'స్వాఙ్గాచ్చోపసర్జనా దసంయోగోపధాత్' 4. 1. 54 సూ.) పై సిద్ధాన్తకౌముదీ గ్రంథమున 'అఙ్గగాత్ర కణ్ఠేభ్యో వక్తవ్యమ్' అను కాశికోక్తికిఁ దరువాత 'పుచ్ఛాచ్చ' అనునది లేదు. లేకున్నను, ముగ్ధబోధకారుఁ డఙ్గాదిగణ మేర్పఱచి, యందు 'పుచ్ఛ' శబ్దమును జేర్చినవా డగుటచేఁ దదను సారముగా 'పుచ్ఛ' శబ్దముఁ గూడ 'అఙ్గగాత్ర కణ్ఠేభ్యో వక్తవ్యమ్' అను దానికంగముగాఁ జేర్పఁబడవలసినదని దీక్షితుఁడు తరువాత నుదాహరించుట ప్రమాదమని కౌముదిని సంస్కరించుచు దీక్షితుఁడు ప్రమాదమునిన గ్రంథమునం దంతర్భూతముగా దీనిని జేర్చిరి. తాము సంస్కరించినట్లు తెలియ వచ్చుటకును గౌముదీ గ్రంథమున నిది యిచ్చట లేదని తెలుపుటకును వీరు త్యాజ్య చిహ్నముల నడుమ దీని నుంచిరి. 'త్యాజ్య చిహ్నముల నడుమ నుంతువా?' అని శ్రీ శాస్త్రులుగా రడుగుచున్నారు. ఇందులకే యిట్లుంచినారని సమాధానము చెప్పుచున్నాము. అది కాశికా కారుని సూత్రమనియే నేను దలంచి యున్నచోఁ గాశికా వాక్యములఁ జేర్పక వేరుపంక్తిలో నిలుపుదునా? యనునది వీరి మఱియొక ప్రశ్నము. సూత్ర లక్షణము వేఱు. ఇష్ట్యాదుల లక్షణము వేఱు! దానికేమి? ప్రకృత ప్రశ్నమునకు సమాధాన మొసఁగెదను. కాశికోక్తియందే చేర్చి దీనిని వీరు వ్రాసినఁ గాశికా గ్రంథమున నిది లేదే యని యడిగిన వీరేమి సమాధానము చెప్పుదురు? వృత్తి గ్రంథ మిప్పటికిని నుపలభ్యముగు చునే యున్నదికదా! ఆ వృత్తిగ్రంథము ముగ్ధబోధ వ్యాకరణమునుబట్టి సంస్కార్యమనియేకదా! వీరి యాశయము! ఇందులకే వీరు 'పుచ్ఛాచ్చ' అను వార్తికమును వేఱు పంక్తిలో వ్రాయవలసిన వారైనారు. ఇక్కడి తత్త్వమిది! వీరు తమ్ము సమర్థించుకొనుటకై యెంతగాఁ బ్రయత్నించినను సత్య మెట్లు మఱుఁగుపడును? ముగ్ధబోధ వ్యాకరణము వీరికిఁ బరమదైవతము. అది పాణినీయమున నవ్యుత్పన్నబుద్ధులగువారికిఁ గొంత వఱకుఁ గేవల లక్ష్యజ్ఞాన నిష్పాదకముగా నేర్పఱపఁబడినది. (పాణినీయమున) ముగ్ధులగువారే దాని కధికారులని తన్నామమే నిర్వచించుచున్నదననగును. దీనినిబట్టియా! వీరు కౌముదీ వృత్తి గ్రంథముల సంస్కరింపఁ గడఁగుట! ఎంతటి సాహసము! ఇట్లు శ్రీ శాస్త్రులవారు 'పుచ్ఛాచ్చ' అను వార్తిక సందర్భమునఁ బొరపడిరని నిర్ణయించుటతోపాటు, వార నసిద్ధాన్తమనిన ('3') మూడవ విషయము సైతము సిద్ధాన్తమని నిర్ణయింపఁబడినది.

IV. వీరి ప్రసంగ మప్రయుక్తతాదోషము నకే నిర్విషయత్వమును ఘటించును - మేకాధీశ శబ్దార్థశతకోటి - (ఇది నాల్గవ యాక్షేపము)

"పుపుత్రిత్రీయియిషిషతి'వంటి ప్రయోగముల ననేకములఁ బాణినీయము సాధించుచున్నది. నేఁడు వానికిఁ బ్రయోగములు గానరావు. 'ప్రయుక్తానా మిద మన్వాఖ్యానమ్'—అని ప్రయుక్త శబ్దములకే శాస్త్ర మనుశాసకము గావలసియున్నది. లక్ష్య లక్షణము లవ్యూనాతిరిక్తములుగా నుండవలయును. అట్టి సంబంధము కానరానందునఁ గావ్యభాషకుఁ బాణినీయ మనుశాసకము గాఁజాల"దని ఈ సందర్భమునందలి శ్రీ శాస్త్రులవారి వ్రాఁతలలోని సారాంశము. ఇందులకు వీరికి నేను సమాధాన మొసఁగుచు నిట్లు వ్రాసితిని—పాణినీయము కేవలము లౌకిక వాఙ్మయమునేకాక, యనంతమగు వైదిక వాఙ్మయమున్ సైతము శాసించినది. మహాభాష్యకర్త, తమ లక్షణమునకు లక్ష్య వాఙ్మయ మిది యని—"చత్వారో వేదా స్సాఙ్గా స్సరహస్యా బహుధా భిన్నా ఏకశత మధ్వర్యుశాఖా స్సహస్రవర్త్మా సామవేదః, ఏకవింశతిధా బాహ్వృచ్యమ్, నవధా థర్వణో వేదః" (మహాభాష్యము 1. 1. 1.) అని వేదవాఙ్మయమును 'సప్తద్వీపా వసుమతీ, త్రయోలోకాః; వాకోవాక్య మితిహాసః పురాణం వైద్యకమ్' అని లౌకిక వాఙ్మయమును శృఙ్గగ్రాహికగాఁ బ్రదర్శించినాఁడు. అప్రయుక్త శబ్దములను మీలక్షణ మనుశాసించుచున్న దను నిట్టి ప్రశ్నమే యవతరింపగా 'సర్వేదేశాన్తరే' యని వార్తికకర్త సమాధాన మొసఁగినాఁడు. 'సర్వే ఖ ల్వప్యేతే శబ్దా దేశాన్తరేషు ప్రయుజ్యన్తే, న చైవోపలభ్యన్తే, ఉపలబ్ధౌ యత్నః క్రియతామ్, మహాన్ శబ్దస్య ప్రయోగ విషయః' అని మహాభాష్యకర్త ఈ సిద్ధాన్త వార్తికమును వ్యాఖ్యానించినాఁడు. పాణినీయ సాధితములగు శబ్దముల ప్రయోగమునకు విషయ మెంత విపులమో వివరించినాఁడు. అప్రయుక్తములని ఈ సందర్భమున నాక్షేపింపఁబడిన శబ్దముల కన్నిటికినిఁ బ్రయోగము చూపినాఁడు. "ఏ తావన్తం శబ్దస్య ప్రయోగ విషయ మననువిశమ్య స న్త్యప్రయుక్తా ఇతి వచనం కేవల సాహస మాత్రమేవ" (మహాభాష్యము—పస్పశాహ్నికము) అని యుప సంహార మొనర్చినాఁడు. మహాభాష్యకర్త పై రీతిని దమ శాస్త్రమునకు లక్ష్యమని నిర్దేశించిన వాఙ్మయమునంతను నాలోడింపనిదే 'పుపుత్రీయియిషిషతి' ఇత్యాదు లప్రయుక్తములనుటకు వీలుకాదు. అనంతమగు వేద వాఙ్మయమున 'త్రయోలోకాః' అనురీతి నపరిమితమగు లౌకిక వాఙ్మయమున నివి లేవనుట యెట్లు? మన మెఱిఁగిన లోకమెంత? "శవతి ర్గతికర్మా కామ్బోజేష్వేవ భాషితో భవతి, వికార ఏనమార్యా భాషన్తే శవ ఇతి, హమ్మతి స్సురాష్ట్రేషు, రంహతిః ప్రాచ్యభరతేషు, గమిమేవ త్వార్యాః ప్రయుఞ్జతే, దాతి ర్లవనార్థే ప్రాచ్యేషు, దాత్ర ముదీచ్యేషు" (చూ: మహాభాష్యము—పస్పశాహ్నికము) అని యిట్లు పతంజలి,

దేశభేదమునుబట్టి ప్రయోగభేదము వింత బహుళముగాఁ జూపెను. ఇది యంతయుఁ దమ శాస్త్రమునకుఁ బ్రమేయమైనదనెను. ప్రయుక్తములనే మా శాస్త్ర మనుశాసించినదని మరల మరల నుద్ఘాటించెను. చర్చించి, చర్చించి దీనినే నిర్వచించెను. ఇట్టిచో శాస్త్రకర్తలు నిర్దేశించిన ప్రయోగపు ప్రదేశ మేదియుఁ జూడక 'అప్రయుక్త మప్రయుక్త'మనుట కేవల సాహసమేకదా! యగును! ఇట్టివారినేకదా! 'స న్త్యప్రయుక్తా ఇతి కేవలం సాహస మాత్రమేవ' అని మందలించి, తమ శాస్త్ర సాధితముల కెల్లఁ బ్రయోగములున్నవని మహాభాష్యకర్త సిద్ధాన్తీకరించినాఁడు. మహాభాష్యకర్త వచనముగూడ వీరి కప్రమాణమా? ఐన వీరికిఁ బ్రామాణికు లెవరు?" ఇదియే వీరికి నేను సమాధాన మొసగిన వ్రాతలలోని సారాంశము! విషయమిది! ఇందులకై వీరు తమ సంహితా సర్వస్వమున నాపై నుదాహరించిన విషయ స్పర్శములేని పరిహాస వచనముల సంగతము పరామర్శించెదను.

ఈ సందర్భమున నే నన్న మఱికొన్ని మాటలివి. లౌకిక వాఙ్మయమున నైనను, 'సప్తద్వీపా వసుమతీ' యని యాతఁ డుదాహరించెను. సప్త ద్వీపములలోని భాష యటుండ సప్త ద్వీపములలోని యొక్క ద్వీపమునైనను శ్రీ శాస్త్రులుగారు చూడలేదు. తుద కిప్పటికి సంస్కృతమునకుఁ బేరువడియున్న నేపాళ కాశ్మీరాది దేశములనైన వీరు చూచియుండరే? ఏ యే దేశమున నెట్టి శబ్దము లెట్టి వ్యవహారమునఁ గలవో! ఎంత వాఙ్మయ మెక్కడ నెక్కడ దిగఁబడియున్నదో! శిథిలమైన వాఙ్మయ మెంతకలదో వీరి కెట్లు తెలియును? (పాణి. కా. 130 పు.). పై మాటలవలన, నేను శ్రీ శాస్త్రులుగారిని స్వర్గమునకుఁ బోవలయునంటినని, యట్టి పండితుఁడు దుర్లభుఁడని శ్రీ శాస్త్రులుగారు పరిహాస మాడుచున్నారు.* ఇఁక సమాధానమున కుపక్రమింతును! స్వర్గమునకుఁగాని, దేశాంతరమునకుఁగాని పొమ్మనిన వారు వార్తికకార మహాభాష్యకారులు. నేనుగాదు. "సర్వేదేశాన్తరే" 'న చైవోపలభ్యన్తే, ఉపలబ్ధౌ యత్నః క్రియతామ్'' అని వారేకదా! యనుచున్నారు. ఇందు నే ననిన దేమి? 'అట్టి పండితుఁడు దుర్లభుఁడుకదా!' యని వీరనుచున్నారు. అట్టి శక్తిలేని పండితుఁడు, శాస్త్రకర్తలు తమ శాస్త్ర నిష్పన్నములన్నియుఁ బ్రయుక్తములని యుద్ఘోషించుచుండ, వారియందు లేని పోని యప్రామాణ్య శంక నారోపించుకొని, యప్రయుక్తము లప్రయుక్తములని ఘోషింపనేల? కావుననే యస్మదాదులను గేవలము లక్షణ మనుసరింపవలసిన లక్షణైకచక్షుష్కులఁగానే శాస్త్రము నిర్ణయించినది. లక్ష్యైకచక్షుష్కులు శాస్త్రకర్తలు! లక్ష్య పరిశోధనమునది వారిపని. అందులకు వారే సమర్థులు! శాస్త్రకారులు 'త్రయోలోకాః' అని తమ లక్షణమునకు లక్ష్యవాఙ్మయమును బ్రత్యక్షముగాఁ బ్రదర్శించుచున్నారుకదా! కాదనుట యెట్లు? లక్షణమునకుఁగల లక్ష్య వాఙ్మయమును సపాకల్యముగా దర్శింపనివాఁడు లక్షణ మతివ్యాప్తమైనదని యెవరు మాత్ర మెట్లు నిర్ణయింపఁగలరు? మరియొకమాట వీరి నడుగుదము! 'వీరైనను, 'పాణినీయము వైదిక కర్మోపయోగి శిష్ట వ్యవహార భాషానుశాసక'మని యంగీకరించినవారేకదా! (చూ: చింతా వి.వ. 106 పు.). అందు 'పుపుత్రీయియిషిషతి'వంటి రూపములున్నవందురా? లేవందురా? లేవన్న లక్షణ మన్యూనాతిరిక్తముగావించేసి యనుశాసకముగాదు. ఉన్నవందురా? యత్యల్పమగు నా భాషయందే యవి యుండుట సంభవించునప్పుడు, ననంతమగు వేద వాఙ్మయమునవో, యపరిమితమగు లౌకిక వాఙ్మయమునవో యవి యుండుటకేమి యభ్యంతరము? ఇదివరకు నే నిది శ్రీ శాస్త్రులుగారి నడిగియే యుంటిని. (చూ: పాణి. కా. 134, 135 పు.) ఇందులకు వీరు సమాధాన మొసఁగక మౌనము వహింతురేమి? తమ కడ్డువచ్చు విషయములనెల్ల మఱుఁగుపఱచి పెద్దపెద్ద శీర్షకములతో హాస్య రచనా చాతుర్యము వెల్లడించుటయే విమర్శకుల లక్షణమా? వీరితో వివాదపడిన వారెల్లరును విషయశూన్యమగు వీరి యిట్టి ప్రసంగములకు విసివివేసారి యుపేక్షించినవారేకదా! వీరి ఈ గ్రంథ మింతగాఁ బెరిఁగినది. యథార్థ మెట్టిదో నిరూపించుట కింతగా వ్రాసితినిగాని వీరికి సమాధాన మిచ్చుట కింతగా వ్రాయవలసిన యక్కఱయేలేదు. తమ యనుబంధమున వీరేమనుచున్నారో! చూడుఁడు! "ఇఁకఁబాణినీయము కృతక శబ్దముల సాధించునా? యని సందేహింప నక్కఱలేదు. వ్యాకరణ మాత్రమున కట్టి యతిచారముండి తీరును" (చింతా వి. వ. అనుబంధము 10 పారట) చూచితిరికదా! శ్రీ శాస్త్రుల వారి ఈ వ్రాతలు! వ్యాకరణ మాత్రమున కతిచారముండి తీరునప్పుడు, లక్షణ మన్యూనాతిరిక్తముగా నుండవలయుననుటలో నర్థమేమి? పాణినీయము కృతక శబ్దముల సాధించుట వీరి ఈ సిద్ధాంతము ప్రకారము న్యాయ్యమే యైనప్పుడు 'పుపుత్రీయియిషిషతి' వంటి రూపములఁ బాణినీయము సాధించుటవలన నేర్పడిన నష్టమేమి? వీరు నాతో వివాదపడుట కవకాశ మేది? ఇట్లు వీరు వ్రాసికొనిన వ్రాతలే వారికి సమాధాన మిచ్చుచున్నవి. సత్యమిట్లుండ, వీరు తమ సిద్ధాంతమేదో తాము విలఁబెట్టినట్లు "ఇఁకఁబాణినీయ సాధితములకుఁబెక్కిటికిఁ బ్రయోగములు లేవనుట తప్పుకాదు" అని వ్రాయుచున్నారు. 'తప్పే; యది కేవల సాహసమే!' యని మహా భాష్యకర్తయే "సన్త్యప్రయుక్తా ఇతి వచనం కేవలం సాహసమాత్రమేవ, ఏతస్మింశ్చాతి మహతి శబ్దస్య ప్రయోగవిషయే తే తే శబ్దాస్తత్ర తత్ర నియతవిషయా దృశ్యన్తే" (మహాభాష్యము—పస్పశాహ్నికము). అని మహా భాష్యకర్తయే వీరిని గంతహంకారముతో మందలించి

* "వీరి ఈ యభిప్రాయమునుబట్టి పాణినీయ సాధితములఁ దెలిసికొనవలయునన్న దేశాంతరములను, ద్వీపాంతరములను దిరుగుటయేకాక, స్వర్గమునకుఁ గూడఁ బోవలయునని పర్యవసిత మగుచున్నది. అట్టి పండితుఁడు దుర్లభుఁడుకదా! (ఈ సందర్భములోని సంహితా సర్వస్వమునందలి వ్రాతలు)

వాఁడు. మన ముత్తర వాదులము కావలసిన యావశ్యకత లేదు. ఇక మిగిలినది, పాఠకులకు హాస్యము పుట్టించుటకై కొనివచ్చిన 'మేకాధీశా !' శబ్దార్థ శతకోటి' యొకటి! ప్రమాణబద్ధమై యుక్తియుక్త మగురీతిని సిద్ధాన్తము నిరూపించుకొనుటకును విషయశూన్యములై వాద దౌర్బల్యమును వ్యక్తీకరించు పరిహాసములఁ బచరించుటకును జాలదూరము! వీరీ శబ్దార్థ శతకోటిని దమ చింతామణి విషయ పరిశోధనమునందలి యనుబంధమున గూడఁ దడవి తడవి వ్రాసిరి. ఇఁక దీనికి సమాధానము చెప్పక తప్పదు.

'మేకాధీశా శబ్దార్థ శతకోటి'

'మేకాధీశా' అనుదాని కనేక విధములుగాఁ బాణినీయమును బట్టి వ్యాఖ్య యొనర్పఁబడి యుండుటంబట్టి పాణినీయము కృతక శబ్దముల (అప్రయుక్తముల) ననేకముల సాధించినదైనది. కావ్య వాఙ్మయమున నిట్టి శబ్దము లప్రయుక్తములు. కనుకఁ బాణినీయము కావ్యవాఙ్మయ కనుశాసకముగాఁజాలదు—అని ఈ పట్టునఁగల శ్రీ శాస్త్రులగారి వ్రాతలలోని సారాంశము! కృతకశబ్దము (కవులచేఁ గావ్యములలో నప్రయుక్తము) అని వీ రనుచున్న ఈశబ్దములవంటి శబ్దములు నైతము కావ్యములలో విరివిగాఁ బ్రయుక్తములే యైనవి. అట్టిచో నట్టివి కృతకము లెట్లగును? వానిని సాధించు పాణినీయము కృతక శబ్దముల సాధించిన దనుట యెట్లు? ఇట్టి మహా కావ్య ప్రయోగముల నైతము పాణినీయము శ్రద్ధతో సాధించినప్పుడు, పాణినీయము కావ్యభాషానుశాసకముకాక, మరేది కావ్య భాషాను శాసకమగును? ఇఁక వీరు మేకాధీశా శబ్దార్థ శతకోటి' నుదాహరించి కృతకములనిన శబ్దములవంటి శబ్దములు గూడ మహా కావ్యములయందెట్లు ప్రయుక్తములైనవో చూడుఁడు! ఇవి యైనను బాశ్ ప్రవచవాదులలో నేఁడు నడచుచున్న సుప్రసిద్ధ మహా కావ్యములలోనివే! కావ్య ప్రపంచమున భారవికవికాని, మాఘమహాకవికాని మనకుఁ దెలియరాని వారు కారుగదా! వారి కావ్యములనుండియే వీనికిఁ బ్రయోగ ముద్ధరించెదను :—

"న నోననున్నోనున్నోనో, నానా నానా ననా నను
నున్నోఽనున్నో ననున్నేనో, నానేనా నున్ననున్ననుత్.
(కిరాతార్జునీయము—15 స. 14 శ్లో.)

"దాదదో దుద్దదుద్దాదీ, దాదాదో దూదదీదదోః
దుద్దాదం దదదే దుద్దే, దదాదదదదోఽదదః"
(శిశుపాలవధము—19 స. 115 శ్లో.)

విస్తరభీతిచే మానుచున్నాముగాని యిట్టి వితరమహాకావ్యము లందును బరశ్శతములు. ఇంతయేల? శిశుపాలవధమున నీ సర్గముననే యిట్టి వనేకములు. ఇదా అర్థముల శ్లేషతో సంఘటించుచు నైషధాది మహా కావ్యములం దనేక శ్లోకములు 'మేకాధీశా' వంటివి మహాకవులచేతనే రచింపఁబడినవి. మల్లినాథాది మహా వ్యాఖ్యాతలు పాణినీయమును సమన్వయించుచునే వీనికి వ్యాఖ్యల రచించిరి. ఇట్టి కవి ప్రయుక్తములఁ బాణినీయము సాధించినప్పుడు కావ్య భాష కది సమగ్రమగు ననుశాసన మనియే కదా! నిశ్చయింపవగును? బహు కావ్య దర్శనములేకయా? మేకాధీశా శబ్దార్థశతకోటి కంతగా శ్రీ శాస్త్రులవారు విస్మయ పడుచున్నారు. అందువలననే, పాణినీయసాధితము లనేకములు కృతకములుగా వీరికిఁ గానవచ్చినవి. ఇట్టి నిదర్శనములతోఁ బరామర్శించిన నొక్క శబ్దమును బాణినీయ సాధితము కృతకము గాఁజాల దని మహా భాష్యకర్త మ్రోగించిన ఘంటా నినాద మప్రతిహతముగా దశ దిశల మాఱు మ్రోయించుచు జేజీయ్యమానముగా వెలయుచున్న దనుటకు సందియమేమి? త్రికాలజ్ఞులు నాప్తవాక్కులు విదిత వేదితవ్యులు నగు మహర్షి ప్రవరు లసత్యముల నేల పల్కుదురు? మహాకవులే మన కప్రసిద్ధములనిపించుచున్న శబ్దముల ననేకములఁ బ్రయోగించుచుండఁ బాణినీయము వానినెల్ల జాగరూకతతో సాధించుచుండ నే మన వలయును? లౌకిక భాషకును నిది యన్యూనాతిరిక్త మగులక్షణ మనియే కదా! యనవలయును? ఇట్టిచో శ్రీ శాస్త్రులవారికి విపరీత నిశ్చయమేల కలిగినదో! ఇఁక విషయాంతరమందుకొందము! 'వీరి వ్రాత లప్రయుక్తతా దోషమునకే నిర్విషయత్వమును ఘటించును' అని వీరు నామీద నొక యారోప మొనర్చిరి. ఇది యెట్లో యిఁక విమర్శింతము !

అప్రయుక్తతాదోషము-నిర్విషయత్వము

కవి ప్రయుక్తములగు సాధు శబ్దముల నెల్లఁ బాణినీయము సాధించుచున్నదని నే ననునప్పుడు, కవి ప్రయుక్తములు గాక వ్యాకరణాను శిష్టములగు సాధు శబ్దములే లేవందున, నాలఙ్కారికులు కవి ప్రయుక్తములఁ గాని సాధు శబ్దములఁ గొన్నిటి నుదాహరించి, యవి యప్రయుక్తతా దోషదుష్టము లనుటకాని, యప్రయుక్తతా దోషము నొక దోషముగాఁ జేర్కొనుటగాని యసంగతమేకదా!—యనునవి శ్రీ శాస్త్రులుగారి యాక్షేపము. అప్రయుక్తతాదోష మాలఙ్కారికులది. అది నిర్విషయమగునని వీరింతగా బాధపడుచున్నారనఁ గానే మన్నమాట! యాలఙ్కారికులు ప్రామాణికులని వా రొప్పిన దోష మసంగతమగుచున్నదికాన, నా యీ వాదమును బ్రామాణికు లంగీకరించుటలేదని చెప్పుట యన్నమాట! అట్లైన, 'చ్యుత సంస్కారదోషము' నుదాహరించి 'కవులకుఁ బ్రమాదములు గల'వని యాలఙ్కారికులే యనిరికదా! వారి మాటను వీరంగీకరింపక 'కవులకుఁ బ్రమాదములే లే'వని వాదించిరేల? ఇంకొకమాట! కవి ప్రయుక్తములనెల్ల నన్యూనాతిరిక్తముగా వ్యాకరణము సాధింపవలయునని వీరు వాదించుచున్నప్పుడు, కవి ప్రయుక్తములుగాని వ్యాకరణ సాధిత శబ్దములు వీరికి మాత్ర మెక్కడివి? అప్పు డాలఙ్కారికుల యప్రయుక్తతా దోషము వీరికి మాత్రము నిర్విషయముగాక మరేమగును? అప్రయుక్తతా దోషముతోపాటు వీరి కాలఙ్కారికు లంగీకరించిన 'చ్యుత సంస్కార'మను మఱొక దోషము గూడ నిర్విషయమగుట మఱొక విశేషముగదా! ఇది నాకు మాత్రమే దోషమై

వట్లు పెద్ద శీర్షకముంచి శ్రీ శాస్త్రులు గారింతగా వ్రాసెద రేమి? 'అప్రయుక్తతా దోష'మనగా నేమియో! యిం దాలఙ్కారికుల యాశయ మెట్టిదో! ఏ యర్థము చేసికొనలేదని చెప్పుటకే యింతగా వ్రాసితిని. ఇఁక నిక్కడి వస్తుస్థితిని దెలిపి, నా వాదమున కాలఙ్కారికులు ప్రతికూలురు కా రనుటను నిరూపించెదను—'అప్రయుక్త'మనగాఁ గవులచే నత్యన్త మప్రయుక్త మని శ్రీ శాస్త్రులుగా రనుకొనుచున్నారు. పొరపడుచున్నారు. అట్లర్థముకాదు. ఈ దోషము న్నాలఙ్కారికు లిట్లు నిర్వచించిరి. "అప్రయుక్తం తథామ్నాతమపి కవిభి ర్నాదృతమ్—'యథాఽయం దారుణాచార, స్సర్వ దైవ విభావ్యతే, తథా మన్యే దైవతోఽస్య పిశాచో రాక్షసోఽథవా" అత్ర దైవతశబ్దః 'దైవతాని పుంసి వా' ఇతి పుంసి ఆమ్నాతోఽపి కేనచి న్న ప్రయుజ్యతే (కావ్యప్రకాశికా—దోషప్రకరణము). అత్రభట్టవామనః—'అప్రయుక్త' మితి—అనుశాసనసిద్ధమపి కవిభిః న ప్రయుక్త మిత్యర్థః, ఆమ్నాతమ్—అనుశిష్టమ్—కోశవ్యాకరణాది శాస్త్రసిద్ధ మితి యావత్."

(బాలబోధిని వ్యాఖ్య)

> "అత్ర కవి భిరితి బహువచనా త్కావ్యకారిణా
> కేనచి త్ప్రయుక్తత్వేఽపి బహుభి రప్రయుక్తత్వమేవ
> దోషః" (బుధ మనోరఞ్జని వ్యాఖ్య).

'అప్రయుక్త' మనఁగాఁ గవి లోకమునఁ బ్రచుర ప్రయోగము లేని దనియే యర్థము. పై వ్యాఖ్యానములు, మూలమును నీ యర్థమును స్పష్టముగా బోధించుచునేయున్నవి. ఆలఙ్కారికులందఱు నీ దోషముకడ నిట్టి యభిప్రాయమే కలిగియున్నారు. వా రీ దోషమున కుదాహరణములఁగా నొసఁగు మహాకవుల ప్రయోగములే యిందులకు నిదర్శనములు. కావుననే, ఈ దోషమునకు 'అథైకధేనో రపరాధచణ్డాత్ ...స్పర్శయుతా ఘటోధ్నీః'—మొదలగు కాళిదాసాదుల ప్రయోగముల నైత ముదాహరించినారు. కనుకనే, విద్యానాథుఁ డప్రయుక్తతా దోషమున కుదాహరించిన 'దుశ్చ్యవన' శబ్దమును సంస్కృత కవు లటుండఁ గవిబ్రహ్మ నైతము ప్రయోగించినాఁడు. చూ: 'పొమ్ము దుశ్చ్యవన నీ పోయెడు తెరువన్న వాతఁడు నవ్వుచు నతనిఁ జూచి' (భార. శాంతి 4 ఆ. 392 ప.). కావుననే 'సర్వే శబ్దాః ప్రయోక్తవ్యా, యది దోషవివర్జితాః; అప్రయుక్తత్వ దోషస్తు న విరుద్ధో హరే ర్మతే' అను లక్షణ మేర్పడినది? మఱొక విశేషము! ఈ యప్రయుక్తతా దోషము శ్లేషయమకాదులందు దోషముగాఁ బరిగణింపఁబడదు. ఈ విషయము నాలఙ్కారికు లుద్ఘోషించుచున్నారు—"ఉక్తమిదం ప్రదీపే-"న వ్యత్ర కిందోషకతాబీజమ్, నతావచ్ఛక్తి విరహః, తత్సత్త్వాత్. శక్తిస్మృతి విరహ ఇత్యపి నాస్తి, శబ్దానుశాసనేన తద్గ్రహే స్మృతౌ ప్రతిబన్ధకాభావా దితిచేత్—పదార్థోపస్థితి విలమ్బః త ద్బీజమ్—అతఏవ శ్లేషయమకాదా వదోషత్వమ్; ఉద్భటాలఙ్కార సమ్పత్త్యై ప్రతీత్యవిలమ్బస్య తత్రానుద్దేశ్యత్వాత్, వస్తుతస్తు తాదృశ కవిసమయ లఙ్ఘనే ప్రయోజనాభావే సన్దాన వ్యగ్రతయా ముఖ్యా* ర్థావిచ్ఛిత్తిః దోషకతాబీజమ్, అత ఏవానుకరణే దోషత్వాభావః యమకాదావ ప్యదోషత్వమ్, అన్యత్రా ప్రయుజ్యమానస్యాపి తదర్థం కవిభిః ప్రయోగస్య దర్శనేన వ్యగ్రతాభావా దితి" (కావ్య ప్రకాశము. 7. ఉల్లాసము. (బాలబోధిని వ్యాఖ్య) చూచితిరా! యిప్పటి తత్త్వమిది! అప్రయుక్త శబ్దములు కవి ప్రయుక్తములు గా వనుటకు వీలుకాదుగదా! శ్లేషయమకాదులందీ దోషమే లేదుగదా! కవి ప్రయుక్తముల నెల్ల వ్యాకరణము సాధించు మాత్రమున నిక నప్రయుక్తతా దోషము నిర్విషయమగుననుట యెట్లు? ఇప్పుడేమైనది? ఆలఙ్కారికులు నాకుఁ బ్రామాణికులే యైనారు. వారి యప్రయుక్తతా దోషము నిర్విషయమునుగాలేదు. వీరు 'అప్రయుక్తతా దోషమునకే నిర్విషయత్వము ఘటిల్లు'నని నాపై నారోపించిన యారోపమే తుదకు నిర్విషయమైనది. శ్రీ శాస్త్రులుగారు తత్త్వ మెఱుఁగక యిట్లాక్షేపించి, నన్ను బరీక్షించుటకో! యనునట్లు ప్రత్యల్ప విషయమునను బ్రమాదపడినారు. వీరి యాప్రమాదములేవో నిరూపించి యందలి సత్యమెట్టిదియో విశద పరచుకొనినాము.

పాఠకులారా! శ్రీ శాస్త్రుల వా రాక్షేపించిన ప్రతి విషయ మక్షర మక్షరము పరామర్శించి మీయెదుట నుంచితినిగదా! ఇందొక యల్పాంశమైనను శ్రీ శాస్త్రులగారిది సిద్ధాన్త మనఁదగినదికాని, నాది యప సిద్ధాన్త మనవచ్చినదికాని, మీకుఁ గానవచ్చినదా? ఇందలి గుణ దోషము లిఁక విద్వల్లోకమే నిర్ణయించుఁగాక!

---

* (అవిచ్ఛిత్తిః) తత్త్వతో అత్యన్తావిలమ్బః—ఇతి ఉద్యోతః.

నా మనస్థితి

శ్రీ రెండుచింతల లక్ష్మీనరసింహశాస్త్రి

ఈ ప్రపంచానుభవములు నీసడించి
ప్రకృతితో మంతనమ్మాడు పంతమలర
సాగిపోతి సాయంతన సమయ మందు
శాశ్వతమ్మైన యొక చిత్తశాంతి బడయ

పూర్వ దిక్తటి నొక్క సంపూర్ణ సలిలమగు ప్రవాహమ్ము కన్పడ నచట నాగి
నలుదెసలు చూచి యొక పులినస్థలమ్ము పైన చదికిలబడితి సంభ్రమముదోప

అస్తమించిన సూర్యునియందు నెగులు
గాఢ తమసమ్ముపై దిగుల్ కలిగి యేమొ
శారికాకీర సంతతుల్ చేరనరిగె
తమ కులాయమ్ములకు నింత తడవులేక

ఆలమందలు గోపాలకాధికార రిక్తములె యయ్యె తమ బాటరీతి తెలిసి
క్రమ్మరుచునుండి పల్లెకు గాంచి నన్ను పరిచయా లోకనమ్ముల బలుకరించె

ఆ ప్రశాంతత కొంతయు నలరి నేను
దీన వదనుండనై ప్రకృతిదేవి యెదుట
మోకరిలి యిరుచేతులు మోడ్చి యిటుల
దెలిపికొనినాడ నా మనస్స్థితి యొకింత

"అమ్మ! నీవేడ చనిన నీ యనుగుబిడ్డ నైన నేవచ్చి నీకడ నన్మనీయ
బాల్య చేష్టితముల వెలువరిచి పోదు తల్లిసహియించు పాపల యల్లరులను

కుటిల మానవ సంఘమ్ము కోపజుష్ట
మైన నాడేను నీకడ కరుగుదెంతు
నా మనోవ్యథ తీరు సన్నాహమీవు
చేసి నన్నుపలాలింతుగా సతమ్ము

అదియ నే గోరునదియు నాయంతరంగ మెరుగునో లోక మెరుగదో యెరుగకున్న
నేమి నీకొక చిఱుబిడ్డనై మిగులుదు పాడుకొందు నీ ప్రతిభను పద్యములను

విశ్వనాథ - ప్రయోగ దక్షత

శ్రీ వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు

(గత సంచిక తరువాయి)

వంగసపింటి దివ్వియలు (వంగసపునింటి)

'వంగసము + ఇంటిదివ్వియలు'—అని ఛేదము. కర్మ ధారయములందు ము వర్ణకంబునకుం బు ంపులగు' (బా.వ్యా.స.వ. 32) అను సూత్రము ప్రకృత స్థలమున ప్రవర్తించునా? ఇది షష్ఠీ సమాసము. సూరిగారు 'సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకుం బు ంపులకుం బరుష సరళంబులు పరంబులగు నపుడు ను గాగమంబగు' (స. వ 25) అను సూత్రము క్రింద 'సింగపుఁ గొదమ' అని షష్ఠీ సమాసమున పుంప్వాదేశము కలిగిన రూపము నుదాహరించిరి. షష్ఠీ సమాసములందు పు—ంపులు ప్రామాణిక ప్రయోగ సమ్మతములు—ఇ, వ్వరపుఁడపుం జరిత్రమున వచ్చునె పీ కొక పేర్మి (అను 1—209); గంధపుఁజెక్క (అను 2—378); వేదపుగని (ఉ. హరి 2—197); వన విలు శాస్త్రంపు మినుకులు—(మనువ 2 — 43). ఆదేశము వచ్చునని యంగీకరించిన పక్షమున (అంగీకరింపక తప్పదనుటకు ప్రయోగ ప్రామాణ్య మింకను కావలెనేని, ఆం. వ్యా. సం. సం 1 పు 364 చూ) 'కర్మ ధారయంబులందుత్తున కచ్చు పరం బగునపుడు టు గాగమంబగు'నను సూ 28 ప్రవర్తించి 'వంగ నపుటింటి' అను రూపము నిష్పన్నము కావలెను. (చూ. సరసపు + అలుక—సరసపు టలుక). కేతన ఇట్టి ఆశయమునే ప్రకటించెను.

దీనిధి గుణ పదములపై
మానుగ హల్లున్న నంతిమములగు ము లకున్
పూని పు వాదేశంబగు,
భూనుత పై నచ్చులున్నఁ బుట లగు ములకున్
—ఆం.భా.భూ. 118.

వాదపుబంతంబులును ప్ర
మోదపు శృంగారములును ముత్యపు సరులున్
జూదపు టాటలు నెయ్యపు
టాదరములు ననఁగ నివి యుదాహరణంబుల్—119

ఈ కేతన లక్షణలక్ష్యముల వలన ము వర్ణకమునకు షష్ఠీ సమాసములలోఁ బు—ంపులు రావచ్చుననియు, వట్టి 'పు—ంపు' లకు హల్లుపరమైనచో 'ము'క్కును, స్వరము పర మైనచో—'టు'క్కును నిత్యముగా వచ్చునని స్పష్టము. ఈ పుంప్వాదేశస్థలములను సర్వ లక్షణసార సంగ్రహకర్తయు నచ్చర కత్యమున టుగాగమమునకే విషయములను గావించి దాని పాక్షిక తను క్రింది లక్ష్యములచే ప్రదర్శించెను.

అనలుండిల్లటపుటల్లుఁడై వర్తించున్— జైమినిభారతము
ఎల్లెడఁ గల్గు పాల్కడలి యుల్లట పల్లనిగాంచి
—రామాభ్యుదయము

ఈ టుక్కు నపేక్షించుట ప్రయోగములలోఁ గానవచ్చును.
పట్టు పేనుంగు శ్రీరంగపతికి—పాం. మా 1—77
అప్పడఁతుక లరిగి క్రమ వనఁటుల చెంతన్.
—య యా 4—28.

ఈ చర్చకు చౌదరిగారు ప్రకృత లక్ష్యమును 'షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు' (సం. వ 34) అను సూత్రమునకు విషయముగ గావించుట భ్రాంతి మూలకమని భావము.

18. పునర్వసువు + అంతము—పునర్వసువు నంతము కావలెను. పునర్వసు వంతమందు, మోమందము

షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగు నపుడు నుగాగమమును బాలవ్యాకర్త నిత్యముగా విధించుటచే ప్రవక్త రూపము లసాధువులని చౌదరిగారి యాశయము. తిక్కయజ్వ యీ ను క్కు నపేక్షించుట కానవచ్చును.

ఆలింగల దీపమట్లు తఁడు మండుంగాక యే వార్వెదన్
—కర్ణ 3—49

గొడుగిగి యఖిలపీడలఁ బాపు—అను 5—196

ప్రౌఢ వ్యాకర్తయుఁ దిమ్మకవియు నిట్టి రూపములను సమ్మతించిరి. (కొన్నిచోట్ల షష్ఠీ సమాసంబునం దుకారంబున కచ్చు పరంబగునపుడు ను గాగమంబునకు లోపంబునగు—సం. వ. సూ 10—

దిన వెచ్చమునకు నై తన మేనఁగల సొమ్ము
కొదుకక బచ్చింటఁ గుదువనై చు—పాం. మా 3—16
శిరసందంబరయున్—కళా 7—126

గోకుల మిల్లిలు దప్పకుండ లక్ష్మీపతి గ్రుమ్మరున్—హరివంశము పూ. భా. 5—203)

19. కైకవధింతునందువె (అయోధ్య 62) కైకను వధింతునన్న యర్థములో కల్పవృక్షకర్తచే వజడము ద్వితీయకుఁ బ్రథమ వివక్షితమని చౌదరిగారు.

ద్రుతంబునకు పరుష స్థిరంబులు పరంబులగునపుడు లోప సంశ్లేషంబులు విభాషనగునను విధిచే స్థిరాక్షర పరకత్వమున ద్రుతమునకు లోపమని సమాధానము.

20. కిటికి, గోధుమ—

'కిటికీ' అను శబ్దము హిందూస్థానీ భాషలోని 'ఖిడ్కీ' నుండి తెలుగులోనికి వచ్చినదని సూ. ని; కావున 'నచదేశ్యనదే' అను నిషేధము ప్రవర్తించునవరాదు. వ్యవహారమే ప్రమాణము. (బహువచన పరకత్వమున హ్రస్వాంత రూపమునంగీకరించుచో 'కిటుకులు' అను అనిష్టరూపము సిద్ధించును గాన 'కిటికి' రూపము నా కంగీకార్యము గాదు). 'గోధుమము' అను రూపమును సూ. ని. స్వీకరించినది.

21. గాఢోరసుఁడు (బాల 238)

ఏక వచనాంతములైన 'ఉరస్, సర్పిస్, ఉపానత్, దధి, మధు, శాలి, పుంస్, అనడుత్, పయస్, నౌ, లక్ష్మీ' శబ్దములకు బహువ్రీహి సమాసమున నిత్యముగా 'క' ప్రత్యయము వచ్చునను నియమముచే 'గాఢోరస్కుఁడు' అను రూపమే సాధువని భావింపవగును. సూరిగారి గ్రంథాంత మంగళ శ్లోకమును పరిశీలింపుఁడు.

'శ్రీ వత్సాంచిత కమ్రాత్రి వంక సంకలి తోరసే
పంకజాక్షయ నాథాయ వేంకటేశాయ మంగళమ్'

ఇందలి 'వంకసంకలితోరసే' యను ప్రయోగమును బా. గు. ప్ర. కర్త లాక్షేపించుటయు, మా యుపాధ్యాయులు శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రిగారి తన్నిరాకరణమును చౌదరిగా రెఱుంగకపోరు.

22 ఒక్క యుమ్మడి—'ఒక్కుమ్మడి' అన్న దానికి గణము కోసము సాగదీసిన రూపము అని విమర్శ.

కడగి సుయోధన ప్రభృతి కౌరవ వీరులు భీష్ముతోన బె
ట్టడరిన భీమముఖ్యులగు నక్కడి యోధులు నొక్క
యుమ్మడిన్—భీష్మ 2—131.

23. పాడై (పాడియై); వారిల్లు (వారియొక్క ఇల్లు అన్న అర్థములో); ముంగిలి+అందు—ముంగిలియందు—ముంగిలందు (బాల—297); తిపో (తిపియో); వేల్పు వెకిమీ నందంపు (వేల్పు+ఎకిమీని+అందంపు); ఈ యూరందు (ఊరియందు):

సూరిగారి ఏమ్యాదులలో నివి చేరవని చౌదరిగారి ఆశయము. వీరు 'ఇ'కార సంధి అప్రవృత్తి కుదాహరించిన లక్ష్యములలో నాలుగు షష్ఠీసమాస గతే కారములు. (వారిల్లు, ముంగిలందు, వేల్పు వెకిమీనందంపు, ఈ యూరందు). షష్ఠీ సమాసములోని 'ఇ' కారమునకు సంధి ప్రామాణిక కవి ప్రయోగ సమ్మతము.

మగవాలి పరిబోల్పఁ దగదు విధవ—కాశీఖండ 2-83.

(చూ. సర్వ. ల సార. సం. సంధి-స 1, మగవాలు, పురిటాలు)
(మగవియొక్క+ఆలు—మగవాలు)
దీనంఘ్రులు—నైషధము 3—202
(దీనియొక్క+అంఘ్రులు—దీనంఘ్రులు).

ఇక 'పాడై' (పాడి+ఐ); 'తిపో' (తిపి+ఓ); అను ప్రయోగముల సాధుత్వమున కీ క్రిందిలక్ష్యములు ప్రమాణము లనఁజెల్లును.

కొలఁదై యొప్పని—నిర్వచనోత్తరరామాయణము 6–61
కట్టిఁడైన నీఁ దిత్తజీ—5–106
తలయుఁజెఱొక్కట—విరాట 5—150.
ఖాండవం బే తెలివొంది కాల్చితి—3—292.

24. మనోజ్ఞమా నీ విశాలనగరము (మనోజ్ఞ మగు నట్టి యర్థములో); తలయొ నొక్కతె; మొల్లమా నొద్దుల; ఉడిగినదో నయోధ్య; నీ భాగమా నా విశ్వంభర; పెళ్ళిలోనుర్వి చాళ్ళలలోన; క్షీరంబు లౌఁ గమండలువులు; నీరిహమౌఁ బ్రథమ సృష్టి వరుణదేవుని పోలిక, భాసురలీలలగుఁ దల్లుల; గాఢమౌఁ బ్రణయ తేజము; నిర్విష్ణయమౌఁ బ్రలాపరాసులు, చేసెడుఁ దల్లులు; సకలేశుండగుఁ గౌసలేయుని; వాలికలగుఁ దూపులన్; పాడుఁచేసెడుఁ గడంకను; నీ పొనరుచుఁజేత; చెల్వారుఁ బ్రేమంపు—

ఈ పదునేడుదాహరణములలో పదుమూఁడింటిలో 'అగు' ధాతువు తద్ధర్మార్థక విశేషణముగా నుపయోగింపఁబడినది. ఈ ధాతువునకు 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాషనగు' (అచ్చ 27 సూ) 'అచ్చికంబులం దయి యువు లకు వక్రతమంబులు బహుళంబుగా నగు' (క్రి. ప. 103 సూ) నను సూత్రములు ప్రవర్తించుట వలన 'ఔ'అను రూపమేర్పడును. 'తద్ధర్మార్థక విశేషణంబనహోయుతం ద్రికాల వాచియగు' (ప్రౌ. వ్యా. క్రి. ప. సూ. 1) నను నియమముయొక్క భావము నీసందర్భమునం దనుసంధించుకొనవలెను. 'ఔ' అను రూపమునుపొందిన తరువాత నీ తద్ధర్మార్థ విశేషణ ముదంతముగాకపోవుటచే నచ్పరకత్వమున నుగాగమము రాదని చౌదరిగారి భావము. వచ్చుట సూరిగారి కసమ్మతము. ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగునని సూరిగారి విధి నిర్దేశము. (సం. ప 33). బాలవ్యాకరణోద్యోతమున శ్రీ సీతారామస్వామిశాస్త్రిగా రేమను చున్నారో చూడుఁడు.

చేయు+అతఁడు-చేయునతఁడు; చేసెడు+అతఁడు-చేసెడు నతఁడు (విధాన సామర్థ్యముచే దీనికి సామాసిక లోపములేదు—సంధి 23 సూ). ఉండెడు నంతకంబె—ఆది వ 3—149; క్రియా 103 సూ చెప్పిన వచ్చు వక్రతమాకారము మీఁదను నీ యాగమమగును. ప్రబలమౌ సీక (హరి సలో. 3—26.) ప్రబలమౌ+ఈక—ప్రబలమౌనీక—పుట 62.

కర్మధారయంబు త్రికస్త్రీసమముగంతధాతుజవిశేషణ పూర్వ పదంబయియుండు (బా. వ్యా. సమా 5) అను సూత్రమున స్త్రీ సమములను వచించి సూరి ధాతుజ విశేషణము లను వేఱుగఁ బేర్కొనుటచేత ధాతుజవిశేషణములు సూరి పక్షమున స్త్రీ సమములు కానేరవని చెప్పనగును. కాన బాల వ్యాకరణ పక్షమున ధాతుజవిశేషణములకుఁ బ్రకృత సూత్రముచేత (సమా సంబులనుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంపులకుం బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు సూ 25) నుగాగమము రానేరదని గ్రహింపవలయును. ఇట్లు నుగాగమ రహితముగనే భారతమునఁ బ్రయోగములు వెలయుచున్నవి.

చ. గొంతి ముద్దు సేయు కొడుకు (విరా 1—98)
చూ, చు తలం పెత్తెడు (భీష్మ 1—206)
ప్రో, చు తలంపలవఱచు (అను 1—72)

ప్రాచీన స్థల ఖచితములగు నిట్టి ప్రయోగములకు విరుద్ధముగ నర్వాచీనులు ప్రయోగించిరి.

వాలారుంగొనగోళ్ళ నీ వలసతన్ వాయించుచో
(మను చ 3—57)
అయ్యింతి చె, క్కులఁ బోలుం దెలవాకుల
(పాండురంగ 1—29)
—ఆంధ్ర. వ్యాసంస—సం 1 పు 342

సమాసములయందు హ్రస్వోకారమునకుఁ బరముగాఁ బరుష సరళ పరకత్వమున ను మాగమము వచ్చుననియు, మిశ్రేతర సమాసమునం దుకారాంత స్త్రీసమ శబ్దమునకంటెఁ బరముగ పరుష సరళ పరకత్వమందు మాత్రమె నుమాగమము వచ్చుననియు వికృతి వివేకకారుడు. ఇది కేచిన్మతమని నిరూపణము.

పరశే పరుషే చైవ సమాసే నుము తో భవేత్
అమిశ్రే స్త్రీసమాత్ కేచిత్ ప్రయోగః శరణం కవేః
—అధ్వరణ సం 23

లేదా లక్ష్యములలో నర్ధానుస్వారము లను తొలఁగించి సరళములకు మాఱుగా పరుషములను వ్రాసినచో 'నచ శంకా వచోత్తరమ్'

25. తా వలె (అయోధ్య 165) రాయివలె. వృత్తియందు మాత్రమే రాయిలో యి వర్ణము లోపించును. తా పువ్వు ఇత్యాది అని వివర్శ.

'బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించు' (బా. వ్యా. అచ్ఛి 21 సూ). సూరి గారు ఈ లోపము సమాసములందును చూపబ్డెడినని వివరించి, 'రేరాజు, మగఱా పతకము, వే వెలుఁగు' అను నుదాహరణముల నొసఁగిరి. సూరిగారు 'రే' 'వే' యను వ్యస్త పదములున్నట్లు గణుతింపలేదు.

రే నిద్రించుఁ బ్రభాతం, బైనను మేల్కని సృజించు
అను 1—322

మొగములు వే గల శేషుండు—కవిజన రంజనము 1 ఆ

ఈ ప్రయోగము లాంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వమున బ్రదర్శితములు. కళాపూర్ణోదయమందలి క్రింది పద్యమును చూడుఁడు.

'రాయైనఁ గొంతమేల్నా
రాయణ మీమనసుకంటె రహి నిఁక నెపుడు
వ్రీయంతఁ దడవెదరె యని
యా యంగన యతనిపాద మల్లనఁ బట్టెన్'
4—115

రాయి + ఐన అనుచో విత్వనకు సంధి యగుట చౌదరి గారి కంగీకార్యము కాదేని 'రా' యను వ్యస్త పదమును వారంగీ రింపవలసి యుండురు.

26. మపిసి, శరాసము, శామంతిక, అనుము కోశముల నమ్మరిని బడసినవని శ్రీ రామకృష్ణారావు ప్రతిపాదనము. శరాసః కార్ముకమ్—అని సర్వ శబ్దసంబోధినీకోశమఁట! గ్రాన్యమీ రూపమును స్వీకరించినది. అనుము (అనమునకురూపాంతరము)నాంధ్ర వాచస్పత్య మంగీకరించినది. శామంతికా ప్రసంచిత సీమంత—భాగ 10 పూ 800 అను ప్రయోగమును వా రుదాహరించిరి.

27. కపురంపుముగ్గు, గందంపు—ఇత్యాదులలో అక్కఱ లేని అరసున్న. చాదినఁ గందపు—పీనిలో నరసున్నల కవకాశము లేదు. ముద్రణ వశమున నేర్పడిన దోషమని దీని నంగీకరింప దగును.

28. తన నక్కున—బాల—110 పేజీ—(తన యక్కున అనుటకు); అందుబాటు అందుపాటు (దే. విజ. సమీపము అని శ.ర.) తక్షణము; (తత్క్షణము); ప్రాణానికి (ప్రాణానకు); నీడుఁ గరుణ(నీడుకరుణ); పిన్న దమ్ముఁడు (పిన్నతమ్ముఁడు); వెనులబాటు (వెనులుపాటు); కచ్చరానికా 239 పేజీ కచ్చరము-మయిలకచ్చరానకా; పుణ్యలోకాలికి—239 పేజీ (పుణ్యలోకాలకు); ఈ మాత్రానికా; మేలు జాచి, తిరుజాచి, మన్నన జేయురు, మోము జాచి, మన్నన జేయుచు, ఏగె యెదఁ బెట్టిన (ఏగనెదఁ బెట్టిన) సుకినలు—అయోధ్య 206 సుకిని - ముఖవతి; సుకినులు (బహు); వంచనజేసి, వధింపవేఁబడిరి, సావడి (చావడి)

ఈ లక్ష్యములందలి అక్షర వ్యత్యాసములు స్పష్టముగా కల్పవృక్షకర్తచే ప్రయుక్తములని విశ్వసింపనేరకున్నాను. వలసిన విధముగా నక్షరములను మార్చుటవలన గణభంగాదులు కలుగవు. కల్పవృక్షకర్తకు 'లు, ల, న లు పరంబులగునపు డొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబును విభాషనగు' (తత్స 43 సూ) నను సూత్రము ప్రవర్తించుటచే 'పుణ్య లోకములకు' అను శబ్దము 'పుణ్యలోకాలకు' అను రూపమును పొందుననియు 'పుణ్య లోకాలికి' అను రూపము సాధువు గాదనియు తెలియుదనుట సాహసమగును గాని సరసత కానేరదు.

29. కురిపించన్ (అయోధ్య 92) (కురియింపన్); పున్నెమో పాపమోను (అయోధ్య 187); ఏలాటిదో, ఈవఱకు,

ఆ వశికు, వాస్నంచు (వ్యావహారికము) శతగోపము (శతకోపము ప్రసిద్ధి—ఈ శబ్దమున 'గ' కార మచ్చు తప్పు కావచ్చును). వార నేఁడు—ఈ శబ్దములు లోక వ్యవహారమునుండి స్వీకృతములు.

30. వెల్లరేఁగఁగా (అయోధ్య 169) వెలిఁగి + రేఁగు—వెలరేఁగు=మిక్కిలి విజృంభించు. ఈ రూపమును కల్ప వృక్షము గణము కోసమై, 'వెల్లరేఁగ'గా గ్రహించినది. మృదువాసనముల్—242—వాసము (రూ) వాసస్సు=వస్త్రము; అపైనను—అపైని, గౌరవనీయురాలు—282—అసాధువు; ఏలనమ్మ తల్లి! కళయైన 'ఏల' శబ్దము ఈ కల్పములో ప్రదుతాంతముగా వందల కొలఁది అవతారములెత్తినది; నీ నిల్పుప్ పీడలుఁ (నీ నిల్పునట్టి పీడలు); చెప్పుచుంటిని (చెప్పుచున్నాను—అనెడి వర్తమానార్థములో ఈ భూతకాల రూపములు ఈ కల్ప వృక్షములో రెమ్మ రెమ్మకు, కొమ్మ కొమ్మకుఁ గానవచ్చుచున్నవి); మీరలు వచ్చిరి (అయోధ్య 354) మీరలు వచ్చితిరి, చా లానంద పారవశ్యమ్ము (చాలున్ + ఆనంద—చాలునానంద కావలెను); తిరుగముఁగిఁతగింజలు (అయో 357) తిరుగమూఁతకాదు. తిరుగఁబోఁతయువవలెను. తిరుగఁబోఁత—తాలింపు ఉదా:—కం. క్రొంబోగపుఁగూర వగ తిరుగం బోఁతల—రాజ వాహన విజయము 3 వ ఆ; పతిగా నొల్లిన నేనెలంది (అయో 365) – వలచు ధాతువునకు వ్యతిరేకములో 'ఒల్ల' విభాషగా వచ్చును. ఉదా:—ఒల్లఁడు, ఒల్లరు—పక్షమున వలవఁడు—వలవదు; వలచిన అనవలసినచోట 'ఒల్లిన' అనుట సాహసము. దాసీలు మొ:— ఈ శబ్దముల సాధుత్వము విచార్యము. చౌదరిగారి యాక్షేపముల నంగీకరింపవలెను.

4. ఏకాదేశాన్వయములు

చౌదరిగారు సిద్ధసమాస మధ్యగత పదములతోఁ దద్భిన్న పదముల కన్వయముగల స్థలములు క్వాచిత్కములనియు రెండు మూఁడుదాహరణములకై లభించుననియు సాహసించి వ్రాసిరి. ఈ వ్రాఁతకుఁ ప్రౌఢవ్యాకరణ మందలి క్రింది సూత్రమును తదుదాహృతుల సంఖ్యయు హేతువు కానోవును.

కొన్నియెడల సిద్ధసమాస మధ్యగత పదములతోఁ దద్భిన్న పదముల కన్వయము చూపఁబడెడి.

బహువేద ఘోషములఁజేసి నిరస్త సమస్త కిల్బిషోత్కరులగుచున్న ధన్యులు —భార అర 1—11

వారి యస్మదీయోరువమూనమూహములు—
హరివంశము ఉ. భా 2—105

అఖండిత రూపవిలాస సంపదన్, వంచిత పంచబాణుఁడగు వాని —నైషధము 3—40

అందొకటి చే జనితాధర పీడయై-కళా —5—27"
సమా. సూ. 35

కూచిమంచి తిమ్మకవి 'తన, నీ,నా' శబ్దముల స్థలములం దేకదేశాన్వయము నంగీకరించెను.

తన నా నీ యను పదముల
కొన సంస్కృత శబ్ద వితతిఁ గూర్చి సమాసం
బొనరింపఁ జెల్లుఁగృతులన్
ధనపతిసన్మిత్ర కరటిదానవ జైత్రా —2—17
తన యశో విశద ముక్తాసౌధపాళికి
నంబుదాయనము వాతాయనముగ—వసుచరిత్రము

అధర్వణుఁ డీ క్రింది ప్రకారముగా నియమించినాఁడు.
'సమాస యుక్స్య వేదాద్య అత్మాదిగ విభక్తిగః—హలం 13
అభిన్న స్యాపి వాదేః స్యా ద్భిన్నే నాపి సమన్వయః'—27

ఈ కారిక లాంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము నందీ క్రింది తీరున వ్యాఖ్యాతములు (చూపు 1111). ఆత్మాదిగ="తా" మున్నగు శబ్దములపై నిలిచిన, విభక్తిగః = విభక్తులతో నన్వయించునట్టి, ఆద్యః=సంస్కృతపదము, సమాసయుక్స్యేత్=సిద్ధసమాసగతమగుట యుఁగలదు. వ్యస్తములగు తన యొక్క—నీయొక్క—నా యొక్క మున్నగువానితో నన్వయించు సంస్కృత పదము సిద్ధసమాసాద్యవయవమగుటయుఁ గలదని యర్థము. ఉదా:—తన నామమహిమ. అభిన్న స్యాపి వాదేః=సమాసగతములగు సవర్ణకాంతాది విశేషణ శబ్దములకు, భిన్నేనాపి సమన్వయః = వ్యస్త పదముతో సమన్వయము కలుగవచ్చును. ఉదా :—నేను జేసిన పని, మొద॥— ఇచట 'నేను' అను వ్యస్తపదము 'చేసిన' అను సమాస పూర్వావయవముతో నన్వయించుచున్నది. దీని నేకదేశాన్వయ మందురు.

ప్రయోగములు:—

అవనీశులెల్ల నీ యనుజవీర్య విజితులయి—సభా 1—272
అతని కరతలద్వయావమర్దితములై, కందియును
మహోనుగంధి కుసుమతతులు—అర—2—197
నా వీర్యప్రభువులైన పలువురు సుతులన్
—ఆది 8—301
నా యథాశక్తిఁజేసి యన్యాయపథముఁ బరిహరించి
—సభా 1—57.
హరుచేత సంప్రాప్తవరుఁడయ్యె నరుఁడని యెఱిఁగి
—అర 1—337
ప్రధానవరులందు సమర్పిత రాజ్యభారుఁడై-అర 3-200
ఇక్ష్వాకుని కులతిలకుఁడు—అర 3—225
వాఁడు దానవికిఁజేసిన వెయ్య మెఱింగి—ఆది 3—186
దానము చేసిన తత్ఫలంబు. ఆది 1—15
నీ కంఠార్పిత కాలపాశము—భాస్కర—సుందర ప 78
—ఆంధ్ర. వ్యాసంస-పు 1111, 1113,1115

చౌదరిగా రిచ్చిన లక్ష్యము లన్నియు నిక్కృతివివేక కారి కలచే,భట్టారకుని ప్రయోగములచే సమర్థింపఁదగినవి. 'నీ ప్రథమ మార్గణ దర్శనోత్సాహము' 'నా యస్నిహస్త్రార్థ హవ్య సంపాదనీ' మున్నగు నుదాహరణము లధర్వణకారికావళినుండి యుద్ధరింపఁబడిన హలంతపరిచ్ఛేదమందలి పదుమూఁడవ కారికకు

లక్ష్యములు. 'సవతి యుడిన గరళ సహితుండు; డీల్పడిన చమూ సమేతుండు' మున్నగునవి హాలంతపరిచ్ఛేద మందలి యిరువది యేడవ కారికకు లక్ష్యములు.

5. వ్యర్థసముచ్చయములు

ప్రాయికముగా చౌదరిగా రిచ్చిన లక్ష్యములలో 'ను'శబ్ద మర్థవిశేష ద్యోతకముగాదు. ఇట్లు విస్తారముగా వాడుట సారస్యమనియు వాదింపనేరను. ఈ 'ను' శబ్ద ప్రయోగము పూర్వ కావ్యములందును తఱచుగ్గాకానవచ్చును. కావుననే సీతారామా చార్యులవారు క్రింది విధముగా సూత్రించిరి.

'నామ సర్వనామంబులకును గళలగు నవ్యయంబుల కును గడపల సముచ్చయార్థ విశేషపాదపూరణంబుల యందు 'ను' శబ్దంబు తఱచుగ నగు. కళలగు నమదంత శబ్దంబులమీఁద నయ్యాది యు వర్ణ పూర్వకంబుగ విభాషనగు. మఱియు నది శేష షష్ఠియందు యొక్క లోపించినపుడు లాగ మాంత బహువచ నంబుమీఁద ను సముచ్చయమునం జా పట్టెడు'—త్రిలింగలక్షణ శేషము—శబ్ద పరి—116 సూ.

6. అశ్లీలము

'అసభ్యార్థాంతర మసభ్యస్మృతి హేతు శ్చాశ్లీలమ్' అని వామనుని అశ్లీల పద నిర్వచనము. ఒక పదమున కనేకార్థము లుండ నొక యర్థ మసభ్యముగా నుండినను, సభ్యార్థ వాచక మైనను నేకదేశ ద్వారమున నసభ్యార్థమును స్ఫురింపఁజేయు చున్నను, అట్టి దోష మశ్లీలమని వామనుని నిర్వచనమున కర్థము. గుప్తము, లక్షితము, సంవృత మగునది యశ్లీలమయినను దోషము గాదని వామనుఁడే తదపవాదమును స్ఫుటీకరించెను. (న గుప్త లక్షిత సంవృతాని). గుప్తమనఁగా నసభ్యార్థము స్ఫురించుచున్నను నది యప్రసిద్ధముగా నున్నచో దోషము గానేరదు. సంబాధ పదమున కశ్లీలార్థమున్నను, 'సంకటము' అను నర్థమునవే ప్రసిద్ధి. లక్షిత మన నొకపదమునకు ముఖ్యార్థముచేఁగాక లక్ష్యా ర్థముచే నశ్లీలత తోఁచినను దోషముగాదు. సంవృతమన లోకముచే నాదృతమైనది. చాముండ, కమలము, విమలము, పూబోఁడి మొదలగు పదములు లోక స్వీకృతములగుటచే నిం దశ్లీల శంక కానరాదు. లోకాదృతమగు పదము నసభ్య మనరాదు.

> 'సంవీతస్యహి లోకేన న దోషాన్వేషణం క్షమమ్
> శివలింగస్య సంస్థానే కస్యాఽసభ్యత్వ వాసనా'

లోక సమ్మతమగు పదము దుష్టముగాదు. 'శివలింగము' అను పదమున నెవని కశ్లీ లార్థస్ఫురణముండును? (వాక్యాలంకార సంగ్రహము పు 455—57). చౌదరిగా రిచ్చిన లక్ష్యములలో 'కొసమింటితో వార్థి గుద్దలించు' (అయో—335) నను చోటఁదక్క శేషించిన స్థలములలో నా పదములు లోకాదృతము లగుటచే నసభ్యార్థము స్ఫురించుటలేదు. ప్రకృత లక్ష్యమందలి పదమునకుఁ గళా పూర్ణోదయాదులలోఁ బ్రయోగములు గాని పించును. లోకమున నేఁడది అశ్లీలార్థస్ఫోరకమనుట నిర్వివాదము. (కులమునకు గొప్ప గుద్దలి—స్వ. పు 4—25)

అక్టోబరు మాసపు భారతిలోఁ దాము ప్రచురించిన వ్యాస ములో ప్రయోగములఁ గానవగు వైలక్షణ్యమునేగాక చౌదరిగారు ప్రక్రమభంగాది దోషములకు లక్ష్యములను ప్రదర్శించిరి. ఈ వ్యాసమునఁ బూర్వ భాగముకంటె నుత్తరభాగము విరసముగా నున్నదనుటను దిఙ్మాత్రముగా నిరూపించి ప్రకృతమున కీ పరి శీలనమును ముగింతును.

వింత ప్రయోగములలో 7, 12, 5, 10, సంఖ్యలు గల ఆక్షేపములను చూడుఁడు.

7 నడియు? (చలియుఁ) జప్పుడు లేక నిశ్చలముగాఁగ

'సడీ చప్పుడు లేకుండ' అని లోక వ్యవహారము. దశ రథుఁడులేని అయోధ్య బొపురుమన్నదన్న ఈ ఘట్టములో 'చలి' తో పని యేముండును. యతి ప్రాసల కోసముగాని

అచ్చు తప్పులు గూడ విమర్శకు విషయములేనా? 'సడియుఁ జప్పుడు లేక నిశ్చలముగాఁగ'నని సవరించుకొనవచ్చును గదా! యతిభంగము ప్రాప్తింపదే?

12 అంతఃపురీ సర్వ కాంతా గుచ్ఛంబులు చేర—

గుచ్ఛమనఁగా పూల గుత్తి, నెమలి, పాద. సమూహార్థములో కాంతలకు ఈ గుచ్ఛ మిచ్చిరి. పైగా 'ప్రాసము'గా పాడుకోవలసి సినపని ఉన్నదాయె! అవునెంట దూడ నడచునట్లు మహా కవు లకు యతి ప్రాసలు—గణములు అనువుగా వెంటబడి వచ్చునని శాస్త్రము చెప్పును.

గతిమధ్యస్తన కుంతలస్తబక వీక్షా గర్వ దుర్వార యూ
నతిచే మానమె యూనమయ్యె నిఁక విస్ఫారంపుఁ బ్రాణంబుఁ దా
ల్చు తెగుల్ గాదని రోసి యా వృషలి వాలుందూపుఁ గొమ్మంట కా
హాతి యా బర్హి మృగేంద్రకుంభిచమరీయూథంబునేణంబులున్.

పాం. మా 3—86

స్తబకము—పూగుత్తి, గుచ్ఛకము; స్తబక గుచ్ఛ పద ములు సమానార్థకములు. కుంతలస్తబకమనఁగా 'కుంతలముల యొక్క సమూహ'మని చౌదరిగా రన్వయింపరు గాఁబోలును. ఇంత యేల? సూ. వి. సమూహమను నర్థమును చెప్పినది. ఇట్టి యాక్షేపములు నిక్కమున కుపేక్షింపఁదగినవి.

5,10 ఇంతదాఁక నమఁ జెప్పరు మంచి వివేకు లంచునున్

రాత్రియునఁగావచ్చి ఈ వార్త నాతోఁ జెప్పరే. అవురా! మంచి వివేకులే సుమా మీరు! అని భరతుఁడు వారలతో అన్నమాట— నమఁ జెప్పరు—వింతైన తెలుఁగు కారకము. ఆ భాషలో 'మా మువాచ' ఉన్నదిగదా యని ఈ భాషలో ఇట్లనుట బొత్తిగా సహింపరాదు. 'అంచునున్' లోని సముచ్చయ పారస్యము కల్ప వృక్ష పాఠకులకు క్రొత్త గాదు గదా!

ఓయి యోలు నాయునా! నినుఁ జెప్ప రెవ్వరును
నీకు ఇక్కడి వార్త లెవ్వరును జెప్పరు నాయనా! నేనే చెప్పవలెను

గాఁబోలు—అన్న అర్థము ఈ 'కల్పవృక్ష కారకము'లో ధ్వనింప వలెను.

ఈ యాక్షేపమువలన చౌదరిగారు 'వచ్యర్థ ముఖ్య కర్మంబునకుఁ దోడ కు వర్ణకంబులు ప్రాయికంబుగానగు— మైత్రుండు చైత్రునితోడ నిట్లనియె—మైత్రుండు చైత్రున కిట్లనియె. ప్రాయికంబనుటచే నొకా నొకచో ద్వితీయయు నగు, (బా. వ్యా. కా.వ. సూ 6) నను సూత్రమును, తదర్థమును విస్మరించినారని యెన్ననగును. 'అను, పలుకు' మొదలగునవి వచ్యర్థకములు. ఈ ధాతువులను ప్రయోగించునప్పుడు ముఖ్య కర్మమనియు, గౌణకర్మమనియు కర్మములు రెండుండును. ఏ శబ్దముపై ద్వితీయయేకాని తక్కుంగల విభక్తులు సందర్భింపవో అయ్యది ముఖ్యకర్మార్థకము. ఏ శబ్దముపై ద్వితీయయేకాక తృతీయా షష్ఠీ విభక్తులు సందర్భవశమున నుంపనగునో యవి అముఖ్య కర్మార్థకములు. ఇట్టి యముఖ్యకర్మమునకుఁ బ్రకృతసూత్రము 'తోడ కు' వర్ణకములను విధించుచున్నది. సూత్రమునందలి ప్రాయిక గ్రహణముచే ద్వితీయయు క్వాచిత్కముగా రావచ్చును. ఉ:—మైత్రుండు చైత్రునితోడ నిట్లనియె. ఇచ్చట 'అనియె' అనునది వచ్యర్థక ధాతువు. ఇట్లు (ఈ ప్రకారమైన వాక్యము) అనునది ముఖ్య కర్మము. చైత్రునితోడన్—అనునది అముఖ్య కర్మము. అట్టి అముఖ్య కర్మమునకుఁ దోడ, కు, వర్ణకంబులు కలుగును గావున 'మైత్రుండు చైత్రునితోడ నిట్లనియె. మైత్రుండు చైత్రున కిట్లనియె' నని రూపద్వయము. ప్రాయికమనుటచే నొకా నొకచో ద్వితీయయు కలుగును. కావున 'మైత్రుండు చైత్రు నిట్లనియె' ఇత్యాది ప్రయోగములు సాధువులు

తే. గీ. కొంత ప్రొద్దు, జరపు కుంతీసుతాగ్రణి సంయమీంద్రుఁ
బలికె నిట్లని వినయ సంపదలు పొలయ
—హరిశ్చంద్రోపాఖ్యానము

ఇచ్చట 'పలుకు' అనునది వచ్యర్థక ధాతువు. కావున నముఖ్య కర్మమైన సంయమీంద్రుని జెప్పునట్టి పదమునకు ద్వితీయ కలిగెను. సంయమీంద్రుననఁగా సంయమీంద్రునితోడ నని యర్థము.

(చూ. బా. గు. ప్ర పు 211)

ఈ క్రింది ప్రయోగముల నీ సూత్ర వ్యాఖ్యా సందర్భమునఁ గళాప్రపూర్ణు లాంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వమునం దుదాహరించిరి. (చూ సం. 2 పు 995)

హా మహారాజ! మహామహీ రక్షణ
దక్షదక్షిణబాహు దండ! దండి
తారాతి! విమతరాజాగ్రణి! నన్నిట్లు
వీతదయుండవై విడిచి చనఁగఁ
దగునె నీవెన్నఁడు ధర్మవు దప్పని
వాఁడవు సూనృత వ్రతరతుండ
వోడకుమని నన్ను నూఱడఁ బలికిన
పలుకిట్లు మఱవంగఁ బాడియగునె
పొదలలోన డాఁగి పొడచూపకిట్లుం
డున్నవాఁడ విట్టి యుగ్రభావ
మేల నీకువలసె నెటవోదు నింకెట్లు
గాంతునిన్ను మృగకాననమున—భార—అర 2—82

అప్పుడే, మంటి నృపేంద్ర నన్నని రణాగ్రమున న్నిను
మూదలించెదన్—ఉద్యో 3—59

గోవింద ని, న్నును మానింపక యాడుమన్న తెఱఁగే
మారాజ వాక్యంబుగా—హరి ఉ. భా 1—7

ఉసురోర్వఁజాడి యను నింతి బోటులన్—
హరి. ఉ.భా 3—44

ఈ ప్రయోగములలో ద్వితీయాంతములగు 'నన్ను, బోటులన్' మున్నగు వానికిఁ దృతీయార్థము వివక్షింపక తప్పదుగదా! వివక్షితార్థ సాధనమునకు 'కల్పవృక్షకారక'మను మాత్న సృష్టి అనావశ్యకము.

అప్రయుక్తమను దోషమునకు నిచ్చిన లక్ష్యములలో మూఁడవ దానిని చూడుఁడు.

3, కాశ్యపి భర్త యుజ్జ్వ పరికల్పిత
వాటీబురోపశిమ్మఁడై
ఋష్యవిషాణహావి నివరింపఁగ—

ఈకారాంత స్త్రీలింగమైన కాశ్యపికి భూమి అనియు, ఇకారాంతపుంలింగమైన కాశ్యపికి అమారుఁడనియు అర్థములు. భూపతి యనుటకు కల్పవృక్షము 'కాశ్యపి భర్త' ను సృష్టించి యిచ్చినది. భూమికిపతి యున్న అర్థములో సంస్కృత వాఙ్మయమున ప్రసిద్ధములైన పదములు పదులుగాదు, వందలు దొరుకును. ప్రాసకోసము—అందును తక్కువ రకములో లెక్కకు వచ్చు 'శ—స' ప్రాసముకోసము ఇక్కడ 'కాశ్యపిభర్త' కావలసి వచ్చెను. ఆ పైన నాలవ పాదమున 'ఋశ్య విషాణహావియు' ప్రత్యక్షమయ్యెను. 'ఋష్యశృంగ'కు పేరు తగిలించిన 'నకలుముక్క'. శృంగ—విషాణములు పర్యాయములైనంత మాత్రాన సంజ్ఞా వాచకముల నిట్లు తాఱుమాఱు చేయుట భావ్యమా? హస్తిపురిని 'కరిపురి' అన్నారు గదా అని ఏనుఁగు పట్టణమని మనము క్రొత్తగా వ్రాయఁగలమా? ఋష్యశృంగుఁడు గణముకోసమై ఋష్యవిషాణహావిగా నవతరించుచు 'నేయార్థ' మను కావ్యదోషమును గూడ సంపాదించి యిచ్చెను. (ఇవి చౌదరిగారి వాక్యములు.)

ప్రసక్త పద్యపాదముపై విమర్శకు లీక్రింది మూఁడాక్షేపములను గావించిరి.

1. ఈ కారాంత స్త్రీలింగమైన కాశ్యపికి భూమియని యర్థము. సమాసమునఁ బదాంత దీర్ఘమునకు హ్రస్వమురాదు.

2. శ—స ప్రాసము శ్రేష్ఠము గాదు.

3. సంజ్ఞా వాచకము తాఱుమాఱు చేయుట భావ్యము గాదు.

'హ్రస్వే దీర్ఘ సమాసేఽపి క్వచి ద్దీపః ప్రయోగతః' (అథ.కా. అజం సూ 28) అని వికృతివివేకము. కవిప్రయోగము వలన షష్ఠీసమాస మం దొకానొకచోట 'ఈ' కారాంతమునకు హ్రస్వము కనఁబడుచున్నదని కవిజనమండన టీకాకారుని వివరణము.

"సంస్కృత పదంబు లొగి సమాసములు గూర్చు
కడల స్త్రీలింగములకు దీర్ఘములు కురుచ
లగుచునుండు నొకొక్కచో నాంధ్ర కృతుల
రమ్య ధవళాంగ కంఠపీఠధివిషంగ'

సర్వలక్షణసారసంగ్రహము పు104

అని నియమమును గావించి తిమ్మకవి క్రింది ప్రయోగముల నుదాహరించెను.

పదిదినము లై ద్రుప్రాద్యులు,
పదఁపడి రెన్నాళ్ళనొక్క పగలున్ రేయున్
గదనంబుఁ జేసి మడిసిరి
నదిసుత గురు కర్ణ శల్య నాగపురీశుల్

భార—ఆది—1—68

ధరణీధవదత్త వివిధోపదా విధా న
మార్జితశ్రీ వివర్ధిత నిర్జరాల — ఆముక్తమాల్యద
అపుడు పురంధ్రి వర్గ వృతయై చరణాంక కృతార్థ
మైన —వసుచరిత్రము
కనకక్షోణిధరంబుకార్ముకముగాఁగ ద్రూ
తమాజాండుశింజనిగా—నైషధము.

'కాశ్యపి భర్త' యను సమాసము సాధువని తేలినది. శ, స ప్రాస మప్రశస్తమనుటకుఁ బ్రమాణమేమి? శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారిచే రచింపఁ బడిన 'ప్రాచీనాంధ్ర వాఙ్మయంలో వ్యావహారిక భాష' అను గ్రంథమునఁ బ్రదర్శింపఁ బడిన ఎఱ్ఱయ హరివంశ మందలి క్రింది పద్యమును తిలకింపుఁడు.

కంసుని బాధలం బడు జ
గంబుల కింతట వేగుగాక త
ద్ధ్వంసము వేగవేగుటయుఁ
దానొడఁ గూడదె యన్నతిం దమో
ధ్వంస మొనర్చి కౌరి కను
దమ్ములు తమ్ముల దాయ నవ్వఁగా
హంసుఁడు ప్రాచ్య పర్వతశి
ఖాగ్ర నతంసత నొందె నొప్పుగాన్

—హరి పూ. భా 9—87

క్లిష్టమను పదదోషమునకు నీ రుదాహరించిన క్రింది లక్ష్యమును సహృదయులు పరిశీలించి అచ్చెరువు పొందక మానరు.

నీవా యక్షుద్రాత్ముండవు—దశరథునితో మంత్రి యన్న మాట ఇది. క్షుద్ర—నీచమైన, ఆత్ముఁడు—ఆత్మగల వాఁడు—నీచమైన ఆత్మకలవాఁడు గాని వాఁడు—అక్షుద్రాత్ముఁడు—ఇదియు 'అవిధవాభవ' జాబితా లోనిది అని వాదరిగా రనుచున్నారు.

కెం, గేలంబట్టి తటాలునన్ వెగావె నక్షీణాంబు
నాథాంబుజా
క్షీలోకంబు జయించి వారల యశశ్శ్రీఁదెచ్చు
చందంబునన్ —వసుచరిత్రము 3—162

కుక్షుల్ నిండఁగ నారగించితిమి యక్షుద్రక్షుధాశాంతికిన్
—భీమఖండము

నిజానుజన్ముల, క్షీణపరాక్రము లుద్ధతులఁజేయులు బాహ్లిక
సోమదత్తులా స్థాణుకల్పన నోడరు నంశంబె, జయింపఁగ
నారివేరికిన్—ఉద్యో 1—299

క్షీణము—సం.విణ.క్షయించినది—క్షయించు—క్షీణించు
తగ్గు (చూ. శ. ర)

ఈపదముల కర్థము నిర్ణయించు కొనుటలో పాఠకులకు క్లేశము కలుగుచున్నదనుట సత్యదూరము. వీరి పద్యాన్వయ పద్ధతియు క్రొత్తపుంత. అక్షీణ—సంపూర్ణమైన, అంబు నాథ—జలాధి నాథుఁడైన వరుణునియొక్క, అంబుజాక్షీలో కంబున్ — స్త్రీజన సమూహమును, జయించి—ఇది సంప్రదాయ శుద్ధమగు నన్వయ పద్ధతి. (చూ. సోమకవి వ్యాఖ్యానము). వీరి పద్ధతి విపరీతధీప్రదము.

'ప్రకీర్ణము, గ్రామ్యము' అను శీర్షిక క్రింద వీరేమి వ్రాసిరో చూడుఁడు.

"పామరుల భాష గ్రామ్యము
భామిని కటి గల్లములు విభాసిల్లునన్
గోమలి చన్నులఁ గన్నులఁ
గాముని పండువు లొనర్పఁ గడునడి నవఁగన్'

కావ్యాలంకార సంగ్రహము

"ఇప్పటి గ్రామ్యమనగా వ్యావహారిక భాష యని కాదు. నాగరక వ్యవహారము గుర్తింపక శ్రోతలకు జుగుప్స కలుగునట్లు పలికెడు భాష గ్రామ్యము. అట్టిది కావ్య భాషలో అవశ్యముగా పరిగణింపఁబడును. విద్వద్గోష్ఠులలో పలుకరాని కటి, గల్ల ప్రభృతి శబ్దములను కావ్యదోషములుగా నిర్ణయించి విశేషించిరి. 'కాళ్ళ' పదము సైతము గ్రామ్యమని తెలుగు లాక్షణికులు చెప్పిరి. కాని కవీశ్వరులు పెక్కుమంది ఇట్టివి వాడు

కోమటి నిజమ్మైనను—ఈ దోషములు దోషములుగానే విద్వజ్జనులు భావింతురు. కల్పవృక్షము వీనిని గైకొన్నది."

'అప్పకవి నిరాకరించిన శబ్దములు 'కండ్లు, చండ్లు' గాని కన్నులు, చన్నులుకావు. నరస భూపాలీయము 4 వ ఆ, 10 వ పద్యము చూడండి. మావద్దనున్న ప్రతిలో ఉత్తరార్థము ఇట్లా లేదు.

"కోమలిచండ్లు కండ్లకు నామని పండువు లొనర్చు వనితము వనఁగన్" అని ఉన్నది. (ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము పు 85)

కావ్యాలంకార సంగ్రహకర్తచే నిషేధింపబడిన 'కమ్నులు, చన్నులు, కట్, గల్లము' అను శబ్దములను ప్రయోగింపని తెలుఁగు కవులులేరు. ఈ విషయమును గూర్చిన విచారము ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము పేరాలు 23—52 లలో చూడ నగును.

చౌదరిగారు 'విరుద్ధము' అను కావ్య దోషమున కిచ్చిన యుదాహరణమును పాఠకులు చిత్తగింపుడు.

బుస్సుమన్న త్రాచు పాలతివాలె—అయోధ్య 23 పేజి—త్రాచులన్నియు నాడులేగాన 'త్రాచు పాలతి' యనరాదని విషేధము. కాళహస్తీశ్వరు నారాధించుచున్న 'కాలఫణి' (కాళహస్తీశ్వర మాహాత్మ్యము 2—108) హస్తి త్రిష్ణ మొందు తానొనర్చు పూజను తొలఁగించి పరమేశ్వరుని పూవులతో పత్రములతో నారాధింపనారంభింపగా హేతువు తెలియక చింత నొందినది. 'ప్రతి దినంబును దాఁ జేయు రత్నపూజ, శివునిపై నుండకుండినఁ 'జింతనొంది' 'ప్రాణనాయికతోడఁ బర్యంకసీమల మనకావఁ జెనగు' సంభ్రమము విడిచినదని వర్ణనము. (2—118). ఈ నిషేధము ప్రకృత ప్రమాణముచే నిరాకరణీయము.

ప్రక్రమ భంగ దోషమును గూర్చి చౌదరిగారేమను చున్నారో చూడుఁడు. 'ప్రారంభించిన మార్గమును విడిచినచో ప్రక్రమ భంగమన్న కావ్య దోషము కలుగును. వేయి తిరిగిన కవుల రచనలో ఈ దోషము రానేరాదు." ఈ వాక్యము సాహస మూలకము. లేదా అపరిశీలన కృతము. 'ప్రక్రమ భంగ దోషములు చేయని కవియే యుండడ'ని సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రులవారి నిర్ణయము. నన్నయగారి క్రింది పద్యమున పాఠకులు ప్రక్రమభంగ దోషమును గురుతింపగలరు.

సహకార! మత్ప్రియ సహకారుఁ, బున్నాగ!
పున్నాగుఁ, దిలక! భూభువనతిలకుఁ
జందన! బుధహరిచందనుఁ, బుష్పితా
శోక! సుహృజ్జనశోకదమను
వకుళ! కులైకదీపకు, విభీతక! భయో
పేతార్తిహరు నలుఁ బ్రీతి తోడఁ
గానరే కానల లోన లోకోత్తరు
నని ప్రమాని ప్రమానికి నరిగి యరిగి—అరణ్య—2—95

వీరి రెండవ వ్యాసముపేక్షింపదగిన దనుటకు ఈ మాత్రము చాలును. వారు చేసిన ప్రతిశంకకు సమాధానము వ్రాయుట వస్తువిస్తరము. రామాయణ కల్పవృక్షమున దోషములే లేవని ఎవ్వరును ప్రతిజ్ఞ చేయరు. చేయవలసిన ఆవశ్యకతయులేదు. ఆ దోషములు రసాప కర్షకములై కావ్యత్వ భంజకము లగుచున్న వను ప్రతిపాదనము మాత్రము నిష్పాక్షికముగా పరిశీలించువా రంగీకరించునదిగాదు. గుణదోషములను పరామర్శించుట సద్విమర్శ. దోషములను దోషములుకానివానితో మేళగించి రాశీకరించి ముగ్ధులను భ్రాంతులను చేయఁబూనుట మాత్రము విద్వజ్జనోచితముగాదు.

"జయంతి తే సుకృతినో
రస సిద్ధాః కవీశ్వరాః
నాస్తియేషాం యశః కాయే
జరా మరణజం భయం."

పశ్చిమదేశాలలో సంస్కృత భాషాధ్యయనము

పండిత శ్రీ గౌరీనాథశాస్త్రి

1960 ఆగస్టులో 25 వ అంతర్జాతీయ ప్రాచ్య భాషాకోవిదుల సమావేశం మాస్కోలో జరిగినది. లెనిన్ పర్వతాగ్రాన ఉన్న మాస్కో విశ్వవిద్యాలయం భవనాలలో యీ సభలు ఏర్పాటు చేయబడినాయి. 60 దేశాల నుంచి దాదాపు 2 వేల మంది ప్రతినిధులు ఈ సభలకు వచ్చారు. భారతదేశం నుంచి 11 మంది ప్రతినిధులు ఈ సభలకు హాజరైనారు. ప్రొఫెసర్ సునీత్ కుమార్ ఛటర్జీ భారత ప్రతినిధివర్గానికి నాయకులు. నేను కలకత్తా విశ్వ విద్యాలయం తరఫునా, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫునా, ఈ సభలకు ప్రతినిధిగా హాజరైనాను. ఆగస్టు నెల 9 వ తేదీ ఉదయం ఈ మహాసభల ప్రారంభ సమావేశం జరిగింది. ఆ తర్వాత ఈ ప్రాచ్య భాషలకు సంబంధించి బహు సమావేశాలు—దాదాపు 20 దాకా జరిగాయి. ఈ 20 సమావేశాలలోను ఒకటి ప్రత్యేకం భారతదేశపు భాషలకు సంబంధించి జరిగింది. ఈ సమావేశం, ఇతిహాసం, తత్వశాస్త్రం, భాషలు, లలితకళలు, అన్న ఉపవిభాగాలుగా కొనసాగింది.

ఇప్పుడు ఐరోపాలో సంస్కృతాధ్యయనాన్ని గురించి జరుగుతున్న కృషి ఎట్లా ఉన్నదో తెలియజెప్పటానికి ముందు ఈ జరిగిన సమావేశాన్ని గురించి ఒకటి, రెండు మాటలు చెప్పదలుచుకున్నాను. ఈ సమావేశానికి ప్రపంచంలో సంస్కృత అధ్యయనానికి పేరుపొందిన కేంద్రాలు అన్నింటినుంచి ప్రతినిధులు రాలేదు. పశ్చిమ జర్మనీలోని ఫ్రీ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్, గోటింజన్ యూనివర్సిటీల నుంచి మాత్రం ప్రతినిధులు వచ్చారు. మరి ఏ యితర పశ్చిమ జర్మనీ విశ్వ విద్యాలయం నుంచి గాని రాలేదు. అట్లాగే ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం, సార్‌బోన్ విశ్వ విద్యాలయం, రోమ్ విశ్వవిద్యాలయం కూడా ప్రతినిధులను పంపలేదు. అయితే, మాస్కోలో ఈ సభలు ముగిసిన తర్వాత అన్ని విశ్వ విద్యాలయాలను సందర్శించి, అక్కడ సంస్కృత అధ్యయనాన్ని గురించి, పరిశోధనను గురించి, జరుగుతున్న కృషి ఏమిటో చూడగల భాగ్యం నాకు కల్గింది. అందువల్ల ఆయా ప్రదేశాలలో ఈ కృషియొక్క విస్తృతిని గురించి విపులమైన సమాచారాన్ని నేను సేకరించ గల్గినాను.

ఇది ఎట్లా జరుగుతున్నదో, ముందు రష్యాతోనే ప్రారంభిస్తాను. మాస్కో సమావేశంలో రష్యన్ పండితులు భారత దేశానికి సంబంధించి పండ్రెండు పత్రాలను పఠించారు. ఇందులో ఏ ఒక్కటి గాని, భారతీయ తత్వశాస్త్రాన్ని గురించింది లేదంటే నమ్మండి. ఇది ఇక్కడ గుర్తు పెట్టుకో వలసిన విషయం. పూర్వకాలంలో రష్యన్ పండితులు, బౌద్ధ తత్వాన్ని గురించి అతి విశిష్టమైన కృషిని జరిపివున్న సంగతి ఇంకా అందరి మనస్సులలో ఆడుతూనే ఉంది. ఇప్పుడు ఆ అధ్యయన కేంద్రం గాని, ఆ పండితులు గాని లేరు. ఆ కేంద్రాన్ని నడుపుతూ వచ్చిన పండితులు రెండో ప్రపంచ యుద్ధంలో విహతులై పోయినారని, అందువల్ల వారి ఆ కేంద్రం ఆగిపోయిందని అక్కడివారు చెప్పడంవల్ల తెలియవచ్చింది. తిరిగి రష్యాలో పండితులు తదభిముఖమైన కృషిని ప్రారంభం చేస్తారని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. ఏ జాతి గాని తాత్విక చింతనము, ఊహాపోహ లేనిదే, బ్రతికి బట్ట కట్టి నట్లు కన్పించదు. ఇది నా ఊహ మాత్రమే కాదు. నిష్కృష్టమైన అభిప్రాయం కూడాను.

రష్యాలో నాకు కన్పించిన విషయం ఇంకోటి ఏమిటంటే, అక్కడి పండితులు, వేదాలను గురించి గాని, మరి ఇతర సంస్కృత పరిశోధనలకు సంబంధించి గాని అంతగా కృషి చేయడం లేదు. అట్టి కృషిలో వారికి ఆసక్తి ఉన్నట్లే కన్పించడం లేదు. నేను మాస్కోలో జరుగుతున్న యీ సభకు బయలుదేరేముందు, దేశంలోని కొందరు మిత్రులు, రష్యన్ పండితులు సంస్కృత వాఙ్మయం విషయంలో చాలా పెద్ద కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతేగాక, అక్కడ (అనగా రష్యాలో) అధ్యాపకులు విద్యార్థులు ఏమి చేస్తున్నారో, నను ప్రగంగా పరిశీలించవలసిందిగా గూడా సలహా యిచ్చారు. కాని నేను అక్కడ జరుగుతున్న దానిని చూచి పరమ నిస్పృహలో పడిపోయినాను. రష్యాలో ఇప్పుడు ప్రొఫెసర్ కోల్యనోవ్ ఒక్కరు మాత్రమే కొన్ని సంస్కృత గ్రంథాలను తమ భాషలోకి అనువదిస్తున్నారు. ఇంతవరకు ఆయన భారతంలో ఆది పర్వాన్ని, రామాయణంలో కొంత భాగాన్ని రష్యన్ భాషలోనికి మార్చారు. అయితే, ఈ జరుగుతున్న పని నిరుపయోగమైందని, విలువలేనటువంటిదని నేను అనను. కాని ఇందువల్ల, రష్యన్ పండితులకు సంస్కృత భాష అన్నా, సాహిత్యం అన్నా, భారతీయ తాత్విక విజ్ఞానం అన్నా, ఏదో కొట్టుకుపోయే అంత ఆసక్తి ఉన్నదని భావించలేకపోయా

వంతే. ఇంతమాత్రంచేత, ఆ యా విషయాలలో వారి ఆసక్తి గాఢమైనదని గూడా రూఢిం కావడంలేదు. ప్రొఫెసర్ కోల్యనోవ్ గాని, ఆయనతో కలిసి పనిచేస్తున్నవారు గాని, సంస్కృత భాషకు సంబంధించిన ఏ ఒక్క లక్షణాన్ని గూర్చి ఒక పత్రాన్ని గూడా ఆ సభలో పఠించలేదు. ఆ సభలో ఒక పత్రాన్ని చదవడానికి యోగ్యమైన కృషి గూడా వారు చేసి ఉండలేదని ఇందువల్ల స్పష్టంగా వ్యక్తం అవుతూనే ఉంది.

ఈ సందర్భంలో మాస్కోలోని ప్రాచ్య విజ్ఞాన పరిషత్తును గురించి కొంచెం చెప్పవలసి ఉంది. మమ్మల్ని ఆ పరిషత్తును చూడవలసిందిగా ఆహ్వానించినారు కూడాను. తీరా పోయి చూస్తే, నాకు మనస్సుకు తృప్తి కలగలేదు. అక్కడ చెప్పుకోదగిన పని ఏమీ జరుగుతున్నట్లు నాకు అనిపించలేదు. కాని ఒక్క విషయం. ఈ పరిషత్తు భాండాగారం చాలా బాగుంది. అచ్చు పుస్తకాలు, లిఖిత గ్రంథాలు చాలా ఉన్నాయి. ఉన్న కొరత అల్లా పండితుల విషయంలోనే. అక్కడ సుశిక్షితులైన పండితులు అట్టేమంది లేరు. సంస్కృత అధ్యయనము, పరిశోధనములను గురించి గట్టిగా పనిచేయాలంటే, అక్కడ దారి చూపించే నాథులే ఎక్కువమంది మాకు కన్పించలేదు. ఇక రష్యాలో సంస్కృతాన్ని గురించిన గట్టి కృషి ఎక్కడైనా జరుగుతోందా అంటే, అది ఒక్క లెనిన్‌గ్రాడ్ నగరంలోనే జరుగుతోంది. ఆ నగరంలో గూడా ఒక ప్రాచ్య విజ్ఞాన పరిషత్తు ఉంది. ఆ పరిషత్తువారు ప్రొఫెసర్ కోల్యనోవ్ ఆధిపత్యంలో కొంత చెప్పుకోతగిన కృషి చేస్తున్నారు. ఈ పరిషత్తు 'నీరా' నది ఒడ్డున ఉంది. చూడ్డానికి ఒక ముని ఆశ్రమంలాగా ఉంటుంది. ప్రాచ్య విజ్ఞాన గ్రంథాలు, అచ్చు అయినవి, కానివి, ఎన్నో ఉన్నాయి. అన్నీ అత్యద్భుతమైన గ్రంథాలే. ఇక్కడ పనిచేస్తున్నవారు గూడా, ఎంతో నిస్స్వార్థమైన కృషిని సాగిస్తున్నారు. వీరిని అన్ని విధాలుగాను ప్రోత్సహించవలసిన అవసరం కన్పిస్తున్నది. అయితే కొంతకాలం క్రిందట రష్యాలోని పండితులు సంస్కృతాన్ని గురించి కృషి చేసిన విధంగా కృషి చేస్తేనే గాని, అక్కడ ఆ పరిశోధనలకు ఒక పుష్టి, ఒక చరితార్థత ఏర్పడవు. నేను చూచినంతలో, రష్యాలో పండితులు ఇప్పుడు భారతదేశంలోని వివిధ భాషలను—హిందీ, తమిళం, ఉర్దూ మొదలైన భాషలను—అధ్యయనం చెయ్యడంలో ఎక్కువ ఆసక్తిని పెట్టి పనిచేస్తున్నట్లు నాకు తోచింది. వైదికమైన, లౌకికమైన సంస్కృతంలో, దాని అధ్యయనంలో, పరిశోధనలో, వారికి ఆసక్తి ఏమన్నా ఉంటే, అది ఇంకా కన్పించడంలేదు.

రష్యా నుంచి నేను పశ్చిమ జర్మనీకి వెళ్లాను. పశ్చిమ జర్మనీ ప్రభుత్వం నన్ను ఆహ్వానించింది. ఆ ఆహ్వానాన్ని పురస్కరించుకొనే అక్కడ ఉన్న సంస్కృత కేంద్రాలను, ఆర్ష పరిశోధక సంస్థలను దర్శించాను. అక్కడ ఇట్టి కేంద్రాలు, సంస్థలు చాలా ఉన్నాయి. వానిలో ఒక ఎనిమిది చాలా ముఖ్యమైనవి. ఆ ఎనిమిది కేంద్రాలను, సంస్థలను నేను చూచాను.

ఇప్పుడు ఆ చూచిన ఎనిమిది కేంద్రాలలోను, సంస్థలలోను, ఒక రెండింటిని గురించి—గోటింజన్, టూబింజన్ విశ్వవిద్యాలయాలను గురించి— నాకు కల్గిన అభిప్రాయాలను తెలియజేస్తాను.

గోటింజన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ వాల్డ్‌ష్మిట్ పనిచేస్తున్నారు. ఆర్ష విజ్ఞానంలో ఆయన ప్రతిభ అమోఘమైంది. అట్టి పాండిత్యంలో ఆయన మేరువు లాంటివారు. తన స్వగృహాన్ని, ఆస్తిని ఆయన ఈ విశ్వవిద్యాలయానికి దాన పట్టా వ్రాసి యిచ్చారు. అక్కడి ప్రాచ్య విజ్ఞాన సంస్థ ఇప్పుడు ఆయన యిచ్చిన ఆ యింట్లోనే నెలకొని ఉంది. అక్కడ ఆయన్ను అంతా మహా పండితుడనే గాక, అచ్చశీలి అని గూడా గౌరవిస్తారు. ఇప్పుడు ఆయన సంస్కృతంలో ఉన్న బౌద్ధ గ్రంథాలను పరిశోధిస్తున్నారు. తుర్ఫాన్ లిఖిత గ్రంథాలను విపులంగా సంస్కరించి ప్రకటించారు. డా. రాత్, డా. రోసెన్, డా. ముఖర్జీ ప్రభృతి సహ పండితుల సహకారంతో, ఇంకా ఎన్నో బౌద్ధ గ్రంథాలను పునర్నిర్మించి ప్రకటించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గ్రంథాలు ఉన్నట్లు తెలుసుకొన్నది గూడా ఆయనే.

ప్రొఫెసర్ వాల్డ్‌స్మిట్ గారి ప్రాచ్య విజ్ఞాన పరిషత్తును చూడగా నాకు మన పురాతన గురు కులాలు జ్ఞాపకానికి వచ్చాయి. ఆ గురుకులాలలో గురువులు, అంతేవాసులూ గూడా ప్రేమతో, ఆసక్తితో అధ్యయనం చేసేవారు. ఇప్పుడు ఈ పరిషత్తులో పనులు గూడా అదే పద్ధతిలో జరుగుతున్నాయి.

టూబింజన్ విశవిద్యాలయంలో గూడా ప్రాచ్య విభాగం అంటూ వుంది. అక్కడే నేను ప్రొఫెసర్ థీమ్‌ను, ఆయన శిష్యుడు డా. బ్రాడూన్‌ను కలుసుకున్నాను. ఈ ఇద్దరు ఇప్పుడు సంస్కృత వ్యాకరణాన్ని గురించి పరిశోధనలు చేస్తున్నారు. ముఖ్యంగా పతంజలి మహాభాష్యాన్ని గురించి పరిశోధనలు సాగిస్తున్నారు. ప్రొఫెసర్ థీమ్ ఎంతటి ఉచ్చారణ దక్షుడంటే, ఆయన పురా భారతీయ పండితులు ఉచ్చరించినంత అక్లేశంగా ఉచ్చరిస్తారు. అట్లా చదువుతారు.

మార్బింగ్ విశ్వవిద్యాలయంలో గూడా సంస్కృత అధ్యయనం బాగానే సాగుతున్నది. అక్కడ ప్రొఫెసర్ హీలర్ పనిచేస్తున్నారు. ఆయన క్రింద ఎంతమందో పరిశోధక విద్యార్థులు ఉన్నారు. అక్కడే కార్ట్ దంపతులు ఉపనిషత్తులను గురించి ఆసక్తితో పరిశోధనలు చేస్తూ ఉండటం చూచి ఎంతో సంతోషించాను. ప్రొఫెసర్ విల్‌హెల్మ్‌రావ్ గూడా ఇక్కడ పనిచేస్తున్నారు. కాని, నా దురదృష్టం అట్లా ఉండి, ఆయన్ను కలుసుకోలేక పోయినాను. నేను వెళ్లినప్పుడు ఆయన వూళ్లో లేరు. సెలవలు అవడంచేత ఎక్కడికో వెళ్లారు. ఆయన భర్తృహరి వాక్యపదీయాన్ని సంస్కరించి, ప్రకటనకు సిద్ధం చేస్తున్నారని విన్నాను.

ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలలో, ప్రొఫెసర్ బెయిలీ నాకు తెలియజేసినదాన్ని బట్టి, సంస్కృత సాహిత్యాన్ని గూర్చి కన్నా, సంస్కృతభాషను గూర్చి ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయి.

ఈ వ్యాసాన్ని ముగించేముందు, లండన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ బ్రో సారథ్యం క్రింద ఒక ఇజ్రాయల్ యువ పండితుడు చేస్తున్న కృషిని గూర్చి రెండు మాటలు చెబుతాను: భారతీయ తర్కాన్ని గురించి శ్రీ జానకీనాథ్ వ్రాసిన గ్రంథాన్ని ఈ యువ పండితుడు తర్జుమా చేస్తున్నాడు.

ఇంకో విషయాన్ని గూడా చెప్పి, దీన్ని ముగిస్తాను. యిరోపాలో నా యీ పర్యటనవల్ల ఒక్క విషయం తేలింది. ఇప్పుడు ఈ కృషిలో నిమగ్నులయి ఉన్న మహాపండితులు వృద్ధాప్యంవల్ల, విశ్రాంతి తీసుకోబోతే, వారి స్థానంలో, అంత చక్కగాను పనిచేయగల యువకులు పనిచేయడానికి, ప్రాచ్య విజ్ఞాన జ్యోతిని ఆరిపోకుండా ముందు తరాల వారికి అందజేయడానికి, అంత ప్రయత్నము జరుగుతోందన్న గట్టి భావం ఒకటి నాకు కల్గింది.

—ఆకాశవాణి సౌజన్యంతో.

శబ్దరత్నాకరములో అన్యదేశ్యములు

శ్రీ "సదాశివ"

వ్యవహారవశమున తెలుగులో జేరిన అన్యదేశ్యములగు హిందూస్థానీ (హిందీ, ఫారసీ మరియు అరబీ) పదములకు మన ఆంధ్రనిఘంటువులిచ్చిన అర్థములు కొన్నిచోట్ల సరిగా లేక కొన్ని చోట్ల సమగ్రముగాలేక అపార్థములకు దారితీయుచున్నవి. కొన్ని పదములు వ్యవహారవశమున అన్య భాషలలోచేరి మూల భాషకు భిన్నములగు అర్థములిచ్చుట సహజము. కాని తెలుగు వారి వ్యవహారములోను మూల భాషలలోను లేని అర్థములను కల్పించుట ఉభయభాషలను చెఱచుట యగును. అది నిఘంటు కర్తలకు తగదు.

నేటి తెలుగు నిఘంటువులలో శబ్ద రత్నాకరము ప్రామాణికము, సమగ్రము. శబ్దార్థచంద్రిక, దీపిక మరియు సూర్యరాయాంధ్ర నిఘంటువును అందలి అర్థములను ఆమోదించి ఎత్తి వ్రాసికొనినవి. బహుజనపల్లి సీతారామాచార్యులు ఇట్టి ప్రామాణిక నిఘంటువును సంతరించినందున ఆంధ్రులకు చిరస్మరణీయులు. కానివారు గ్రాంథ్యము నుండి కొన్ని, తమ వినికి కందినవి కొన్ని, హిందూస్థానీ పదములను తమ నిఘంటువునచేర్చి పలుతావుల సరియైన అర్థము లీయలేకపోయినారనిన నన్ను భాషాభిమానులు మన్నింతురుగాక.

విద్యారత్న శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు అన్య దేశ్యములకు ఆచార్యులవారు చూపని కవి ప్రయోగములను చూపుచు కొన్ని క్రొత్తపదములను అయిదవ ముద్రణమున అనుబంధ రూపమున చేర్చినారు. వారును అర్థసంగ్రహమున కొన్నియెడల పొరపడినట్లున్నారు. అట్టివి కొన్ని క్రింద వివరించెదము.

1. 'తారీఖు':—ఈ పదమునకు శబ్దరత్నాకర కర్త లిచ్చిన అరము. తారీఖు—హిం వి. ఆంగ్లేయ మాసములో దినము.

   తారీఖు అరబీ పదము. దినాంకము, తేది అను నర్థముకలది. చరిత్ర అను నర్థమును కలదు. ఆంగ్లేయ మాసమను ప్రత్యేకతలేదు.

2. తఫిసీలు—హిం. వి. వివర్ణము (శ. ర.)

   ఇదియు అరబీపదమే. వివరము అని యుండదగు. వివర్ణము సరికాదు. సంయుక్తము కాకుండిన బాగుండెడిది.

3. 'ఫసలీ':—హిం. వి. పంట, సంవత్సరము (శ. ర.)

   ఇదియు అరబీ పదమే. అక్బరు చక్రవర్తి కాలమున పంటల ననుసరించి ఏర్పఱచిన సంవత్సరము. పంట అనుఅర్థము సరికాదు. ఫసల్ అనగా పంట.

4. ఖులాసా:—హి. వి. సౌఖ్యము, నెమ్మది (శ. ర.)

   ఇది అరబీ పదము. తెలుగువారి వ్యవహారమున గల అర్థమిదియే. కాని మూలభాషలో సారాంశమను నర్థమునవాడబడును.

5. ఖుల్లసు:—హిం. వి. వివరము. (శ. ర.)

   ఇట్టిపదము ఈ యర్థమున హిందూస్థానీకి సంబంధించిన ఏ భాషలోను లేదేమో. ఖులాసా అనియే యుండ దగు.

6. ఖాముఖా:—హిం. క్రి. విణ. అగత్యముగా, గట్టిగా (శ. ర.)

   ఇది ఫారసీ పదము. (ఖ్వాహ్‌మఖ్వాహ్). అనవసరముగా, ఇష్టము లేకున్నను, బలవంతముగా అను నర్థము కలది.

7. జమా. జమ:—హిం. వి. మొత్తము—రాబడి. (శ. ర.)

   ఇది అరబీ పదము. దీనికి 'కూడిక' అను నర్థమును కలదు.

8. బాతాఖానీ:—హిం. వి. వదురుబోతు (శ. ర.)

   ఈ పదము గ్రామ్యము. మాటలాడుట, ఇష్టగోష్ఠి అను నర్థము కలది. 'మాటలాడువాడు' కాదు.

9. బాబతు:—హిం. వి. విషయము. రీతి, పద్దు (శ. ర.)

   దీనికి రీతి, పద్దు అను నర్థములు సరికావు. 'సంబంధించిన' అను నర్థమును చేర్పదగును. ఇది ఫారసీ పదము. ఇవి కొన్ని. ఇట్లెన్నేని కలవు.

ఇక శ్రీ నిడుదవోలువారి అనుబంధములోనివి:

1. తసిరీఖు:—(తసిరీఫ్). దీనికి అర్థము బహుమానము అన్నారు. శ. ర. కర్తలును ఇదే అర్థ మిచ్చినారు. ఇది అరబీపదము. 'గౌరవించు' అను అర్థము కలది. బహుమానమును గౌరవమేకాని క్రొత్తవారికి సంశయాస్పదము—తషిరీఫ్‌లానా అనగా దయచేయుట, విచ్చేయుట.

2. తసిలీము:—దీనికిని బహుమానమను నర్థమే వ్రాసినారు. వందనము, గౌరవము అను నర్థముల వాడబడు అరబీ పదమిది.

3. తాజీము:—దీనికిని బహుమానమే చూపినారు. గౌరవించుట అను నర్థమున నుపయోగింపబడు అరబీ పదమిది.

4. ఫాజీ:—దీనికి నిడుదవోలువారు హిం. వి. స్వల్పమైన—పనికిమాలిన అన్న నర్థము లిచ్చినారు.
ఇది ఫారసీ పదము. ఫాజీకాదు. ఫాజ్. నీచము, హీనము అను నర్థము కలది.

5. మజుకూరు:—దీనికి 'అధీనము' అను నర్థమిచ్చినారు. 'ప్రయోగమును సరిగాలేదు. ఇది అరబీ పదము 'పేర్కొనబడిన' 'ప్రస్తావించబడిన' అను నర్థములు కలది. అధీనమను నర్థము ఎందును వినలేదు.

6. మహతాబు:—దీనికి 'మతాబా' అను నర్థము వ్రాసి చాటు పద్య మణిమంజరిలోని "వాసిరెడ్డి కులాబ్ధి వర్ధిల్లు మహతాబు" అను ప్రయోగము చూపినారు. మహతాబు, (మాహతాబు) అను నది ఫారసీ పదము. చంద్రుడు అను నర్థము కలది. మతాబా అను నర్థమునుకలదు. కాని పై ప్రయోగమున చంద్రుడను అర్థము చెప్పుట రమ్యము. అదియే కవి హృదయము.

7. మొహీము:—ఈ పదమునకు ఆజ్ఞ అను అర్థము చూపినారు. ఇది అరబీ పదము. యుద్ధము, కష్టదాయకమగుపని అను అర్థములు కలది. ఆజ్ఞ అనుట వింత.

8. హోకిము:—అధికారి అను నర్థముగల ఈ పదమునకు 'హాకీము' అను రూపాంతరము చూపి, 'సేనానాయకుడు' అని అర్థము తెల్పినారు. ప్రయోగము ననుసరించి చూచినను వారి అర్థము సరికాదు. ఆ రూపాంతరము మరియు అపార్థదాయకము-హాకీము అనగా తత్త్వజ్ఞుడు, వైద్యుడును.

శ్రీ నిడుదవోలు వేంకటరావుగారివంటివారిని విమర్శించు సాహసము చేయను. సంప్రదాయము తెలియనందునను, హిందూస్థానీ భాష రానందునను క్రొత్తవారు శ. ర. ను ప్రమాణముగా గొనిన పెడ త్రోవ పట్టుదురు. కనుక ఇకముందయిన అన్య దేశ్యములగు పదములను సరియైన అర్థము లిచ్చుట (వ్యవహారములో లేనివి తొలగించినను బాధలేదుకద) వారివంటి విద్వద్వరేణ్యుల పనియే కనుక నాకు తోచిన అర్థములు సూచించినాను.

కందుకూరి రుద్రకవి విజయనగర ఆస్థానమున ఉండెనా?

శ్రీ సోమరాజుపల్లి చెంచయ్య

గత జనవరిమాసమున వెలువడిన భారతి సంచికయందు "గ్రంథ విమర్శనం" శీర్షికను ప్రచురితమైన "అష్టదిగ్గజములు" గ్రంథ సమీక్ష చదివేను. గ్రంథ సమీక్షకులు, ఆ గ్రంథమునందు సంకలనము జేయబడిన శ్రీ వేటూరి వేంకటరమణయ్యగారి వ్యాసమునందు—కందుకూరి రుద్రకవిని గురించి వ్యాసకర్త వెల్లడించిన అభిప్రాయములతోటి ఏకీభవించనందులకు—సమీక్షకులను అభినందించుచున్నాను.

కందుకూరి రుద్రకవిని గురించి నాకు తెలిసిన వివరములను ఇచట పొందుపరచుచున్నాను.

కందుకూరి రుద్రకవికి, భద్రకవి—అను మరియొక వ్యావహారిక నామము ఉండినట్లు శ్రీ కె. నారాయణరావు గారు తమ "ఆంధ్ర కవిత్వ చరిత్రము" నందు వ్రాసియుండిరి.

ఈ రుద్రకవి, స్వగ్రామము నెల్లూరుజిల్లాయందలి కందుకూరు తాలూకా ముఖ్యపట్టణమైన కందుకూరునందున్న, శ్రీ జనార్దనస్వామివారిమీద "జనార్దనాష్టకము" సైతము రచియించెను.

ఈతడు గోలకొండను పరిపాలించిన, కుతుబ్ షాహి సుల్తానులలో ఒకడైన ఇబ్రాహీం కుతుబ్‌షా సుల్తాను ఆస్థాన కవిగా నుండెను. ఈ సుల్తాను మహమ్మదీయుడైనప్పటికినీ, రాజభాష ఫారసీ అయినప్పటికీ—తన రాజ్యంలోని ప్రజల భాషఅయిన తెలుగు భాషనుగూడా అభ్యసించెను. అంతేగాదు, తెలుగు కావ్యాలను గూడా అంకితము పొందెను.

రుద్రకవి ఈతని యాస్థానమునందుండియే, తాను రచించిన "నిరంకుశోపాఖ్యానం" అను కావ్యమును సుల్తానునకు అంకితమిచ్చి—యాతని వలన "చింతలపాలెం" అను గ్రామమును శ్రోత్రియముగా పొందెనని తెలియజేయు నిదర్శనములను కొన్నిటిని ఇచట ఉదాహరించుచున్నాము.

శ్లో. ఆద్యా సీతి శతుశ్శతాధిక
సహస్రస్య వై శకాబ్దాగతా
స్త (అ)స్మిన్ శ్రీ (జయ)వత్సరే జయ తిథౌ
మాసేచ మాఘే తథా
పంచమ్యాం ద్వయతింత్రిణీ జనపథం
రుద్రస్య విద్వత్కవేః
ప్రీత్యా శ్రీ ఇభరామభూపతి
రదాత్ క్షోణీధరాఖండలః"

* * *

సీ. ఇల శకవత్సరంబులువేయునన్నూట
యెనుబదియును జనునెడ జయాబ్ద

మున మాఘమాసంబునను శుద్ధపంచమి
నాఁడు మల్కిభరామనరవరుండు
తగు కందుకూరిరుద్రకవీశునకు జరు
గుంబల్లిపురిని మాన్యం బొసెంగె
నైబుతి భాగంబు నప్పుదేన్కుచ్చెళ్ళ (1)
పొలమది రెంట చింతలయనంగ

గీ. నలరు పురి యుత్తరమునఁ దా నరయ జోగి
రాజుగారిపొలంబు పూర్వదిశయుద్దె
వారి పొలము దక్షిణము పాలేరు పడమర
(2) గూడూరు పొలిమేర హద్దు లవియు"

—చాటు పద్యమణిమంజరి 2—పార్టు పే. 31

కందుకూరి రుద్రకవికి, శా. శ. 1478 లో చింతల పాలెం శ్రోత్రియముగా ఇబ్రహీము ఇచ్చి యుండినట్లు తెలియు చున్నది. మరియు

మ. హరియొస్కంధపుర జనార్దనువరం బందెన్
మహాసత్కవీశ్వరులా రాయలవారి సన్నిధిని
హర్షంబందపట్టంబు గట్టిరి
అందోళికలున్ జహాగ్రతరఘోటీ అగ్రహారంబు
లందరు జూడన్ బహుమానమందె
కవిరుద్రాఖ్యుండు తా ముఖ్యుడై!"

—చాటుపద్య మణిమంజరి, 2 పార్టు.

రుద్రకవి రాయలవారి ఆస్థానమున సత్కారమొంది నట్లు మాత్రమే తెలియుచున్నది.

ఇక శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి ఆంధ్ర దేశ చరిత్ర సంగ్రహము-పదకొండవ ప్రసంగమునననుసరించినయెడల, విజయనగరపతనానంతరమే రుద్రకవి ఇబ్రాహీం కుతుబ్ షా ఆస్థానమునందుండినటుల తెలియుచున్నది.

మరి ఇందు ఏది నిజము? రుద్రకవి రాయలవారి ఆస్థానకవి అనుటకు ఎంతవరకు అవకాశము కలదు? రుద్ర కవికి పేరు తెచ్చిన రచనలు గోలకొండ సుల్తానులు ఆస్థానము నందుండినపుడే రచించినట్లు తెలియుచున్నది-పద్యములవలన—!

ఆనాడు రుద్రకవిగారికి శ్రోత్రియముగా ఇవ్వబడిన "చింతలపాలెం" అను గ్రామము కందుకూరికి దాదాపు పది మైళ్ళదూరముందున్నది. ప్రస్తుతము ఆ గ్రామమునందున్న రుద్రకవి వంశీయులకడనున్న తామ్ర శాసనము పైతము— ఈ కవి గోలకొండ సుల్తానుల కాలమునందుఉండినవాడని, ఆ శాసనము తెలియజేయుచున్నదని—శాసనము చూచియున్న ఒకరిద్దరు మిత్రులవలన వినియుంటిని.

ఇందుదాహరించిన కారణములనుబట్టి రుద్రకవి రాయలవారి ఆస్థానకవి కాడని విశ్వసిస్తున్నాను. అంతేగాదు, ఆ కవి రచన అయిన "నిరంకుశోపాఖ్యానము" గోలకొండ సుల్తానులకు అంకితమిచ్చి అగ్రహారము పొందియున్నపుడు ఈతడు రాయల ఆస్థానకవియని ఎట్లు విశ్వసించగలమని— నా మనవి!

శ్రీ కదళీపుర (పెదకళ్ళేపల్లి) మాహాత్మ్యము

శ్రీ గొత్తిపాటి వెంకటనరసయ్య

శ్రీ మహావిష్ణుని యవతారమగు వ్యాసమహర్షి మిత్ర సమ్మితములగు పదునెనిమిది పురాణములను రచించెను. ఆ పురాణములలో పద్మ పురాణ మొకటి. అందు గదళీ పుర మహాత్మ్యమును గూర్చి శ్రీరామచంద్రునకు యగస్త్య మహర్షి బోధించెను. ఆ నాటి కదళీపురమనేది పెదకళ్ళేపల్లి. ఇయ్యది కృష్ణాజిల్లాదివి తాలూకాయందలి దేవర కోటసీమలో జేరిన పురాతనేతిహాసప్రసిద్ధిగాంచిన గ్రామము. మచిలీపట్టణమునకు పడమరగా 15 మైళ్ళదూరమున కృష్ణా తీరమందు గలదు. ఈ గ్రామమునకు దక్షిణమునుండి కృష్ణా నది తూర్పు దిక్కుగా ప్రవహించి యుత్తరవాహినియై శ్రీ దుర్గా నాగేశ్వరస్వామి దృష్టి పర్యంతము సాగి తిరిగి తూర్పుగా ప్రవ హించి హంసలదీవి వద్ద సముద్రములో గలియుచున్నది. కాశీ క్షేత్రమందలి విశ్వేశ్వరునివలె నిక్కడ క్షేత్రస్థుడు శ్రీ దుర్గా పార్వతీ సహిత నాగేశ్వరస్వామి; క్షేత్రజ్ఞుడు కాలభైరవుడు; క్షేత్రపాలకుడు, కాశీక్షేత్రమందలి బిందుమాధవునివలె, నిందు వేణుగోపాలస్వామియగుటచేతను నీ గ్రామము "దక్షిణ కాశీ" యని పేరు వహించెను. ఇది నాగేశ్వర క్షేత్రమగుటచే దీనికి కర్కోటక క్షేత్రమని యందురు. ఈక్షేత్రము గురించి సహ్యాద్రి ఖండమున నిట్లు వర్ణింపబడియున్నది.

"యత్ర నాగేశ్వరోదేవః కృష్ణాచోత్తర వాహినీ
తత్రస్నాత్వా చ పీత్వాచ బ్రహ్మహత్యాం వ్యపోహతే
కర్కోటక క్షేత్రరూపం, శ్వేతల్లింగం శిలామయం

---

(1) కుచ్చెల—8 గొర్లు. నెల్లూరు మాండలిక భూమి కొంత పరిమాణము. అనగా 25 ఎకరాలు.

(2) గూడూరు—అనగా దేవగూడూరు. ప్రస్తుతము "దావగూడూరు" అని పిలువబడుచున్నది.

వశిష్ఠం పూజయామాస పార్వత్యా సహ దుర్గయా
తతః కర్కోటక క్షేత్ర మితి ఖ్యాతం సమంతతః
కదళీపురమిత్యేత ద్వాఖ్యాంచేతి తద్విదుః
తదుత్తరదిశి శ్రీమన్నాగకుండం శుభావహం
నాగకుండస్య మహాత్మ్య మనంతం కోవదిష్యతి
తదుత్తరదిశి శ్రీమద్బ్రహ్మకుండం చ రౌద్రకం
కుండత్రయే స్నాన దాన జపహోమార్చనాదికం
అపరూపంకృతంచేత్స్యా దనంతం ఫలమద్భుతం
కర్కోటకక్షేత్రరూపో యత్ర నాగేశ్వర శ్శివః
సర్వాభీష్టప్రద స్సర్వ సిద్ధిదశ్చ సనంశయః
షష్టిర్వర్ష సహస్రాణి భాగీరథ్యవగాహనే
యత్ఫలం లభతే మర్త్య స్సమం కన్యాగతే రవే
యం యం మిచ్ఛంతిమనుజా స్తేషాం సిధ్యంతి కామానాః
ఇంద్రాది సర్వదేవాశ్చ కృష్ణా స్నానాభికాంక్షిణః
తిష్టం త్యాగత్య సర్వత్ర సత్యం నారద భాషితమ్
సముద్ర క్షారతోయేన యత్ర నద్యాంవరాహతమ్
తత్ర సర్వాణి తీర్థాని వసంతీతి విదోవిదుః"

ఈ క్షేత్రమున కృష్ణానదిలో స్నానము చేసినవారికి పునర్జన్మ ముండదని స్కాంద పురాణమున గలదు.

"యత్ర నాగేశ్వరో దేవః కృష్ణాచోత్తర వాహినీ
తత్ర స్నాత్వాచ, పీత్వాచ పునర్జన్మ న విద్యతే"

ఈ క్షేత్రమున జనమేజయు సర్పయాగస్థానము నందు కర్కోటక, తక్షకాది మహా నాగకుమారుల చేత సుప్రతిష్ఠిత దివ్యలింగమైన నాగేశ్వర శ్రీమన్మహాదేవరకు క్రీ. శ. 1292 సం. రంలో శ్రీ మత్పుష్పగిరి మఠ పాంత్రానికులైన శ్రీమతు సోమశివాచార్యులుగారు గుడి కట్టించిరి. తరువాత 490 సం. రములకు అనగా క్రీ. శ. 1782 వ సం. రమున శ్రీ దేవరకోట (చల్లపల్లి) ప్రభువులగు శ్రీ యార్లగడ్డ కోదండరామన్న ప్రభువుగారు సదరు ఆలయము శిధిలముకాగా జీర్ణోద్ధరణముగావించి పెక్కు ఈనాములు ఇచ్చిరి. వీరి యనంతరం వీరి మూడవ కుమార్తును పెదన వరగణాధిపతియును అగు శ్రీ రాజా నాగేశ్వరనాయుడుగారు క్రీ.శ. 1795 వ సం. రంలో గోపుర ప్రాకారములు కట్టించిరి. అప్పటి నుంచి శ్రీ దేవరకోట (చల్లపల్లి) ప్రభువులు వంశ పరంపరగా ధర్మకర్తలుగా వచ్చుచున్నారు. ఈ క్షేత్రమున ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి బ్రహ్మోత్సవము మహా వైభవముగా జరుగును.

గ్రంథవిమర్శనము

ఉపనిషత్సముచ్చయము

(ప్రథమ భాగము : ఆంధ్రానువాద, ప్రభానామక వ్యాఖ్యా సహితము. కర్త : సాహిత్యాచార్య, కవిశేఖర, వేదాంత విమర్శన విశారద శ్రీ పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రిగారు. ప్రమరణకర్త : కీ. శే. శ్రీ దశగ్రంథాల సుబ్బయ్యశాస్త్రి. ప్రాప్తిస్థానము : గ్రంథకర్త, ఆంధ్రభాషా ప్రధానాధ్యాపకుడు ప్రభుత్వ మహారాజా సంస్కృత కళాశాల, ప్రత్తిపాటివారివీధి, విజయనగరము 26 + 20 + 41 + 51 + 12 = 150 పుటలు. వె : రు. 4.)

బంధము అవిచార కృతము. మోక్షార్థియైనవాడు విచారము చేయవలెను. అధ్యారోపము అపవాదము అనువాని స్వరూపముల నిశ్చయించి వాని ద్వారమున తత్త్వము నెరుగ వలెను. అందులకై జగత్తు, జీవుడు, పరమాత్మ అనువానిని గూర్చిన విచార మవసరము. విచారము మోక్షసాధక మనుచు పైంగలోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది : 'అవిచార కృతో బన్ధో విచారాన్మోక్షో భవతి. తస్మాత్ సదా విచారయేత్. అధ్యారోపాపవాదతః స్వరూపం నిశ్చయీ కర్తుం శక్యతే. తస్మాత్ సదా విచారయేత్ జగజ్జీవ పరమాత్మనః. జీవభావ జగద్భావ బాధే ప్రత్యగభిన్నం బ్రహ్మైవావశిష్యత ఇతి.' కాని ఈ తాత్త్విక విచార మెప్పుడు నుండ వలసిన దనుట గమనింప దగిన యంశము. 'సదా విచారయేత్' అని పైంగల మనగా, అధ్యాత్మోపనిషత్తు ఎంత తొలగించినను నాచు యథాపూర్వముగా నావరించునట్లు మాయ ప్రాజ్ఞునైనను మరల నావరించునని యిట్లు చక్కగా చెప్పుచున్నది. 'యథాపకృష్టం శైవాలం క్షణమాత్రం న తిష్ఠతి, ఆవృణోతి తథామాయా ప్రాజ్ఞం వాపి పరాఙ్ముఖమ్'. కనుక సాధకునకు విచారము 'సదా' ఉండవలసినదే. ఇక కర్మ జ్ఞానములలో నే యొక్కటియో కాక, రెంటినీ అనుసరింపవలెననియు, కర్మమార్గమువలన వివేకము గలిగి జ్ఞానమార్గము సుగమమగు ననియు వేదాంతశాస్త్రము చెప్పుచున్నది. కర్మచితములైన లోకముల పరీక్షించి తెలిసికొని నిర్వేదము పొంది సాధకుడు దర్భలు గ్రహించి గురువును వెదకికొనుచు పోవలెనని ఉపనిషత్తు చెప్పుచున్నది. కాని నేటి లోక మట్టి వ్యవస్థకు సముఖముగా లేదు. గురు సాహాయ్య మర్థింపక, యోగ్యులుగా వ్రాసిన పుస్తకములు చదువుకొని పండితుల మైత్రి నమకొనుట నేటి లౌకిక విద్యల మహత్తులలో నొకటి. ఏ విద్యకైనను అంతఃకరణ వృత్తియైన అనుసంధానము జ్ఞాన సాధక మగుచున్నది. అతిరహస్యము గుప్తము అనుభవైక వేద్యము అయిన ఆత్మవిద్య విషయమున ఈ అనుసంధాన మెంత ముఖ్యమో చెప్ప పనిలేదు. ఆత్మనిష్ఠులగువా రనుసంధానమున కెట్లును అలవాటు పడియుందురు గనుకనే ముఖ్యముగా వారికిని, ఆసక్తిపరులైన తదితరులకును వ్యాఖ్యాన సమన్వయాదు లుపకరింపగలవనుటలో సందేహము లేదు. ఆంధ్ర ధ్వన్యాలోక లోచనములకు ఆంధ్రానువాద, 'ప్రభామతి' వ్యాఖ్యలు ఘటించిన సాహిత్యాచార్యులు శ్రీ పంతుల లక్ష్మీ నారాయణశాస్త్రిగారు ఈ గ్రంథమున ఈశావాస్య, నిరాలంబ, పైంగ లాధ్యాత్మికోపనిషత్తులకు ఆంధ్ర పద్యానువాదముతో పాటు శంకరాద్యుల భాష్యములు సమన్వయించి స్వాభిప్రాయము తెలిపెడు 'ప్రభా' నామక వ్యాఖ్యను గూడ వెలయించినారు.

ఈ నాలుగు ఉపనిషత్తులును శుక్ల యజుర్వేదమునకు చెందినవి. శ్రీ శాస్త్రిగారు వీనిని కూర్చిన క్రమము సాధకుల కుత్తరోత్తర ముపకరించునట్టిది. ఈశావాస్యము పదునెనిమిది మంత్రములు మాత్రము గల కొలదిపాటి గ్రంథమైనను గుణమున గొప్పది. ఇందు జ్ఞానయోగ కర్మ యోగములు, ఆత్మ తత్త్వము, కర్మోపాసన సముచ్చయము, సంభూ త్యసంభూత్యుపాసన సముచ్చయములును, అర్చిరాది మార్గమున బ్రహ్మలోక ప్రాప్తియు ప్రతిపాదింప బడినవి. కార్యరూపమైన బ్రహ్మము నుపాసించుట (హిరణ్య గర్భాది సగుణ బ్రహ్మము) సంభూ త్యుపాసనము. కారణమగు అవ్యక్త ప్రకృతి నుపాసించుట అసంభూ త్యుపాసనము. ఈ రెండింటి నుపాసింపవలె నని చెప్పుచున్నను మొదటిదాని కణిమాది సిద్ధులును, రెండవదానికి ప్రకృతి లయమును ఫలములు.

నిరాలంబోపనిషత్తు సాధకునకు కైపొత్తము వంటిది. బ్రహ్మమేది ? ఈశ్వరు డెవడు ? మొదలుగా పలుబడి యొక్క ప్రశ్నలు, వానికి సమాధానములు ఇందు కూర్చ బడినవి. కర్మ స్వరూపము నీ యుపనిషత్తు ఎంత సుగమముగా చెప్పుచున్నదో చూడుడు : 'కర్మేతిచ; క్రియమాణేంద్రియైః కర్మాణ్యహం కరోమీ త్యధ్యాత్మ నిష్ఠతయా కృతంకర్మైవ కర్మ'. "నేను చేయుచున్నాను" అను సాహంకార భావముతో నధ్యాత్మ నిష్ఠముగా చేయునది యగు కర్మయే కర్మ యగుచున్నది. అట్టి కర్మఫలము బంధ మగునని యభిప్రాయము. అట్లే స్వర్గ నరకములను గూర్చిన ఈ యభిప్రాయముల చిత్తగింపుడు : 'స్వర్గ ఇతిచ, సత్సంసర్గః; నరక ఇతిచ, అసత్ సంసారవిషయ జనసంసర్గ ఏవ నరకః.'

పైంగలోపనిషత్తున అద్వితీయ బ్రహ్మ స్వరూపాదుల వివరణము, అధ్యారోపము—అపవాదము అనువాని తెలివిడి, జ్ఞానసహితమైన ధ్యానము యొక్క మహిమ చెప్పబడినవి.

శరీరాదులను రథాదులుగా నిరూపించి నారాయణుడే ప్రత్యగాత్మ యని చెప్పెడు 'ఆత్మానం రథినం విద్ధి, శరీరం రథమేవతు' ఇత్యాది మంత్ర మిందులోనిదే.

ఇంక అధ్యాత్మోపనిషత్తు సాధకులకు చక్కగా నుపకరింపగల సరళ గ్రంథము. ఉపనిషత్తుల కన్నిటికి వ్యాఖ్యలు వ్రాసిన ఉపనిషద్బ్రహ్మయోగి అధ్యాత్మికోపనిషత్—మొదలగు కొన్నింటికి అవతారికలు మాత్రము వ్రాసినారు. కాగా శాస్త్రి గారి కా వారి సాహాయ్యము లభింపకపోయినను శాంకర సిద్ధాంతము ననుసరించి వ్యాఖ్య వెలయించినారు. వైరాగ్యము, బోధ, ఉపరతి సిద్ధించినట్లు సాధకు డెట్లు తెలియగల డను దాని కీ యధ్యాత్మోపనిషత్తు యిట్లు గుర్తులు చెప్పుచున్నది: 'వాసనా నుదయో భోగ్యే వైరాగ్యస్య తదావధిః; అహంభావోదయాభావో బోధస్య పరమావధిః; లీనవృత్తే రనుత్పత్తి ర్మర్యాదోపరతేస్తు సా'. దీనికి శాస్త్రిగారి సరళమైన వ్యాఖ్య: 'అనుభవింపదగిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము లనువిషయములయందు గల ప్రీతి తొలగి, అది తిరుగ పుట్టకుండిన యెడల వైరాగ్యము లభించినదనియు, 'నేను' అను తలంపు కలుగకుండిన యెడల జ్ఞానము సిద్ధించినదనియు, ఆత్మయందడగిన చిత్తవృత్తి వెలికి రాకుండ నచటనే నిలుచుచుండిన యెడల నుపరతి ప్రాప్తించినదనియు తెలిసికొనవలయును. అట్లు గాక శాస్త్ర పాండిత్య మున్నంత మాత్రమున వైరాగ్య, బోధ, ఉపరతులు సిద్ధించెనని తలచుట మౌఢ్యమే అగును. ఈ వైరాగ్యాదులు లేని యెడల ఆత్మప్రాప్తి కలుగదు. ఆత్మలాభము లేనియెడల పశువులయం దెల్ల నుత్తమ మగు మానవ జన్మము ఫలవంతము కానేరదు.' లోకానువర్తనము దేహానువర్తనము అనువానితోపాటు శాస్త్రానువర్తనము కూడా వాసనయే యగునని యు, నందుచే నీ మూటిని త్యజించి స్వాధ్యాసాపనయము చేయుమనియు ఈ యుపనిషత్తు బోధించిన భావ మీ వ్యాఖ్యలో సమన్వయింపబడినది.

శాస్త్రిగారు పండితులే కాక సాధకులు గూడ నని విందుము. 1938 నా డెప్పుడో 'వేదిక్ రిసర్చ్' పత్రికలో విపులమగు వ్యాఖ్యలతో ప్రకటించిన నిరాలంబ పైంగలోపనిషత్తులను, అట్లే 1939 లో ప్రకటించిన అధ్యాత్మోపనిషత్తును, 1953 లో ప్రకటించిన ఈశావాస్యమును సంక్షిప్తమగు సరళ వ్యాఖ్యతో నిప్పు డిట్లు సముచ్చయముగా ప్రకటించి శాస్త్రిగారు ముముక్షువులకు, జిజ్ఞాసువులకు మేలు చేసినారు. వారి ఆత్మనిష్ఠ కీ గ్రంథమందలి ప్రభావైశద్యమే గురుతు. అధికారులు చదువతగిన ఉత్తమ గ్రంథము.

ఎస్. కె.

కాళహస్తీశ్వర మాహాత్మ్యం

(ధూర్జటి మహాకవి. వెంకట్రామా గ్రంథమాల ప్రచురణము. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిచే పరిష్కృతము. వెల : 5 రూపాయలు.)

ధూర్జటి మహాకవి కాళహస్తీశ్వరమాహాత్మ్యమును వెంకట్రామ అండ్ కంపెనీవారు, వెంకట్రామ గ్రంథమాల తొలి పుష్పముగా ప్రకటించినారు. ఇంతవరకు ఈ మహాకావ్యము రెండు, మూడుసారుల కన్న ఎక్కువగా ముద్రితము కాకపోవడము తెలుగుదేశము దురదృష్టము. పరమమధురమైన ధూర్జటి వాణిని గూర్చి వినుటయేగాని, చదివినవారు ఎందరో ఉండరు. ముఖ్యముగా నీ కాళహస్తీశ్వర మాహాత్మ్య మట్టి గ్రంథమైనది. ఇప్పుడు వెంకట్రామ గ్రంథమాలవారు ఆ లోపముకును తీర్చుటకు పండిత ప్రవరులైన శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రిగారిచే పరిష్కరింపించి దానిని ప్రకటించిరి.

ధూర్జటి మహాకవి వ్రాసిన గ్రంథములు రెండు. (1) కాళహస్తీశ్వర మాహాత్మ్యము. (2) కాళహస్తీశ్వర శతకము. ఈ శతకము తెలుగునాట అందరికిని బాగుగా తెలియును. ఇందులో దేనిని ధూర్జటి ముందు వ్రాసినాడన్న చర్చ అనవసరము. పాకమును బట్టి, అనుభవ పరిపాక ప్రదర్శనమును బట్టి శ్రీ కాళహస్తీశ్వర శతకమే మలి గ్రంథ మనిపించును. ఇది వేరు విషయము. ప్రకృతము.

ధూర్జటి మహాకవి ఈ మహాగ్రంథము క్షేత్ర మాహాత్మ్య సంబంధమైనది. ఈ రకమైన రచనలను తెలుగులో శంభుదాసుడే తన నృసింహపురాణముతో ప్రారంభము చేసెను. తరువాత శ్రీనాథాదులు గూడ నిట్టి మాహాత్మ్య ప్రబంధములను రచించిరి. ధూర్జటి కాలమున గూడ తెన్నాలి రామకృష్ణుడు స్మార్తుడై ఉన్నప్పుడు ఘటికాచల మాహాత్మ్యమును, వైష్ణవుడైన తర్వాత పాండురంగమాహాత్మ్యమును రచించినాడు. అందువలన తెలుగు ప్రబంధ నిర్మాణచరిత్రలో నీ క్షేత్ర మాహాత్మ్యములను ఒక తెగ ప్రబంధములై వెలసినవి.

కొందరు ఇట్టివి నిజముగా ప్రబంధములు కాకపోయినను, ప్రబంధము లనబడుచున్నవని అనుచున్నారు. అట్టి సందర్భమున ప్రబంధ మనవేమో గూడా వీరు నిర్వచించుచున్నారు. మరి ఆ నిర్వచనము, లక్షణనిర్ణయము ఉన్న ప్రబంధములనుబట్టి గాక, కొన్ని యెడల వారివారి స్వకపోల భావనావిలసితములై, అశాస్త్రీయమై, విలసిల్లుచున్నవి. ముఖ్యముగా ప్రబంధేతి వృత్తమును గూర్చి ఈ రకపు ఈ అర్వాచన లక్షణ కర్తల భావములు మరియు విపరీతముగా కాన్పించుచున్నవి. అట్టి భావములనే ప్రాయికముగా శ్రీ పాపయ్య శాస్త్రిగారు అనుసరించి, "యీ ప్రబంధమున వస్త్వైక్య మంతగా పొందుపడి యుండలే ద"నినారు. ఇందులో వస్తువు శ్రీ కాళహస్తి శివుని మాహాత్మ్యము. ప్రబంధమున ఆదినుండి తుది వరకు నదియే విషయము, బహుకథా పుష్పములలో దారము మాదిరిగా సంతరించబడినది. ఇక ఇందులో ఐక్యములేకపోవుట యెక్కడ ? ప్రబంధ మన్నది పాశ్చాత్య పద్ధతి నవలగాని, కావ్యముగాని కాదు. ఎక్కువ కథలను ఏక విషయ నిష్ఠముగా కూర్చునది ప్రబంధమ్ము కావచ్చును. మరియు నది స్వతంత్ర రచన కానక్కరలేదు.

ప్రఖ్యాతేతివృత్తమునకు స్వతంత్రానువాదము కావచ్చును. తెలుగులోని ప్రబంధములు దాదాపుగా నన్నియు నిట్టివే.

ఈ మహాప్రబంధములో నేమి యేమి కథలున్నవో, వానిని ఎంత అందముగా ధూర్జటి మహాకవి శిల్పించినాడో శ్రీ పాపయ్యశాస్త్రిగారు తమ పీఠికలో చక్కగా వివరించినారు. వారి దృష్టి ననుసరించి ఇందులో తృతీయాశ్వాసమునందలి తిన్నడు, నత్కీరుడు కథలు గొప్పగానున్నవి. ఈ కథలలో తిన్నని కథను పాల్కురికి సోమనాథుడు గూడ చెప్పినాడు. ఆయన పద్ధతి వేరు. ఈయన పద్ధతి వేరు. అయినను కొన్ని సందర్భములలో నాయన పోలికలును ఇక్కడ లేకపోలేదు. నా దృష్టికి ఇందులో మొదటి ఆశ్వాసమునందలి మిండజంగము కథయు, చతుర్థాశ్వాస మందలి మాణిక్యవల్లి కూతుల కథయు చాల బాగున్నవి. ఆ కథలను అట్లు చెప్పుట ఒక్క ధూర్జటికే చేత నవును.

ఈ గ్రంథమును పరిష్కరించుటలో శ్రీ పాపయ్య శాస్త్రిగారు ధూర్జటి పద్యముల కొకటి రెండు చోట్ల పాఠాంతరములను తమ పీఠికలో సూచించినారు. అవి బాగున్నవి.

నవోదయం

(ఖండకావ్య సంపుటి)

(రచయిత: శ్రీ అందె వెంకటరాజము. ప్రతులకు రచయితకే వ్రాయవలెను. అడ్రసు : కోరుట్ల, కరీంనగరంజిల్లా.)

ఈ నవోదయ మన్న ఈ గ్రంథము 48 ఖండకావ్యముల సంపుటము. ఈ ఖండములో కొన్ని మార్గచ్ఛందమునను, కొన్ని మాత్రాచ్ఛందమునను వ్రాయబడినవి. ఈనాటి కొందరు కవులవలె గాక, ఈ రెండు రకముల ఛందముల యందును అందెవేసిన వానివలె, భాషమీద తగుమాత్రము అధికారము కలిగి ఈయన కవిత్వము అల్లినాడు. తన కవిత్వము యొక్క లక్షణమేమో, రమ్యముగా "యోగ్యత" అను ఖండములో కవి వివరించుకొనుట జరిగినది. కవిత ఒక వయ్యారి యని, కవిత ఒక సువిశాల సుషమా భవనమని, కవిత యొక్క లలితాతి లలిత సుమవనమని, కవిత యొక్క శాంతిసౌఖ్య ప్రదనవ నవోన్మేష ప్రకృతి అని, కవిత యొక్క యమృతత్వ మిడు నవనవరసోచిత దివ్యపాకము అని, కవిత యొక్క సుకుమార భావన అని, కల్పనామయ రమ్యలోకము అని ఈయన తీర్పు. ఇప్పు డీ గ్రంథములోని వివిధ ఖండములు, వివిధ విధములుగా, వివిధ గతులుగా, నుండుటకు కవికి కవితను గూర్చి ఉన్న ఇట్టి భావనయే కారణమేమో అనిపించుచున్నది. "చందమామ" మొదలు, "ఈతచెట్టు" వరకు గల ప్రతివస్తువు ఇచ్చట కవిత్వమునకు విషయ మయినది. మరియు ఆ కవిత్వము రమ్యముగా నున్నది. రమ్యత అన్న దినుసు ఉన్న కవిత్వము విధిగా సహృదయులయిన పఠితల హృదయములను కదుపుతుంది. అట్టిదికాని కవిత్వము "కొయ్యగుర్రము" వలె కద లమా కదలదు. కదిపించనూ కదిపించదు. నిర్వచనములే కవిత్వ మన్న పేరుతో చలామణి అవుతున్న ఈ రోజులలో నిట్టి కావ్యములు ప్రకటింపబడుతూ ఉండుటవలన తెలుగు కవిత్వం నిస్సారపు నిర్వచనాలలోను, అయోమయపు భావనా మరు భూములలోను సురిగిపోవడం లేదన్న భావం ప్రతిఒక్క రసికుడికి కల్గుతుంది. ఇట్టి ఈ గ్రంథము వెల రెండు రూపాయలు.

గౌతమీ మహాత్మ్యము

(1వ భాగం)

(రచన : అష్టావధాని శ్రీ చిలుకూరి రామభద్రశాస్త్రి. ప్రాప్తిస్థానము : విజ్ఞానగోష్ఠి సంఘము, రాజమండ్రి. ధర తెలియదు.)

బ్రహ్మపురాణాంతర్గతమైన ఈ గౌతమీ మాహాత్మ్యము అష్టావధాని శ్రీ చిలుకూరి రామభద్రశాస్త్రిగారు తెలుగు వచనములోనికి అనువదించినారు. గ్రంథ ప్రాశస్త్యమును గూర్చి శ్రీయుతులు జటావల్లభుల పురుషోత్తముగారు, వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు తమ తమ అభిప్రాయములలో ఉగ్గడించి యున్నారు. గౌతమీ మాహాత్మ్యమును గూర్చి, చరిత్రను గూర్చి శ్రీనాథుని మొదలు క్రీ. శే. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి వరకును ఉన్న కవులు కొందరు గ్రంథములను రచించినారు గాని, అవి పద్యములలో ఉండి, మామూలు జనులకు అర్థముకాని వగుట శ్రీ రామచంద్ర శాస్త్రిగారి వచన మాహాత్మ్యము ముముక్షువుల ఉపయోగార్థము ప్రయోజనకారి అగుచున్నది. ఈ గ్రంథములో గోదావరి జన్మము, మాహాత్మ్యము, అందున గల వివిధ తీర్థములు, వాని మాహాత్మ్యము చక్కగా వర్ణింపబడినవి. వచనము చక్కగా, సుబోధకముగా నున్నది.

హ. శి.

గ్రంథ స్వీకారము

1. భారత కమ్యూనిస్టుపార్టీలో లుకలుకలు—సంస్కృతి ప్రచురణ (71).
2. బోల్షివిజం : ఆచరణ : సిద్ధాంతం (బర్ట్రాండ్ రస్సెల్ గ్రంథమునకు అనువాదము)—కల్చరల్ బుక్స్ (ప్రైవేట్) లిమిటెడ్ ప్రచురణము. వెల : రు. 2—50.
3. స్త్రీధర్మ ప్రబోధిని—కలవకుంట కృష్ణమాచార్య. వెల : రు. 1—00.
4. భారత జవాబ్; కుటుంబ నియంత్రణం. (సరస్వతీ గ్రంథమాల), వెల : రు. 1—50.

వార్తలు

ఎన్నికలు ఫలితాలు

దేశంలో ఎన్నికలు పూర్తి అయినాయి. 12 రాష్ట్రాలలో శాసనసభలకు, పార్లమెంటుకు, 2 రాష్ట్రాలలో పార్లమెంటుకు (ఒరిస్సా, కేరళ) ఎన్నికలు జరిగినాయి. కేంద్రపాలిత ప్రాంతాలలో గూడా ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు ఎన్నికలు జరిగిన 12 రాష్ట్రాలలోను 10 రాష్ట్రాలలో కాంగ్రెస్ మెజారిటీలు సంపాయించింది. రెండు రాష్ట్రాలలో ఇరుకున పడింది. అవి మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లు.

ప్రతిపక్షాలలో మద్రాసులో డి. ఎం. కె., ఆంధ్రలో కమ్యూనిస్టులు పూర్వంకన్నా బలం సంపాదించారు. స్వతంత్ర పార్టీ ఎన్నికలు జరిగిన 12 రాష్ట్రాలలోను 5 రాష్ట్రాలలో రెండు సంఖ్యలమీద స్థానాలను సంపాయించింది. జనసంఘం దక్షిణభారతంలో ప్రవేశించలేకపోయింది. ఉత్తర హిందూస్థానంలో గూడా మధ్యప్రదేశ్, యు. పి., రాజస్తాన్‌లలో మాత్రం నిలవద్రొక్కుకుంది. పూర్వం కంటే ఎక్కువ స్థానాలను సంపాయించింది.

స్వతంత్రులుగా పోటీచేసినవారిలో అధిక సంఖ్యాకులు వోడిపోయినా, అన్ని రాష్ట్రాలలోను కొంతమంది నెగ్గారు. ఈ స్వతంత్రులు ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా నెగ్గారు. తక్కువ మందినెగ్గింది మద్రాసులో. దాదాపు అన్నిరాష్ట్రాలలోను కాంగ్రెసుకు పూర్వపు బలం తగ్గింది. కమ్యూనిస్టులు ఆంధ్రలోను, పశ్చిమ బెంగాల్‌లోను కొంచెం ఎక్కువ స్థానాలు సంపాయించారు. మద్రాసులో ద్రవిడ మున్నేట్రకజగం 50 స్థానాలను సంపాయించింది. పూర్వం వీరు 12 మంది ఉండేవారు. ఇప్పుడు 38 స్థానాలు అధికంగా సంపాయించారు. మద్రాసులో కాంగ్రెసు బలహీనతకు ఇది ప్రథమ ఉదాహరణం.

ఈ ఎన్నికలలో వివిధ రాష్ట్రాలలోను దాదాపు 30—40 మంది దాకా మంత్రులుగాని, ఉప మంత్రులుగాని ఓడిపోయారు. ఎక్కువమంది మైసూరులో వోడిపోయారు.

ఉత్తర హిందూస్థానంలో ప్రతిపక్షాలుగా స్వతంత్ర, జనసంఘపు పక్షాలు పైకి వచ్చాయి.

ఈ ఎన్నికలలో వోట్లు అధికంగా మురిగిపోయినాయి. డిపాజిట్లు గూడా ఎక్కువగా గల్లంతయినాయి. విచిత్రం ఏమంటే కాంగ్రెస్ అభ్యర్థులు గూడా కొన్నికొన్ని చోట్ల డిపాజిట్లు కోల్పోయారు.

అనేకమంది పెద్దలు ఈ ఎన్నికలలో వోడిపోయినారు. కేంద్ర మంత్రి కేస్కర్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డా. ఖట్జూ, ప్రజాసోషలిస్టు నాయకులు శ్రీ అశోక్‌మెహతా, శ్రీ గోరే, కమ్యూనిస్టులలో శ్రీ డాంగే, స్వతంత్రపార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్. జి. రంగా, జనసంఘం అధ్యక్షుడు శ్రీ రామారావు, హిందూమహాసభ అధ్యక్షుడు శ్రీ దిగ్విజయనాథ్ ప్రభృతులు ఈ వోడిపోయినవారిలో ఉన్నారు. అట్లాగే రాష్ట్ర స్థాయి నాయకులలో శ్రీ నిజలింగప్ప, శ్రీ బల్వంతరాయ్ మెహతాలు వోడిపోయారు.

అన్ని రాష్ట్రాలలో కంటె, కాంగ్రెస్ మహారాష్ట్రలో చెప్పుకోతగిన విజయాన్ని సాధించింది.

వివిధరాష్ట్రాలలో పార్టీలబలాబలాలు ఈవిధంగా ఉన్నాయి:

ఆంధ్రప్రదేశ్ (300)—కాంగ్రెస్ 176, కమ్యూనిస్టు 51, స్వతంత్రపార్టీ 19, సోషలిస్టు 2:, ఇండిపెండెంట్లు 51. ఇక్కడ మూడుచోట్ల ఉపఎన్నికలు జరగవలసి ఉంటుంది. (1) రామాయంపేట, (2) బెజవాడ (శ్రీ కాశేశ్వర రావు దివంగతులు కావడంవల్ల), (3) బోధన్‌లో నెగ్గిన ఇండిపెండెంటు ఇంకో నియోజకవర్గం నుంచి గూడా నెగ్గారు గనుక, ఆయన వదులుకునే స్థానంలోను.

అస్సాం (105)—కాంగ్రెస్ 79, కమ్యూనిస్టులు 0, పి. ఎస్. పి. 6, ఇతర పార్టీలు 12, ఇండిపెండెంట్లు 8.

బీహారు (318)—కాంగ్రెస్ 180, కమ్యూనిస్టు 12, పి. ఎస్. పి. 29, స్వతంత్రపార్టీ 49, జనసంఘం 3, ఇతర పార్టీలు 27, (జార్‌ఖండ్ 20; సోషలిస్టులు 7); ఇండిపెండెంట్లు 12.

గుజరాత్ (154)—కాంగ్రెస్ 109, కమ్యూనిస్టులు 0, పి. ఎస్. పి. 7, స్వతంత్రపార్టీ 23, ఇండింపెండెంట్లు 7.

మహారాష్ట్ర (264)—కాంగ్రెస్ 214, కమ్యూనిస్టు 6, పి. ఎస్. పి. 9, స్వతంత్రపార్టీ 0, ఇతర పార్టీలు 19, స్వతంత్రులు 15.

మధ్యప్రదేశ్(288)—కాంగ్రెస్ 142, కమ్యూనిస్టు 1, పి. ఎస్. పి. 33, స్వతంత్రపార్టీ 2, జనసంఘం 41, ఇతర పార్టీలు 30, (సోషలిస్టులు 14, రామరాజ్య పరిషత్తు 10, హిందూమహాసభ 6), ఇండిపెండెంట్లు 39.

మద్రాసు (206) కాంగ్రెస్ 138, కమ్యూనిస్టు 2, స్వతంత్రపార్టీ 6, డి. ఎం. కె. 50, ఇతర పార్టీలు 4, ఇండిపెండెంట్లు 5. ఈ రాష్ట్రంలో ఒక ఉపఎన్నిక జరగవలసివుంది.

మైసూరు (208)—కాంగ్రెస్ 139, కమ్యూనిస్టులు 4, పి. ఎస్. పి. 21, స్వతంత్రపార్టీ 9, సోషలిస్టు 1, ఇతరులు 9, ఇండిపెండెంట్లు 25.

పంజాబు (154)—కాంగ్రెస్ 89, కమ్యూనిస్టు 9, స్వతంత్రపార్టీ 3, జనసంఘం 8, ఇతరపార్టీలు 23, (అకాలీలు 19; సోషలిస్టు 4); ఇండిపెండెంట్లు 19.

రాజస్తాన్ (176) కాంగ్రెస్ 88, కమ్యూనిస్టు 5, పి. ఎస్. పి. 2, స్వతంత్రపార్టీ 36, జనసంఘం 15, ఇతర పార్టీలు 8, (సోషలిస్టులు 5, రామరాజ్య పరిషత్తు 3), ఇండిపెండెంట్లు 22.

యు. పి. (430)—కాంగ్రెస్ 248, కమ్యూనిస్టులు 14, పి. ఎస్. పి. 38, స్వతంత్రపార్టీ 15, జనసంఘం 48, ఇతర పార్టీలు 30. (సోషలిస్టు 23, హిందూమహాసభ 2, రిపబ్లికన్ పార్టీ 8, ఇండిపెండెంట్లు 31.

పశ్చిమ బెంగాల్ (252)-కాంగ్రెస్ 138, కమ్యూనిస్టు 44, పి. ఎస్. పి. 5, స్వతంత్రపార్టీ 0, జనసంఘం 0, ఇతర పార్టీలు 24, ఇండిపెండెంట్లు 14.

లోక్ సభ

మొత్తం స్థానాలు 494. ఇందులో కాంగ్రెస్ 338, కమ్యూనిస్టులు 29, డి. ఎం. కె. 7, జనసంఘం 15, పి. ఎస్. పి. 10, సోషలిస్టులు 5, స్వతంత్రపార్టీ 18, ముస్లింలీగు 2, లోక్‌సేవక్‌సంఘ్ 1, పంజాబ్ హిందీ రక్షాసమితి 1, ఫార్వర్డ్ బ్లాక్ 2, ఆర్. ఎస్. పి. 1, నూతన్ మహాగుజరాత్ జనతా పరిషత్తు 1, ఇండిపెండెంట్లు, ఇతరులు 22, కొండజాతి మహాసభ 1, రామరాజ్య పరిషత్తు 2, జార్ఖండ్ 3. గణతంత్ర పరిషత్తు 4; అకాలీదళ్ 3. రిపబ్లికన్‌లు 3, హిందూమహాసభ 1.

* * *

నేపాల్ లో తిరుగుబాటు

నేపాల్‌లో మహేంద్రరాజు అధికారాన్ని పూర్తిగా చేపట్టిన అనతికాలంలోనే అక్కడ తిరుగుబాటు ప్రారంభమైంది. 1962 జనవరిలో ఈ తిరుగుబాటును గూర్చిన వార్తలు బహిర్గతం అవుతూ వచ్చాయి. తూర్పు నేపాల్‌లో పోలీసు చౌకీలమీద, గ్రామాలమీద, పట్టణాలమీద గూడా విప్లవకారులు దాడులు ప్రారంభించారు. ఇవి భారతదేశంలో ఉన్న నేపాలీల ప్రోత్సాహంతో భారతదేశం సరిహద్దుల మీదుగా నడుస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వంలోని మంత్రులు ఆరోపణలుచేశారు. జనవరి 7, 8 తారీఖులలో నేపాల్ విదేశాంగమంత్రి శ్రీ తులసీగిరి ఇట్టి ఆరోపణ చేసినప్పుడు, భారత ప్రభుత్వం అధికారులు వెంటనే ఆ వార్తలను ఖండించారు. తర్వాత నేపాల్ అధికారులు గూడా తాము భారతదేశాన్ని ఏమీ అనలేదని వివరణలు జారీ చేశారు.. నిజం ఏమిటంటే, ఈ తిరుగుబాటు నేపాల్‌లోనే జరుగుతోంది. ఆ దేశంలో టెర్రాయ్ అని ఒక ప్రాంతం ఉంది. అక్కడ నేపాలీ కాంగ్రెసుకు బలం ఎక్కువ. అక్కడినుంచే యీ తిరుగుబాటు నడిపించబడుతున్నది. ఇది రోజులు గడుస్తున్నకొద్దీ తీవ్రరూపం ధరిస్తోంది. మొదట చిల్లర అల్లరిగా కన్పించిన ఈ తిరుగుబాటు యిప్పుడు చెలరేగిపోగా, ప్రభుత్వం సైన్యాన్ని ఉపయోగించవలసిన అవసరం గూడా ఏర్పడిపోయింది. కొన్నిచోట్ల పోలీసులు, సైన్యం గూడా తిరుగుబాటుదార్లలో చేరడం జరిగింది. రాజ ప్రభుత్వంలో మంత్రి శ్రీ తులసీగిరి స్వగ్రామంలో రాజుపై హత్యాప్రయత్నం గూడా జరిగింది. ఆ తర్వాత పరిస్థితి మరీ విషమించింది. ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టే ఉద్దేశం మహారాజుకు లేదని ఆయన ఉద్యోగులు అనడం మొదలుపెట్టారు. మహారాజు స్వయంగా ఈ తిరుగుబాటును పూర్తిగా అణచివేస్తానని ప్రకటించారు.

ఫిబ్రవరి 5: నేపాల్‌రాజు మార్చినెలలో ఢిల్లీకి రావచ్చునని నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది.

ఫిబ్రవరి 10 : దక్షిణ నేపాల్‌లో గూడా రాచరికంపై తిరుగుబాటు ప్రారంభమైంది. విప్లవకారులు దాదాపు పది చెక్ పోస్టులను పట్టుకున్నట్లు, భరత్‌పూర్‌లో వీధి పోరాటం జరుగుతున్నట్లు గూడా వార్తలు వచ్చాయి.

ఫిబ్రవరి 13 : నేపాల్‌రాజు ఇప్పుడప్పుడే ఢిల్లీకి ప్రయాణం పెట్టుకోకపోవచ్చునని తుల్సీగిరి ఒక ప్రకటన చేశారు.

ఫిబ్రవరి 24 : ఉత్తర నేపాల్‌లో గూడా తిరుగుబాటు ప్రారంభమైంది. తిరుగుబాటును అణచడానికి నేపాల్ రాజ సైన్యం పెద్ద ఎత్తున తిరుగుబాటుదార్లమీద చర్యలు ప్రారంభం చేసింది.

* * * *

పాకిస్తాన్ లో పితూరి

పాకిస్తాన్‌లో జనరల్ అయూబ్‌ఖాన్, శ్రీ సురవర్దీని అరెస్టు చేయించడం చాలా గందరగోళానికి దారి తీసింది. ఫిబ్రవరి మొదటి వారంలో తూర్పు పాకిస్తాన్‌లో విద్యార్థులు సురావర్దీని విడుదల చేయాలంటూ ఉద్యమాన్ని ప్రారంభం చేశారు. ఢక్కా విశ్వ విద్యాలయం, వైద్య కళాశాల విద్యార్థులు ఇందులో పాల్గొని పెద్ద పెద్ద ప్రదర్శనలు, సమ్మెలు జరిపారు. ప్రెసిడెంట్ అయూబ్ గూడా అప్పుడు ఢక్కాలోనే వున్నారు. పాకిస్తాన్ పెద్ద ఉద్యోగులంతా అక్కడే వున్నారు. విద్యార్థులను మందలిస్తూ, జనరల్ అయూబ్ సురావర్దీకి విదేశ ఏజంట్లతో సంబంధం వున్నదంటూ ఒక ఆరోపణ చేశారు. కాని, ఫిబ్రవరి 9 నాటికి విద్యార్థుల ఉద్యమం ఇతర ప్రాంతాలకు గూడా వ్యాపించింది. అయూబ్ ప్రభుత్వం, ముగ్గురు మాజీ మంత్రులను, మరో 197 మంది ఇతరులను అరెస్టు చేసింది. విద్యార్థులు, ఇతరులు తూర్పు పాకిస్తాన్‌కు స్వయంపాలనం కావాలని కోరారు. తిరిగి తూర్పు పాకిస్తాన్ నుంచి హిందువులవలస ప్రారంభమైంది. భారత ప్రభుత్వం అందుకు అధిక్షేపణ తెలియజేసింది.

ఫిబ్రవరి 19 : పశ్చిమ పాకిస్తాన్‌లో గూడా విద్యార్థులు ఆందోళన ప్రారంభంచేశారు. లండన్‌లోని పాకిస్తానీలు గూడా అయూబ్ నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ, ప్రదర్శనలు జరిపారు.

* * * *

కాశ్మీరు సమస్య

ఫిబ్రవరి 1వ తేదీనాడు భద్రతా సంఘం కాశ్మీర్ సమస్యను గూర్చి చర్చించింది. 1957 తర్వాత ఈ చర్చ జరగడం ఇదే మొదలు. ఈ సందర్భంలో పాక్ ప్రతినిధి శ్రీ జఫ్రుల్లా ఒక తీర్మానాన్ని సంఘంలో ప్రతిపాదింపజేయాలని ప్రయత్నించారుగాని, అక్కడ ఆ తీర్మానాన్ని ప్రతిపాదించేవారు ఎవ్వరూ దొరకలేదు. పాకిస్తాన్, భారతదేశముల ప్రతినిధుల ప్రసంగాలు విన్న అనంతరం సంఘం అధ్యక్షుడు శ్రీ స్టీవెన్‌సన్ చర్చను వాయిదా వేశారు. భారతదేశంలో ఎన్నికలు పూర్తిఅయిన తర్వాత ఎప్పుడో చర్చ జరగవచ్చునని ఆయన చెప్పారు.

ఫిబ్రవరి 3 : పాకిస్తాన్ విద్రోహులు జమ్మూలో మన సరిహద్దు పోలీసులతో యుద్ధానికి తలపడ్డారు. కాని అందులో వారే 50 మంది చనిపోయినారు. ఎంతోమంది చిక్కిపోయారు.

ఫిబ్రవరి 15: కాశ్మీర్‌ముగూర్చి ఈసారి భద్రతా మండలిలో జరిగే చర్చలో రష్యా తమ్ము బలపరుస్తుందని పాక్ విదేశాంగ శాఖ కార్యదర్శి శ్రీ దహ్ల్వీ భావిస్తున్నారు.

* * * *

ఫిబ్రవరి 8 వ తేదీవాడు పశ్చిమ రాజ్యాలు—బ్రిటన్, అమెరికాలు—మార్చిలో జరిగే 18 రాజ్యాల సమావేశానికిముందు మూడు రాజ్యాల విదేశాంగమంత్రుల సభ జరగాలని రష్యాకుసూచించాయి. ఫిబ్రవరి 12 వ రష్యాప్రధాని శ్రీ కృష్చేవ్ పాశ్చాత్య రాజ్యాలకు ప్రత్యుత్తరం పంపుతూ, మార్చి సభలో ఈ 18 రాజ్యాల అధినాయకులు పాల్గొంటే బాగుంటుందని సూచించారు. అంతేగాక, ఆ సభలో పాల్గొనవలసివున్న అన్ని రాజ్యాల అధినేతలకు గూడా ఇటువంటి ఉత్తరాలే అందజేశారు. ''నిరాయుధీకరణ సమస్య విదేశాంగమంత్రుల స్థాయికి మించింది. కాబట్టి ముందు అధినాయకులు చర్చిస్తే, తర్వాత క్రింది వారికి వదలవచ్చు'' అని శ్రీ కృష్చేవ్ ఆ ఉత్తరంలో పేర్కొన్నారు.

నిరాయుధీకరణ సమస్యలు

ఫిబ్రవరి 13 : శ్రీ కృష్చేవ్ ఈ సూచనను గురించి వ్యాఖ్యానిస్తూ, బ్రిటిష్ ప్రధాని ''అధినాయక సమావేశం మంచిదే. కాని ఆచరణ సాధ్యంకాదు'' అన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి శ్రీ డీన్‌రస్క్ గూడా ఇదేవిధంగా వ్యాఖ్యానిస్తూ, ''శ్రీ కృష్చేవ్ సూచించినట్టి సభ తర్వాత జరగవచ్చును'' అన్నారు.

ఫిబ్రవరి 14 : బ్రిటిష్ ప్రధాని శ్రీ మాక్మిలన్, అమెరికా అధ్యక్షుడు శ్రీ కెనెడీ, రష్యా ప్రధాని అధినాయక ప్రతిపత్తి సభను తిరస్కరించారు. అవసరమైతే, ''అనంతరం జనీవాలో జరిగే ఆ సభకు ''తాను హాజరు కాగలనని బ్రిటిష్ ప్రధాని అన్నారు. శ్రీ కెనెడీ గూడా అదేవిధంగా ప్రకటించారు.

ఫిబ్రవరి 19 : నిరాయుధ కరణం విషయంలో తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, జనరల్ డిగాల్ రష్యా ప్రధానికి ప్రత్యుత్తరం పంపించారు.

ఫిబ్రవరి 20 : 18 రాజ్యాల అధినాయకసభ సూచనకు బర్మా ఆమోదించింది.

ఫిబ్రవరి 21 : జనీవాలో 18 రాజ్యాల అధినాయక సభకు నెహ్రూ ఆమోదించారు కాని, ఆ సభకు ఏప్రిల్‌లోగాని తాను రాలేని శ్రీ కృష్చేవ్‌కు సమాధానం వ్రాశారు.

ఫిబ్రవరి 23 : శ్రీ కృష్చేవ్ సూచనను బ్రిటన్, అమెరికాలు తిరస్కరిస్తున్నందుకు రష్యా ప్రధాని విచారాన్ని ప్రకటించారు.

ఫిబ్రవరి 24 : శ్రీ కృష్చేవ్ సూచనను బ్రిటన్, అమెరికాలు అధికారికంగా తిరస్కరించాయి.

* * * *

అమెరికా, దక్షిణ అమెరికా రాజ్యాలు పుంటాడెల్‌ఎస్టెలో సమావేశమై అమెరికా రాజ్య వ్యవస్థనుంచి, క్యూబాను బహిష్కరించడానికి నిశ్చయించాయి. ఆ తర్వాత అమెరికా క్యూబాపై దిగుమతి ఆంక్షలు విధించింది. ఫిబ్రవరి 3 వ ఉత్తర్వు జారీఅయింది. ఆ రోజునే అర్జెంటీనా, క్యూబాతో తెగతెంపులుచేసుకుంది.

క్యూబాపై ఆంక్షలు

ఫిబ్రవరి 4 : బ్రిటన్‌ను, ఇతర నాటో రాజ్యాలను గూడా ఇట్లాగే ఆంక్షలు విధించవలసిందిగా అమెరికా కోరగలదని అమెరికా అధికారులు పేర్కొన్నారు.

తమ ఆంతరంగిక వ్యవహారాలలో అమెరికా జోక్యం చేసుకుంటున్నట్లు క్యూబా సమితికి ఫిర్యాదు చేసింది.

ఫిబ్రవరి 5 : అమెరికా రాజ్య వ్యవస్థనుంచి తన్ను బహిష్కరించడంతో సమితి ప్రణాళికను ఆ రాజ్యాలు భంగపరచినట్లయినదని క్యూబా సమితిలో ఆరోపించింది.

ఫిబ్రవరి 5 : అమెరికా, క్యూబాలు తమ తగాదాను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని చెకొస్లొవేకియా, రుమేనియాలు సమితిలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాయి.

ఫిబ్రవరి 20 : క్యూబాపై ఆంక్షలకు నాటో రాజ్యాలు కొన్ని షరతులు పెట్టినట్లు తెలుస్తున్నది.

ఫిబ్రవరి 15 : చెక్ రుమేనియా తీర్మానం వోటమి. తీర్మానంపై ఆసియా, ఆఫ్రికా రాజ్యాలు వోటుచేయలేదు.

* * * *

అల్జీరియా విషయం ఫ్రెంచి విధానంలో వచ్చిన పెద్ద మార్పును అధ్యక్షుడు జనరల్ డిగాల్ ఫిబ్రవరి 5 వ ప్రకటించారు. ఈసారి ప్రకటనలో ఆయన అల్జీరియాకు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని వాగ్దానం చేశారు.

అల్జీరియాకు స్వాతంత్ర్యం

ఫిబ్రవరి 19 : అల్జీరియాలో 7 సంవత్సరాల యుద్ధాన్ని అంతం చెందించడానికి ఫ్రాన్సు, అల్జీరియాలు ఆమోదం కుదుర్చుకున్నాయి.

ఫిబ్రవరి 21: అల్జీరియా ఒప్పందాన్ని ఫ్రెంచి ప్రభుత్వం ఆమోదించింది.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.